

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st JULY '52

అట్టమీంది బొమ్మ

'తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలి' అని తెలుగులో ఒక సామెత వున్నది. భారతం పంచమవేదముగా పరిగణింపబడుతూవుంది. ఇటువంటి మహత్తర గ్రంథాన్ని లోకహితార్థం వ్రాసి అర్పించాలెననే సంకల్పం వేదవ్యాసునికి ఒకప్పుడు కలిగింది.




ఐతే, భారతమంటే కాస్తా కూస్తా గ్రంథమా! అటువంటి బ్రహ్మాండమైన గ్రంథాన్ని వ్రాయడం ఒక్కళ్ళవల్ల నవుతుందా! కనుక, తను ఆలోచించి చెబుతూవుంటే అదంతా గ్రంథస్థంచేయగల సమర్థుడు ఎవడా అని జిజ్ఞాసలో పడ్డాడు. ఏమీ పాలుపోక, బ్రహ్మదేవుణ్ణి తలుచుకునేసరికి బ్రహ్మ ప్రత్యక్షమై, 'ఈ కార్యం నిర్వహించగల మొనగాడు వినాయకుడు ఒక్కడే. కనుక అతని సాహాయ్యం పొందవలసింది' అని సలహాచెప్పి, అదృశ్యుడయ్యాడు.

అప్పుడు వ్యాసభగవానుడు వినాయకుణ్ణి తలుచుకోగా గణపతి ప్రత్యక్షమయ్యాడు. వ్యాసమహర్షి సంకల్పం వినగానే గణపతి 'మహానుభావా! నీ కోరికప్రకారం నేను భారతం వ్రాస్తాను. ఐతే, నేను ఘంటం చేతపట్టిందిమొదలు ఆగటానికి వీలులేదు. అంతటి ప్రవాహవేగంగా నీవు చెప్పగల్గితివంటే ఈపనికి పూనుకొంటా' నన్నాడు.

గట్టిచిక్కే వచ్చింది వ్యాసుడికి. దూరం యోచించినమీదట 'ఓయీ గణాధిపా!— చక్కటిమాట చెప్పావు. నీవు ఘంటం నడిపే గమనానికి తట్టుకొని నేను పాఠంచెబుతా. ఐతే, నీవుమాత్రం నేను చెప్పే ప్రతిమాటా అర్థం చేసుకు మరీ వ్రాయాలి సుమా' అని ఒకచిన్న అడ్డుపుల్ల వేశాడు.

వ్యాసుని చతురతకు గణపతి చిరునవ్వు నవ్వుకున్నాడు. ఇది లోకోద్ధరణకోసం తలపెట్టినకార్యమే అని తెలియనే తెలుసును గనుక, వ్యాసుడు అపూర్వమైన వాగ్ధరితో చెప్పుకొంటూపోగా, గణపతి నిండు సమ్మతితో మహాభారతాన్ని చకచక వ్రాసి గ్రంథస్థంచేసి, లోకానికి అర్పించి వంద్యుడైనాడు.

ఈ విధంగా మహత్తరమైనటువంటి పద్ధెనిమిది పర్వాలలో మహాభారతం వ్యాసమహర్షిముఖతా లోకానికి ప్రసాదింపబడి, మానవ జీవితంలో అది ఎంతగానో ఉపయోగపడుతున్నది. జీవితం సార్థకం కావాలంటే మహాభారతం చదివే తీరాలి.


చందమామ
AUGUST
6

అట్టమీది బొమ్మ

మాలినినదీతీరాన అందమైన అడవులుండేవి. ఆ అడవులు సమస్తమైన ఫలవృక్ష జాలులతోను, బారులుతీర్చిన పర్వతశ్రేణులతోను, నదీనదములతోను నిండారి, చూడ ముచ్చటగా ఉండేవి. ఈ అడవులలో చిత్రమేమిటంటే: భయంకరమైన వన్య మృగాలూ, మురిపెము గొలిపే సాధుజంతువులూ ఎట్టివైరమూ లేక కలిసి ఎంతో మచ్చికగా సంచరించుతూ వుండెవి.



ఇలాటి మహారణ్యంలో నెలకొనివున్నది కణ్వమహర్షి ఆశ్రమం. కణ్వుని ఆశ్రమంలో ఒక ఆరేళ్ల బాలుడు ఆటలాడుకొంటూ ఉండేవాడు. ఐతే, కణ్వమహర్షి చలవ వలన శుక్లపక్ష చంద్రునివలె పెరుగుతూ వున్న ఆ బాలుడు సామాన్యుడుకాడు. అతడు ఆడే ఆటలూ సామాన్యమైనవి కావు. అవి చాలా అపురూపమైనక్రీడలు.

ఆరేళ్లవాడే కానీ, ఆ బాలుడు దీర్ఘబాహుడు, అనంతజవ సత్వసంపన్నుడు. చక్రవర్తి చిహ్నములతో ప్రకాశించేవాడు. ఆ పసివాడు మహారణ్యంలోని పులులను, సింహాలను, ఏనుగులనూ పట్టితెచ్చేవాడు. వాటిని ఆశ్రమంలో వుండే మహావృక్షాలకు కట్టిపెట్టేవాడు. అంతేకాదు. వాటిపైన నిర్భయంగా స్వారిచేసి, ఎన్నెన్నో ఆటలాడుకునేవాడు. ఆ బాలుని శైశవక్రీడలు ఆశ్రమంలోని మునులనే భీతికొలిపేవి. భయమనేది ఎరుగక వన్యమృగాలను అణగద్రొక్కిన ఆ పసివానికి తగినట్టుగా ఆశ్రమవాసులు అంతాకలిసి 'సర్వదమనుడు' అని పేరుపెట్టారు.

సర్వదమనుడు వయస్సునుమించిన బలానికి, తేజస్సుకు, విక్రమానికి పెట్టిందిపేరు. సర్వదమనుని తల్లి కణ్వమహర్షిచే పెంపబడిన శకుంతల. అతని తండ్రి శకుంతలను గాంధర్వవిధిగా వివాహం చేసుకొన్న దుష్యంతుడు. ఒకప్పుడు అశరీరవాణి వినబడి, సర్వదమనుడికి 'భరతుడ'నే పేరు తగివుంటుందని చెప్పింది. అప్రకారమే తలిదండ్రులు పసివాడైన సర్వదమనుణ్ణి భరతుడని పిలువసాగారు.

దుష్యంతుని తరువాత భరతుడే గద్దెయెక్కాడు. పరాక్రమంతో పరరాజులను గెలిచి, ధర్మపాలనం సాగించి అతడు యశముపొందాడు. అనేక యాగాలూ, అశ్వమేధాలూ చేసి తరించాడు. ఈ భరతుడు ఏలినదేశమే మనకు జన్మభూమి ఐనటువంటి భారతదేశం.


చందమామ
M.T.V.Acharya

అట్టమీది బొమ్మ

మహాభారతంలో పంచపాండవులను ఎరుగనివారుండరు. పాండవుల తండ్రి పాండుమహారాజు. ఆయనకు పట్టపురాణి కుంతి. కిందముడనే మహాఋషి ఒకప్పుడు పాండురాజును సంతానంలేకుండా శపించివేశాడు. ఆ విరక్తికొద్దీ పాండురాజు 'శతశృంగ'మనే కొండప్రదేశానికి పోయి, అక్కడ జీవితం గడుపసాగాడు.

కుంతీదేవికి ఒకప్పుడు దూర్వాసమహర్షి మంత్రోపదేశం చేసి, 'దీనిని పఠించి నీయిష్టంవచ్చిన దైవాన్ని తలుచుకో. ఆ దైవం నీకు ప్రత్యక్షమై పేరుతెచ్చే పుత్రుణ్ణి ప్రసాదిస్తాడు' అని చెప్పిపోయాడు.

ఈరహస్యం ఆమె తనభర్తతో వెల్లడించేసరికి, పాండురాజు సంతోషించి ముందుగా ధర్మజ్ఞుడైన కొడుకు వుండటం మంచిదని సలహాయిచ్చాడు. భర్త ఆజ్ఞప్రకారం ఆమె ధర్మదేవతను ఆహ్వానించి, వరప్రసాదంగా యుధిష్ఠిరుడనే శిశువును కన్నది.


తరువాత—క్షత్రియులకు భుజబలం అవసరంగనుక, మహాబలుడైన కొడుకు కావాలని పాండురాజు తనకోరిక వెల్లడించగా, కుంతిదేవి వాయుదేవుని అనుగ్రహం సంపాదించి భీముడనే బలశాలిని కన్నది. ఇలానే పంచపాండవులూ పుట్టారు.

అందరిలోకీ రెండవవాడైన భీముని పుట్టుక అతి చిత్రమైంది. భీముడు పుట్టిన పదవనాడు కుంతి నదిలో స్నానంచేసుకుని పూజకై ఇంటికి వస్తూన్నది. భర్త కూడానే వున్నాడు. అకస్మాతుగా ఒక భయంకరమైన పెద్దపులి గాండ్రుపెడుతూ వచ్చింది. పులి కంటపడగానే కుంతి హడలిపోయి ఒకగుట్ట మీదికి యెక్కింది.



అలా ఆమె తత్తరపడి గుట్ట ఎక్కటంలో ఒడిలో వున్న శిశువు ఆమెకుతెలియకుండానే దభీమని కింద పడిపోయాడు. ఇదిచూచి పాండురాజు బాణంయెక్కుపెట్టి పులిని చంపివేశాడు.

కుంతి కంగారులో బిడ్డడు రాతిమీద పడిపోయాడే కాని, వాడికి కొంచెమైనా దెబ్బతగలలేదు. పైగా, పసివాడి ధాటికి ఆ రాయే ముక్కలుగా బద్దలైపోయింది! వాడు ఉయ్యాలలో పడుకుని ఆడుకున్నట్టుగానే ఎంతో ఉత్సాహంతో నవ్వుతూ ఆడుకోసాగాడు. అద్భుతమైన వాని బలంచూచి అందరూ అమితాశ్చర్యపోయారు. మహాబలుడు, పరాక్రమవంతుడు ఐన ఈ భీముడే పెరిగి పెద్దవాడై అనేకమంది రాక్షసులను సంహరించాడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st OCT. 52
M.T.V.Acharya

అట్టమీది బొమ్మ

భీముడు క్రమంగా పెరిగి పెద్దవాడయ్యాడు. అతనికి పదిహేనోయేడు వచ్చేసరికి తండ్రి అయిన పాండురాజు పోయాడు. అందుచేత శతశృంగంనుంచి పాండవులు ఐదుగురూ తల్లి కుంతితోసహా హస్తినాపురం చేరుకున్నారు.

అక్కడ పాండవులూ కౌరవులూ కలిసి ధృతరాష్ట్రుని పెద్దరికంక్రింద పోషింపబడుతున్నారు. కురు పాండవులందరూ కలిసి ఆడుకొనేవాళ్ళు. అందరిలోకీ భీముని బలపరాక్రమాలు అతీతంగా ఉంటూవుండేవి.



పదిమందీ కలిసిచెట్లెక్కి కోతి కొమ్మచ్చి ఆడుకోబోతే భీముడు తన భుజబలంవల్ల ఆ చెట్టును ఊపి పారవేసేవాడు. దెబ్బతో అది గజగజ వణికిపోయి, చెట్టుమీదివాళ్లంతా క్రిందపడేవాళ్ళు. ఇలాంటి పనులెన్నో సరదాకు చేసిచూపి, భీముడు తన పరాక్రమాన్ని ప్రదర్శించేవాడు. భీముడు ఇలా చేయటం కేవలమూ సరదాకోసమే కాని, దురుద్దేశం ఎంతమాత్రమూ వుండేదికాదు. ఐతే—అహంకారంతోనూ, అర్థంలేని పట్టుదలతోనూ నిండి వున్న దుర్యోధనుడు భీముని బలపరాక్రమాలు చూచి సహించలేకపోయాడు. భీముడి పీడ ఎలా వదిలించుకోవడమా అని అదునుకోసం చూస్తూవున్నాడు. ఒకప్పుడు గంగానదితీరాన 'ప్రమాణకోటి' అనే స్థలమందు కురు పాండవులందరూ విడిదిచేసి క్రీడలుసల్పటానికి నిశ్చయమైంది. మత్తుపదార్థాలతో, పానీయాలతో విందులు ఆరగించి అందరూ నిద్రిస్తూవుండగా దుర్యోధనుడి పక్షంవాళ్లు భీముణ్ణి బలమైన తాళ్లతో కట్టి గంగలోకి తోసివేశారు. భీముడు ఆ కట్లను అవలీలగా తెంచేసుకుని యథాస్థానం చేరుకుని మళ్ళీ హాయిగా నిద్రిస్తూవున్నాడు.

అర్థరాత్రివేళ వచ్చి చూడగా భీముడు నిద్రిస్తునేవున్నాడు! ఇదిపని కాదని దుర్యోధనుడు మరి ఒక వ్యూహం పన్నాడు. అతని ప్రోత్సాహంవల్ల కొందరు, నిద్రిస్తున్న భీముని మీదికి క్రూరమైన నల్లత్రాచుపాములను తెచ్చి వదిలారు. కానైతే, ఎంత కాటువేసినా, భీముని శరీరంలోకి పాముల కోరలు దిగనేలేదు. కోరలే దిగనప్పుడు విషం ఎక్కేదేమిటి? మెలకువ రాగానే భీముడు అవి ఏమిటో చూడకనే పురుగుల్ని విదిలించినట్టుగా పాములను విదిలించి అవతల పారవేశాడు!

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీంది బొమ్మ

ద్వాపరయుగంలో నరకాసురుడనే రాక్షసుడు తన తల్లిచేతప్ప మరణంలేకుండా వరం పొందాడు. ఈ వరగర్వంచేత కన్నుమిన్నుగానక సమస్త లోకాలనూ బాధపెట్టసాగాడు. వాని బాధకు ఓర్వలేక జనులు శ్రీ కృష్ణభగవానునివద్దకు పోయి మొరపెట్టుకున్నారు.

ఆర్తజనరక్షకుడైన కృష్ణుడు ప్రజలకు అభయమిచ్చి, నరకాసురుడితో యుద్ధానికి తలపడ్డాడు. ఆరోజున కృష్ణుని భార్య సత్యభామకూడా భర్తతో బయల్దేరింది.


శ్రీకృష్ణ నరకాసురుల మధ్య తీవ్ర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కృష్ణుడు వేసిన బాణాలన్నీ వ్యర్థమయినై. నరకాసురుడి బాణాలు మట్టుకు కృష్ణుణ్ణి తాకుతూ వచ్చినై.

అప్పుడు కృష్ణుడు తన శక్తిఅంతటితో ఒక గొప్ప బాణం వేశాడు. నరకుడు ప్రతిగా ఒకబాణం ప్రయోగించేసరికి కృష్ణుడు మూర్ఛితుడయ్యాడు. ప్రాణాలు తీసేటటువంటి మరొక బాణం ఆవెంటనే ప్రయోగించాడు నరకుడు.

ఇదంతా కనిపెడుతూవున్న సత్యభామ అతి శక్తివంతమైన ఒక గొప్పబాణం ప్రయోగించేసరికి, అది నరకుడి బాణాల్ని తునాతునకలుచేసివేస్తూ, సరాసరి వాని గుండెలో దూసుకుపోయింది. "హా, తల్లీ!"—అని కేకవేస్తూ, వాడు అమట్టునే నేలకు ఒరిగాడు.

కృష్ణుడు తేరుకున్నాడు. అప్పుడు అతనికి నరకుని పూర్వజన్మవృత్తాంతం స్ఫురణకు వచ్చింది: పూర్వం హిరణ్యాకశిపుడు భూదేవిని ఎత్తుకుపోయి సముద్రంలో దాగొన్నాడు. విష్ణువు వరహావతారమెత్తి, హిరణ్యాకశిపుని చంపి, భూదేవిని ఉద్ధరించాడు. భూదేవి కొడుకే ఈ నరకాసురుడు. భూదేవే సత్యభామ.

ఇప్పుడు— భర్తను రక్షించుకోవడం కోసం కొడుకుపైన బాణం వేయవలసి వచ్చింది. ఇందుకు విచారించక నరకుడు: "అమ్మా!—నాకు అవసానకాలం ప్రాప్తించింది. ఇక గడియో క్షణమో. నా పేరు శాశ్వతంగా లోకంలో ఉండిపోవటానికిగాను ఈ రోజు ఒక పర్వముగా ఎంచి జనులందరూ సుఖంగా కాలం గడపాలని నా ప్రార్థన" అన్నాడు-దీనినిబట్టే దీపావళి ముందురోజు 'నరకచతుర్దశి'గా ఈనాటికిన్నీ నిలిచిపోయింది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
6
MT.V.Acharya

అట్టమీది బొమ్మ

నల్లత్రాచు పాములచే కరిపించినప్పటికీ భీముడు లెక్కచేయక, బతికి బయట పడటం దుర్యోధనాదులకు చింతకున్నట్టయింది.

వీడిని ఎలా నాశంచేయటమా అనే సమస్య వేధింపసాగింది. అప్పుడు, కౌరవపక్షానికి మొనగాళ్లయిన దుర్యోధనుడు, శకుని, కర్ణుడూ, కలిసి తీవ్రంగా ఆలోచించారు. ఒకటి గాకుంటే మరొకటైనా ఫలించదా అని చెప్పి, వారు లక్ష వ్యూహాలు పన్నుకొని కూర్చున్నారు.

భీముడు తిండిపోతు అనీ, వానికి లడ్డూలు యిష్టమనీ తెలిసి, విషపులడ్డూలు ప్రత్యేకించి తయారుచేయించారు. వీటితోనూ, మరికొన్ని అపురూపమైన భక్ష్యాలతోనూ గంగఒడ్డున వారు గొప్ప విందు ఏర్పాటుచేశారు.

అక్కడ వారందరూ ఆటలాడినంత సేపూ ఆడి, విందు ప్రారంభించారు. విషపులడ్డూలు తింటూన్న భీమునివైపు కౌరవ పక్షీయులు చూచారు. అతనిలో ఏమీ మార్పులేదు. ఆ లడ్డూలు తిని, జీర్ణించుకొని, మునపటికంటె ఉత్సాహంతో వున్నాడు. తరువాత హాయిగా నిద్రించాడు.

నిద్రిస్తూవున్న భీముణ్ణి వారు ఆకస్మికంగా కట్టి, గంగలో తోసివేశారు. ఇప్పుడు భీముడు గంగలో పడిన చోటునకు అడుగున సూదిమొనలు గల అనేకమైన త్రిశూలాలు అమర్చివున్నాయి!


ఇలా పడిపోయిన భీముడు పాతాళ లోకం చేరుకొన్న తరువాత మెలకువ వచ్చి, 'ఇదేమిటబ్బా!—వళ్ళు చల్లగా ఉన్నట్టుందే...' అనుకొన్నాడు.

అక్కడ నాగలోకవాసులు భీమసేనుని ఎంతగానో ఆదరించారు. అతడు పంచపాండవులలో ఒకడని తెలిసి, చాలా సంతోషించారు.

వారు ఇచ్చిన సిద్ధరసం సేవించగానే భీమునికి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

తరువాత నాగుల దీవనలందుకొని, కొత్తతేజస్సుతో ఇంటికి చేరుకునేసరికి, భీమునికోసం బెంగపెట్టుకొనివున్న అతని ఆత్మీయులంతా సంగతి సందర్భాలు తెలుసుకొని, ఆశ్చర్యపోయి, 'ఇదీ వకమంచికే...' అనుకొన్నారు.

ఎవరెన్ని ఆపదలు తలపెట్టినా, భీమసేనుడు చెక్కుచెదరలేదు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
M.T.V.Acharya

అట్టి విగ్రాది బొమ్మ

ధనుర్విద్యలో దిట్ట ద్రోణాచార్యులు. ద్రోణునివద్ద అనేకమంది రాజకుమారులు విలువిద్య నేర్చుకొనేవారు. కౌరవులూ పాండవులూకూడా ఆయన శిష్యులే.

ద్రోణుని శిష్యులలోకల్లా ప్రవీణులు కర్ణుడూ, అర్జునుడున్నూ. ఐతే, కర్ణుడు కురుపక్షపాతి కావటంచేత, అప్పుడప్పుడు అర్జునుణ్ణి పరిహసిస్తూ ఉండేవాడు. ఇటువంటి మత్సరం లేకపోవటంచేతనే, అర్జునుడు గురువుకు ప్రేమపాత్రుడైనాడు. శిష్యులందరకూ ద్రోణుడు విలువిద్యలో పోటీ పెట్టేవాడు. ఆ పరీక్షలలో తరుచు అర్జునుడే నెగ్గుతూవుండేవాడు. ఇది గురుపుత్రుడైన అశ్వత్థామకుసైతం అసూయకు కారణమయింది.

అసూయ కలిగి అతనేమిచేశాడంటే—'అర్జునుడికి ఎన్నడూ చీకటిలో మాత్రం అన్నం పెట్టవద్దుసుమా' అని తన వంటలవానితో చెప్పాడు. అతని మాటప్రకారమే వంటలవాడు జాగ్రతగా నడుచుకొంటూవచ్చాడు.

ఒకనాటిరాత్రి భోజనాలవుతూవుండగా పెద్దగాలి వచ్చి, దీపం ఆరిపోయింది. అయితే అలవాటుచొప్పున అర్జునుడు ఆ చీకటిలోనే భోజనం చేస్తూవున్నాడు. చేస్తూవుండగా అతనికొక ఆలోచన కలిగింది. 'అలవాటువల్లనేకదా చీకటిలో ఐనప్పటికీ కబళాలు సరిగా నోటికిపోతున్నయి. అభ్యాసంచేసి విలువిద్యమాత్రం చీకటిలో ఎందుకు సాధించలేము?' అని.

అనాటినించే అతడు చీకటిలో అస్త్రవిద్య అభ్యసించటానికి ప్రారంభించాడు. శరం సంధించి గురితప్పక అమ్ములను వదలగలిగేవాడు. ఒకరాత్రి అతను సాధకంచేస్తూవుండగా, ఆ ధ్వని వినబడి గురువుకు మెలకువ వచ్చింది.

లేచి చూచి ప్రియశిష్యుడైన అర్జునుని కార్యాసక్తికి ఆయన ఆశ్చర్యపడ్డాడు. అప్పుడు శిష్యుని కౌగిలించుకొని, శిరస్సు నిమిరి, 'అర్జునా! ఈ జగమందు నీకు సాటి అయిన విలుకాడు మరొకడు లేకుండా విలువిద్యలో గల రహస్యాలన్నీ నీకు బోధిస్తాను' అని వాగ్దానంచేశాడు.

ఆ వాగ్దానంప్రకారం ద్రోణుడు సమస్తమైన రహస్యాలు బోధించగా, అర్జునుడు సాటిలేని మేటివిలుకానిగా పేరుగాంచాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
FEB. '53
6

అట్టివీరాదిబొమ్మ

ఒకప్పుడు కురు పాండవులు కలసి వేటకని అడవికి వెళ్లారు. అక్కడ అర్జునుడికి ఒక జింకా, ఆ జింకను వెంటాడే ఒక వేటకుక్కా కనిపించినై. అతను జింకను తరుముకొనిపోగా, కొంతదూరంలో ఆ జింకా, కుక్కాకూడా మాయమయినై.

మరికొద్దిసేపటికే ఆ వేటకుక్క వేదనపడుతున్న శబ్దం వినవచ్చింది. వెంటనే పోయిచూస్తే, ఆ కుక్క శరీరంనిండా అనేకమైన గాయాలు కనిపించినై. అర్జునునికి జిజ్ఞాస పట్టుకున్నది—'ఒక్క శరంతో ఇన్ని గాయాలు కలిగించగల అద్భుత విద్య నాకూ, నా గురువయిన ద్రోణునికీ తప్ప మరెవ్వరికీ తెలియదే! ఈ రహస్యాన్ని తెలుసుకోగలిగిన ఆ మూడవవాడు ఎవడుచెప్మా!' అని.


పోగాపోగా, ఒక చిన్న గుడిసె కంటబడ్డది. పక్కన ఒక వేటగాడు నిలబడి వున్నాడు. వాని చేతిలో విల్లమ్ములున్నయి.

వాడొక బోయవాడు, పేరు ఏకలవ్యుడు. వాని వికృతాకారం చూచి వేటకుక్క మొరిగితే దానిని కొట్టాడు. ఒకప్పుడు ఏకలవ్యుడు ద్రోణాచార్యుని ఆశ్రయించి విలువిద్య చెప్పమని కోరాడు. అయన నిరాకరించాడు. అప్పుడు వాడు ద్రోణుని ప్రతిమను అడవిలో తన కుటీరంవద్ద నెలకొల్పి, ఆ ప్రతిమనే నిజమైన గురువుగా ఎంచి, విలువిద్య అభ్యసించి, స్వయంకృషివల్లనే ఇంతటివాడైనాడట.

అర్జునుడు ఈ సంగతి గురువుకు చెప్పాడు. అయన ఆ ప్రదేశానికి వచ్చి చూచి, విస్తుపోయాడు. ఏకలవ్యుడు అతి భక్తితో గురువుకు ప్రణమిల్లాడు.

ఏకలవ్యుడు విద్యనేర్చిన తీరు చూచాడు ద్రోణుడు. 'మరికొద్దిరోజులపాటు వీడు ఇలానే విద్య అభ్యసిస్తే, నా ప్రియశిష్యుడైన అర్జునుణ్ణి మించిన మేటి విలుకాడు ఐతీరుతాడు. అప్పుడు నేను సవ్యసాచికి, 'నిన్నుమించిన ధనుర్ధరుడు ఉండబోడ'ని చేసిన వాగ్దానం తప్పిపోతుందే' అని ఆలోచనలో పడ్డాడు.

"ఏకలవ్యా!–నిన్నుచూడగా నాకు చాలా సంతోషమైంది. మరి గురుదక్షిణ?" అని అడిగాడు. సంతోషంతో ఏకలవ్యుడు 'గురూ!—మీ అనుజ్ఞ!' అన్నాడు. అప్పుడు ద్రోణుడు వాని కుడిచేతి బొటనవేలు ఇమ్మనగా, చర్రుమని కత్తితో తన వేలు కోసి, ద్రోణునికి గురుదక్షిణగా సమర్పించి, ఏకలవ్యుడు ధన్యుడైనాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st MAR 63
SANKAR...

అట్టి వివాది బొమ్మ

ఒకరోజున ద్రోణాచార్యులు, తన శిష్యులైన కురుపాండవులను వెంటబెట్టుకొని గంగానదీతీరానికి వెళుతున్నాడు. దారిలో ఒక అశ్వత్థవృక్షం కనిపించింది. వెంటనే ఆయన అర్జునుణ్ణి పిలిచి, 'ఇవాళ నేను అభ్యంగనం చేదామనుకొంటున్నాను. నూనే, సున్నిపిండీ తెచ్చిపెట్టు'మంటూ, అతనిని పనిమీద పంపించాడు.

అర్జునుడు వెళ్ళగానే, ద్రోణుడు దుర్యోధనుని పిలిచి, "నాయనా! నీకొక కొత్త విద్య చెబుతాను, నేర్చుకో"మని అంటూ, రావిచెట్టుకింద చక్రంవేసి, మంత్రరహస్యం చెప్పి, ఆ వృక్షానికి బాణంవేసి కొట్టమన్నాడు. దుర్యోధనుడు కొట్టాడు. చెట్టుమీద గల ప్రతీ ఆకునకూ ఒక్కొక్క రంధ్రం పడింది.

తరువాత అందరూ గంగానది చేరుకొని స్నానంచేస్తున్నారు. ద్రోణుడివద్ద మాత్రం ఎవ్వరూ లేరు. ఆయన కాలుపట్టి ఒక మొసలి ఈడ్చుకుపోతున్నది. ద్రోణుడు కేకవేసేసరికల్లా కౌరవులందరూ పరుగెత్తుక వచ్చారు. ఎంత యత్నించినా ఆ మొసలిని విడిపించలేక, వారు తెల్లబోయి చూస్తూ వున్నారు.

అంతలో, గురువుకోసం నూనే, పిండీ తెస్తూవున్న అర్జునుడు అశ్వత్థవృక్షం దగ్గరకు వచ్చాడు. చెట్టుఆకులన్నీ రంధ్రాలుకలిగి చిత్రంగా కనిపించినై. కిందచూస్తే మంత్రచక్రం కనబడింది. చక్రంచూస్తూ అర్జునుడు గాండీవంతో చెట్టుకు సంధించి కొట్టాడు. వెంటనే ఆకులన్నిటికీ మళ్ళీ ఒక్కొక్క రంధ్రం చొప్పున ఏర్పడింది.

అర్జునుడు వెళ్ళేసరికల్లా గురువు మొసలినోట్లో పడిపోవటం కనిపించింది. చూచాడు సవ్యసాచి. కొత్తగా నేర్చిన మంత్రం ప్రయోగించి కొట్టాడు. దెబ్బతో మొసలి శరీరమంతా సహస్ర రంధ్రాలు పడి, చచ్చింది! ఈవిధంగా ద్రోణునికి గండం తప్పింది.

తరువాత—అందరూ కలిసి ఇంటికి మరలిపోతూవుండగా అశ్వత్థవృక్షపు ఆకులకు రెండేసి రంధ్రాలు ఎలా వచ్చాయని ద్రోణుడు ప్రశ్నించాడు. 'నేనే కొట్టా'నన్నాడు అర్జునుడు. అప్పుడు ద్రోణుడు, తను చెప్పిన మంత్రాన్ని కౌరవులు మరిచిపోవటాన్నీ, స్వయంకృషిచేత అర్జునుడు విద్యనేర్చుకోవటాన్నీ వివరించి, ఉభయుల ప్రజ్ఞలకూ గల తేడాలను చూపించాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st APR. '53
6
SANKAR

అట్ట వినాది బొమ్మ

ద్రోణాచార్యులవద్ద కురుపాండవులందరూ సమస్తమైన విద్యలూ అభ్యసించారని చెప్పివున్నాముకదా! వారికి విద్యలు పూర్తి అయినై. ఒక మంచిరోజున వారందరకూ గురువు విద్యాపరీక్షలు పెట్టించాడు.

ఆ రోజున, రాజపరివారమే గాక, రాజ్యంలోని పౌరులూ, పసిబిడ్డలుసైతం వేడుకలు చూడవచ్చారు. కత్తిసాములు, గుర్రపుస్వారీలు, మల్లయుద్ధాలు మొదలైనవన్నీ అద్భుతంగా జరిగినై. అందరూ ఆశ్చర్యపోయారు. మల్లయుద్ధంలో భీముడికీ దుర్యోధనుడికీ పోటీపడింది. వారుభయులూ అసహాయశూరులని అనిపించుకున్నారు. వారిని వారించటానికి భీష్మద్రోణాదులవంటి పెద్దలు చాలా శ్రమపడవలసివచ్చింది. అంత పౌరుషంగా నడిచింది, వారి పోటీ!


అటు తరువాత–శస్త్రవిద్యాప్రదర్శనం. విలువిద్యలో అర్జునుణ్ణి మించినవారు ఎవ్వరూ లేరని ఏకకంఠంతో అందరూ జయఘోషపెట్టారు. ఈ మాట వినగానే కర్ణుడు ముందుకువచ్చి, "కుర్రకుంక, అర్జునుడికేమి వచ్చు విలువిద్య? ఏమీ తెలియకుండా ఎందుకు వాడిని ఊరక పొగడుతున్నారు? చూడండి నావిద్య" అంటూ, తన శస్త్రవిద్యానైపుణి అగపరిచాడు. "భేష్! భేష్!!" అని పలువిధాల మెచ్చుకున్నారు అందరూ.

ఈ విజయగర్వం చూచుకొని కర్ణుడు "అర్జునా!—నాతో యుద్ధంచేసి నన్నుగెలువు"మని సవాలుచేశాడు. ప్రశాంతభావంతో అర్జునుడు 'ఏమిటి అనుజ్ఞ?' అన్నట్టు భీష్మ, ద్రోణులవంక చూచాడు. అప్పుడు వారు లేచి, "ఇది పరీక్షారంగమేకాని యుద్ధరంగం కాదు" అని అంటూ, "అయినా, కర్ణా!—సూతపుత్రుడవైన నీవు రాజకుమారుడైన సారథిని యుద్ధానికి పిలవటం తగదుసుమా" అని మందలించారు.

అప్పుడు దుర్యోధనుడు లేచి, సభవంక తిరిగి "అదేం మాట? ఇప్పుడే నేను కర్ణుణ్ణి అంగరాజ్యానికి ప్రభువుగా చేస్తున్నా"నని చెప్పి, వెంటనే మంగళద్రవ్యాలు తెప్పించి, కర్ణుడికి పట్టాభిషేకం జరిపించాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st May '53

6

అట్టవిూది బొమ్మ

విద్యలు పూర్తిఅయినతరువాత ద్రోణాచార్యులు శిష్యులందరినీ పిలిచి, "నా గురుదక్షిణమాట యేమిటి?" అని అడిగాడు. అందరూ చేతులుకట్టుకు నిలబడి, 'మీరేమి కోరినా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నా'మన్నారు. అప్పుడు ద్రోణుడు "నాకు కావలసిందల్లా ఒక్కటే: ఐశ్వర్యగర్వంతో మిట్టిపడుతున్న ఆ ద్రుపదుణ్ణి ఒడిచికట్టి తీసుకురావాలి' అని చెప్పాడు.

'ఒస్, దీనికేముంది!' అంటూ వారు కవచాలు ధరించి, అస్త్రశస్త్రాలు చేతపట్టి, రథాలు తయారుచేసుకుని, ద్రుపదునిపైకి యుద్ధానికితయారై వెళ్లారు. అందరూ వెళ్ళారుకాని, అర్జునుడుమాత్రం అప్పుడు వెళ్ళలేదు.

ఈ వార్త ముందుగానే తెలిసిన ద్రుపదమహారాజు తన సైన్యాలను సిద్ధం చేసుకొని తలపడ్డాడు. గొప్ప యుద్ధం జరిగింది. ద్రుపదుని బాణాలు కౌరవుల కవచాలను చీల్చిచెండాడినై. కురుకుమారులందరూ చావుదెబ్బలు తిని, పాండవులున్న చోటికి చేరుకున్నారు.

అప్పుడు అర్జునుడు గురువుకు ప్రణమిల్లి, ధర్మరాజుకు నమస్కరించి, అనుమతిపుచ్చుకొని, ద్రుపదునిమీదికి అత్యుత్సాహంతో బయల్దేరాడు.

బ్రహ్మాండమైన మత్స్యాలు సముద్రాన్ని అల్లకల్లోలంచేసేటట్టుగా భీముడు గదాపాణి అయి, ద్రుపదుని యేనుగులను కొట్టాడు. అవి కొండలలాగా క్రింద కూలుతూవచ్చినై. ద్రుపదుని సైనికులు నివ్వెరపడి చూడసాగారు. గురువు ఆజ్ఞ నెరవేర్చాలనే గట్టి పట్టుదలతో అర్జునుడు ప్రళయకాలపుటగ్నిలాగా ప్రజ్వరిల్లి, ద్రుపదుని రథం చుట్టుముట్టి, మహారథుడైన ఆ ద్రుపదునిపైన ధారాపాతంగా శరవర్షం కురిపించాడు. అయేసరికల్లా ద్రుపదుడు అదృశ్యుడయ్యాడు! పాంచాల సైన్యంలో హాహాకారాలు చెలరేగినై. అప్పుడు ద్రుపదుణ్ణి రక్షించటానికని సత్యజిత్తుడు అర్జునుడితో యుద్ధంచేశాడు. కాని, వాని రథం కూలిపోయింది. సైన్యం చెదరిపోయింది. సత్యజిత్తు పలాయితుడయ్యాడు.

అప్పుడు మళ్ళీ అర్జునుడికీ ద్రుపదుడికి మధ్యని ఘోరమైన యుద్ధం జరిగింది. అర్జునుడి దెబ్బలకు తట్టుకోలేక ద్రుపదుడు పారిపోబోతుండగా వానిని అర్జునుడు పట్టి, కట్టి, ద్రోణాచార్యునివద్దకు తీసుకపోయి, ఆయనకు తన గురుదక్షిణగా సమర్పించాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

వీరాధివీరుడైన ద్రుపదుణ్ణి అర్జునుడు పట్టితెచ్చి, ద్రోణాచార్యునికి గురుదక్షిణగా సమర్పించాడని తెలుసుకొన్నాముకద!

అర్జునుడి పరాక్రమాన్ని గురువర్యుడు మెచ్చుకోవటం సహజమే. కాని, విడ్డూరమేమిటంటే, అర్జునునివల్ల ఓటమిపొంది, పరాభవింపబడిన ద్రుపదుడే అతనిని ఎంతగానో మెచ్చుకొన్నాడు!

పైగా, ద్రుపదరాజు ద్రోణునిపైన పగబూనాడు. 'ద్రోణుని చంపగల కుమారుణ్ణీ, అర్జునుని వరించటానికి తగిన కూతురునీ కన్నతరువాతగాని మళ్లీ రాజ్యం చేకొనను' అని ప్రతిజ్ఞపట్టాడు.

గంగాతీరాన వున్న ఋషులకు తన ప్రతిజ్ఞ వెల్లడించగానే, వారు 'పుత్రకామేష్ఠియాగం' చేయుమని సలహా ఇచ్చారు. ఆప్రకారం యాగానికి అవసరమైన పరికరాలన్నీ సమకూర్చుకొని, వేదోక్తవిధిగా క్రతువు జరిపించాడు ద్రుపదుడు.

యాగమంతా పరిపూర్తిచేసి, చివరకు, పూర్ణాహుతి సమర్పించే సమయాన, తేజస్వి ఐన కుమారుడు అస్త్రశస్త్రాలతో, కవచకుండలాలతో ఉద్భవించాడు! అప్పుడు అశరీరవాణి "రాజా! వీడే నీవు కోరుకొన్న కుమారుడు ధృష్టద్యుమ్నుడు!" అని పలికింది.

తరువాత స్వయంగా, అగ్నికుండంలోనించి అగ్నిదేవుడే ప్రత్యక్షమై ఎదుట నిలచాడు. అతని చేతులలో ఒక స్త్రీశిశువు ఉన్నది. బంగారు బొమ్మలాగా వుండే ఆ శిశువును అగ్నిదేవుడు ద్రుపదుని చేతికిస్తూ 'నీవు కోరుకొన్నటువంటి కన్య ఈ ద్రౌపదే' అని చెప్పి, అంతర్హితుడయ్యాడు.

ద్రుపదుడు తలపెట్టిన పుత్రకామేష్ఠియాగం ఇలా దిగ్విజయంగా నెరవేరిన తరువాతనే తిరుగా ఆయన తన పాంచాలరాజ్యం ప్రవేశించాడు. అరణ్యవాసం చేసి వచ్చిన తమ ప్రభువు మళ్లీ వచ్చినందుకు రాజ్యంలో ప్రజలందరూ సంతోషంతో ఉత్సవాలు చేశారు. వరప్రసాదంగా పుట్టిన ధృష్టద్యుమ్నుడూ, ద్రౌపదీ దినదినప్రవర్ధమాన మవుతూ వచ్చారు. ధృష్టద్యుమ్నుడు వీరుడుగానూ, ద్రౌపది రూపసిగానూ పేరు పొందారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st July '52
6

అట్టవీాది బొమ్మ

పాండవులైదుగురనూ ఎలాఐనా హతమార్చాలెనని దుర్యోధనుడు కాంక్షపట్టివున్నాడు. తన పరివారంతో నిరంతరమూ సలహాలుచేస్తూనే వున్నాడు. అనేకమైన వ్యూహాలు పన్ని అవన్నీ విఫలములైన తరువాత చివరకు ఒకేఒక అమోఘమైన వుపాయం పన్నాడు. అదేమిటి అంటే :

కనకుడు అనే గొప్ప శిల్పిని రప్పించి, అందమైన ఒక లక్కయింటిని సృష్టించాడు. 'మీ అన్నదమ్ములందరూ ఈ ఇంట్లో ఉండండి' అని ధృతరాష్ట్రునిచేత పాండవులకు హితవు చెప్పించాడు. ఆ ప్రకారం వచ్చి, పాండవులు లక్కయింటిలో మసులుతూవుండగా చూచి, ఒక రోజున ఆ యింటికి నిప్పు ముట్టించుమని 'పురోచను'డనే అంతరంగికునితో యేర్పాటుచేసివుంచాడు.

ఐతే—పాండవపక్షపాతి ఐన విదురునివలన భీమసేనుడు ముందుగానే ఈ యేర్పాటు తెలుసుకొన్నాడు. పురోచనుడు లాక్షాగృహాన్ని దహసంచేయబోయే సమయంకూడా తెలుసుకొన్నాడు.

ఈ పరిస్థితులన్నీ గ్రహించి, అంతకుముందుగానే తవ్వి ఉంచిన ఒక రహస్యసొరంగంద్వారా భీముడు గాఢనిద్రలో వున్న తన తల్లి కుంతీదేవినీ, సోదరులనందరనూ ఎత్తుకుతీసుకుపోయి గంగానది ఒడ్డుకు చేర్చాడు. విదురుని ఏర్పాటుప్రకారం అక్కడ ఆ సమయాన సిద్ధంగా వున్న ఒక పడవ పాండవులనూ కుంతీదేవినీ ఎక్కించుకుపోయి, సురక్షితమైన ఒక ప్రదేశమందు దిగబెట్టింది. తరువాత భీమసేనుడు మరలివచ్చి, పురోచకునికంటె ముందుగా తనే లక్కయింటికి నిప్పుముట్టించివేశాడు. చిటికసేపటిలో లాక్షాగృహం పురోచకుడితోసహా భస్మీపటలమై వూరుకొన్నది.

తెల్లవారగానే అక్కడ బూడిదమాత్రమే కనబడింది. పాండవులందరూ చచ్చివుంటారని దుర్యోధనాదులు సంతోషించారు. ఈ ఘోరవార్త విని భీష్మాదులు దుఃఖించారు. అందరితోపాటు విదురుడున్నూ దుఃఖం నటించాడు. పురోహితులను రప్పించి చచ్చారనుకొన్న పాండవులకు, కౌరవులు ఉత్తరక్రియలు జరిపించారు. ధృతరాష్ట్రుడుకూడా పాండవులకు తిలోదకాలు వదిలాడు. దగ్ధమైన లక్కయింటినిగురించి తనప్రజ్ఞ తలుచుకొని దుర్యోధనుడు పొంగిపోయాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
6
ANKAR

అట్టమీది బొమ్మ

లక్కయింటిని తగులబెట్టిన భీమసేనుడు హిడింబవనంలో తన తల్లినీ, సోదరులనూ కనిపెట్టుకొని వున్నాడు. అక్కడ హిడింబాసురుడనే రాక్షసుడు తన చెల్లెలినిపిలిచి "ఈచుట్టుపక్కల ఏదో నరవాసన కొడుతున్నది. మనకు మంచి విందు దొరికేటట్టున్నది. పోయి చూచివస్తా"నంటూలేచాడు. అందుకు హిడింబి "అన్నా! ఈపాటిదానికి నీవెందుకు? నేనే పోయివస్తా, ఉండు" అంటూ బయలుదేరింది.


దూరంనుంచే హిడింబి భీమసేనుని సుందరరూపం చూసింది. చూడగానే అతనిని పెళ్ళాడాలనని కుతూహలం కలిగింది. వెంటనే ఆమె ఒక అందమైన చిన్నదాని రూపం తాల్చి, భీమసేనునివద్దకు వచ్చి, కుశలప్రశ్నలు వేస్తూనే తన అభిలాషను వెల్లడించింది. పెళ్ళివిషయంలో పెద్దల అనుమతి కావాలని చెప్పాడు భీమసేనుడు.

ఈ సంభాషణ జరుగుతూవుండగానే హిడింబాసురుడు అక్కడికి చక్కా వచ్చాడు. తన చెల్లెలు భీమునితో ప్రీతిగా మాటాడటంచూచి గర్జించాడు. అప్పుడు భీమసేనుడు వానితో మల్లయుద్ధంచేసి హిడింబుణ్ణి సంహరించాడు.

ఈ అలికిడికి పాండవసోదరులూ, కుంతీదేవీ నిద్రనుండి లేచారు. కుంతి ఎన్నో ప్రశ్నలు అడిగేసరికి, హిడింబి అనే ఆ సుందరి ఎంతో ఒప్పిదంగా సమాధానాలు చెబుతూవచ్చింది. ఆమె పాండవుల చరిత్రఅంతా తొలినుండి తుదివరకూ వెల్లడించేసరికి ధర్మరాజు ఆశ్చర్యపోయి, 'ఇదంతా నీకెలా తెలుసు?' నని ప్రశ్నించాడు. 'వ్యాసభగవానుని అనుగ్రహంవల్ల నాకు భూత భవిష్యత్తులు తెలుసు' నన్నది ఆమె.

హిడింబి ఇలా అంటూ, భీమసేనునికి తను భార్యగా ఉండేటట్టు అనుమతించవలసిందని ప్రాధేయపడింది.

ఆ సమయాన వ్యాసభగవానుడు ప్రత్యక్షమై, 'ఈ హిడింబి రాక్షసవనిత కదా అని సంశయించ పనిలేదు. పుట్టుకచేత రాక్షసే ఐనప్పటికీ, దైవాంశలుగల సుగుణఖని. మన భీమసేనుని సతి కావటానికి అన్నివిధాలా తగినది' అంటూ హిడింబి గుణగణాలు వర్ణించిచెప్పి, అప్పుడే భీమసేనునికీ హిడింబికీ వ్యాసభగవానుడు స్వయంగా పెళ్ళి చేయించాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Sep. '53
6
SANKAR

అట్టపీది బొమ్మ

పంచపాండవులు వ్యాసభగవానుని హితవు ప్రకారం హిండింబవనంనుండి బయలుదేరిపోయి ఏకచక్రపురం ప్రవేశించి, ఒక బ్రాహ్మణుని ఇంటిలో కాపురముంటూవచ్చారు. ఉన్నట్టుండి, ఒకనాడు ఆ ఇంట్లోవారందరూ దుఃఖంతో విలపించడం కుంతీదేవి చెవులకు వినపడింది. ఆమె వారిదగ్గరకు వెళ్ళి 'ఏమిటీ సంగతి' అని అడిగేసరికి వారిలా చెప్పారు:

'అమ్మా!—ఏమని చెప్పేది మా అవస్థ? ఈవూరికి సమీపాన అరణ్యంలో బకాసురుడనే రాక్షసుడున్నాడు. వాడు ఊళ్ళమీద పడి జనాన్ని పీడిస్తూవుండగా, నలుగురూ చేరి 'అయ్యా, రాక్షసరాజా!—మేము వంతులువేసుకుని, రోజూ బండినిండా ఆహారపదార్థాలు మనిషితోసహా సమర్పించుకొంటాము. తృప్తిపడవలసిం'దని ఒప్పందం చేసుకొని ఆనాటినించీ అలానే జరిపిస్తున్నాము. రేపటిరోజు మావంతు. మాలో ఎవళ్ళు రాక్షసుడికి బలికావటమా అని గొడవపడుతున్నాము' అని చెప్పాడు.

అందుకు కుంతీదేవి "అయ్యా!—మీరెంతమాత్రమూ దుఃఖించపనిలేదు. నాకు ఐదుగురు బిడ్డలున్నారు. వారందరూ బలాఢ్యులు. అందులోనూ రెండవవాడైన భీమసేనుడు రాక్షసులను చంపడంలో ఘనుడు. రేపటిరోజున మీబదులు మా భీముడే పోయివస్తాడు. పోయి ఏమిచేస్తాడో నే చెప్పడమెందుకు, మీ కంటితో మీరే చూతురుగాని" అని నచ్చజెప్పగా వారు ధైర్యంచెంది శోకంమానారు.

కుంతీదేవి ఈ వార్త చెప్పటంతోనే భీమసేనుడు ఎగిరి గంతువేశాడు. మరునాడు ఒక పెద్ద బండినిండా దివ్యమైన ఆహారపదార్థాలు పట్టించుకొని, బకాసురుడు ఉండే అడవికి చేరుకొన్నాడు. అక్కడ ఒక చెట్టుక్రింద స్తిమితంగా కూర్చుని, భీమసేనుడు పదార్థాలను ఆరగించసాగాడు.

అంతలో "ఎవడురా వాడూ!..." అని హుంకరిస్తూ బకాసురుడు వచ్చాడు. నిర్లక్ష్యంగా భోజనంముందు కూర్చునివున్న భీముని వాలకం చూచి ఉగ్రుడయ్యాడు. భీముడు వానికి మాటకుమాట బదులుచెప్పాడు. క్రమంగా చేతులు కలిసినై. అతి పౌరుషంతో వారు పోరాడగా, బ్రహ్మాండమైన రెండుకొండలు ఢీకొన్నట్టు భూమి కంపించింది. చివరకు బకాసురుడు హతుడై నేలకూలాడు. ఈవిధంగా భీముడు ఆ రాక్షసుని పీడ లోకానికి వదిలించి, మెప్పుపొందాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Oct
6

అట్టమీది బొమ్మ

తనను పరాభవించిన ద్రోణుణ్ణి సాధించేటందుకుకదా, పాంచాలప్రభువైన ద్రుపదమహారాజు ఘోరతపస్సుచేసి ద్రౌపదిని కుమార్తెగా పొందాడు? ద్రోణుని ప్రియశిష్యుడైన అర్జునుడు, తక్కిన పాండవులతోపాటు లాక్షాగృహంలో దహనమైవుంటాడని నమ్మి, నలుగురలాగానే ద్రుపదుడూ విచారించాడు.

ద్రౌపదికి యుక్తవయస్సు వచ్చింది. పార్థునివంటి ప్రజ్ఞావంతుడికి ఆమెనిచ్చి పెండ్లిచేయాలనే కుతూహలంతో, ద్రుపదుడు ఒక గొప్ప పరీక్ష పెట్టాడు. అదే 'మత్స్యయంత్రం'. ఎంతో యెత్తున మత్స్యయంత్రం ఏర్పాటు చేసి, కింద బరువైన విల్లొకటి పెట్టాడు. విల్లు ఎక్కుపెట్టి ఎవరు ఆ మత్స్య యంత్రాన్ని భేదిస్తే, వాళ్లకు తన కుమార్తెను ఇస్తానని రాజ్యంలో స్వయంవరం ప్రకటించాడు.

స్వయంవరానికి రాజాధిరాజులందరూ వచ్చారు. కర్ణ, దుర్యోధనాదులు వచ్చారు. బ్రాహ్మణుల రూపంలో పంచపాండవులూ వచ్చారు. దర్బారు కిటకిటలాడుతూ, అత్యంత వైభవంగా ఉన్నది.

ద్రౌపదికి సోదరుడైన దృష్టద్యుమ్నుడు స్వయంవరాన్నిగురించి వివరాలన్నీ సభవారికి వెల్లడించాడు. వివరాలు విన్నతరువాత ఆ వచ్చిన రాజకుమారులలో కొందరు కూర్చున్నచోటినుండి లేవనేలేదు. కొందరు సగందూరం వచ్చి అక్కడి నించే తలవంచుకు మరలిపోయారు. కొంతమంది ధనుస్సు ఎత్తబోయి, చేతగాక వెనుదిరిగారు. చివరకు, బాణం ఎక్కుపెట్టి కొట్టగలిగింది ఒక్కడే ఒక్కడు—కర్ణుడు. ఐతే అతని గురి తప్పిపోయింది. ఇక క్షత్రియులలో పోటీ చేయవలసిన వారెవ్వరూ మిగలలేదు. అప్పుడు ద్రుపదుడు, బ్రాహ్మలలోనైనా సరే సమర్థత కలవారు పోటీచేయవచ్చు నన్నాడు.

వెంటనే, బ్రాహ్మణరూపంతో వున్న అర్జునుడు ఉత్సాహంతో ముందుకు వచ్చాడు. గురిపెట్టి కొట్టి మత్స్యయంత్రాన్ని భేదించాడు! సభలో జేజేలు మిన్నుముట్టినై.

ఈ యంత్రాన్ని కొట్టింది బ్రాహ్మణుడు కాదు, ఫల్గుణుడే అనేరహస్యం వెల్లడికాగా, సభలో చెలరేగిన ఆనందానికి అంతు లేకపోయింది. ద్రౌపది సరాసరి వచ్చి పూలమాలను సవ్యసాచి మెడలో వేసింది!!

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

దీపావళి అనగా దీపాల వరుస అని అందరకూ తెలుసు. ఈ మాట చెవిని పడగానే ఒక పండగ పేరు మనకు స్ఫురిస్తుంది. అసలు, దీపావళి అనే ఈ మాటలోనే ఏదో గొప్ప విశేషమున్నట్టు తోస్తుంది.

ఐతే—దీపావళి పేరులోనే గాక, పండగలోకూడా గొప్ప విశేషమున్నది. దీపావళి పేరు వింటే మనస్సు వికసిస్తుంది. దీపావళిపండగ వస్తే ఆశాజ్యోతులు వెలిగి ప్రకాశిస్తాయి. దీపావళి పేరు అంత శ్రావ్యంగా వుంటుంది. దీపావళి పండగ అటువంటి కళ్ళవెలుగును ఇస్తుంది.


దీపావళిపండగ రాత్రిపండగ. చిమ్మచీకటిలో అది వికసిస్తుంది. ఇంటిలోనూ, మనసులోనూ వుండే అంధకారాన్ని పటాపంచలు చేయటానికి ఈనాడు దేశమంతటా కోటానకోట్లు దీపాలు వెలుగుతై. తల్లులు చేసే దీపారాధనలతో, పిల్లలు చేసే బాణాసంచాల శబ్దాలతో, దీపావళిపండగ దివ్యంగా శోభాయమానంగా జరుగుతుంది.

ఏటా ఇంత శోభతో జరిగే ఈ పండగ ఎందుకోసం? నరకాసురుడనే రాకసుడు యీనాడు తుదముట్టింపబడ్డాడు! ఇప్పటికి మనదేశంలో ఎంతమంది రాకసులు పుట్టలేదు? చావలేదు? అందరి చావుకోసమూ ఇటువంటి వైభవమైన ఉత్సవాలు జరుగుతున్నవా?—లేదు. మన భారతజాతికి ఇటువంటి దీపాల ఉత్సవాన్ని కల్పించిన ఆ నరకాసురుడు ఎంత క్రూరుడోకదా!

నిజానికి, మనదేశంలో పుట్టిన దేవతలూ గొప్పవాళ్ళే, రాకసులూ గొప్పవాళ్ళే. అందుచేతనే, మనదేశపు కథలు ప్రపంచమంతటినీ ఆకర్షించినై. లోకానికంతటికీ దారిచూపుతున్నాయి.

మన దీపావళి, లోకంలో ధనవంతులకూ దరిద్రులకూ ఒకే విధంగా వెలుగు చూపుతుంది. పండగలలోకల్లా ఈ పండగ అంటే పిల్లలకు యెంతో ఇష్టం. తల్లులకు ఎంతో తుష్టి. ఇంటా బయటా కలకలలాడే ఈ దీపావళి తల్లుల పండగ, పిల్లలపండగ. ఇంటింట జరిగే పండగ, ఇంటిల్లిపాదీ పాల్గొనే పండగ.

ఈవిధంగా ఒక యింటి తల్లీ పిల్లలు ఉత్సాహంతో పాల్గొంటూవున్న దీపావళి దృశ్యమే, ఈ నెల చందమామపైన మీరు చూచే అట్టమీది బొమ్మ.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక

అట్టమీది బొమ్మ

మత్స్యయంత్రం భేదించిన సవ్యసాచి మెడలో ద్రౌపది పూలమాల వేసిందని చెప్పాముకద! ఐతే, పెద్దల ఆదేశంప్రకారం ఆమె పంచపాండవు లైదుగురనూ పెళ్ళాడవలసి వచ్చింది. పెండ్లి కాగానే, పాండవులు రాజధాని ఐన ఇంద్ర ప్రస్థపురానికి వెళ్ళిపోయారు.

ఒకరోజున నారదమహర్షి వచ్చి వారికి అనేకమైన హితబోధలు చేస్తూ, సుందోపసుందుల కథకూడా చెప్పాడు.

సుందోపసుందులు 'నికుంభుడు' అనే రాక్షసుని కుమారులు. వారు సామాన్యులు కారు. ఇద్దరూ మంచి తపశ్శాలులు. ఒకరికొకరు గాఢ మైత్రితో ఉండేవారు. ఈ మైత్రి ఎప్పుడూ ఇలానే ఉంటుందని వారి నమ్మకం. ఈ నమ్మకంతో ఒకప్పుడు బ్రహ్మనుగూర్చి వారు ఘోర తపస్సు చేశారు.

బ్రహ్మ ప్రత్యక్షంకాగా, వారు "దేవా!—పరస్పరమూ మాకు మేము తక్క, ఇతరులెవ్వరివలనా మాకు చావులేకుండా వరం అనుగ్రహించవలిసింది" అని కోరుకొన్నారు. 'సరే' అనిచెప్పి బ్రహ్మ తనలోకానికి వెళ్ళిపోయాడు.

వరబలంవలన వాళ్ళు గర్విష్ఠులై, దేవలోకంమీదికే దండెత్తారు. భూలోకమందు సాధులను హింసింపసాగారు. ప్రజ వాళ్ల బాధ భరించలేక తిన్నగా పోయి బ్రహ్మతో మొరపెట్టుకొన్నారు.

అప్పుడు బ్రహ్మ విశ్వకర్మనిచేత ఒక చక్కటి స్త్రీరూపాన్ని తయారు చేయించాడు. బ్రహ్మ ఆమెను పిలిచి, "ఓ తిలోత్తమా! నీవు భూలోకానికి పోయి, గర్విష్ఠులైన సుందోపసుందులను పరిమార్చిరావాలి" అన్నాడు.

సమయంచూచి ఆమె భూలోకానికి దిగివెళ్ళి, వారిని ఎంతగానో ఆకర్షించింది. ఆమెను చూచి వారిద్దరూ 'నేను పెళ్లాడతా'నంటే 'నే పెళ్లాడతా'నని పోటీలుపడి తగవులాడారు.

తగవు తెగలేదు. వారిలోవారికి ఆమెనుగురించి మత్సరం ఎక్కువైంది. చివరకు యుద్ధానికి తలపడి, ఇద్దరూ యుద్ధంలో చచ్చి, కింద పడ్డారు.

తిలోత్తమ మళ్ళీ దేవలోకానికి వెళ్ళిపోయింది. ఆ దుర్మార్గుల పీడ వదలినందుకు సమస్తలోకాలూ సంతోషించినై.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

నారదమునివలన పంచపాండవులు 'సుందోపసుందుల' కథ విన్నట్టు చెప్పాముకద. తరువాత, పాండవులు ఒక యేర్పాటు చేసుకొన్నారు—ద్రౌపదితో ఒక్కొక్కరు ఒక్కొక్క ఏడు కాపరంచెయ్యాలి. ఆమె ఎవరింటిలో వుంటే ఆ యింటికి తక్కిన నలుగురూ పోకూడదు. ఒకవేళ వెళ్లడమే తటస్థించినట్టయితే, పన్నెండునెలలు తీర్థయాత్ర చేసుకురావటమే ప్రాయశ్చిత్తం.

ఒకరోజున ఒక బ్రాహ్మణుని ఆవులను దొంగలు తోలుకొనిపోతూవుండగా, ఆయన ధర్మరాజుండే నగరుకు దుఃఖిస్తూ వచ్చాడు. అర్జునుడు దుఃఖకారణం తెలుసుకొని, ఆ బ్రాహ్మడికి అభయమిచ్చాడు. వెంటనే అర్జునుడు తన ధనుర్బాణాలకోసం ఆయుధాగారంలోపలికి వెళ్లాడు. ఆ సమయాన ధర్మరాజూ ద్రౌపదీ అక్కడ వుండటం చూచి, అర్జునుడు చాలా విచారించాడు.

ఏమయితేనేం పోయి, దొంగలను శిక్షించి బ్రాహ్మడి గోవులను తిరుగా ఇప్పించి, అన్నగారివద్దకు వచ్చాడు అర్జునుడు. 'అన్నా!—మనం చేసుకున్న నియమాన్ని ఉల్లంఘించాను. తీర్థయాత్రపోయి వస్తా, సెలవియ్యి'అని కోరాడు.

అందుకు ధర్మరాజు 'అర్జునా! ఇది విప్రకార్యం కనుక దోషంకాదు. తీర్థయాత్ర పోవలసిన పనిలేదు' అని హితవుచెప్పాడు. ఐనా, అర్జునుడికి మనస్కరించలేదు. 'మనమే ధర్మం తప్పితే లోక మేమనుకొంటుంది. వెళ్ళే తీరతాను' అంటూ అర్జునుడు బయల్దేరాడు.

అర్జునుడు తన యాత్రలలో అనేక పుణ్యనదులలో స్నానంచేసి, దేవ తర్పణములూ పితృతర్పణములూ చేస్తూవచ్చాడు. అతను గంగానదిలో మునిగేసరికి 'ఉలూపి' అనే నాగకన్య అర్జునుడి చెయ్యిపట్టుకొని, ఇవతలకు రానీయకుండా అతనిని నాగలోకంలో ఒక దివ్యభవనం చేర్చింది.

'ఇది ఏమి సాహసం? నీవెవ్వతెవు? ఇది ఏ దేశం?' అంటూ అర్జునుడు ప్రశ్నించసాగాడు. అందుకామె 'నేను కౌరవ్యుడనే నాగరాజు పుత్రికను. ఈ గంగానదికి నువ్వు వచ్చిందిమొదలు నీ పరమసుందరరూపం చూచి, నిన్నే పెళ్ళాడటానికి నిశ్చయించుకొన్నాను. కాదంటివా, నేను పరలోకానికి పోవలసిందే. కరుణించు. పుణ్యంకట్టుకో' అంటూ అర్జునుడి పాదాలు పట్టుకొన్నది. అర్జునుడు ఉలూపిని గాంధర్వవిధిగా పెళ్ళాడి ఆమెకోరిక నెరవేర్చాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
6
SANKAR

అట్టమీది బొమ్మ

అర్జునుడు తీర్థయాత్రలు చేసుకొంటూ, అనేక ప్రదేశాలు తిరిగితిరిగి, ద్వారక సమీపానికి చేరుకొన్నాడు. ఈ వర్తమానం శ్రీకృష్ణుడికి తెలిసి, వెంటనే అతనికి ఎదురు వెళ్ళాడు.

కృష్ణునికి సుభద్ర అనే చెల్లెలు వున్నది. ఆమెకు తగిన భర్త అర్జునుడే అన్నసంగతి కృష్ణుడికి తెలుసు. ఐతే, అతని అన్న ఐన బలరాముడికి ఈ సంబంధం ఇష్టంలేదు. కాగా, కృష్ణార్జునులు కలసి ఒక తంత్రం పన్నారు.

అర్జునుడు సన్యాసివేషంతో 'రైవతకాద్రి'లో దిగి, మకాంచేశాడు. అతని కీర్తి ఆ ప్రాంతమంతటా ప్రచారమై, బలరామునివరకూ పోయింది. బలరాముడికి సాధువులంటే భక్తిగౌరవాలు ఎక్కువ. కనుక, సపరివారంగా వచ్చి, ఆ సన్యాసిని తోడ్కొనిపోయి, తన ఉద్యానవనంలో ఆయనకు సౌకర్యమైన చక్కటి బస ఏర్పరిచాడు.


అప్పుడు ఆ సన్యాసి 'చాతుర్మాసవ్రతం' పట్టాడు. ఆయన సేవకూ శుశ్రూషకూ బలరాముడు సుభద్రనే నియమించాడు. 'సన్యాసుల్ని నమ్మరాదు. సుభద్రను నియమించవద్దుసుమా' అని శ్రీకృష్ణుడు అన్నతో చెప్పాడు. ఐనా, సాధుభక్తి గల బలరాముడు ఆ మాట చెవినిపెట్టలేదు.

సుభద్ర సన్యాసికి పరిచర్యచేస్తూ వుండగావుండగా ఇద్దరిమధ్యనీ పరిచయం దినదినాభి వృద్ధిపొందింది. ఆమె అర్జునుణ్ణి ఎన్నోవిధాల మెచ్చుకొంటూ వారి ప్రసంగాలలో వెల్లడించింది. అప్పుడు 'నేనే ఆ అర్జునుణ్ణి' అంటూ రహస్యం చెప్పివేశాడు సన్యాసివేషంలో వున్న అర్జునుడు. సుభద్రకు చాలా ఆనందం కలిగింది.

ఆమె తన మనోభీష్టాన్ని అన్న ఐన శ్రీకృష్ణునికి తెలుపగా, శ్రీకృష్ణుడు వారి రహస్య వివాహానికి ఏర్పాటు చేశాడు. ఆ ప్రకారం, అర్జునుడు ఒక రథం పైన సుభద్రను కూర్చోబెట్టుకొని, ఇంద్రప్రస్థానికి దారితీశాడు.

ఈ సంగతి తెలిసి, బలరాముడు కుపితుడై, అర్జునుణ్ణి ఎదుర్కొన్నాడు. వారిమధ్య గొప్ప యుద్ధం జరిగింది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు వచ్చి, అన్నను సమాధానపరిచి, సుభద్రార్జునులకు వైభవంగా పెళ్లి జరిపించాడు.

ఈ సుభద్రకు పుట్టినవాడే భారతవీరాగ్రేసరుడైన అభిమన్యుడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
st Mar. '54
6
SANKAR...

అ ట్ట వి హా ది బొ మ్మ

ఒకప్పుడు గ్రీష్మకాలంలో కృష్ణార్జును లిద్దరూ వనవిహారం బయలుదేరారు. పోయిపోయి, ఖాండవ వనం సమీపానికి చేరుకొన్నారు. అక్కడ వారు సుఖాసీనులైవుండగా, ఒక వృద్ధబ్రాహ్మణుడు వచ్చి "మీరెవరో మహానుభావులలాగా ఉన్నారు. నేను చాలా ఆకలిబాధతో వచ్చాను. 'తీరుస్తాను' అని మీరు మాట ఇస్తే, నా కథ చెబుతాను" అన్నాడు.

వెంటనే అర్జునుడు "చెప్పవయ్యా బ్రాహ్మడా! నే నుండగా నీకేం భయం?" అన్నాడు, ధీమాగా. ఈ మాట చెవినిపడగానే వృద్ధుని రూపంలో వున్న అగ్నిదేవుడు ఇలా చెప్పాడు :

"నేనే అగ్నిని. లోగడ శ్వేతకి అనే రాజు లెక్కలేనన్ని యాగాలు చేశాడు. ఆయన చేసిన యాగాలు ఎన్ని అని లెక్కచెప్పాలంటే వినండి : వాటిలో పాలొన్న బ్రాహ్మణులకు పొగవల్ల నేత్రరోగాలు వచ్చినై. హోమం చేసిన నెయ్యి తాగితాగి నాకు కడుపునొప్పి పట్టుకొన్నది. ఈ బాధ వదుల్చుకోవటం ఎలాగా? అని బ్రహ్మదేవుణ్ణి ప్రశ్నిస్తే, 'ఖాండవవనాన్ని దహించవయ్యా, నీ రోగం ఇట్టె నయమవుతుంది' అని అన్నాడు. నేను ఎన్నోసారులు ప్రయత్నం చేశానుకాని, ఆ వనానికి అధిపతి ఐన దేవేంద్రుడు వర్షం కురిపించటంవల్ల ఆటంకం కలిగి, నా కోరిక నెరవేర్చుకోలేకపోయాను.

"ఈ సంగతి మళ్ళీపోయి బ్రహ్మతో చెప్పుకొనేసరికి, ఆయన 'త్వరలోనే కృష్ణార్జునులు ఆ వనానికి రాబోతున్నారు. అప్పుడు వారికి నీ సంగతి వినిపించి, సహాయం కోరుకో. వారు తప్పక నెరవేరుస్తారు' అని సలహా చెప్పాడు. అలానే మీరు దయచేశారు. నా కోరిక తీర్చాలి" అని ప్రార్థించాడు.

మాట తప్పటానికి మనస్కరించక అర్జునుడు, 'బాగానే వుంది. మరిప్పుడు మావద్ద ఆయుధాలు లేవే?' అన్నాడు. అప్పుడు అగ్ని వరుణదేవుని వేడుకోగా, వరుణుడు వచ్చి అర్జునుడికి అక్షయతూణీరమూ, దివ్యరథమున్నూ, కృష్ణునికి చక్రమూ, కౌమోదకి అనే గదా సమర్పించాడు. ఈ పరికరాలతో కృష్ణార్జునులు ఒక పక్షంరోజులు కాపలా కాస్తూవుండగా, అగ్నిదేవుడు ఖాండవ వనం దహించి, తన కోరిక సఫలం చేసుకొన్నాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Apr. '54
6
SANKAR

అట్ట మీది బొమ్మ

కొంతకాలమైనతరువాత దుర్యోధనుడు పిలిపించగా, పంచపాండవులు ద్రౌపదితో సహా హస్తినాపురం చేరుకొన్నారు. చాలాకాలానికి కంటబడిన ద్రౌపది గాంధారితో ముచ్చటిస్తూవుండగా, ప్రాతికామి అనేవాడు అక్కడికి వచ్చి 'ధర్మరాజు నిన్ను పందెంలో ఓడిపోయాడు. మా కౌరవేశ్వరుడు నిన్ను రమ్మంటున్నారు. రా వెంటనే!' అంటూ ద్రౌపదిని పిలిచాడు.

అందుకు ద్రౌపది నివ్వెరపడి, 'అబ్బాయీ!—ధర్మరాజు తను ఓడిన తరువాత నన్ను ఓడినాడా? ఓడకముందే నన్నోడినాడా?' అని ప్రశ్నించింది. వాడు బదులు చెప్పకుండానే ఆమెను రమ్మని తొందరచేసి, సభకు తీసుకపోయాడు. ఆ నిండుసభలో ఆమె నిలబడింది. అలా నిలచిన ద్రౌపదిని సభమధ్యకు ఈడ్చుకురమ్మని దుర్యోధనుడు ఆజ్ఞాపించాడు. ఆజ్ఞప్రకారం దుశ్శాసనుడు వెంటనే ఆమె కొప్పుపట్టి లాగాడు.

అంతటి గొప్పసభలో అందరూ తెల్లబోయి చూస్తున్నారేకాని, ఒక్కడూ కిక్కురుమనలేదు. నీచమనస్కుడైన దుర్యోధనుడు అంతటితో ఆగలేదు. 'చూస్తావేం!' అని సంజ్ఞచేశాడు దుశ్శాసనుడికి. అలా చేయటమే తడవుగా దుశ్శాసనుడు ఆమె కట్టుకొన్న వస్త్రాలు లాగివేయజొచ్చాడు.

ఆ సమయంలో ఎవ్వరూ ఆమెను రక్షింపలేకపోయారు. ఇటువంటి తగని పనిని భీష్మాదులుసైతం మాన్పింపజాలక నిశ్చేష్టులై నిలబడిపోయారు.


అప్పుడు దిక్కులేని ద్రౌపది పొందిన ఆవేదన ఇంతంత కాదు. తన మానం కాపాడమని ఆమె నిశ్చలమైన మనస్సుతో, ఆ కృష్ణభగవానుణ్ణి వేయి విధాల వేడుకొన్నది.

మానవతి ఐన ద్రౌపది మొర శ్రీకృష్ణుడికి వినిపించింది. ఆమెను కాపాడటానికి భగవానుడు వెంటనే పూనుకొన్నాడు. అందుకు ఫలితంగా—దుర్మార్గుడైన దుశ్శాసనుడు ద్రౌపది చీరను ఎంతగా ఒలిచినప్పటికీ అంతులేకుండా అది పెరిగిపోయి, ద్రౌపది శరీరాన్ని అంటిపెట్టుకొనే ఉంటూ వచ్చింది! అందుచేత, దుర్యోధనుడి దుర్మార్గపు వ్యూహం ఎంతమాత్రం నెరవేరలేదు.

ద్రౌపదీదేవి పాతివ్రత్యాన్ని ఈవిధంగా కాపాడిన శ్రీకృష్ణుని మహిమకు సభలోఅందరూ ఆశ్చర్యపోయారు!

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టవీాదిబొమ్మ

ప్రాయజూదంలో ఓడిపోయిన పాండవులను దుర్యోధనుడు అడవులకు వెళ్ళగొట్టినట్టు లోగడనే తెలుసుకొనివున్నాముకద. పాండవులు అరణ్యావాసానికి బయలుదేరేముందుగా ద్వైతవనంలో కొన్నాళ్ళుండి, తరువాత దూరాన వుండే 'కామ్యక' వనానికి చేరుకొన్నారు.

వనవాసమూ, అజ్ఞాతవాసమూ పూర్తిఅయిన తరువాత, దుష్టుడైన దుర్యోధనుడితో తమకు ఎలానూ యుద్ధం వస్తుందని బాగా తెలుసు అర్జునుడికి. అందుకోసమని, యుద్ధంలో జయించేటందుకు తగిన దివ్యాస్త్రాలను పొందాలని, అతడు తపస్సు ప్రారంభించాడు.

ఇంద్రకీలపర్వతంలో అర్జునుడు ఈశ్వరునిగురించి ఘోరతపస్సు చేయగా పార్వతితోసహా ఈశ్వరుడు, కిరాతవేషంలో వచ్చి అర్జునుని తపోదీక్షను పరీక్షింపసాగాడు.

ఈ పరీక్షకుగాను 'మూకుండు' అనే రాక్షసుడు ఒక అడవి పందిరూపంలో వచ్చి అర్జునుడి తపస్సు భగ్నంచేయబోయాడు. అర్జునుడు దానిని ఒకే బాణంతో కొట్టాడు. అదే సమయాన కిరాతుడుకూడా బాణంవేశాడు. అప్పుడు 'ఈ పందిని నేను చంపానంటే నేను చంపా'నని వారిద్దరిమధ్యనీ పేచీవచ్చింది. కిరాతుడికీ అర్జునుడికీ గొప్పయుద్ధం జరిగింది. శివార్జునుల యుద్ధం అంటే వేరే చెప్పేదేమిటి? మూడులోకాలూ దద్దరిల్లిపోయినై. బాణాలవర్షం కురియసాగింది.

చాలాసేపు యుద్ధం జరిగినతరువాత, చివరకు కిరాతుడు అర్జునుని గాండీవానికి గల 'నారి'ని తన బాణంతో కొట్టి తెంపివేశాడు.

ఇదిచూచి అర్జునుడికి పట్టరాని ఆశ్చర్యం కలిగింది. ఏమీ! ఈ విధంగా తన గాండీవాన్ని ఛేదించగలిగినవాడు ఈశ్వరుడు ఒక్కడే. వెంటనే చిరునవ్వు నవ్వుతూ నించున్న ఈశ్వరుని గుర్తించాడు అర్జునుడు. నమస్కరించాడు.

పైగా, అర్జునుడు శివలింగాన్ని స్థాపించి, దానికి పూజించిన పువ్వులన్నీ ఆ కిరాతకుని తలపైన స్పష్టంగా కనిపించినై. అందుచేత, ఆయన తప్పక ఈశ్వరుడే అన్న సంగతి అర్జునుడికి రూఢిఐపోయింది. అర్జునుడి తపస్సుకు మెచ్చి, ఈశ్వరుడు తన పాశుపతాస్త్రం అనుగ్రహించి, అదృశ్యమయ్యాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
June '54
6
SANKAR

అట్టవిాది బొమ్మ

అస్త్రశస్త్రాలు తీసుకురావటానికని వెళ్లిన అర్జునుడు ఎంతకాలానికీ రాకపోవటంతో ధర్మరాజు చింతాక్రాంతుడయ్యాడు. అప్పుడు బృహదశ్వుడు అనే ఋషి వచ్చి, ధర్మరాజు చింతను తొలగించటానికి ఈ కథ చెప్పాడు :—

నిషధదేశపు రాజు నలుడు. సదాచారసంపన్నుడు. విదర్భ రాజకుమారి ఐన దమయంతి అతన్ని స్వయంవరంలో వరించింది. నలుడి సదాచారసంపత్తి చూచి కలిపురుషుడికి ఈర్ష్యకలిగింది. ఒకనాడు నలుడు ఏదో చిన్న ఆచారం మరచిన సమయం చూచి, కలిపురుషుడు అతన్ని పట్టివేశాడు.

కలి ప్రోత్సాహంవల్ల నలుడు పుష్కరుడితో జూదమాడి, రాజ్యమంతా పోగొట్టుకొని, దమయంతితోసహా అడవులకు పోయాడు. అక్కడ అకలిబాధకు ఓర్వలేక, పిట్టలకోసం గుడ్డ పరిస్తే, అవికాస్తా అగుడ్డతో ఎగిరిపోయినై. ఇలా అష్టకష్టాలూ పడుతున్న నలదమయంతులు అలసి, ఒక చెట్టుకింద పడుకొన్నారు. ఈ బాధలు చూడలేని నలుడు ఆమె గాఢనిద్రలో ఉండగా, భార్య పైటచెంగు చించి కట్టుకొని, ఆమెను వదిలిపోయాడు.


నలుడు కొంతదూరం పోయేసరికి కార్చిచ్చులో చిక్కుకొని వున్న ఒక నాగుపాము 'ఓ రాజా !—నన్ను ఈ అపదనుండి కాపాడు. నీకు ఉపకారం చేస్తాను' అన్నది. నలుడు దానిని మంటలోనుంచి తీసి రక్షించాడు. కాని, అది వెంటనే అతనిని కాటువేసింది. నలుడికి కురూపం వచ్చింది.

అప్పుడు ఆ పాము 'నేను కర్కోటకుడనే సర్పరాజును. నీకిప్పుడు కలిగిన కురూపంవల్ల మేలు కలుగుతుందని ముందుముందు నీకే తెలుస్తుంది. అగత్యమైనప్పుడు నన్ను తలుచుకో. మళ్లీ నీకు మామూలు రూపం వచ్చేలాగ చేస్తాను' అని చెప్పి మాయమైంది.

తరువాత నలుడు 'సుబాహు' అనే మారుపేరుతో ఋతుపర్ణునివద్ద అశ్వపాలకుడుగా ఉంటూవచ్చాడు. దమయంతి 'చేది' రాణివద్ద చేరి, సైరంధ్రి అనే మారుపేరుతో కాలక్షేపంచేస్తూవచ్చింది. కొంతకాలానికి దమయంతి తండ్రి ఆమెకు రెండవ స్వయంవరం చాటింపించాడు. అతిచిత్రంగా, నలుడు మళ్ళీ దమయంతినే వివాహంచేసుకొన్నాడు. కలిపురుషుడు తొలగిపోయాడు. నలదమయంతులు సుఖంగా కాలంగడిపారు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీద బొమ్మ

పూర్వం, ఇక్ష్వాకు వంశంలో సగరుడనే చక్రవర్తి ఉండేవాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఒకామెకు ఒక్కగానొక్క కొడుకు 'అసమంజసుడు' అనేవాడు. వీడి దుర్మార్గం సహించలేక తండ్రి వీడిని రాజ్యంనుండి వెళ్ళగొట్టాడు. రెండవ భార్యకు అరవైవేలమంది పుత్రులు. వాళ్ళూ చాలా గర్విష్ఠులు.


సగర చక్రవర్తి ఒకప్పుడు అశ్వమేధయాగం తలపెట్టాడు. యజ్ఞాశ్వం మాయమయింది. దానిని వెతికిపట్టటానికి ఈ అరవైవేలమందీ బయల్దేరి, పాతాళ లోకం చేరుకున్నారు. అక్కడ కపిలమహర్షివద్ద ఈ అశ్వం కనపడగా, ఆయనే దొంగిలించాడని వీళ్లు గోలచేశారు. మహర్షి ఉగ్రుడై, వారిని శపించేసరికి, వాళ్ళంతా ఉన్నపాటున భస్మమైపోయారు.

చివరకు సగరచక్రవర్తికి 'అంశుమంతుడు' అనే ఒక్క మనుమడు మిగిలాడు. వానికి పట్టంకట్టి చక్రవర్తి తపస్సు చేసుకోబోయాడు. ఈ అంశు మంతుని మనుమడే భగీరథుడు. కపిలమహర్షివల్ల భస్మమైపోయిన తన ముత్తాతలకు గతులు కల్పించాలని భగీరథుడు సంకల్పించాడు.

వారికి గతులు కలగాలెనంటే పవిత్రమైన గంగాజలం వారిమీదినించి ప్రవహించాలి. ఐతే, ఆకాలమందు గంగ భూలోకమందు ఇంకా అవతరించ లేదు. అప్పుడు భగీరథుడు అనేకవేల వత్సరాలు ఘోరతపస్సు చేసి గంగా దేవిని ప్రార్థించాడు. ఆమె ప్రత్యక్షమై 'నాయనా!—నేను దిగివస్తే, నన్ను భూదేవి భరించలేదు. కనుక పరమేశ్వరుణ్ణిగురించి తపస్సుచేసి, మొట్టమొదట నా శక్తిని ఆయన భరించేటట్టు వరం పొందు' అని చెప్పి అదృశ్యమయింది.

భగీరథుడు శివునిగురించి తపస్సుచేసి, వరం పొందాడు. తరువాత గంగ దిగివచ్చి పరమేశ్వరుని తలపైన పడి, ఆయన జటాజూటంలోపలినుండి దారి చేసుకొని, భగీరథుని వెంబడే భూమిమీద ప్రవహించింది.

ఇలా గొప్ప ప్రయత్నం చేసి, గంగను పాతాళానికి కొనిపోయి, అరవైవేల మంది సగరపుత్రులకూ గతులుకల్పించాడు భగీరథుడు. దీనినిబట్టే 'భగీరథ ప్రయత్నం' అని జాతీయం ఏర్పడింది. గంగకు భాగీరథి అని పేరువచ్చింది. శివుడు గంగాధరుడయ్యాడు. ఈ గంగావతరణ కథను, వనవాసంలో ఉన్న ధర్మరాజుకు ఋషులు వినికిడిచేశారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Aug.
6 as
SANKAR

అట్టమీది బొమ్మ


అరణ్యవాసంలో ఉన్న ధర్మరాజు అనేకమైన పుణ్యకథలు వింటూవచ్చాడని చెప్పాముకద! అందులో ఒక స్వారస్యమైన కథ ఇది—

పూర్వం అంగరాజ్యానికి రోమపాదుడు ప్రభువుగా ఉండేవాడు. ఆయన ఒకప్పుడు తన ధర్మాన్ని తప్పాడు. అందుచేత వర్షాలు కురవడం నిలిచిపోయి, దేశంలో క్షామం పట్టింది. తరువాత రాజు తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడ్డాడు. వెంటనే మంత్రి పురోహితులను పిలిపించి, వర్షం కురిపించడం ఎలాగా అని ప్రశ్నించాడు. అప్పుడు అనుభవజ్ఞులైనవారు యీవిధంగా సలహా చెప్పారు: 'విభాండకుడనే ఋషి వున్నాడు. ఆయన ఆశ్రమం ఎప్పుడూ పచ్చగా, కను పండువుగా వుంటుంది. దీనికి కారణం: ఆయన కుమారుడైన ఋష్యశృంగుడు అక్కడ తపస్సు చేసుకొంటూ వుండటమే. ఋష్యశృంగుడు ఎక్కడ వుంటే అక్కడ నెలకు మూడు వర్షాలూ కురుస్తాయని దేవేంద్రుని వరం ఉన్నది. కనుక, ఆ ఋష్యశృంగుని ఎలాఐనా మన రాజ్యానికి రప్పించి యజ్ఞయాగాదులు చేసినట్టయితే, దేవేంద్రుడికి సంతోషం కలుగు తుంది. దానివల్ల సవ్యంగా వర్షాలు కురిసి దేశం సుభిక్షమవుతుంది.

'ఐతే—ఋష్యశృంగుని రప్పించటం తేలికకాదు. అతని తండ్రికి తెలియకుండానే ఈ పని జరగాలి. ఋష్యశృంగుడు ఇంతవరకు స్త్రీని చూచి ఎరుగడు. కాబట్టి, అందకత్తెలైన స్త్రీలు కొందరిని పంపించి అతనిని ఆకర్షించ వచ్చు,' అని చెప్పారు.

ఆ ప్రకారం రోమపాదుడు కొంతమంది అందకత్తెలను విభాండకుని ఆశ్రమానికి పంపాడు. అందరిలోనూ అత్యంత సౌందర్యంగల ఒకామె ఋష్యశృంగునిదగ్గర చేరి, మధురమైన మాటలతోనూ ఉపచారాలతోనూ అతనిని మెప్పించింది. తను ఎలా చెబితే అలా నడుచుకొనేటట్టు చేసింది. అతడు ఆమెవెంబడే బయలుదేరి అంగరాజ్యం చేరుకొన్నాడు.

రోమపాదుడు ఋష్యశృంగుణ్ణి చాలా గౌరవించి, తన పుత్రిక ఐన శాంతను ఇచ్చి వివాహంచేశాడు. సంతోషించి దేవేంద్రుడు వర్షాలు కురిపించాడు. అంగరాజ్యం సుభిక్షమయింది. ఇలా మోసం జరిగినందుకు అక్కడ విభాండ కుడికి కోపంవచ్చింది. కాని, ఇది సత్కార్యం కావటంచేత శాంతించాడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Sept. '54
6
SANKAR...

అట్టమీది బొమ్మ


పంచపాండవులు అరణ్యవాసంలో ఉండి అనేకమైన దివ్య గాథలు వింటూ ఉన్నారని చెప్పాముకద. ఇరవైయొక్కమారులు క్షత్రియులపై దండెత్తిన పరశురామునిగురించి చెప్పమని ధర్మరాజు కోరగా, అకృతవర్ణుడు ఇలా చెప్పాడు :—

'పూర్వకాలమందు జమదగ్ని అనే ఋషి ఉండేవాడు. ఆయన బ్రహ్మతేజస్సంపన్నుడు. సాంగవేదాధ్యయనపరుడు. ఆయన ప్రసేనజిత్తు అనే రాజుకుమార్తె ఐన రేణుకను పెళ్ళాడాడు. వారికి రుమణ్వంతుడు, సుషేణుడు, వసు, విశ్వావసు, పరశురాముడు అని ఐదుగురు పుత్రులు కలిగారు.

ఒకరోజున రేణుక స్నానానికని నదికి వెళ్లింది. ఆ సమయంలో సౌందర్యవంతుడైన గంధర్వుడొకడు ఆకాశమార్గాన పోతున్నాడు. అతడి ప్రతిబింబం నీటిలో కనపడగా, వచ్చినపని మరచి రేణుక చాలసేపు నదిఒడ్డునే ఉండిపోయింది. అందుచేత, ఆమె ఆశ్రమానికి చేరుకునేసరికి ఆలస్యమయింది.

ఈ ఆలస్యానికి కారణం దివ్యదృష్టివల్ల తెలుసుకొన్నాడు జమదగ్ని. క్రోధావేశంతో ఋషి రేణుకను బహువిధాల తూలనాడి, వెంటనే అక్కడ ఆశ్రమంలోనే వున్న కొడుకులు నలుగురనూ పిలిచాడు. 'ఇటువంటి మహాపాపి జీవించి ఉండటం తగదు. చంపివేయండి' అని ఆజ్ఞాపించాడు. ఐతే, తల్లియందుండే ప్రేమచేత వారు తండ్రి ఆజ్ఞను నెరవేర్చలేకపోయారు. జమదగ్ని వారిపైన కోపించి, 'మీరు ఈ వనమందు అజ్ఞానులై, మృగాలలాగ పక్షులలాగ చరించండి!' అని శపించివేశాడు.

కొంతసేపటికి పరశురాముడు ఆశ్రమానికి వచ్చాడు. అతనినికూడా తండ్రి అలానే ఆజ్ఞాపించాడు. తక్షణమే పరశురాముడు, తల్లి అని శంకించక, తల నరికివేశాడు. అప్పుడు జమదగ్ని సంతోషించి, శాంతించి, 'నాయనా, రామూ! నామాట జవదాటక, తెంపుచేసి దుష్టురాలైన నీ తల్లిని వధించావు. సంతోషించాను. నీ కిష్టమైన వరములు కోరుకో'మని అనేసరికి 'తండ్రీ!— అమ్మను బ్రతికించు. సోదరులకు జ్ఞానప్రాప్తి కలగజేయి. యుద్ధములందు నాకు అప్రతిహతశక్తిని ప్రసాదించు'—అని కోరుకొన్నాడు. జమదగ్ని ఆనందంతో కొడుకు అభీష్టాలను నేరవేర్చాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Oct. '54
6
as
SANKAR...

అట్టమీది బొమ్మ

క్రిందటిసారి పరశురాముని పితృభక్తిని గురించి తెలుసుకొన్నాముకదా! ఈ కథ అంతటితో ముగియలేదు. పరశురాముని తండ్రి ఐన జమదగ్నిమహర్షి తన కోపమువలన ఎంతటి ఘోరమైన కీడుమూడిందో గ్రహించి, పశ్చాత్తాపం పొంది, అప్పటినుంచీ పరమ శాంతుడయ్యాడు.

ఒకనాడు—హైహయరాజు ఐన కార్తవీరార్జునుడు వేటకు వచ్చి, పరివారంతోసహా జమదగ్ని ఆశ్రమం చేరుకొన్నాడు. అప్పుడు పరశురాముడు సమిధలకోసం అడవికి పోయివున్నాడు. జమదగ్ని, తన హోమధేనువు సహాయంతో రాజుకూ పరివారానికీ దివ్యమైన అతిథిసత్కారం చేశాడు.

ఐతే, రాజు కృతజ్ఞత చూపలేదు సరిగదా పైగా, ఆ హోమధేనువును జమదగ్ని ఆశ్రమంనుంచి బలవంతంగా తనవెంట లాక్కుపోయాడు. కొంతసేపటికి పరశురాముడు వచ్చి జరిగిన దౌర్జన్యం గ్రహించాడు. కోపావేశంతో పోయి, కార్తవీరార్జునుణ్ణి మధ్యతోవలోనే ఎదుర్కొని, అతనినీ పరివారాన్నీ తన పరశువుతో వధించాడు. తన తండ్రిదైన హోమధేనువును మళ్ళీ ఆశ్రమానికి తీసుకువచ్చాడు.


కార్తవీరార్జునుడికి నూరుగురు కుమారులు. వారు తండ్రిని మించిన క్రూరులు. పరశురాముణ్ణి ఎదుర్కొనేందుకు ధైర్యంచాలక, అతడు ఆశ్రమంలో లేని సమయమందు వారు వచ్చి, తపోనిష్ఠలో వున్న జమదగ్నిని చంపివేశారు.

పరశురాముడు వచ్చి, దుఃఖిస్తూవున్న తల్లిని చూచాడు. నిజం తెలుసుకొన్నాడు. 'క్షత్రియులు దురహంకార పూరితులై వున్నారు. వారి వంశమే లేకుండా నిర్మూలించి, లోకానికి వాళ్ళ పీడ వదిలిస్తాను,' అని ప్రతిజ్ఞపట్టాడు.

ఈ ప్రతిజ్ఞ నేరవేరటంకోసమే పరశురాముడు, కార్తవీరార్జునుడి కుమారులందరినీ చంపివేశాడు. క్షత్రియులమీద పగబట్టి ఇరవైయొక్కసారులు భూప్రదక్షిణంచేసి, క్షత్రియుల రక్తంతోనే తన పితరులకు తర్పణం విడిచాడు.

ఇంతపని చేసినతరువాత పరశురాముడు శాంతించి, క్షత్రియులనుంచి తను స్వాధీనపరుచుకొన్న భూమిని బ్రాహ్మణులకు దానంచేసి, మహేంద్ర పర్వతంపైన తపస్సు చేసుకోబోయాడు.


చందమామ
దీపావళి ప్రత్యేక సంచిక
1st Nov. '54
6
SANKAR


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Dec. '54
6
as
SANKAR

అట్టమీది బొమ్మ

అరణ్యావాసం చేస్తున్న పంచపాండవులు ఎక్కడెక్కడి పుణ్యక్షేత్రాలూ దర్శించుకొంటూ, మహాత్ముల గాథలను వింటూ వచ్చారని చెప్పాముకద! వారొక రోజున, పూర్వం శిబిచక్రవర్తి యజ్ఞంచేసిన స్థలం చేరుకొన్నారు. ఈ శిబిచక్రవర్తిని గురించిన అద్భుత కథను రోమశఋషి ఇలా వినిపించాడు:-

చంద్రవంశానికి చెందిన శిబిచక్రవర్తి లెక్కలేనన్ని యజ్ఞాలు చేస్తూ వుండగా, ఒకప్పుడు ఒక విచిత్రం జరిగింది. అకస్మికంగా ఒక పావురం భయంతో పరుగెత్తుకువచ్చి శిబి చేతిపైన వాలింది. "రాజా!—శరణు, శరణు!!—రక్షించు, రక్షించు!!!" అంటూ ఆర్తనాదం చేసింది.

వెంటనే చక్రవర్తి పావురంతో 'నీకు వచ్చిన భయమేమీలేదు...' అని చెప్పి అభయమిచ్చాడు.

అంతలో భయంకరరూపుడైన ఒక కిరాతకుడు అక్కడకు వచ్చి, 'రాజేంద్రా!-ఇది నేను వేటాడిన పావురం. కనుక నా పావురాన్ని నాకిచ్చెయ్యి' అని అడిగాడు.


అందుకు శిబి 'దీనికి నేను అభయమిచ్చివున్నాను. కనుక దీనికి బదులుగా మరేదైనా కోరుకో, తప్పక నీ కోరిక నెరవేరుస్తాను' అని జవాబుచెప్పాడు.

అప్పుడు కిరాతకుడు 'రాజా!—ఈ పక్షి మాంసానికి సరిఅయిన విలువ కలది నీ మాంసమే. కాని అది అడగటం న్యాయం కాదుగదా? కనుక, దయవుంచి నా పావురాన్ని నాకిచ్చివేయి' అన్నాడు.

ఈ మాటకు చక్రవర్తి 'అయితే ఈ పక్షి మాంసానికి సమానంగా నా మాంసమే ఇస్తాను' అంటూ వెంటనే తక్కెడ తెప్పించి, ఒకపక్క ఆ పావురాన్ని ఉంచి, రెండవ పక్క తన శరీరంనుంచి మాంసం కోసిపెడుతూవచ్చాడు. చిత్రం!—ఎంత మాంసం కోసిపెట్టినా, ఆ పావురం బరువుకి సరిపోలేదు.

ఇదిచూచి, శిబి 'ఓయీ బోయవాడా!—నీవు ఈ తక్కెడ పట్టుకో. నేనే ఇందులో ఎక్కి కూర్చుంటాను' అని తక్కెడను కిరాతకుడికి ఈయబోతూ వుండగా—కిరాతకుడు సాక్షాత్తు దేవేంద్రుడుగాను, పావురం అగ్నిదేవుడుగానూ శిబిచక్రవర్తికి ప్రత్యక్షమయ్యారు.

"చక్రవర్తీ!-నీ త్యాగశీలాన్ని పరీక్షించటానికి మేమీ రూపంలో వచ్చాము. నీ కీర్తి చిరస్థాయిగా ఉండుగాక!" అని దీవించి, వారు అంతర్ధానమయ్యారు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Jan. '55
6
అణా
SANKAR

అట్టమీది బొమ్మ

పాండవులలో మధ్యముడైన అర్జునుడు యాత్రలనుండి ఇంకా తిరిగిరాలేదు. అర్జునుడు దగ్గరలేని చింతను ధర్మరాజాదులు పుణ్యకథాశ్రవణాలతోను, దివ్య స్థలాల సందర్శనంతోనూ గడపుతూ, కామ్యకవనంలో ఉంటున్నారు.


ఒకనాడు వారు కామ్యకవనంనుంచి చాలాదూరం వెళ్లారు. అక్కడ కొత్త కొత్త మునిజనుల పరిచయం కలిగింది. మైనాక, హిరణ్యశిరము మొదలైన పర్వతశిఖరాలు చూచారు. బిందుసరోవరతీరము మొదలైన దివ్య ప్రదేశాలలో ఆరురోజులు గడిపారు. ఏడవరోజు తెల్లవారుజామున ఎక్కడి నుంచో ఒక అపూర్వ పరిమళం వచ్చి పాండవులనూ, అక్కడ వున్న అందరినీ ఆకర్షించింది.

ఆ పరిమళానికి ద్రౌపది ఎక్కువగా ఆకర్షింపబడింది. ఆమె ఈ అద్భుత మైన పరిమళం ఆఘ్రాణించి చాలా కుతూహలపడింది. ఇది ఎక్కడనుండి వస్తున్నదా అని విస్తుపోయి నలుమూలలూ చూచేటంతలో ఈశాన్యదిక్కునుండి చాలాసుందరమైన ఒక ఎర్రటి పుష్పం గాలిలో తేలిఆడుతూ ద్రౌపదివైపే రాసాగింది. దానిని ద్రౌపది ఆప్యాయంతో అందుకొని, చేత పుచ్చుకున్నది.

ఇంత సుందరమైన పుష్పాన్ని ఇంతకుముందెన్నడూ ద్రౌపది చూచి ఎరుగదు. దీనినిగురించి వినిఐనా ఉండలేదు. ఈ పుష్పాన్నిగురించి ఆశ్రమాలలో వుండే ఋషులను అడిగిచూడగా, అది 'సౌగంధికపుష్ప'మని పేరుమాత్రం చెప్పారు. కాని, అది ఎక్కడ దొరుకుతుందో ఆ సంగతి తమకు తెలియదన్నారు.

ఇటువంటి పుష్పాలు ఇంకా కావాలని ద్రౌపది ఉవ్విళ్ళూరింది. ఈ పని నెరవేర్చడానికి ఒక్క భీమసేనుడే సమర్థుడని ఆమెకు బాగా తెలుసు. అందుచేత వెంటనే అతనివద్దకు వెళ్లి, తన కోరికను వెల్లడించింది.

ద్రౌపదిమీద భీమసేనుడికి అపారమైన ప్రేమ. కనుక, అతడు ఎంతో సంతోషంతో 'దీనికేముంది, ఇది ఈశాన్యదిక్కునుంచికదా వచ్చింది? దీని పరిమళంకూడా తెలుస్తూనేవుంది. పైగా, దీని పేరు ఫలానా 'సౌగంధికపుష్ప' మని ఋషులు చెప్పనేచెప్పారు. ఇంతకుమించిన ఆనవాళ్ళు ఏం కావాలె! ఇప్పుడే పోయి నీకు కావలసినన్ని పువ్వులు తెచ్చిపెడతాను' అని చెప్పి అతడు ఈశాన్యదిశకు బయల్దేరాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Feb. '55
SANKAR...

అట్టమీది బొమ్మ

భీమసేనుడు, ద్రౌపది కోరిన సౌగంధిక పుష్పంకోసం ఈశాన్యదిశకు బయలు దేరాడుకదా!—త్రోవలో అడ్డువచ్చిన వృక్షాలనన్నిటినీ తన బాహుబలంవల్ల ఛేదించుకొంటూ, ముందుకు సాగిపోయాడు. ఈవిధంగా, అరణ్యం దాటుకొని గంధమాదన పర్వతానికి సమీపంలోవున్న ఒక కదళీవనం ప్రవేశించాడు.

ఆ వనంలోనించి పోతూవుండగా, దారిలో కూర్చునివున్న ఒక వృద్ధ వానరం కనిపించింది. 'ఏయ్, ముసలికోతీ!—దోవవిడు!!' అని భీముడు గర్జించాడు. అందుకా వానరం వృద్ధాప్యంవల్ల వణికిపోతూ 'అయ్యా, నేను లేవలేని స్థితిలో వున్నాను. కనుక, నా తోక కాస్త పక్కకి తోసి, నీవు నీదారిన వెళ్ళు' అని అన్నది.

భీమసేనుడు చాలా అలక్ష్యంగా దాని తోకను తన ఎడమకాలితో తోయ బోయాడు. కదలలేదు. బలంకొద్దీ చేతితో లాగాడు. అప్పటికీ కదలలేదు. అప్పుడు రెండు చేతులతోనూ బలంకొద్దీ వూపిచూచాడు. కాని తోక రవంత కూడా కదలలేదు. అది సామాన్య వానరం కాదని భీముడు గ్రహించాడు.

వెంటనే, భక్తిగౌరవాలతో ఆ వృద్ధవానరానికి చేతులు జోడించి నమస్కరిస్తూ, 'మీరెవరో మహాత్ముల్లాగా వున్నారు. నన్ను మన్నించి, మీ వృత్తాంతం చెప్పి అనుగ్రహించండి!' అంటూ ప్రాధేయపడ్డాడు.

అప్పుడా వానరం చిరునవ్వుతో 'తమ్ముడా! నేను వాయుపుత్రుడనైన హనుమంతుణ్ణి. నీకు, అన్నను. ఇదిగో చూడు, నా విశ్వరూపం...' అని చెప్పి, భూమ్యాకాశాలను ఒక్కటిగా చేసేటట్టు తన నిజరూపంతాల్చి నిలబడ్డాడు. భీమసేనుడు సంతోషించి, హనుమను స్తుతించగా, హనుమంతుడు మెచ్చుకొని పాండవుల భవిష్యాన్ని చెప్పి, "సోదరా!—ముందు మీకూ కౌరవులకూ జరగబోయే యుద్ధంలో నేను అర్జునుడి ధ్వజంపైనే ఉండి, మీకందరకూ బలం చేకూరుస్తాను' అని వరమిచ్చాడు. భీమసేనుడు సంతృప్తుడై, హనుమ చెప్పిన దోవనే వెళ్ళి సౌగంధికవనం ప్రవేశించాడు. కుబేరుని కాపలావాళ్ళయిన యక్షులు భీమసేనుణ్ణి అటకాయించారు. భీముడు వాళ్ళతో యుద్ధంచేసి, వాళ్ళని పడగొట్టి, తనకు కావలసినన్ని సౌగంధికపుష్పాలు తీసుకొని మరలి పోయాడు. ద్రౌపదికి పరమ సంతోషమైంది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Mar. '55
6
as
SANKAR

అట్టపీడ దిబొష్ట


పాండవ మధ్యముడైన అర్జునుడు పాశుపతాస్త్రంకోసం వెళ్ళినవాడు ఇంకా తిరిగిరాలేదు. అతని రాకను నిరీక్షిస్తూ తక్కిన సోదరులు ద్రౌపదితో సహా వనవాసంలోనే ఉంటున్నారు. ఇలా ఉండగా—యుధిష్ఠిరుడికి గల బ్రాహ్మణ భక్తినిగురించి విన్న జటాసురుడనే రాక్షసుడు ఒకనాడు బ్రాహ్మణవేషంతో ధర్మరాజువద్దకు వచ్చి, 'నేను సకలవిద్యాసంపన్నుణ్ణి. కొత్త కొత్త అస్త్రశస్త్రాలన్నీ నాకు తెలుసు. వాటిని మీకూ నేర్పదలిచి వచ్చాను' అంటూ పాండవులను నమ్మించాడు. వారు నేర్చుకోడానికి అంగీకరించారు.

ఒకనాటి ఉదయాన ఋషులూ, బ్రాహ్మలూ నదిఒడ్డుకు అహ్నికాలు తీర్చుకోబోయారు. భీమసేనుడు వేటకని అరణ్యానికి వెళ్లాడు. ఇదే సమయమని, కపటబ్రాహ్మణుడైన జటాసురుడు ముందుగా పాండవుల ఆయుధాలను దాచివేశాడు. తరువాత తన నిజరూపంలో ద్రౌపదిని ఎత్తుకొని పారిపోసాగాడు.

అప్పుడు అక్కడ వున్న ధర్మరాజు, నకుల సహదేవులూ ఆయుధాల కోసం వెతుక్కోగా కనబడలేదు. చేసేదిలేక, నిరాయుధులుగానే వారు జటాసురుణ్ణి అటకాయించారు. బలీయుడైన ఆ రాక్షసుడు వారి ముగ్గురినీకూడా చంకనెత్తుకుని పరుగుతీశాడు.

ఐతే, యుక్తిపరుడైన సహదేవుడు చంకనుండి చల్లగా కిందికి జారుకొనిపోయి, ఈ విషయం భీముడికి అందించాడు. ఈలోపల ధర్మరాజు జటాసురుడితో ధర్మవాదనకు దిగి, వాడి వేగం తగ్గించాడు. అంతలోనే గదాయుధుడైన భీమసేనుడు గర్జిస్తూ వచ్చాడు. అది చూచి జటాసురుడు—ధర్మరాజునీ, నకులుణ్ణీ జారవిడిచి, ద్రౌపదినిమట్టుకు ఎత్తుకొని ఆకాశానికి లంఘించాడు.

వెంటనే భీమసేనుడు ఒక మహావృక్షాన్ని పెల్లగించి వాడిని కొట్టేసరికి, వాడు పర్వతంలా నేలను కూలి, ద్రౌపదిని ఒకచోట ఉంచి, భీమసేనునితో కలియబడ్డాడు. ఉభయులకూ మధ్యని ముష్టియుద్ధమే గాక గదలతోను, వృక్షాలతోను గొప్పయుద్ధం జరిగింది. చివరకు, జటాసురుణ్ణి భీమసేనుడు గగనమార్గానికి ఎగరవేయగా, వాడు కిందపడి ముఖం పగిలి చచ్చాడు. ఈ విధంగా పాండవులు ధైర్యంతో కష్టాలను ఎదుర్కొంటూపోయారు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st April '55
6
SANKAR

అట్టమీది బొమ్మ

తన సోదరులను విడిచివెళ్ళిన అర్జునుడు పరమేశ్వరుణ్ణీ, దేవేంద్రుణ్ణీ మెప్పించి అనేకమైన వరాలు పొంది, చాలా కాలానికి తిరిగివచ్చాడు. అప్పుడు పంచపాండవులు అత్యంత ఉత్సాహంతో, హిమవత్ప్రాంతంలో సంచారం చేయసాగారు.

ఇలా వుండగా, ఒకనాడు—ఎక్కడికో వెళ్ళిన భీమసేనుడు ఎంతకూ రాకపోవడంతో యుధిష్ఠిరుడికి ఆత్రం కలిగింది. కొన్ని అపశకునాలు కనబడటం చేత ఆయన ఆత్రం మరింత ఎక్కువైంది. ఇక ఉండబట్టలేక, ధర్మరాజు స్వయంగా బయల్దేరి తమ్ముడిజాడ కనిపెడుతూ వెళ్ళాడు.


కొంతదూరంలో భీముడు విడిచే నిశ్వాసాలధ్వని స్పష్టంగా వినబడింది. అక్కడికి పోయి చూడగా—

భీకరస్వరూపం గల ఒక గొప్ప కొండచిలువ భీమసేనుణ్ణి బంధించి వుండటం కనబడింది. అది సామాన్యమైందికాదని ధర్మరాజు వెంటనే గ్రహించాడు. విచారింపగా, ఆ చిలువ ఇలా చెప్పింది: 'ఇది నా ప్రదేశం. ఇక్కడికి వచ్చినవాళ్ళని తినే హక్కు నాకున్నది. ఐతే—నే నడిగే ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పగలవాళ్ళనుమాత్రం విడిచిపెడతాను; అప్పుడే నాకు శాపవిముక్తి' అంటూ, తన చరిత అంతా వివరించింది.

పూర్వం చంద్రవంశంలో నహుషుడనే రాజుండేవాడు. అతడు ఘన కార్యాలు చేసి, ఇంద్రపదవి గడించాడు. మహర్షులే వచ్చి అతడికి పల్లకిపట్టారు. అప్పుడు నహుషుడు గర్వంచేత 'ఇంత నిదానమేమిటి! చరచరా పొండి!' అని ఋషులను హెచ్చరించాడు. అప్పుడు అగస్త్యుడు కోపగించి 'నీవు సర్పమై పోదువుగాక!' అని శపించాడు.

నహుషుడు పశ్చాత్తాపపడి, మహర్షిని క్షమాపణ వేడుకొన్నాడు. అందుకు అగస్త్యుడు 'నీవు అడిగె ధర్మసూక్ష్మమైన ప్రశ్నలకు జవాబివ్వగలవారు వచ్చినప్పుడు వారివల్ల నీకు శాపవిమోచనం కలుతుంది. అంతవరకూ జవాబులు చెప్పలేనివాళ్ళ నందర్నీ భక్షిస్తూ కాలక్షేపం చెయ్యి' అని చెప్పాడు.

ఆ చిలువరూపంలో వున్న నహుషుడి ప్రశ్నలకు, ధర్మరాజు సరైన సమాధానాలు యివ్వటంతో అతడికి శాపవిముక్తి కలిగింది. భీమసేనుడు విముక్తుడయ్యాడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '55
6
SANKAR

అట్టమీది బొమ్మ

ధర్మాత్ములైనటువంటి పాండవులు నిర్విఘ్నంగా అరణ్యవాసం సాగిస్తూ వచ్చారు కద! వారు సంచారం చేసిన పది సంవత్సరాల కాలమూ పది క్షణాలుగా గడచిపోయింది. ఈ అవధిలో భీమార్జునులకు ఎన్నెన్నో కొత్త శక్తులు లభించినై. ఈ సమయంలోనే యుధిష్ఠిరుడి ధర్మబలంకూడా పరీక్షకు నిలిచి, నెగ్గింది. వనవాసం పూర్తికావడానికి ఇంకొక్క రెండేళ్లు మాత్రమే గడువున్నది.

ఇలా పంచపాండవులూ ద్రౌపదీ, సరస్వతి నదీ తీరాన సాగుతూ, ద్వైత వనం చేరుకొన్నారు. అక్కడినుండి బయల్దేరి, ఋషులనూ, బ్రాహ్మణులనూ వెంటబెట్టుకొని వారు సరాసరి కామ్యకవనానికే వచ్చేశారు.

ఒక రోజున, అర్జునుడి స్నేహితుడైన బ్రాహ్మణుడు ఒకాయన, అత్రంతో పరుగున వచ్చి, సత్యభామాసమేతుడై శ్రీకృష్ణభగవానుడు విచ్చేస్తున్నా డనే శుభవార్త తెలిపాడు.

పాండవులు సంతోషభరితులై, ఆపద్బాంధవుడైన శ్రీకృష్ణునికి ఎదురు వెళ్లి అత్యంత ఆదరంతోను, భక్తితోనూ స్వాగతమిచ్చారు. కృష్ణుడు పాండవ సోదరులనూ, సత్యభామ ద్రౌపదీదేవినీ దివ్యాలింగనాలతో పరస్పరమూ సత్క రించుకొన్నారు.

తరువాత అందరూ విశ్రాంతిగా కూర్చుని, ఎంతో ఆప్యాయంతో ఒకరి నొకరు కుశలప్రశ్నలు వేసికొనడంలో నిమగ్నులైనారు.

ఇంతవరకూ గడచిన అరణ్యవాస విశేషాలూ, అనుభవాలూ శ్రీకృష్ణునితో యుధిష్ఠిరుడు పూసగుచ్చినట్టు వివరించాడు. భగవానుడైన కృష్ణుడికి ఇవన్నీ తెలియవా! అన్నీ విని, చివరకు శ్రీకృష్ణుడు—"కర్తవ్యనిష్ఠులైన మీరు కష్ట సుఖాల భేదాన్ని పాటించరని ఎరుగుదును. మీకు కీడు తలచినవారికి అంత్య ఘట్టం వచ్చింది. వనవాసంలో మీకు ఎంతటి కొత్త శక్తులు లభించినవో, అంతవరకూ దుర్యోధనుడి శక్తి క్షీణించిందన్నమాట. మిగిలివున్న కొద్దిపాటి కాలమూ అరణ్యవాస, అజ్ఞాతవాసాలు నిశ్చింతతో ముగించండి. మీకు శుభ మవుతుంది" అని హితవు చెప్పాడు.

పాండవులూ, అక్కడ వున్న అందరూ 'జయ జయ శ్రీ కృష్ణా!' అంటూ పరవశులై భగవానుణ్ణి కీర్తించారు.


చందమామ
6 as
SANKAR

అట్టమీది బొమ్మ

కృష్ణుడు సత్యభామాసమేతుడై వచ్చి పాండవులతో సంప్రతిస్తూవుండగా అక్కడికి చిరంజీవి ఐన మార్కండేయఋషి రాక అందరికీ మరింత సంతోషాన్ని కూర్చింది. ఆయనకు స్వాగతమిచ్చిన తరువాత శ్రీకృష్ణుడు, కొన్ని దివ్యగాథలు వినటానికి కుతూహలంగా వుందని అన్నాడు. ధర్మరాజు తనకు గల కొన్ని సంశయాలు తెల్పి, వాటిని పరిష్కరించుమని కోరాడు. అప్పుడు మార్కండేయుడు చెప్పిన కథలలో ఇది ఒకటి :—

పూర్వం, హైహయ రాజవంశానికి చెందిన యువకుడొకడు ఒకనాడు వేటకు వెళ్లాడు. ఒక జింకను బాణంతో కొట్టాడు. ఐతే—అది జింక కాదు, జింకచర్మం ధరించి తపస్సు చేసుకొంటున్న ఒక మునికుమారుడు! హైహయ రాకుమారుడు తనుచేసిన తప్పుకు చింతిస్తూ ఇంటికి పోయి, పెద్దలకు చెప్పాడు.

వారందరూ దుఃఖిస్తూ, అడవిలో గాయపడివున్న మునికుమారునివద్దకు బయల్దేరారు. తోవలో వారికి తార్క్ష్యముని ఆశ్రమం కనిపించింది. తార్క్ష్యముని వారికి ఆతిథ్యమీయబోగా, వారు 'మహాత్మా!—మేమిట్టి సత్కారానికి అర్హులం కాము. అరణ్యంలో మా పిల్లవాడు ఒక మునికుమారుని చంపి, పాపం కట్టుకొన్నాడు. దానికి తగిన శిక్ష మేము అనుభవించితీరాలి. కనుక, మాదారిని మమ్మల్ని పోనీయండి' అని వినయంగా చెప్పుకొన్నారు.

అప్పుడు తార్క్ష్యముని చిరునవ్వు నవ్వుతూ, 'అలానా! మీరు ఇందుకు చింతించకండి. మంచివాళ్లు తెలియక చేసిన పాపానికి క్షమాపణ వున్నది. మీరు మంచివాళ్లు కనుకనే పశ్చాత్తాపం పొందుతున్నారు. ఏదీ, మీరు చంపామనుకున్నది ఇతడేనా, చూడండి!' అంటూ తన కుమారుని పిలిచాడు.

ఆశ్రమం లోపలినుండి బయటికి వచ్చిన మునికుమారుని చూచి, హైహయ రాకుమారుడు ఆశ్చర్యంతో 'ఇతడే, ఇతడినే నేను బాణంతో కొట్టింది!' అని చెబుతూ, గుర్తుపట్టాడు.

'బాణంతో కొట్టబడిన యితడు ఎలా బతికివచ్చాడు?' అని అందరూ ఆశ్చర్యంతో ప్రశ్నించగా, 'అదే తపఃప్రభావం...' అని తార్క్ష్యముని ధర్మబోధ చేశాడు. తరువాత ముని ఆతిథ్యాన్ని హైహయులందరూ తృప్తితోనూ, ఆనందంతోనూ స్వీకరించారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st July '55
6
SANKAR...

అట్టమీది బొమ్మ

అరణ్యవాసంలో ఉన్నటువంటి పాండవులవద్దకు మార్కండేయుడు వచ్చి, అనేకమైన గాథలు వినిపిస్తున్నాడుకదా! వాటిలో ఇదొకటి :—

పూర్వం, వైవస్వతమనువు అనే ఒక మహారాజు ఉండేవాడు. ఆయన ఒకప్పుడు గంగానదీతీరాన తపస్సు చేసుకొంటూ వుండగా, ఒక చిన్న చేప కనిపించి, 'ఓ తపోనిధీ!—మా జాతిలో పెద్దచేప చిన్నచేపను మింగడం ఆచారంగా ఉంటున్నది. నన్ను పెద్దచేప ఏదైనా వచ్చి మింగుతుందేమోనని భయమవుతున్నది. కనుక, నన్ను ఈ గంగలోనుంచి తీసుకుపోయి, మరొక సురక్షితమైన జలాశయంలో వదిలి పుణ్యం కట్టుకో. నీకు ఎప్పటికైనా, ఏ విధంగానైనా ఉపకృతి చేసి ఋణం తీర్చుకుంటాను' అని వేడుకొన్నది.

దయాళువు అయిన వైవస్వతుడు దానిని తన వెంట పట్టుకపోయి, ఒక జలాశయంలో వుంచి, జాగర్తగా కాపాడుతున్నాడు. కొద్దిరోజులకే ఆ చేప పెద్దదై, 'రాజా!— ఈ స్థలం నాకు చాలటంలేదు. మరొక పెద్ద జలాశయంలో నన్ను విడిచిపెట్టు,' అని కోరింది,

అలానే రాజు, దానిని ఒక పెద్ద సరోవరంలో విడిచి పెట్టాడు. మరికొంత కాలానికి ఆ చేప, ఆ సరోవరంకూడా పట్టనంత పెద్దదిగా తయారయింది. అప్పుడు మనువు దాని కోరికపైన ఆ చేపను గంగానదిలో వదిలాడు.

ఐతే—గంగానది లోతుకూడా దానికి చాలక, ఆ చేప తను సముద్రానికి వెళుతున్నానని చెప్పి, 'రాజా!—కొద్దికాలంలోనె మహాప్రళయం రాబోతున్నది. కనుక నీవు మహనీయులైన సప్తఋషుల్నీ, సృష్టిలోని సమస్త బీజాలనూ ఒక పడవలో ఎక్కించుకొని సముద్రంలో బయల్దేరు. నేను నా శృంగాన్ని ఆ పడవ తాడుకు తగిలించి, పడవను ప్రళయజలంనుండి రక్షిస్తాను' అని తెలిపింది.

కొద్దికాలానికి మహాప్రళయం రానేవచ్చింది. అప్పుడు చేపరూపంలో వున్న శ్రీ మహావిష్ణువు పడవను ప్రళయజలంనుంచి లాక్కుపోయి, మునగకుండా మిగిలివున్న ఒకే ఒక హిమాలయ శిఖరానికి చేర్చాడు. తరువాత ఈ వైవస్వత మనువునుంచే ప్రపంచంలో పునఃసృష్టి ప్రారంభమయింది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Aug. '55
SANKAR

అట్టి వీూదిబొమ్మ

మార్కండేయమహర్షి పంచపాండవులవద్దకు వచ్చి అనేకమైన దివ్యకథలు చెబుతూవచ్చాడని తెలుసుకద! ఆ చెప్పిన కథలలో యిది ఒకటి :—

"పూర్వం, ఇక్ష్వాకువంశంలో ఉద్భవించిన పరీక్షితుడు అయోధ్యా నగరాన్ని ఏలుతూండేవాడు. అయన ఒకనాడు వేటకు పోయి, ఒక జింకను తరుముతూ అతివేగంగా పరుగెత్తసాగాడు. పరివారం వెనుకబడింది. జింక ఎక్కడికో పోయింది. రాజు ఎంత వెతికినా అది కనబడలేదు.

ఆ సమయంలో వీనులవిందు చేసే గానం అయన చెవులబడింది. అటు పోయిచూడగా, ఆ పాడుతున్నది ఒక చక్కని యువతి!

ఆమెను చూచి రాజు 'నీవెవరవు? ఇక్కడ ఒంటిగా ఎందుకున్నావు? నీభర్త ఎవరు?' అంటూ ప్రశ్నలు కురిపించాడు. అందుకామె 'నేనొక కన్యను. పేరు శోభన...' అని మాత్రం జవాబు చెప్పింది. 'అటయితే, నీవు నన్ను పెళ్ళాడతావా?' అని రాజు అడిగాడు. ఈ ప్రశ్నకు బదులుగా 'నీళ్ళున్నచోటికి నన్ను తీసుకువెళ్లనని మాట యిస్తే అలాగే వివాహం చేసుకుంటాను' అన్నది, శోభన. సరేనని పరీక్షితుడు ఆమెను గాంధర్వవిధిగా పెళ్లాడాడు.


పరీక్షితుడు కొంతకాలం శోభనతో సుఖంగా గడిపాడు. ఒకనాడు ఉద్యాన వనంలో విహరిస్తూ, జ్ఞాపకంలేక శోభనతో జలక్రీడకు దిగాడు. తక్షణమే శోభన మాయమైపోయింది. పరీక్షితుడు దిగాలుపడి సరోవరమంతా శోధించాడు.

అప్పుడు ఒక బ్రహ్మండమైన కప్పమాత్రం కనిపించింది. తన భార్యను మింగినది ఆ కప్పే అని తలచి, పరీక్షితుడు రాజ్యంలో కనబడిన కప్పలన్నిటినీ చంపివేయమని శాసించాడు.

ఈ ఘోరవార్త తెలిసి కప్పరాజు మునివేషంతో పరీక్షితు అస్థానానికి వచ్చి, 'రాజా! ఆ శోభన నాకుమార్తె, ఆమె నిన్ను వరించిన సంగతి తెలియక యింటికి తీసుకుపోయాను. ఆమెను తిరుగా తెచ్చి నీకు వప్పగిస్తాను. నిష్కారణంగా కప్పలను చంపవద్దు' అని సమాధానపరిచి, శోభనను తెచ్చి వప్పగించాడు. పైగా—తన కూమార్తెను ఇలా శపించాడు :—'నీవు మహారాజునూ నన్నూ మాయచేసినట్టే నీపుత్రులు ఉత్తములను ద్రోహం చేసి, దాని దుష్ఫలితాన్ని అనుభవిస్తారు!'

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టవిూదిబొమ్మ

కప్పరాజు కుమార్తె శోభనతో పరీక్షితుడు చాలాకాలం సుఖంగా ఉన్నాడు. అతనికి శలుడు, బలుడు, దలుడు అనే ముగ్గురు పుత్రులు కలిగారు. పరీక్షితుడు, పెద్దవాడైన శలుడికి రాజ్యం వప్పగించి వానప్రస్థాశ్రమం స్వీకరించాడు.

ఒకనాడు శలుడు వేటకుపోయి, ఒక జింకను వెంటాడాడు. అతని గుర్రాలు జింకతో పరుగెత్తలేక, అలసిపోయినవి. అప్పుడు సారథి "రాజా!—ఇక్కడ సమీపంలో వామదేవరుషి ఆశ్రమం ఉన్నది. ఆయనవద్ద అసామాన్యమైన అశ్వాలు ఉన్నట్లు విన్నాను. అవి మనకు లభ్యమయితే ఆ జింకను మనం వేటాడగలము," అని చెప్పాడు.

ఆ ప్రకారం శలుడు వామదేవరుషిని కోరగా, గుర్రాలనుయిస్తూ, 'సరే, నీ పని తీరగానే వాటినితెచ్చి వప్పగించు' అన్నాడు. శలుడు గుర్రాలను తీసుకు వెళ్ళి, జింకను వేటాడాడు. తరవాత—గుర్రాలను రుషికి వప్పగించక, వాటిని తీసుకుని తిన్నగా రాజనగరు చేరుకొన్నాడు.

రుషి ఒక నెలవరకు శలుడికోసం నిరీక్షించి, ఒక శిష్యుణ్ణి పంపించాడు. శలుడు గుర్రాల నివ్వటానికి నిరాకరించాడు. అందుచేత రుషి స్వయంగానే వెళ్లి అడిగితే 'నీకు మరొక జత గుర్రాలను ఇస్తాను. వీటినిమటుకు ఇవ్వను' అని చెప్పాడు. రుషి కోపించి కొందరు రాక్షసులను సృష్టించాడు. వాళ్లు శలుణ్ణి వధించారు. శలుడి తమ్ముడు దలుడుకూడా, గుర్రాలను ఇవ్వను అంటూ రుషి పీడ వదుల్చుకుందామని ఆయనపైన బాణం ఎక్కుపెట్టాడు. రుషి 'ఇది నీ కుమారుణ్ణే చంపుగాక!' అని శపించేసరికి, అంతఃపురంలో ఉన్న వాని కుమారుడు శ్యేనజితుణ్ణి ఆ అంబుతాకి చంపివేసింది. పౌరుషంకొద్దీ దలుడు మరిఒక బాణం రుషిపైన ప్రయోగించబోగా, వాని హస్తం అలానే స్తంభించిపోయింది!

అప్పుడు దలుడి భార్య రుషి కాళ్లపైన పడి, 'మీ గుర్రాలను నేనిప్పిస్తాను. నా భర్తను రక్షించండి!' అని వేడుకున్నది. అప్పుడు రుషి దలుడుని కరుణించి శాపవిముక్తుణ్ణి చేయడమేగాకుండా, చచ్చిపోయిన అతడి కుమారుడు శ్యేనజితుణ్ణికూడా బ్రతికించాడు.

ఆనాడు కప్పరాజు తన కుమార్తె శోభనకు ఇచ్చిన శాపం ఈ విధంగా పరిసమాప్తి పొందింది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Oct. '55
6
as
SANKAR

అట్టివీ ది బొమ్మ

పూర్వం ఇంద్రద్యుమ్ను డనే మహారాజు భూమిపై ఎన్నో పుణ్యకార్యాలుచేసి, చచ్చినవెనక స్వర్గానికివెళ్లి అక్కడ చాలాకాలం స్వర్గసుఖాలు అనుభవించాడు. చివరకు స్వర్గంలోని దేవతలు ఇంద్రద్యుమ్నుణ్ణి భూలోకానికి తోసివేశారు.

మానవులు చేసుకున్న మంచికర్మను గురించి భూమిమీద చెప్పుకున్నంత కాలమూ వారు స్వర్గంలో ఉండవచ్చు. అందుచేత ఇంద్రద్యుమ్నుడు, చిరంజీవి అయిన మార్కండేయుడివద్దకు వచ్చి, "మునీశ్వరా! నేను ఇంద్రద్యుమ్ను డనేవాణ్ణి! నన్ను గురించి ఎప్పుడైనా విన్నావా?" అని అడిగాడు. "వినలేదు, బాబూ!" అన్నాడు మార్కండేయుడు. "పోనీ నీకన్న ఎక్కువకాలంగా జీవించిఉన్నవా రెవరన్నా ఉన్నారా?" అని అడిగాడు ఇంద్రద్యుమ్నుడు.

"హిమాలయంమీద ప్రావారకర్ణం అనే గుడ్లగూబ ఉన్నది" అన్నాడు మార్కండేయుడు. ఇంద్రద్యుమ్నుడు ఒక తెల్లగుర్రంరూపు ధరించి, మార్కండేయుణ్ణి తన వీపుపైకి ఎక్కించుకుని, హిమాలయానికి వెళ్ళి, గుడ్లగూబను కలుసుకుని, "నన్నెరుగుదువా?" అని అడిగాడు. గుడ్లగూబ కొంచెం ఆలోచించి, "ఇంద్రద్యుమ్నుడనే పేరు వినలేదుగాని, ఇక్కడికి దగ్గిర లోనే 'ఇంద్రద్యుమ్న' మనే సరస్సున్నది. అందులో నాకన్న ముందుపుట్టిన నాడీజంఘుడనే కొంగ ఉన్నది. దానినడిగితే తెలుస్తుంది!" అన్నది. ఇంద్రద్యుమ్నుడు గుడ్లగూబనుకూడా మీద ఎక్కించుకుని ఇంద్రద్యుమ్నమనే సరస్సు దగ్గిరికి వెళ్ళి నాడీజంఘుణ్ణి కలుసుకున్నాడు.

"ఇంద్రద్యుమ్నుడిపేరు నేనైతే వినలేదుగాని, ఈ సరస్సులో నాకన్న ముందుపుట్టిన తాబేలొకటి ఉంటున్నది. దాన్ని అడిగిచూడండి!" అన్నది కొంగ.

తాబేలును బయటికి పిలిచి, "ఇంద్రద్యుమ్నుడనే రాజునుగురించి ఎప్పుడైనా విన్నావా?" అని అడిగేసరికి, తాబేలు కంటనీరు పెట్టుకుని, "ఇంద్రద్యుమ్నుణ్ణి ఎరగకపోవటమేమిటి? ఆయన ఇక్కడ వెయ్యి యజ్ఞాలుచేశాడు. ఆయన దానం ఇచ్చిన గోవుల తొక్కిడికి ఈ కొలను ఏర్పడింది" అన్నది.

తాబేలు ఈ మాట అనగానే దేవతలు ఇంద్రద్యుమ్నుడికోసం విమానం పంపారు. ఇంద్రద్యుమ్నుడు కొంగనూ, గుడ్లగూబనూ, మార్కండేయుణ్ణీ వారి వారి స్థానాలలో దిగవిడిచి, విమానంలో స్వర్గానికి తిరిగివెళ్ళాడు.


చందమామ
దీపావళి ప్రత్యేక సంచిక


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Dec. '55
6

అట్టమీది బొమ్మ

పూర్వం కౌశికుడనే బ్రహ్మచారి ఉండేవాడు. వయోవృద్ధులైన తల్లిదండ్రులను కూడా వదిలిపెట్టి, కౌశికుడు ఎంతో నిష్ఠతో తపస్సు చేసుకోసాగాడు.

ఒకనాడు కౌశికుడు ఒక చెట్టుకింద కూచుని తపస్సు చేసుకుంటూ ఉండగా, చెట్టుమీద ఉన్న ఒక కొంగ అతనిపై రెట్టవేసింది. పట్టరాని ఆగ్రహంతో ఆ బ్రహ్మచారి లేచినిలబడి తలఎత్తి చెట్టుమీద ఉన్న కొంగకేసి చూశాడు. వెంటనే కొంగ గిలగిలా తన్నుకుని చచ్చి కిందపడింది.

మధ్యాహ్నం కాగానే కౌశికుడు భిక్షాటనకు బయలుదేరి ఒక ఇంటికి వెళ్ళాడు. అదేసమయానికి గృహస్థు ఇంటికి వచ్చాడు. గృహిణి తన భర్తకు కాళ్ళు కడిగి, భోజనంపెట్టి, కాళ్ళు ఒత్తి నిద్రపుచ్చి, కౌశికుడికి భిక్ష తెచ్చింది.

కౌశికుడు మండిపడి, "నన్నింతసేపు వాకిట నిలిపి ఉంచుతావా? ఎవరనుకున్నావు?" అని గద్దించాడు.

"నువు కొంగను చంపి తపశ్శక్తిని నాశనంచేసుకున్న కౌశికుడవు కావా, నాయనా? బడలి ఇంటికి వచ్చిన భర్తకు ఉపచారాలు చెయ్యటం భార్యధర్మం కాదా? తెలిసీ తెలియక ఎందుకాగ్రహిస్తావు?" అని అడిగింది గృహిణి.


తాను కొంగను చంపిన సంగతి ఆమెకు తెలిసిందని కౌశికుడు చాలా సిగ్గుపడ్డాడు. "అమ్మా, నాకు ధర్మం ఏమిటో తెలియదు. దయవుంచి చెబుతావా?" అని అడిగాడు.

"నీకు ధర్మబోధ చెయ్యగలవాడు ధర్మవ్యాధుడు. అతను మిథిలలో ఉంటాడు. నువ్వతని దగ్గిరికివెళ్ళి ధర్మం తెలుసుకో!" అన్నది గృహిణి.

కౌశికుడు ఆ ప్రకారమే మిథిలకుపోయి ధర్మవ్యాధుడికోసం విచారించాడు. అతనొక కసాయివాడని తెలియగానే కౌశికుడికి అసహ్యం కలిగింది. కౌశికుడు తన అసహ్యాన్ని అణచుకుని ధర్మవ్యాధుడి దుకాణానికి వెళ్ళాడు.

"బ్రాహ్మణా! నువ్వెందుకు వచ్చావో నాకు తెలుసును. మా యింటికి పోదాం పద!" అంటూ ధర్మవ్యాధుడు, కౌశికుణ్ణి తన యింటికి తీసుకుపోయాడు.

ధర్మవ్యాధుడు ఎటువంటి మాతృభక్తి, పితృభక్తి కలవాడో కౌశికుడు అర్థంచేసుకున్నాడు. అతను ధర్మవ్యాధుడివల్ల అనేక ధర్మాలు తెలుసుకుని, ఇంటికి తిరిగివచ్చి, తన తల్లిదండ్రులను ఆదరంతో చూస్తూ తరించాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Jan.
6
as

అట్టమీది బొమ్మ

పూర్వం ఒకప్పుడు దేవతలకూ దానవులకూ గొప్ప యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దేవతలు పూర్తిగా ఓడిపోయినారు. దీనికి కారణం దేవతలకు సమర్థుడైన సేనానాయకుడు లేకపోవటమే.

దేవతలకు కలిగిన అపజయానికి విచారించి ఇంద్రుడు బ్రహ్మవద్దకు వెళ్ళి, "దేవా, దేవసేనకు తగిన నాయకుడు ఎక్కడ ఉన్నాడు?" అని అడిగాడు. బ్రహ్మ ఇంద్రుడితో, "సోమసూర్యాగ్ని సంభవుడైనవాడే దేవసేనను నడిపించి జయం చేకూర్చగలడు," అని చెప్పాడు.

ఈ సంగతి తెలుసుకుని ఇంద్రుడు సప్తఋషులవద్దకు వెళ్ళాడు. అప్పుడు వారు దేవతల విజయంకోరి ఒక గొప్ప యజ్ఞం ఆరంభించి, అద్భుతాగ్నిని ఆవాహనచేశారు. అద్భుతుడనే ఈ అగ్నికి సప్తఋషుల భార్యలను చూడగానే వారిపై కోరిక కలిగింది. ఈ సంగతి తెలిస్తే ఋషులు తనను శపిస్తారన్న విచారంతో కుంగిపోయి అగ్ని ఆత్మహత్య చేసుకోవటానికి యత్నించాడు.

ఇది గమనించి పార్వతీ పరమేశ్వరులు, యాగాన్ని కాపాడటానికి ఒక పన్నాగం చేశారు. ఈశ్వరుడు అగ్నిలో ప్రవేశించి అతని ప్రాణాలు కాపాడాడు. పార్వతీదేవి అగ్నియొక్క భార్య అయిన స్వాహాదేవిలో ప్రవేశించింది. అప్పుడు స్వాహాదేవి సప్తఋషుల భార్యల రూపులు ధరించి అగ్నిని ఆకర్షించింది. ఆమె వసిష్ఠుడి భార్య అయిన అరుంధతి రూపుమాత్రమే ధరించలేకపోయింది, మిగిలిన ఆరుగురి రూపాలూ ధరించింది.

ఈ విధంగా పార్వతీ పరమేశ్వరుల అంశలతో అద్భుతాగ్నికీ స్వాహాదేవికీ ఒక మహా శౌర్యసంపన్నుడైన కుమారుడు కలిగాడు. ఆ కుమారుణ్ణి కృత్తికలు గంగాతీరాన పెంచారు. అతనే కుమారస్వామి. కొద్దిరోజుల పిల్లవాడుగా వున్నప్పుడే అతను మదగజాలను సయితం అవలీలగా మచ్చిక చేశాడు, ఒక్కొక్క బాణంతో ఒక్కొక్క పర్వతశిఖరాన్ని ఛేదించాడు.

ఇంద్రుడు ఒకషష్ఠినాడు దేవసేనను ఒక కన్యారూపంలో తెచ్చి కుమారస్వామికి పెళ్లిచేశాడు. అందుచేతనే కుమారస్వామికి ఆ తిథి ప్రియమైనది.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

కుమారస్వామికీ, దేవసేనకూ వివాహం అయిన సమయాన సమస్తదేవతలూ, దిక్పాలకులూ, బ్రహ్మ, పార్వతీ పరమేశ్వరులూ వచ్చారు. తరువాత పార్వతీ పరమేశ్వరులు, వెయ్యి సింహాలు పూన్చిన రథంమీద కుమారస్వామినీ, దేవసేననూ కూర్చోబెట్టుకుని భద్రవటానికి బయలుదేరారు. రథానికి ముందుగా కుబేరుడు తన పుష్పక విమానం ఎక్కి కదిలాడు. రథానికి వెనకగా ఇంద్రుడు ఐరావతం ఎక్కి వచ్చాడు. కుమారస్వామి రథానికి ఒక పక్క అష్టవసువులూ, ఏకాదశరుద్రులూ, మరొక పక్క దిక్పాలకులూ, బ్రహ్మర్షులూ ఉన్నారు.

వీరందరూ వెంట రాగా కుమారస్వామి మహావైభవంగా భద్రవటం చేరి, అందరి ఆశీస్సులూ పొంది, అక్కడ నివాసం ఏర్పరచుకున్నాడు.


కొంతకాలానికి మహిషాసురుడనే రాక్షసుడు రాక్షససేనలన్నిటినీ సమకూర్చుకుని దేవతలపైకి దండెత్తి వచ్చాడు. రాక్షసగణాలు ఆశ్రమాలు ధ్వంసం చేశాయి, యజ్ఞాలు భగ్నంచేశాయి, నిరాయుధులైన ప్రజలపై బడి, భయపెట్టి, హింసించి, పీడించాయి. వీరినందరినీ రక్షించటానికి వచ్చిన దేవసేనలకూ, రాక్షసగణాలకూ భయంకరమైన యుద్ధం సాగింది. ఈ యుద్ధంలో దేవతలు, మహిషాసురుడి ధాటికి అగలేక, చెల్లాచెదరై పారిపోయారు.

బ్రహ్మవల్ల అనేక వరాలు పొందిన మహిషాసురుడు విజయగర్వంతో పరమేశ్వరుడున్న చోటికి వెళ్ళి ఆయన రథాన్ని పట్టుకున్నాడు. మహిషాసురుడికి పరమేశ్వరుడుకూడా ఓడిపోయాడని సంతోషించి రాక్షసులు విజయనాదాలు చేశారు.

అప్పుడు పరమేశ్వరుడు కుమారస్వామిని తలుచుకున్నాడు. వెంటనే కుమారస్వామి యుద్ధసన్నద్ధుడై, శక్తిని చేత ధరించి, కోపావేశంలో కళ్ళ నిప్పులు రాలగా మహిషాసురుడిపైకి వచ్చి ఆ దుర్మార్గుడిపై శక్తిని విసిరాడు. దాని దెబ్బకు మహిషాసురుడి తల పగిలిపోయి వాడు కొండ విరిగిపడ్డట్టు పడిపోయి చనిపోయాడు. మహిషాసురుడికి అండగావున్న మహాబలులైన రాక్షసులు కుమారస్వామి పైకి వచ్చారు. కాని కుమారస్వామి వారినందరినీ ఒక్క మధ్యాహ్నంలో చిత్రవధచేసి యమపురికి పంపేశాడు. యుద్ధం ముగిసింది. దేవతలు కుమారస్వామిపై పుష్పవర్షం కురిపించారు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

పాండవులు మాయజూదంలో ఓడిపోయి అరణ్యవాసంచేస్తున్న సమయంలో కర్ణుడు దుర్యోధనుడికి ఒక దుర్బుద్ధి కలిగించాడు. పాండవులు అరణ్యవాస దుఃఖం అనుభవించే ఈసమయంలో మనం మహావైభవంగా వారికి కనిపించాలి. అందుకని మనం అరణ్యంలో మన పశువుల మందల యోగక్షేమాలు విచారించే మిషపెట్టి బయలుదేరుదాము," అని కర్ణుడు దుర్యోధనుడికి సలహా ఇచ్చాడు.

దుర్యోధనుడు తనవెంట శకుని కర్ణులనూ, దుశ్శాసనాది సహోదరులనూ, అంతఃపురకాంతలనూ, అంతులేని రథగజతురగపదాతి సేనలనూ వెంటబెట్టుకుని, పాండవులుండే ద్వైతవనానికి బయలుదేరి ఒక సరస్సు ఒడ్డున విడిదిచేశాడు.


ఆ సరస్సుకు అవతలి గట్టున పాండవులున్నారు. ఆసమయాన ధర్మరాజు ఒక యజ్ఞం ఆరంభించబోతూ ఉన్నాడు. దుర్యోధనుడి పరివారం సరస్సు తీరాన విడుదులు నిర్మించబోయే సమయంలో కొందరు గంధర్వులు వచ్చి, "మా రాజు చిత్రసేనుడు తన భార్యలతో ఈ గట్టునే విడిదిచేసి ఉన్నాడు. కనుక మీరిక్కడ నిలవటానికి వీలులేదు," అన్నారు.

ఈ మాటలు విని దుర్యోధనుడు మండిపడి చిత్రసేనుడి భటులపైకి తన సైనికులను ఉసికొల్పాడు. వారు వెళ్ళి తమ రాజుతో జరిగినసంగతి చెప్పారు. చిత్రసేనుడు వెంటనే బయలుదేరి యుద్ధానికి వచ్చాడు. అతను ఒక్క సమ్మోహనాస్త్రంతో దుర్యోధనుడి బలాలన్నిటినీ కాళ్ళు చేతులు కదలకుండా చేసి, దుర్యోధనుణ్ణి పెడరెక్కలు విరిచికట్టి, తీసుకు పోసాగాడు.

అప్పుడు దుర్యోధనుడి భటులు ధర్మరాజువద్దకు పరిగెత్తి, "మహాప్రభో, రక్షించండి! మా దుర్యోధనమహారాజును గంధర్వులు పట్టుకుపోతున్నారు!" అని మొరపెట్టారు. "కాగల కార్యం గంధర్వులే చేశారు!" అన్నారు భీమార్జునులు.

కాని ధర్మరాజు తమ్ములతో, "అది పొరపాటు. మనకూ కౌరవులకూ మధ్యగల వైరంలో వారు నూరుగురూ, మనం ఐదుగురమూ. అదే పరాయి వాడితో వైరమైనప్పుడు మనమంతా కలిసి నూట అయిదుగురం! అందుచేత మీరు వెంటనే వెళ్ళి దుర్యోధనుణ్ణి విడిపించుకు రండి!" అన్నాడు.

భీమార్జునులు బయలుదేరి వెళ్ళి చిత్రసేనుడితో యుద్ధంచేసి గెలిచి దుర్యోధనుణ్ణీ, అతని అంతఃపుర స్త్రీలనూ విడిపించారు. "ఎన్నడూ అలాటి సాహసాలు చేయకు!" అని ధర్మరాజు దుర్యోధనుడికి హితబోధచేసి పంపేశాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st April '56
6
SANKAR

అట్టహాది బొమ్మ

అరణ్యవాసంలో కష్టాలు పడుతున్న పాండవులను చూసి ఆనందించుదామనీ, వారికి తన వైభవం చూపింతామనీ అట్టహాసంగా బయలుదేరిన దుర్యోధనుడు, చిత్రసేనుడనే గంధర్వుడిచేత చిక్కి, పాండవులచేత విడిపించబడ్డాడుగదా.

అలా భంగపాటుచెంది దుర్యోధనుడు కర్ణ శకుని దుశ్శాసనాదులను చేరుకుని, తన సైన్యాలతోసహా హస్తినాపురానికి బయలుదేరాడు. చీకటిపడగానే ఒక జలాశయంవద్ద డేరాలు వేసి విడిశారు. అప్పుడు దుర్యోధనుడి డేరాలోకి కర్ణుడు వచ్చి, "మహారాజా, ఆ గంధర్వుణ్ణి నీవు గనక జయించి తిరిగి వచ్చావు గాని, మేమైతే తప్పక ఓడిపోయేవాళ్లం!" అని ప్రశంసించాడు.

పరాభవంతో కుళ్ళిపోతున్న దుర్యోధనుడుకళ్లనీళ్లు కుక్కుకుంటూ కర్ణుడితో జరిగినదంతా చెప్పి, "ఇంత అవమానంపాలయి యింకా బతికివుంటానా? నేను ప్రాయోపవేశం చేస్తున్నాను," అంటూ తన ఆభరణాలూ, దుస్తులూ తీసివేసి నారబట్టలు ధరించి, దర్భాసనంపై పడుకున్నాడు.

"మహారాజా, ఇందులో అవమానం ఏమున్నది? పాండవులు నీ బంటులు. నిన్ను శత్రువునుంచి విడిపించటం వారి ధర్మం. బంటుల ధర్మమే వారు నిర్వర్తించారు. ఇందులో వారి అధిక్యత ఏమీలేదు!" అని కర్ణుడు దుర్యోధనుడికి నచ్చజెప్ప యత్నించాడుకాని లాభంలేకపోయింది.

దుర్యోధనుడు ప్రాయోపవేశం చేశాడన్న సంగతి పాతాళంలో ఉన్న రాక్షసగణాలకు తెలిసింది. వారు వెంటనే హోమంచేసి మంత్రాలు చదివారు. అగ్నిగుండంలోనుంచి కృత్య అనే శక్తి వెలువడి వచ్చి, రాక్షసులను, "ఏమి సెలవు?" అని అడిగింది. "నీవు వెళ్ళి, ప్రాయోపవేశం చేసివున్న దుర్యోధనుణ్ణి తక్షణం ఇక్కడికి తీసుకురా!" అన్నారు రాక్షసులు. కృత్య అలాగే చేసింది.

ఆ రాత్రి తెల్లవార్లూ రాక్షసులు దుర్యోధనుడితో మాట్లాడారు. "మా ఆశ లన్నీ నీపైనే పెట్టుకుని వున్నాము. పెద్ద యుద్ధం రాబోతున్నది. అందులో దేవతలు పాండవుల పక్షం వుంటారు. మేమంతా నీకు అండగావుండి, యుద్ధంలో నీకు విజయం సాధించిపెడతాము. అందుచేత నీవు చావటానికి యెంత మాత్రమూ వీలులేదు," అని రాక్షసులు దుర్యోధనుడికి హితబోధ చేశారు. తెల్ల వారుతూనే కృత్య, దుర్యోధనుణ్ణి స్వస్థానానికి చేర్చింది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '56
6

అట్టమీది బొమ్మ

గంధర్వరాజు చేతిలో ఓడి, పరాభవం భరించలేక ప్రాయోపవేశం చేసిన దుర్యోధనుడు, కర్ణాదుల కోరికవల్లనైతేనేమి, పాతాళంలో దైత్యులిచ్చిన సలహా వల్లనైతేనేమి ప్రాయోపవేశం మాని హస్తినాపురానికి తిరిగి వచ్చేశాడు.

తరవాత దుర్యోధనుడికి ఉత్సాహం చేకూర్చటానికి కర్ణుడు పెద్ద సైన్యాన్ని తీసుకుని జైత్రయాత్ర బయలుదేరాడు. అతను నాలుగు దిక్కులూ జయించి, గెలిచిన రాజ్యాలన్నీ దుర్యోధనుడి పరంచేసి, సంతోషపెట్టాడు. అప్పుడు దుర్యోధనుడు వైష్ణవమనే యజ్ఞం చెయ్యటానికి తలపెట్టాడు.

ఈ యజ్ఞంకోసం నగరం వెలపల విశాల ప్రదేశాన్ని బంగారు నాగళ్ళతో దున్నించారు. తరవాత శిల్పులు వచ్చి యజ్ఞశాలలు నిర్మించారు. ఈ యజ్ఞానికి రమ్మని పాండవులను ఆహ్వానించటానికిగాను దుర్యోధను డొక దూతను ద్వైత వనానికి పంపాడు. ఆ దూతతో ధర్మరాజు, "మేము ప్రస్తుతం వనవాసదీక్షలో ఉన్నాము. యజ్ఞంకోసమై దీక్షకు భంగం కలగగూడదు. అందుచేత రాలేము," అన్నాడు. అప్పుడు భీముడు దూతతో, "మా అరణ్యవాసమూ అజ్ఞాతవాసమూ ముగియగానే మా అన్నగారొక యజ్ఞం చేస్తారు. అందులో దుర్యోధనుడూ, అతని తమ్ములు యజ్ఞ పశువులుగా ఉంటారు. ఆ యజ్ఞానికి నేను వస్తానని దుర్యోధనుడితో చెప్పు!" అన్నాడు. దూత తిరిగి వెళ్ళిపోయాడు.

తరవాత దుర్యోధనుడు యజ్ఞాన్ని గొప్పగానే చేశాడు. అతడికి చాలా సంతోషం కలిగింది. ముఖ్యంగా కర్ణుడిచ్చిన ప్రోత్సాహం తలుచుకుని, పాండవులతో జరగబోయే యుద్ధంలో తాను గెలిచినట్టే భావించుకున్నాడు.

ఇది జరిగిన కొద్దికాలానికే, అక్కడ ద్వైత వనంలో, ఒకనాడు ధర్మరాజు నిద్రపోతూండగా, ఆయన కొక కల వచ్చింది. ఆ కలలో ఆయనకు అనేక అరణ్య మృగాలు కనిపించాయి. "మీరెందుకు వచ్చారు? నావల్ల మీకు కావలిసినదేమిటి ?" అని ధర్మరాజు వాటిని అడిగాడు.

"మహాత్మా, మేము ఈ ద్వైతవనంలో వుండే మృగాలం. ఎంతోకాలంగా మీ తమ్ములు మమ్మల్ని వేటాడి, మా వంశాలు పూర్తిగా నాశనమయే స్థితి తెచ్చిపెట్టారు. మాయందు దయవుంచి మీరు మరొక అరణ్యానికి వెళ్ళి, మమ్మల్ని బతకనివ్వండి!" అని అవి జవాబు చెప్పాయి. ధర్మరాజు దీనికి అంగీకరించి, మరునాడే తన తమ్ములతో భార్యతోసహా కామ్యక వనానికి వెళ్ళిపోయాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st June '56
6

అట్టవిూది బొమ్మ

ఒకనాడు దూర్వాసుడు పదివేలమంది శిష్యులతో దుర్యోధనుడికి అతిథిగా వచ్చాడు. దూర్వాసుడు పరమ కోపిష్ఠి. ఏమాత్రం తప్పు జరిగినా శపించేస్తాడు. అందుచేత దుర్యోధనుడు ఆ మునిపట్ల ఎంతో శ్రద్ధాభక్తులు చూపి అయనను చాలా సంతోషపెట్టాడు. "దుర్యోధనా, నాకు అతిథ్యం ఇవ్వటంలో నీవు చూపిన భక్తికి సంతోషించాను. ఏమి వరం కోరుతావో కోరుకో!" అని దూర్వాసుడన్నాడు.

"స్వామీ! నా దాయాదులైన పాండవులు కామ్యకవనంలో వుంటున్నారు. మీరు మీ శిష్యగణంతో అక్కడికి వేళగానివేళ వెళ్ళి అతిథ్యం కోరండి. ఇదే నా కోరిక," అన్నాడు దుర్యోధనుడు.

దూర్వాసు డిందుకు ఒప్పుకుని, తన పదివేలమంది శిష్యులతోనూ బయలుదేరి, కామ్యక వనంలో పాండవులుంటున్న చోటికి మధ్యాన్నం దాటినాక చేరుకున్నాడు. ధర్మరాజు తన తమ్ములతోసహా దూర్వాసుడికి నమస్కరించి స్వాగతం చెప్పాడు.

"ధర్మరాజా, నేనూ నా శిష్యులూ ఇంకా భోజనం చెయ్యలేదు. మేము గంగకు వెళ్ళి స్నానంచేసి వచ్చేలోపుగా మాకు భోజనం సిద్ధంచేయించు," అంటూ శిష్యగణంతోసహా, సమీపంలోనే వున్న గంగానదికి వెళ్ళిపోయాడు.

అప్పటికే ద్రౌపది అక్షయపాత్రలో అన్నం వండి తన భర్తలకూ, అతిథులకూ పెట్టి, తాను తిని అక్షయపాత్రను కడిగివేసిందికూడా. దూర్వాసుడికీ, అయన శిష్యులకూ ఎలా భోజనం పెట్టాలో తోచక అమె కృష్ణుణ్ణి ధ్యానించింది.

వెంటనే శ్రీ కృష్ణు డక్కడికి వచ్చాడు. "నాకు అకలి దహించుకుపోతున్నది. వెంటనే భోజనం పెట్టు," అని అయన ద్రౌపది నడిగాడు. "నీవే నన్ను పరీక్షిస్తున్నావా? అక్షయపాత్ర కడిగేశానుకూడా!" అన్నది ద్రౌపది.

"ఏ మూలనన్నా ఒక్క మెతుకు ఉండకపోదు. చూసి నాకు పెట్టు," అన్నాడు శ్రీకృష్ణుడు. అక్షయపాత్ర తెచ్చి ద్రౌపది కృష్ణుడికి చూపింది. శ్రీకృష్ణుడు పాత్రనుంచి ఒకేఒక మెతుకు తీసి నోటవేసుకున్నాడు. మరుక్షణమే దూర్వాసుడికీ, అయన శిష్యులందరికీ పొట్టలు ఉబ్బరించి, త్రేపులు అరంభమయాయి.

"ఈ స్థితిలో మనం వెళ్ళి ధర్మరాజు పెట్టే భోజనం ఎలా తిన గలం? తీరా వంట చేయించి తినకపోతే అయన శపించగలడు!" అనుకుంటూ, వారు గంగలోనుంచి బయటికి వచ్చి పాండవులవద్దకు రాక అటే వెళ్ళిపోయారు.


చందమామ
మాసపత్రిక

అట్టి మీది బొమ్మ

కామ్యకవనంలో ఉంటున్న పాండవులు ఒకనాడు వేటకు బయలుదేరి పోతూ, ద్రౌపదిని తృణబిందు మహాముని ఆశ్రమంలో ఉంచి, తమ కులపతి అయిన ధౌమ్యుణ్ణి ఆమెకు తోడుంచి అడివిలోకి వెళ్లిపోయారు. ఆ సమయంలో సైంధవుడు సాళ్వరాజు కుమార్తెను వివాహమాడటానికి సపరివారంగా బయలుదేరి కామ్యకవనంగుండా పోతూ తృణబిందు మహాముని ఆశ్రమం చెట్లమధ్య నిలబడి ఉన్న ద్రౌపదిని చూశాడు.

వెంటనే సైంధవుడు తన రథం ఆపి కోటికాస్యుడనే తన మిత్రుని పిలిచి, "ఆ స్త్రీ ఎవరో తెలుసుకొని రా. ఈమెను చూసినతరవాత ఆ సాళ్వరాజు కుమార్తెను పెళ్ళాడాలని నాకు కోరిక లేదు," అన్నాడు. కోటికాస్యుడు వెళ్ళి ద్రౌపదితో మాట్లాడి వచ్చి, "ఆమె పాండవుల భార్య అయిన ద్రౌపది. పాండవులు వేటకు వెళ్లారట," అని చెప్పాడు.

ఇది విని సైంధవుడు రథం దిగి ద్రౌపది ఉన్న చోటికి వచ్చి కుశల ప్రశ్నలు చేశాడు. ద్రౌపది అతని ప్రశ్నలకన్నిటికీ జవాబు చెప్పింది.

కాని ఆ దుర్మార్గుడు ద్రౌపదితో, "వెర్రివానా, ఈ పాండవులతోబాటు ఎందుకీ అరణ్యవాసం అనుభవిస్తావు? అదుగో నా రథం. దానిలో ఎక్కి పోదాం పద!" అన్నాడు. ద్రౌపది మండిపడి, "దుర్మార్గుడా, అమర్యాదగా మాట్లాడావంటే నా భర్తలు నిన్ను నిలువునా చంపగలరు, జాగ్రత్త! అధిక ప్రసంగం చెయ్యక వచ్చిన దారి పట్టు!" అని సైంధవుణ్ణి దూషించింది.

సైంధవు డామె మాటలు లక్ష్యపెట్టక, "దిక్కులేక అడవులు పట్టిపోయిన నీ భర్తలను చూస్తే నాకు భయమనుకున్నావా? నీవు మంచిగా నావెంట రాక పోయావంటే, నిన్ను బలాత్కారంగా తీసుకుపోతాను. నీ భర్తలెలా అడ్డుతారో చూస్తాను!" అంటూ ఆమెను బలవంతాన ఎత్తుకుని బయలుదేరాడు.

అసహాయురాలైన ద్రౌపది, "రక్షించండి! రక్షించండి!" అని కేకలు పెట్టసాగింది. ఆ కేకలు విని ధౌమ్యుడు ఆశ్రమంలోనుంచి బయటికి వచ్చి, సైంధవుడితో, "దుర్మార్గుడా, నీ ప్రయత్నం మాను! చెడిపోతావు!" అని చెప్పాడు.

కాని సైంధవుడు ధౌమ్యుణ్ణి లక్ష్యపెట్టక, ద్రౌపదిని తన రథంలో కూర్చోబెట్టి, తానుకూడా రథమెక్కి బయలుదెరాడు. ధౌమ్యుడు కేకలు పెడుతూ రథం వెనకగా పరిగెత్తసాగాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st August '56

అట్టమీది బొమ్మ

ద్రౌపదిని సైంధవుడు బలాత్కారంగా తన రథంమీద తీసుకునిపోతున్న సమయంలో, అడవిలో వేటకు వెళ్లిన పాండవులకు దుశ్శకునాలు కలిగాయి. వారు వేట చాలించి తిరిగి వచ్చి, జరిగిన సంగతి తెలుసుకున్నారు.

వెంటనే పాండవులు అయిదుగురూ తమ రథాలమీద బయలుదేరి, అతి వేగంగా సైంధవుడి బలాలను చేరుకున్నారు. పాండవులకూ, సైంధవుడి అనుచరులకూ ఘోరయుద్ధం జరిగింది.


తనకు అపజయం తప్పదని సైంధవుడికి తెలిసిపోయింది. వాడు తన రథంమీదినుంచి ద్రౌపదిని కిందికి దింపి, రథం తోలించుకుని పారిపోయాడు.

ఈలోపుగా పాండవులు సైంధవుడి బలాలను పూర్తిగా నాశనంచేసేశారు. భీమార్జునులు సైంధవుడికోసం చూసి, అతడు పారిపోయాడని తెలుసుకుని, అతనికోసం ఒక రథంలో బయలుదేరారు. వారు పోయేటప్పుడు ధర్మరాజు, "సైంధవుణ్ణి ఏమైనా చెయ్యండిగాని, చంపవద్దు!" అని హెచ్చరించాడు.

ఒక కోసుదూరం వెళ్లాక భీమార్జునులకు సైంధవుడి రథం కనుచూపు మేరలోకి వచ్చింది. వారు దూరంనుంచే ఆ రథం గుర్రాలను బాణాలతో కొట్టేశారు. రథం దిగి కాలిబలంకొద్దీ పారిపోతున్న సైంధవుడు వారికి చిక్కిపోయాడు. భీముడు అతన్ని కసితీర చిత్రహింస చేసి, చంపబోతుండగా అర్జునుడు, అన్న చెప్పినమాట జ్ఞాపకంచేసి అతన్ని వారించాడు.

భీముడు సైంధవుడికి పంచశిఖలు పెట్టి, "ఓరీ, నీచాధముడా! నువు వెళ్ళినచోటనల్లా పాండవుల దాసుణ్ణి అని చెప్పుకు తిరుగు. అలా అయితే నిన్ను ప్రాణాలతో వదిలేస్తాను!" అన్నాడు. ప్రాణభయంచేత సైంధవుడు, భీముడు చెప్పినదానికి అంగీకరించాడు.

ఇంత పరాభవం చెందిన సైంధవుడు హిమాలయాలకు వెళ్ళి శివుణ్ణి గురించి ఘోరతపస్సు చేశాడు. శివుడు మెచ్చి ప్రత్యక్షమై, "ఏం వరం కావాలో కోరుకో!" అన్నాడు. "మహాదేవా, పంచపాండవులందరూ నాచేతిలో ఓడేటట్టు వరమియ్యి!" అని అడిగాడు సైంధవుడు. "వెర్రివాడా, అర్జునుడికి నేను పాశుపతాస్త్రం ఇచ్చి ఉన్నాను. అతన్ని ఎవరూ ఓడించలేరు. మిగిలిన నలుగురూ ఒక్క రోజు నీచేత ఓడేటట్టు వరం ఇచ్చాను, వెళ్లు!" అన్నాడు శివుడు.



అట్టమీది బొమ్మ

పాండవుల అరణ్యవాసం పన్నెండో ఏడు పూర్తి కాబోతూండగా, అర్జున పక్షపాతి అయిన ఇంద్రుడు ఒక ఆలోచనచేశాడు. త్వరలోనే పాండవ కౌరవుల మధ్య యుద్ధం జరగబోతుంది. ఆ యుద్ధంలో కౌరవులపక్క కర్ణుడుంటాడు. అతనికి సహజ కవచకుండలాలున్నాయి. వాటి ప్రభావం ఉన్నంతకాలమూ అర్జునుడు కర్ణుణ్ణి ఓడించలేడు. అందువల్ల ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో కర్ణుడి దగ్గిరికి వెళ్ళి అతని సహజ కవచకుండలాలు యాచింతామనుకున్నాడు.

సూర్యుడు ఒకరాత్రి కలలో కర్ణుడికి ప్రత్యక్షమై, "నాయనా, ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో వచ్చి నీ సహజ కవచకుండలాలు యాచిస్తాడు. నీవు వాటిని ఇవ్వకు. ఇచ్చినట్లయితే యుద్ధంలో నీకు చావు తప్పదు," అని హెచ్చరించాడు.

"దేవా, నా వ్రతం ఎలా తప్పేది? బ్రాహ్మణులు కోరితే ప్రాణమే ఇస్తానని ప్రతిజ్ఞ చేసిఉన్నాను," అన్నాడు కర్ణుడు.

"అలా అయితే ఒక పని చెయ్యి. నీవిచ్చే కవచకుండలాలకు బదులుగా ఇంద్రుడివద్ద ఉండే శక్తి తీసుకో," అని సూర్యుడు సలహా ఇచ్చాడు.

కొన్నిరోజుల అనంతరం ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో కర్ణుడివద్దకు వచ్చాడు. కర్ణుడు, "బ్రాహ్మణోత్తమా, ఏమి కావాలో కోరుకో!" అన్నాడు. వెంటనే ఇంద్రుడు, "బాబూ, నీ సహజ కవచకుండలాలు కోసి నాకిచ్చెయ్యి! అంతకన్నా నాకింకేమీ అక్కర్లేదు!" అన్నాడు.


"స్వామీ, నీవు మాయవేషంలో వచ్చిన ఇంద్రుడివని నాకు తెలుసు. నీబోటివాళ్లు మానవులకు వరాలివ్వాలిగాని, నాకు అపాయం కలిగించే వరం కోరటం న్యాయమా? నా కవచకుండలాలు అలాగే ఇస్తాను. కాని దానికి మారుగా నీ శక్తిని నాకియ్యి!" అన్నాడు కర్ణుడు.

"ఇస్తాను. కాని అది ఎల్లకాలం నీవద్ద ఉండదు. నీ శత్రువులలో ఒక్కణ్ణి చంపి అది మళ్లీ నాదగ్గిరికి వచ్చేస్తుంది," అన్నాడు ఇంద్రుడు. కర్ణుడు నవ్వుతూ, "నాకున్న శత్రువు ఒక్క అర్జునుడే!" అన్నాడు. ఇంద్రుడు ఆలోచించి, "ఆ శక్తిని నువు ఆత్మరక్షణకు మాత్రమే ఉపయోగించాలి. లేకపోతే నిన్నే అది చంపేస్తుంది!" అన్నాడు.

కర్ణుడు ఈ నియమాలన్నిటికీ ఒప్పుకుని ఇంద్రుడికి తన కవచకుండలాలు ఒలిచి ఇచ్చేసి, ఆయనవద్ద శక్తి తీసుకున్నాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

పంచపాండవులు కామ్యక వనంనుంచి తిరిగి ద్వైతవనానికి మారారు. వారు అక్కడ ఉన్న సమయంలో, ఒక బ్రాహ్మడు వచ్చి, "నాయనలారా, నా నిప్పు కొయ్యను ఒక దుప్పి తన కొమ్ములలో ఇరికించుకుని పారిపోయింది. నా నిప్పు కొయ్య తెచ్చి ఇచ్చి పుణ్యం కట్టుకోండి," అని కోరాడు.

వెంటనే అయిదుగురు అన్నదమ్ములూ విల్లు అంబులు తీసుకుని దుప్పి వెళ్ళిన దిక్కుగా బయలుదేరారు. కొంతసేపటికి అది వారి కంట బడింది. దాని మీదికి ఎన్ని బాణాలు వేసినా, ఒక్కటీ తగలలేదు. దుప్పి పారిపోతూ, ఆగుతూ పాండవులను కీకారణ్యం మధ్యకు తీసుకుపోయి అసలే మాయమయింది.


అందరూ అలిసి దాహంతో బాధపడుతున్నారు. నకులుడు ఒక చెట్టెక్కి కొంతదూరాన నీటిమడుగు ఉండటం గమనించాడు. అతను అందరికీ నీరు తెస్తానని బయలుదేరి, మడుగువద్దకు పోయి తన దాహం తీర్చుకోబోతూండగా "ఈ మడుగు నాది! ముందు నా ప్రశ్నలకు జవాబులు చెప్పకుండా నీరు తాగ టానికి వీలులేదు!" అన్నది అశరీరవాణి. నకులుడు ఆ మాటలు లక్ష్యం చెయ్యక నీరు తాగి మడుగుదగ్గిరే స్పృహ తప్పి పడిపోయాడు.

నకులుడెంతకూ రాకపోవటం చూసి, ధర్మరాజు సహదేవుణ్ణి పంపాడు. అతనుకూడా నీరు తాగి, స్పృహతప్పి పడిపోయాడు. తరవాత ధర్మరాజు అర్జునుణ్ణి పంపాడు. అర్జునుడుకూడా నీరు తాగి పడిపోయాడు. తరవాత భీముడుకూడా వచ్చి, నీరుతాగి పడిపోయాడు.

ఆఖరుకు ధర్మరాజు వచ్చాడు. అశరీరవాణి హెచ్చరిక విని, "మహాత్మా, నువ్వెవరు? నీ ప్రశ్నలేమిటి?" అని అడిగాడు. అశరీరవాణి ధర్మరాజును అనేక ప్రశ్నలడిగింది. అన్నిటికీ ధర్మరాజు సమాధానాలిచ్చాడు. అశరీరవాణి సంతోషించి, "ధర్మరాజా! నీ తమ్ములలో ఎవరినన్నా ఒకరిని బతికిస్తాను, కోరుకో!" అన్నది.

"మహాత్మా! మా తండ్రికి కుంతీ, మాద్రీ ఇద్దరు భార్యలు. కుంతీ పుత్రులలో నేను బతికివున్నాను కనక, మాద్రి పుత్రులలో నకులుణ్ణి బతికించు" అన్నాడు ధర్మరాజు. "నాయనా, నీ ధర్మబుద్ధికి చాలా సంతోషించాను. నేను యమధర్మరాజును." అంటూ యమధర్మరాజు ప్రత్యక్షమై, మిగిలిన పాండ వులను బతికించి, అంతర్ధానమయాడు.


చందమామ
దీపావళి
1st Nov 19
8
as
Acharya


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Dec. '56

అట్ట మీది బొమ్మ

పాండవులు అరణ్యావాసంచేసే కాలంలో మార్కండేయ మహాముని వారి వద్దకు వచ్చి అనేక కథలు చెప్పాడు. ఒకసారి ధర్మరాజు, "మహాత్మా, పరమ పతివ్రత అయిన ద్రౌపది మాతోబాటు ఇన్ని కష్టాలు పడుతున్నదిగదా! పూర్వం ఏ పతివ్రత అయినా ఇలా కష్టాలు పడటం జరిగిందా?" అని అడిగాడు. అప్పుడు మార్కండేయుడు సావిత్రీ సత్యవంతుల కథను చెప్పసాగాడు.

పూర్వం మద్రదేశాన్ని అశ్వపతి అనే మహారాజు ఏలుతూ ఉండేవాడు. ఆయనకు పిల్లలు లేరు. అందుచేత ఆయన విడవకుండా పద్దెనిమిదేళ్లపాటు సావిత్రీదేవిని హోమార్చనలతో సహా ఆరాధించాడు. సావిత్రీదేవి ప్రత్యక్షమై, "రాజర్షీ, నీ ఆరాధనకు మెచ్చాను. ఏం వరం కావాలో కోరు!" అన్నది.

దానికి అశ్వపతి, "తల్లీ, నాకు కొడుకులను ప్రసాదించు!" అని కోరాడు.

"నీ ఉద్దేశం ముందే ఎరిగి ఉండటంచేత నేను బ్రహ్మవద్దకు వెళ్లి నీ విషయం మాట్లాడాను. నీకు ఒక్క కుమార్తెను మాత్రమే ఇవ్వటానికి ఆయన సమ్మతించాడు. పెద్దలిచ్చినది భక్తితో స్వీకరించటం మంచిది. అందుచేత నీవు ఒక్క కుమార్తెతో తృప్తిపడు," అన్నది సావిత్రీదేవి.

ఆ తరవాత అశ్వపతి భార్య అయిన మాళవి గర్భవతి అయి సకాలంలో ఒక ఆడపిల్లను కన్నది. సావిత్రీదేవి వరాన పుట్టిన పిల్ల కావటంచేత అశ్వపతి తన కుమార్తెకు సావిత్రి అని పేరుపెట్టుకున్నాడు. సావిత్రి క్రమంగా పెరిగి పెద్దది అవుతున్నకొద్దీ ఆమె అందమూ, తేజస్సూ చూసి ప్రజలు, ఆమె మానవ మాత్రురాలు కాదనీ, దేవతే మానవరూపంలో అవతరించిందనీ అనుకునేవారు. ఆమెకు వివాహంచేసుకునే వయసు వచ్చినప్పటికీ ఏ రాజకుమారుడుకూడా, ఆమెను పెళ్ళాడతానని ముందుకు రావటానికి సాహసించలేక పోయాడు.

ఇలా ఉండగా ఒకనాడు సావిత్రి స్నానంచేసి, సావిత్రీదేవికి హోమం చేసి, తండ్రిదగ్గిరికి వచ్చి ఆయన విచారంగా ఉండటం గమనించి కారణం అడిగింది. "అమ్మా, నీ వివాహంగురించి నేను చింతిస్తున్నాను. ఒక్క రాజ కుమారుడైనా నిన్ను పెళ్ళాడటానికి సాహసించకుండా ఉన్నాడు. నీకు తగిన భర్తను నీవైనా వెతకిచూసుకో. నిన్ను అతనికిచ్చి పెళ్ళిచేసి నా కర్తవ్యం నెర వేర్చుకుంటాను. యుక్తవయస్సు వచ్చిన కుమార్తెకు పెళ్ళిచేయలేదన్న నింద నాపై రాకుండా చూడు!" అన్నాడు అశ్వపతి.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
8

అట్టవిూది బొమ్మ

తండ్రి కోరినప్రకారం, తనకు కాబోయే భర్తను వెతుకుతూ సావిత్రి సపరివారంగా బయలుదేరి, పుణ్యతీర్థాలను సేవిస్తూ, అడవులలో తపస్సు చేసుకునే రాజర్షుల కుమారులను చూడసాగింది. ఇలా పోతూండగా ఆమెకు ఒక ఆశ్రమం సమీపాన సత్యవంతుడనే యువకుడు కనిపించాడు.

సత్యవంతుడి తండ్రి ద్యుమత్సేనుడు ఒకప్పుడు సాళ్వదేశానికి రాజు. ఆయనకు కళ్ళు రెండూ పోవటంవల్ల శత్రురాజులు ఆయన రాజ్యాన్ని అపహరించి, ఆయనను అడవులకు పంపారు.

సత్యవంతుణ్ణిచూసి సావిత్రి అతడే తనకు తగిన భర్త అని నిర్ణయించింది. ఆమె తన యాత్ర ముగించుకుని మద్రదేశానికి తిరిగి వచ్చింది. సరిగా ఆమె చేరిన వేళకే నారదమునికూడా అశ్వపతిని చూడవచ్చాడు.

"అమ్మా, నీవు వెళ్లిన పని ఏమయింది? నీకు భర్త కాదగినవాడెవడైనా కనిపించాడా?" అని అశ్వపతి సావిత్రిని అడిగాడు. సావిత్రి తన తండ్రికి సత్యవంతుడి విషయం చెప్పి, అతనినే పెళ్లాడ నిశ్చయించానని తెలిపింది.

"మునీశ్వరా, సత్యవంతుడు నా కుమార్తెకు తగిన వరుడేనా? అతని సంగతి మీకేమైనా తెలుసునా?" అని అశ్వపతి నారదుణ్ణి అడిగాడు.

నారదుడు అనుమానంగా తల ఆడించి, "రాజా, ఈనాటి రాజకుమారులలో సత్యవంతుడితో పోలగలవాడు ఒక్కడుకూడా లేడు. కాని అతనికి ఒకటే లోపం ఉన్నది. నేటికి సరిగా సంవత్సరం నిండేసరికి అతని ఆయుర్దాయం నిండిపోతుంది. ఈ సంగతి తెలియక సావిత్రి అతనిని భర్తగా ఎన్నుకున్నది!" అన్నాడు. ఈ మాట విని దిగులుపడి అశ్వపతి, "అమ్మా, ఇతను గాక మరెవరినైనా కోరుకో! ఈ అల్పాయుష్కుడెందుకు?" అన్నాడు.

కాని సావిత్రి తన మనసు మార్చుకోలేదు. "మనోవాక్కాయాల ఆడది ఒకరినే వరించగలదు. ఒక్కరోజైనా నేను సత్యవంతుడికే భార్యగా ఉంటాను!" అని ఆమె గట్టిపట్టు పట్టింది.

ఆమె పట్టు విడవదని తెలిసి నారదుడు అశ్వపతితో, "రాజా, ఆమె ఇష్టప్రకారమే వివాహం చెయ్యి!" అని సలహాఇచ్చాడు. అశ్వపతి సావిత్రి వివాహానికి ముహూర్తం పెట్టించి, ద్యుమత్సేనుడి ఆశ్రమానికి బయలుదేరి వెళ్ళాడు. అక్కడ సావిత్రీ సత్యవంతులకు వేదోక్తంగా వివాహం జరిగింది.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Feb. '57
8
అ
T.K.Acharya

అట్టమీది బొమ్మ

సత్యవంతుణ్ణి పెళ్లాడగానే సావిత్రి తన మేలి వస్త్రాభరణాలు విడిచిపెట్టి నార చీరెలు ధరించి, అత్త మామలకూ, భర్తకూ సేవచేస్తూ వనవాసం చెయ్య సాగింది. సత్యవంతుడి చావు ఇంకా నాలుగు రోజులలో ఉన్నదనగా ఆమె మూడు రోజుల కఠిన ఉపవాసవ్రతం పూనింది. మూడు రోజుల వ్రతమూ పూర్తి అయినాక నాలుగవ రోజు ఆమె భోజనం చెయ్యలేదు.

ఆ రోజు సత్యవంతుడు పూలూ, కట్టెలూ తీసుకురావటానికి అడవిలోకి పోతూంటే సావిత్రికూడా అతనివెంట బయలుదేరింది. అడవిలో సత్యవంతుడు పూలూ, పళ్లూకోసి, కట్టెలు కొడుతూ మధ్యలో గొడ్డలి జారవిడిచి, తనకు తల నొప్పిగా ఉన్నదనీ, కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటాననీ సావిత్రిదగ్గిరికి వచ్చాడు. అతని తల తన తొడమీద పెట్టుకుని సావిత్రి కూర్చుని ఉండగా ఆమె ఎదట యమధర్మరాజు కనిపించాడు.

యముడు తన భర్త ప్రాణాలను పాశంతో బంధించి తీసుకుపోతూండటం కళ్లారాచూసి సావిత్రి ఆయనను వెంబడించింది. యముడు ఆమెను తిరిగి పొమ్మన్నాడు, కాని ఆమె ఒప్పుకోలేదు. ఆమె తనవెంట రాకుండా ఆపటానికి యముడు ఆమెకు వరసగా అనేక వరాలిచ్చాడు. సావిత్రి మామగారికి కళ్లు తిరిగివచ్చేటట్టూ, ఆయనకు రాజ్యం తిరిగివచ్చేటట్టూ, సావిత్రి తండ్రి అయిన అశ్వపతికి నూరుగురు కొడుకులు కలిగేటట్టూ యముడు వరాలిచ్చాడు. అప్పటికీ సావిత్రి ఆయనను వెంబడించటం మానలేదు. ఆఖరుకు యముడు సావిత్రికి నూరుగురు కొడుకులు కలిగేలాగు వరమిచ్చాడు. భర్త పోయాక పతివ్రత పిల్లల్ని ఎలా కంటుందని సావిత్రి యముణ్ణి అడిగింది. యముడు చేసేదిలేక తన పాశంనుంచి సత్యవంతుడు ప్రాణాలు తప్పించి ఆమెకు భర్తృ దానం చేశాడు.

సావిత్రి సత్యవంతుడి వద్దకు తిరిగివచ్చేసరికి అతను నిద్రలేచిన వాడి లాగా లేచి కూర్చున్నాడు. తరవాత వారిద్దరూ కలిసి ఆశ్రమానికి తిరిగివచ్చారు.

యముడి వరాలప్రభావంచేత సావిత్రి మామగారికి కళ్ళువచ్చాయి, పోయిన రాజ్యంకూడా లభించింది. అతడికి కుమారులు కలిగారు. సత్య వంతుడు సాళ్వదేశానికి రాజై చాలాకాలం పాలించాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st March '57

8

అట్టవిహాది బొమ్మ

పంచపాండవులు పన్నెండేళ్ళ అరణ్యావాసం పూర్తిచేశారు. ఇప్పుడు వారు పన్నెండు నెలలపాటు ఎవరికీ తెలియకుండా అజ్ఞాతవాసం చేయవలసి ఉన్నది. ధర్మరాజు తన తమ్ములతోబాటు ఆలోచించి, అజ్ఞాతవాసకాలాన్ని మత్స్య దేశంలో విరాటరాజు కొలువులో గడపాలని నిర్ణయించాడు.

"నేను బ్రాహ్మణవేషం ధరించి, కంకుడు అనే పేరు పెట్టుకుని విరాటుడి కొలువులో చేరి ఆయనను పాచికల ఆటతో రంజింపజేస్తాను," అన్నాడు ధర్మరాజు. "నేను వలలుడనే పేరు పెట్టుకుని విరాటుడివద్ద వంటవాడుగా చేరి, నావంటతోనూ, నాకుగల బలంతోనూ విరాటుడికి ఎల్లవిధాలా సహాయపడతాను." అన్నాడు భీముడు. "నేను జుట్టు ఉంచుకుని, నగలు పెట్టుకుని, బృహన్నల అనే పేరుతో, మగవాడూ ఆడదీకాని అవతారంలో అంతఃపురంలో ప్రవేశించి అంతఃపుర స్త్రీలకు నృత్యం నేర్పుతాను. రాజుగారికీ, రాణీవాసానికీ నృత్తగీతవాద్యాదులతో వినోదం కలిగిస్తాను!" అన్నాడు అర్జునుడు.

"నాకు అశ్వవిద్య బాగా తెలుసును. నేను దామగ్రంథి అనే పేరుతో విరాటుడి అశ్వశాలలో ఉద్యోగం సంపాదిస్తాను. గుర్రాలకు శిక్షణ ఇవ్వటమూ, జబ్బుచేస్తే చికిత్స చేయటమూ నాకు చేతనవును," అన్నాడు నకులుడు.

"నేను తంత్రీపాలుడని పేరు పెట్టుకుని విరాటుడి గోవులకు పాలకుడనుగా ఉంటాను," అన్నాడు సహదేవుడు. "నేను సైరంధ్రిగా విరాటుడి భార్య అయిన సుధేష్ణదగ్గిర పనికి కుదురుతాను. నాకు తలదువ్వి ముడవటం బాగా తెలుసును. సుధేష్ణ అండను నాకే బాధా ఉండదు," అన్నది ద్రౌపది.

ఈ విధంగా నిర్ణయించుకున్నవారై పాండవులు ధౌమ్యుడికీ, తమ వెంట ఉన్న బ్రాహ్మణులకూ, పరివారానికీ వీడ్కోలు చెప్పి ద్వైతవనంనుంచి ద్రౌపదితోసహా బయలుదేరి మత్స్యదేశానికి వెళ్ళారు. విరాటనగరం అంత దూరంలో ఉండగా వారు ఆగి తమ వేషాలు మార్చుకున్నారు. శ్మశానంలో ఉన్న ఒక శమీవృక్షంమీద తమ ఆయుధాలన్నీ కట్టకట్టి దాచిపెట్టారు. దాని పైన ఒక వికృతమైన శవాన్ని కప్పారు.

తరువాత వారు, తమలో తాము ఒకరినొకరు రహస్యంగా సంబోధించటానికిగాను జయ, జయంత, విజయ, జయత్సేన, జయద్బల అనే అయిదు పేర్లూ పెట్టుకుని విరాటనగరంకేసి బయలుదేరారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st April '57
50
NAYE PAISE
8
AS

అట్టివీూది బొమ్మ

అజ్ఞాతవాస దీక్ష నిమిత్తమై పంచపాండవులూ, ద్రౌపదీ తమ వేషాలు మార్చుకున్న అనంతరం ధర్మరాజు ముందుగా బయలుదేరి విరాటరాజు కొలువుకు వెళ్లి, "రాజా, నేను పూర్వం ధర్మరాజు కొలువులో ఉండేవాణ్ణి. నా పేరు కంకుడు. నాకు పాచికల ఆటలో ప్రావీణ్యం ఉన్నది. నన్ను మీ కొలువులో ఉంచుకోండి," అని కోరాడు. విరాటుడు సంతోషంతో అంగీకరించాడు.

ఈ లోపల ద్రౌపది సైరంధ్రీ వేషంతో విరాటనగరం ప్రవేశించి వీధుల వెంట నడవసాగింది. దారిలో ఆమెను చాలా మంది ఆపి, "అమ్మా, ఎవరు నీవు?" అని ప్రశ్నించారు. వారితో ఆమె, "నేను సైరంధ్రిని. ఎవరైనా నన్ను పోషించినట్లయితే వారికి సేవకురాలుగా పని చేస్తాను!" అని చెబుతూవచ్చింది.

ఈ వార్త విరాటరాజు భార్య అయిన సుధేష్ణకు తెలిసింది. ఆమె ద్రౌపదిని పిలిపించి, "నీవెవరు?" అని అడిగింది. దానికి ద్రౌపది, "అమ్మా, నేను ఇంతకు ముందు సత్యభామాదేవి వద్దా, ద్రౌపదీదేవి వద్దా పరిచారికగా ఉండేదాన్ని. నా పేరు మాలిని. నాకు కేశాలంకరణ, పూలమాలలు కట్టటం, అలంకరణ చెయ్యటం బాగా తెలుసును," అన్నది.

"నిన్ను అంతఃపురంలో పెట్టుకుంటే విరాటరాజుగాని, ఇతరులుగాని నీ అందానికి వశులైనప్పుడు నీకు ఇబ్బంది కలుగుతుందేమో?" అన్నది సుధేష్ణ.

"అమ్మా, నన్ను నా భర్తలైన అయిదుగురు గంధర్వులు అనుక్షణమూ కాపాడుతూ ఉంటారు. అందుచేత నాకు ఎవరి భయమూ లేదు!" అని ద్రౌపది జవాబిచ్చింది. సుధేష్ణ ఆమెను తనవద్ద ఉంచుకోవటానికి ఒప్పుకున్నది.

మరి కొంతసేపటికి వంటలవాడి వేషంలో భీముడు విరాటరాజువద్దకు వచ్చి, "మహారాజా, నేను వలలుడనేవాణ్ణి. నేను వంట చేస్తాను. నన్ను మీ కొలువులో ఉంచుకోండి. నేను అవసరమైతే మల్లయుద్ధంకూడా చేయగలను. కాని వంట చేయటం నా వృత్తి!" అన్నాడు. విరాటుడు ఆ ప్రకారమే భీముణ్ణి తన వంటవాడుగా నియమించాడు. రాజుగారి వినోదంకోసం భీముడు మల్లులను ఓడించడమేగాక, సింహశార్దూలాది మృగాలతో కూడా పోట్లాడి తన బాహుబలం ప్రదర్శిస్తూ ఉండేవాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '57
50
NAYE PAISE
8
AS

అట్టమీది బొమ్మ

ధర్మరాజూ, ద్రౌపదీ, భీముడూ మారువేషాలు ధరించి, మారుపేర్లతో విరాట రాజువద్దకు వెళ్ళి ఉద్యోగాలు సంపాదించిన అనంతరం, అర్జునుడు బృహన్నల రూపంలో బయలుదేరి విరాటుడి కొలువుకు వెళ్ళాడు. విరాటరాజు నివ్వెరపోయి, "నీ వెవరు?" అని అడిగాడు.

"మహారాజా, నేను బృహన్నల అనేదానను. నాట్యకళలో నాకు మంచి నైపుణ్యం ఉన్నది. పిల్లలకూ, పెద్దలకూకూడా నాట్యశిక్షణ చేయగలను. వీణా, మృదంగమూ మొదలైన వాద్యాలు వాయించటంలో ప్రవీణురాలను," అని అర్జునుడు జవాబు చెప్పాడు. విరాటరాజీ మాటలను నమ్మలేక, "నాయనా, నీవాలకం చూస్తే ధనుర్బాణాలు ధరించదగి ఉన్నావు. స్త్రీజనానికి నాట్యాలు నేర్పేగతి నీకేంపట్టింది? ధనుర్బాణాలు ధరించి నాకు అండగా ఉండు!" అంటూ ధనుర్బాణాలు తెప్పించి అర్జునుడి ఎదట పెట్టాడు.

అర్జునుడు వాటిని చూసి భయపడినవాడులాగా నటిస్తూ, "మహారాజా, వీటిని ఎలా పట్టుకోవాలోకూడా నాకు తెలియదు. నేను నిజంగా బృహన్నలను! నాపై అనుగ్రహించి నాట్యానికి నన్ను పెట్టుకోండి!" అని విన్నవించుకున్నాడు.


అప్పుడు విరాటుడు తన కుమార్తె అయిన ఉత్తరను పిలిపించి, "తల్లీ, ఈవిడ పేరు బృహన్నల. ఇకనుంచీ ఈమె నీకు నాట్యం నేర్పుతూ, నీకు చెలికత్తెగా ఉంటుంది!" అన్నాడు. అర్జునుడు రాజపుత్రిక వెంట అంతఃపురానికి వెళ్ళిపోయి అక్కడ నర్తన శాలలో ఉత్తరకు దినదినము నృత్యం నేర్పసాగాడు.

తరువాత కొంతసేపటికి విరాటుడు కొలువు చాలించి అశ్వశాలకు వెళ్ళాడు. ఆ సమయంలో నకులుడు అక్కడికి వచ్చి తానుకూడా గుర్రాలను చూడసాగాడు. విరాటుడు అతన్ని పిలిపించి, "నాయనా, నీకు గుర్రాలను గురించి తెలుసునా?" అని అడిగాడు. దానికి నకులుడు, "మహారాజా, నాకు అశ్వచికిత్సా, అడవిగుర్రాలను మచ్చిక చెయ్యటమూకూడా తెలుసు. దయ ఉంచి నన్ను ఉద్యోగంలో పెట్టుకోండి," అని అడిగాడు. రాజు సమ్మతించాడు.

ఆ రోజే సహదేవుడుకూడా విరాటరాజువద్ద గోపాలకుడుగా ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఈ విధంగా పంచపాండవులూ, ద్రౌపదీ తమ అజ్ఞాతవాసదీక్ష అరంభించారు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

పాండవులూ, ద్రౌపదీ విరాటరాజువద్ద కొలువుచేస్తూ, తమ అజ్ఞాతవాసదీక్ష పది నెలలపాటు సాగించారు. ఈ దీక్ష మరి రెండు మాసాలు జరగవలసి ఉన్నది. ఈ సమయంలో సుదేష్ణ తమ్ముడైన కీచకుడు ద్రౌపదిని చూడటం తటస్థించింది.

విరాటరాజుకు సేనానాయకుడుగా ఉంటున్న ఈ కీచకుడు మహా బలశాలి, గొప్పగర్వి. ద్రౌపదిని చూస్తూనే అతను ఆమెను మోహించాడు. అతను నిర్భయంగా అంతఃపురంలో ప్రవేశించి ద్రౌపదిని సమీపించి, "ఎవరునీవు? నీవంటి సౌదర్యవతిని నేనెక్కడా చూడలేదు. నీకు ఇక్కడ దాసీ పనిచేసే కర్మమేమిటి? నన్ను పెళ్లాడి నారాణివిగా ఉండు. నేనూ, నా ఇతర భార్యలూ నీకు దాసానుదాసులుగా ఉంటాము!" అన్నాడు.

"నేను పరస్త్రీని. నాతో నీకేమిపని? నీబుద్ధి మార్చుకో. లేనిపక్షంలో నా భర్తలయిన గంధర్వులయిదుగురు నిన్ను హతమార్చెయ్యగలరు!" అని ద్రౌపది కీచకుణ్ణి బెదిరించింది.

కీచకుడు భయపడక, "నన్ను హతమార్చగలవాళ్లు మూడులోకాలలోనూ లేరు. ఈ విరాటరాజును సింహాసనంమీదవుంచి కాపాడుతున్నది నేనే. కనుక, నా కోరిక మన్నించి నన్ను పెళ్ళాడు!" అన్నాడు.

"పాపీ, నీకు ఆయుర్దాయం తీరినట్టుగా ఉన్నది. నీకు ఇటువంటి ఆలోచన ఉన్నదని తెలిస్తే చాలు నా భర్తలు నిన్ను చంపేస్తారు. నీ బల పరాక్రమాలు వారిముందు ఎందుకూ పనికిరావు!" అని ద్రౌపది హెచ్చరించింది.

ద్రౌపది బుద్ధిమార్చలేక కీచకుడు తన అక్క అయిన సుధేష్ణ కాళ్ళమీద పడి, "అక్కా; ఈ సైరంధ్రి నన్ను పెళ్ళాడకపోతే నా ప్రాణాలు దక్కవు, ఎలాగైనా ఆమెను నాకు సుముఖురాలినిచేసి పుణ్యంకట్టుకో," అన్నాడు.

సుధేష్ణ అతనిబుద్ధి మరల్చాలని ప్రయత్నించింది గాని, కీచకుడి బుద్ధి కొంచెమైనా మారలేదు. చివరకామె, "నీకు రోజులు మంచివికావు! దానికి నేనేం చెయ్యగలను? నీవు ఇంటికిపోయి మద్యమూ, మధురాన్నమూ తయారు చేయించు. వాటికోసం సైరంధ్రిని పంపుతాను. చాతనైతే ఆమెను సుముఖు రాలినిచేసుకో, లేకపోతే నీకర్మ నువే అనుభవించు!" అన్నది.

కీచకుడు పరమానందంతో ఇంటికి వెళ్లిపోయాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st July '57

50 NAYE PAISE

8

అట్టవీూది బొమ్మ

కీచకుడికి మాట ఇచ్చిన ప్రకారం రాణీ సుధేష్ణ ద్రౌపదిని పిలిచి, "సైరంధ్రీ, నాకు చాలా దాహంగా ఉంది. నువు మా తమ్ముడి ఇంటికి వెళ్లి కాస్త మద్యం పట్టుకురా!" అన్నది.

"మీ తమ్ముడు నన్ను విపరీతంగా మోహించి ఉన్నాడు. నేను ఆయన ఇంటికి వెళ్లను, మరెవరినైనా పంపరాదా?" అన్నది ద్రౌపది.

"నేను పంపానంటే మా తమ్ముడు నిన్నేమీ చేయడు. వెంటనే వెళ్లిరా!" అని సుధేష్ణ ద్రౌపదిని నిర్బంధించింది. విధిలేక ద్రౌపది ఒక బంగారు పాత్ర తీసుకుని కీచకుడి ఇంటికి వెళ్లింది. ద్రౌపదిని చూడగానే కీచకుడు తన కోరిక నెరవేరిందనుకుని, ఆమె చెయ్యి పట్టుకున్నాడు. వెంటనే ద్రౌపది అతని పట్టు విడిపించుకుని బయటికి పరిగెత్తింది. కీచకుడు ఆమెవెంట పడ్డాడు.

ద్రౌపది నేరుగా విరాటరాజు కొలువుకు వెళ్లింది. కాని కీచకుడు రాజ సభనుకూడా పాటించక ద్రౌపదిని జుట్టు పట్టుకుని పడదోశాడు. ఇది చూసి సభలో ఒక్కరుకూడా, ఇదేమిటని కీచకుణ్ణి వారించలేకపోయారు.

ఒక్క భీముడుమటుకు రోషంతో పరవశుడైపోయి, పళ్ళు పటపట కొరుకుతూ, సమీపంలో ఉన్న పెద్ద చెట్టును పెరకబోయాడు. సమయానికి ధర్మరాజు, "పిచ్చివాడా, అ పచ్చిచెట్టు నీకు వంటచెరుకుగా పనికిరాదు. దాని నెందుకు పెరుకుతావు?" అని భీముణ్ణి నివారించాడు.


కీచకుడు తనను ఇలా అవమానిస్తుంటే, తన భర్తలుసయితం చూస్తూ ఊరుకోవటం చూసి మండిపోతూ, ద్రౌపది విరాటరాజుతో, "నా భర్తలు మహా శక్తిమంతులైకూడా ఏమీ చెయ్యలేనప్పుడు, రాజువైన నీవుకూడా ఈ దుర్మార్గుణ్ణి మందలించక ఊరుకున్నావేమిటి?" అని అడిగింది.

విరాటరాజుకు కీచకుణ్ణి శాసించే ధైర్యం లేదు. "నీకూ అతనికీ మధ్య చాటుగా ఏమి సంబంధమో నాకేం తెలుసు?" అన్నాడాయన.

ధర్మరాజు పరిస్థితి విషమిస్తుందని భయపడి ద్రౌపదిని కోపంగా, "ఓసీ, నీకి రాజసభలో ఏమి పని? నీకు పరాభవం జరిగితే, సమయం కనిపెట్టి నీ భర్తలు దానికి ప్రతిక్రియ చేయరా?" అని మందలించాడు. ద్రౌపది లేచి కోపంతోనూ దుఃఖంతోనూ కన్నీరు కార్చుతూ అంతఃపురానికి వెళ్లిపోయింది.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టవిూది బొమ్మ

విరాటరాజు నిండుకొలువులో కీచకుడిచేత పరాభవం పొందిన ద్రౌపది అంతః పురానికి తిరిగిరాగానే సుదేష్ణ ఆమెను చూసి, "ఎందు కలా ఉన్నావు? నిన్ను ఎవరు బాధించారు?" అని అడిగింది. ద్రౌపది ఆమెతో జరిగినదంతా చెప్పింది. "నా తమ్ముడు ఇంతపని చేస్తాడా? వాణ్ణి చంపిస్తాను!" అన్నది సుదేష్ణ.

"నన్ను పరాభవించినందుకు అతనిమీద ఎవరికి రోషం వస్తుందో వారే అతన్ని చంపేస్తారు!" అన్నది ద్రౌపది.

అప్పటికే ఆమె కీచకుణ్ణి భీముడిచేత చంపించాలని నిశ్చయించుకుని ఉన్నది. అ రాత్రి అందరూ గాఢనిద్రలో మునిగి ఉన్న సమయంలో ఆమె భీముడు పడుకునే చోటికి వెళ్లి, అతన్ని లేపింది.

"నీ భార్యను ఒక దురాత్ముడు నీ యెదటనే పరాభవించటం కళ్లారా చూసికూడా ఎలా నీకు నిద్రపట్టింది?" అంటూ ద్రౌపది తన కష్టాలన్నీ భీముడికి చెప్పుకుని ఏడ్చింది.

"ఇంక కొద్దికాలం ఓపికపట్టు! మన అజ్ఞాతవాసదీక్ష పూర్తి అయి పోతుంది; మనకు మళ్లీ మంచిరోజులు వస్తాయి!" అన్నాడు భీముడు.

"అంతదాకా నేను జీవించి ఉంటేగద? మదాంధుడైన కీచకుడు నన్ను వదలడు. మీరు అయిదుగురూ ఉండికూడా నన్ను ఆ దుర్మార్గుడి బారినుండి కాపాడ లేరు. ఇక నేను జీవించటం సాధ్యంకాదు. తెల్లవారేలోగా కీచకుడు చావనిపక్షంలో నేను ప్రాణత్యాగం చేసుకోకతప్పదు. రేపు మళ్లీ వాడి మొహం ఎలా చూడను?" అంటూ ద్రౌపది కన్నీరు కార్చింది.

ఈ మాటలతో భీముడికి రోషం వచ్చింది. "ఆ కీచకుణ్ణి నేను తప్పక చంపుతాను; నువు విచారించకు. అయితే ఈ పని రహస్యంగా జరగాలి. తెల్లవారగానే కీచకుడు నీవద్దకు వచ్చినప్పుడు వాడిపైన నీకు ఇష్టం కలిగి నట్టుగా నటించి, రేపురాత్రికి నర్తనశాలకు రమ్మని చెప్పు. ఆడవాళ్లు పగలల్లా అక్కడ నృత్యం నేర్చుకుంటారు, కాని రాత్రివేళ అక్కడ ఎవరూ ఉండరు. వాడితో నేను యుద్ధంచేస్తుంటే ఎవరూ అడ్డరు. అక్కడినుంచే నేను వాణ్ణి యమపురానికి పంపేస్తాను!" అని భీముడు ద్రౌపదితో ప్రమాణంచేశాడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక


అట్టవిూది బొమ్మ

మర్నాడు తెల్లవారుతూనే కీచకుడు విరాటరాజు అంతఃపురానికి వచ్చి ద్రౌపదితో, "చూశావా? ఈ మత్స్యదేశంలో నన్ను ఎదిరించేవారు లేరు. కనక ఇకనైనా మంచిగా నా కోరిక తీర్చు. నిన్ను నా పట్టపురాణిని చేస్తాను. నా భార్యలందరూ నీకు దాసీలుగా ఉంటారు!" అన్నాడు. "నీవు బలం గలవాడివి, నీకెవరి భయమూ లేదు. కాని ఈ సంగతి నా భర్తలైన గంధర్వులకు తెలిస్తే నాకు చాలా ప్రమాదం. ఇవాళ రాత్రికి నర్తనశాలకు వస్తివా, నేను నీకోసం అక్కడ వేచి వుంటాను. ఈ సంగతి మరెవరికీ తెలియరాదు," అన్నది ద్రౌపది.

కీచకుడిందుకు సంతోషంతో ఒప్పుకున్నాడు. ఈ ఏర్పాటును గురించి ద్రౌపది భీముడికి తెలిపింది. చీకటి పడగానే భీముడు వెళ్ళి ఒంటరిగా నర్తనశాలలో శయ్యమీద దుప్పటి కప్పుకుని పడుకున్నాడు. అన్నప్రకారం కీచకుడు వచ్చి, చీకటిలో భీముణ్ణి చూసి సైరంధ్రే అనుకుని, మీద చెయ్యివేశాడు. వెంటనే భీముడు సింహంలాగా లేచాడు. ఆ అంధకారంలో ఇద్దరూ కొంచెంసేపు మదగజాలలాగా యుద్ధంచేశారు. చిట్టచివరకు భీముడు కీచకుణ్ణి చంపేసి, అతని కళేబరాన్ని గుర్తించరాకుండా బీభత్సపరిచాడు. తరవాత దివిటీకాంతిలో ఆశవాన్ని ద్రౌపదికి చూపి, "నిన్ను మోహించిన దురాత్ముడికి ఏంగతి పట్టిందోచూడు!" అని చెప్పి, తన వంటశాలకు తిరిగివెళ్లాడు. తరవాత ద్రౌపది నర్తనశాలా రక్షకులను పిలిచి, "నా భర్తలైన గంధర్వులు కీచకుణ్ణి చిత్రవధ చేశారు. శవం నర్తనశాలలో ఉన్నది!" అని చెప్పింది. వాళ్లువెళ్లి ఈ సంగతి రాజభవనంలో చెప్పారు.

కీచకుడి మరణవార్త వినగానే నూటఅయిదుమంది ఉపకీచకులు వచ్చి, అక్కడే నిలబడిఉన్న ద్రౌపదిని చూసి, "దీనిమూలానే మన కీచకుడు చచ్చాడు. దీన్నికూడా ఆయనతోబాటు తగలేద్దాం!" అని ఆమెనుకూడా పాడెకు కట్టి శ్మశానానికి బయలుదేరారు. ద్రౌపది తన భర్తలను మారుపేర్లతో పిలిచి కేకలు పెట్టసాగింది. భీముడా కేకలు విని మారువేషంతో బయలుదేరి, దారిలో ఒక చెట్టు పెరికి దానితో ఉపకీచకులనందరినీ మట్టుపెట్టాడు.

దారిలో స్నానంచేసి సైరంధ్రి అంతఃపురానికి రాగానే రాణీసుధేష్ణ, "సైరంధ్రీ, నీ కొలువు ఇక చాలు! నీ భర్తలైన గంధర్వుల భయం మాకు జాస్తిగా ఉంది. నీవు వెళ్లిపో!" అన్నది. "అమ్మా, నాకు పదమూడు రోజులు గడువివ్వండి! తరవాత నాభర్తలువచ్చి నన్ను తీసుకుపోతారు!" అన్నది ద్రౌపది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Oct. '57
50
PAISE
8
AS

అట్టవీాది బొమ్మ

పాండవుల అజ్ఞాతవాసదీక్ష ముగిసేలోగా వారిని బయటపెట్టినట్టయితే, వారు మరొక పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసమూ, తిరిగి ఒక సంవత్సరం అజ్ఞాత వాసమూ చేయవలసి ఉంటుంది. అందుచేత దుర్యోధనుడు తన వేగులవారిని దేశదేశాలకు పంపి, పాండవులు ఎక్కడ ఉన్నదీ తెలుసుకురమ్మన్నాడు. వారు పట్టణాలూ, అడవులూ, కొండలూ సర్వం గాలించి తిరిగి వచ్చి పాండవుల జాడ ఎక్కడా దొరకలేదని చెప్పారు.

వెంటనే దుర్యోధనుడు భీష్మ ద్రోణాదులను చేర్చి కర్తవ్యం ఏమిటని అడిగాడు. వారు చనిపోయి ఉంటారని కొందరన్నారు. కృపాచార్యులు మాత్రం, "మనం అన్నిదేశాలమీద దండెత్తుదాం. బలహీనులతో సంధి చేసుకుందాం. పాండవులున్న ఏదేశం అయినా వారి అండచూచుకుని మనతో తప్పక యుద్ధానికి సిద్ధపడుతుంది. పాండవులు మహాశూరులు గనక ఆ యుద్ధంలో పాల్గొని మనకు దొరికి పోతారు," అన్నాడు.

దానిపై సుశర్మ ఇంకొక సూచనచేశాడు. "తన బావమరిది అయిన కీచకుడి అండచూసుకుని విరాటరాజు నాపై చాలాసార్లు దండెత్తివచ్చి, ఓడించాడు. ఇప్పుడా కీచకుణ్ణి కాస్తా గంధర్వులు సంహరించారు కనుక మనం యిప్పుడా దేశంమీద పడి అతణ్ణి సులువుగా జయించవచ్చు. నేను విరాటరాజుపై నా పగ తీర్చుకుంటాను," అన్నాడు.

దుర్యోధనుడు తన సేనను రెండుభాగాలుగా చేసి ఒకభాగం సుశర్మకిచ్చి మత్స్యదేశంమీద ఒకపక్కనుంచి దాడిచెయ్యమన్నాడు.

బహుళసప్తమినాడు సుశర్మ మత్స్యదేశంపైనపడి విరాటుడి గోగణాలను స్వాధీనపరుచుకున్నాడు.

ఈ వార్త తెలియగానే విరాటుడు యుద్ధానికి కదలి వెళ్లాడు. ఆయన వెంట బృహన్నల తప్ప మిగిలిన పాండవులుకూడా వెళ్లారు. ఈ యుద్ధంలో సుశర్మ విరాటుడిని ఓడించి ఖైదీగా పట్టుకున్నాడు. ఇది చూసి, ధర్మరాజు భీముణ్ణి, సుశర్మమీదికి యుద్ధానికి పంపాడు. భీముడు సుశర్మను ఓడించి, విరాటుడిని బంధ విముక్తుణ్ణి చేయటమేగాక, పారిపోతున్న సుశర్మను వెంబడించి అతణ్ణి ఖైదీగా పట్టుకున్నాడు.


చందమామ
దీపావళి ప్రత్యేక సంచిక
1st Nov. '57
75
NAYE
PAISE

దీపావళి

రాజు అసమర్థుడైనప్పుడు దేశంలో అరాజకం ఏర్పడి ప్రజలు ఎన్ని విధాల బాధపడతారో "అరాజకం" [జాతక కథ] లో వర్ణించబడింది. అరాజకం తాత్కాలికంగా ఏర్పడేది.

కాని మానవచరిత్రలో అప్పుడప్పుడూ బలవత్తరమైన లోకకంటకులు పైకి వచ్చి ప్రపంచవాసుల జీవితాన్ని దుఃఖభరితం చేసి అంతటా అంధకారం కలిగిస్తారు. వారిని నిర్మూలించటానికి సాధారణ మానవశక్తులు చాలనప్పుడు భగవంతుడే అవతరించి ప్రపంచాన్ని దుఃఖంనుంచీ, అంధకారంనుంచీ రక్షిస్తాడని మన పురాణాలు చెబుతున్నాయి.

అలాటి మానవ విమోచనానికి చిహ్నం దీపావళి. అందుచేత మనం ఏటా ఈ పండగను జరుపుకుంటున్నాం. లోకకంటకుడైన నరకాసురుడు తన ధాటికి ఎదురులేదని విర్రవీగుతూ మూడు లోకాలను పీడించే సమయంలో, శ్రీకృష్ణుడు సత్యభామాసమేతుడై ఆ లోకకంటకుడిపై దండెత్తి వెళ్లి, అతనిని సంహరించి, ప్రపంచానికి ఆనంద వికాసాలను తిరిగి ప్రసాదించాడు. ప్రజలు ఆ దంపతులకు జేజేలు పట్టారు.

లోకకల్యాణంకోసం పురుషుడితో సమంగా స్త్రీకూడా పోరాడాలన్న సూత్రాన్ని సత్యభామ ఆనాడే అమలుచేసింది.

ఈనాడు ప్రపంచం శాశ్వతశాంతి సౌఖ్యాలకోసం కృషి చేస్తున్నది. ఈ కృషిలో స్త్రీ పురుషులు సమంగా పాల్గొనాలి. అందుచేత ఈ దీపావళి పుణ్యసమయాన ఆ పుణ్యదంపతులను స్మరించుదాం.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st c. '57
50
NAYE PAISE
8

అట్టవిూది బొమ్మ

సుశర్మ దక్షిణ గోగ్రహణం చేసిన వెనువెంటనే దుర్యోధనుడు భీష్మ ద్రోణ కర్ణ కృప శకుని దుశ్శాసనాశ్వత్థామలతో సహా తన బలాలను వెంటబెట్టుకుని మత్స్య దేశానికి ఉత్తరంగా ఉన్న అరువేల గోవులను పట్టుకున్నాడు.

అక్కడి గోపాలకులు వెంటనే బయలుదేరి విరాటనగరం వెళ్ళి, స్త్రీజనం మధ్య కూచుని కబుర్లుచెబుతున్న విరాటరాజు కొడుకును, ఉత్తరకుమారుణ్ణి, చూసి, జరిగిన సంగతి చెప్పి, "మహారాజా, యిప్పుడు మీరే దిక్కు. మీరు వెంటనే బయలుదేరి వచ్చి, కౌరవులతో యుద్ధంచేసి మన గోగణాలను విడిపించండి!" అన్నారు.


దానికి ఉత్తరుడు, "అయ్యో, నాకు తగిన సారథి లేకపోయెనే! ఉన్నట్టయితే ఒంటరిగా బయలుదేరి వెళ్ళి ఆ కౌరవ బలాలతో అర్జునుడిలాగా పోట్లాడి, అందరినీ ఓడించి ఉందును," అన్నాడు. ఆ మాట వినగానే ద్రౌపది, "మహారాజా, మన బృహన్నల అర్జునుడికి సారథ్యం చేసినవాడు. అతన్ని వెంటబెట్టుకు పోయినట్టయితే కౌరవులమీద సులువుగా గెలుస్తారు!" అన్నది.

ఉత్తరుడు తన చెల్లెలైన ఉత్తరను నర్తనశాలకు పంపి బృహన్నలను పిలిపించాడు. బృహన్నల, "రాజకుమారా, నేను పాడగలను, ఆడగలను గాని రథసారథ్యం నావల్ల ఏమవుతుంది!" అన్నాడు.

"ఆటలూ పాటలూ తరవాత చూడవచ్చు. ముందు రథాన్ని సిద్ధంచెయ్యి. ఇదిగో ఈ కవచం ధరించు," అంటూ ఉత్తరుడు బృహన్నలకు ఒక కవచం ఇచ్చాడు. దానిని ధరించటం తెలియనివాడులాగా బృహన్నల తన శరీరంమీద కప్పుకున్నాడు. అక్కడ ఉన్న స్త్రీలందరూ విరగబడి నవ్వారు. ఉత్తరుడు బృహన్నలకు తానే స్వయంగా కవచం తొడిగాడు.

తరవాత ఉత్తరుడు ధనుర్బాణాలు తీసుకుని, రథానికి సింహధ్వజం ఎత్తి బృహన్నలతోసహా రథం ఎక్కాడు. ఉత్తర బృహన్నలతో, "యుద్ధంలో గెలిచి వచ్చేటప్పుడు నా బొమ్మల పాత్తిళ్ళకుగాను మంచిమంచి బట్టలు తీసుకురండి," అని అడిగింది.

"మీ అన్న యుద్ధంలో గెలిస్తే అలాగే తెస్తాం," అంటూ బృహన్నల రథాన్ని బయలుదేరదీశాడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
50
NAYE PAISE
8
AS

అట్టవిూది బొమ్మ

కౌరవ బలాలను ఒంటరిగా జయించి తన గోవులను తెచ్చుకోవటానికి రథం ఎక్కి కూచున్న ఉత్తరుడు, "బృహన్నలా, మనం కౌరవులను ఓడించి త్వరగా తిరిగి రావాలి గనక రథాన్ని వేగంగా యుద్ధరంగానికి తోలు!" అన్నాడు.

బృహన్నల అదిలించేసరికి గుర్రాలు వాయువేగాన పరిగెత్తసాగాయి. కొద్ది సేపట్లోనే శ్మశానం వచ్చింది. రథాన్ని శమీవృక్షం దగ్గిరికి చేర్చి బృహన్నల ఉత్తరుడితో, "అవిగో కౌరవబలాలు! చూడు!" అన్నాడు.

సముద్రంలాగావున్న కౌరవసేనను చూడగానే ఉత్తరుడు భయంతో వణికి పోయాడు. అతనికి చేతులూ, కాళ్ళూ చల్లబడి ముచ్చెమటలు పోశాయి.

"బృహన్నలా, ఇంతసేనను దేవతలుకూడా జయించలేరు. నేను ఒంటరి గాణ్ణి ఎలా జయిస్తాను? నా శరీరమంతా గరిబొడుస్తున్నది. రథాన్ని వెంటనే వెనకకు తిప్పు!" అన్నాడు ఉత్తరుడు.

"కుమారా, నీవు భయపడటం చూసి శత్రువులు నవ్వుతున్నారు. కౌరవులతో యుద్ధంచేసి గోవులను విడిపించటానికై బయలుదేరి వచ్చావు; ఆపని పూర్తిచేయకుండా ఇంటికి ఎలాపోతావు? పోతే అక్కడి ఆడవాళ్లంతా నిన్ను చూసి నవ్వరా? కౌరవులను జయిస్తానని వారివద్ద ప్రగల్భాలు పలికావుగదా?" అన్నాడు బృహన్నల.

"కౌరవులు గోవులను తీసుకుపోతే పోనీ, ఆడవాళ్ళు నన్నుచూసి నవ్వితే నవ్వనీ! నేనుమాత్రం ఆ సేనతో యుద్ధంచేయను!" అంటూ ఉత్తరుడు రథం నుంచి కిందికిదూకి పారిపోవనారంభించాడు. అర్జునుడు అతనివెంట పరిగెత్తాడు. వారినిచూసి కౌరవసేనలు నవ్వసాగాయి.

నూరు అంగలలో అర్జునుడు ఉత్తరుణ్ణి అందుకుని అతనిజుట్టు పట్టేసుకున్నాడు. ఉత్తరుడు దణ్ణాలుపెడుతూ, "అమ్మా, బృహన్నలా! నన్ను పోనిచ్చావంటే నీకు బోలెడంత బంగారమూ, రత్నాలూ, పది ఏనుగులూ ఇచ్చుకుంటాను!" అని వేడుకున్నాడు.

"పిరికివాడా, నీకు భయమైతే, ఈ కౌరవులతో నేను యుద్ధంచేస్తాను. నా రథం నడుపు, చాలు! నీకు ఏ అపాయమూ కలగకుండా నేను రక్షిస్తాను!" అంటూ అర్జునుడు ఉత్తరుణ్ణి తెచ్చి రథంలో కూచోబెట్టాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Feb. '58
50
NAYE PAISE
8
AS

అట్టవిూది బొమ్మ

తరవాత అర్జునుడు రథాన్ని శమీవృక్షం వద్ద ఆపి ఉత్తరుడితో, "నాయనా, ఈ చెట్టుపైన పంచపాండవుల ఆయుధాలున్నాయి. నీవు చెట్టెక్కి వాటిని దించి నట్టయితే వాటి సహాయంతో ఈ కౌరవ సేనలను ఓడిస్తాను," అన్నాడు.

"ఈ చెట్టుపైన ఏదో శవం ఉన్నదట. నన్ను శవాన్ని ముట్టుకోమనటం ధర్మమేనా ?" అన్నాడు ఉత్తరుడు. "మత్స్యరాజు కొడుకువు—నీకు కూడని పని చెబుతానా ? అక్కడ శవంలేదు. ఎక్కు," అన్నాడు అర్జునుడు.

ఉత్తరుడు చెట్టెక్కి, పాండవుల అస్త్రాలపైన ఉన్న కప్పు తొలగించి ఆ అస్త్రాలను చూచి ఆశ్చర్యపోయాడు. అర్జునుడు ఆ అస్త్రాలు ఎవరెవరివో వివ రించి చెప్పి చిట్టచివరకు, "నేనే అర్జునుణ్ణి. వలలుడు భీముడు. కంకుభట్టు ధర్మరాజు. మాలిని ద్రౌపది. అశ్వాలనూ గోవులనూ చూస్తున్నవారు నకుల సహ దేవులు !" అని చెప్పాడు. ఉత్తరుడు నమ్మలేకపోయాడు. అర్జునుడు తనకుగల పదిపేర్లూ చెప్పి, అవి ఎలావచ్చాయో వివరించినప్పుడు ఉత్తరుడికి నమ్మకం కుదిరింది. "రథసారథ్యంలో నేను నిజంగా ఆరితేరినవాణ్ణి. ఆ కనిపించే కౌరవ సేనలో ఏ వేపు రథం తోలమన్నావో చెప్పు!" అన్నాడతను.

"బాణం వేసే దూరంలో రథాన్ని ఆపు. తరవాత ఎటు తోలాలో చెబు తాను!" అన్నాడు అర్జునుడు. శరవేగంతో వచ్చే రథాన్ని కౌరవనాయకులు చూసి, వచ్చేది అర్జునుడని గుర్తించారు. వారిలో తర్జనభర్జనలు జరిగాయి. "ఈ పాండ వులు పన్నెండేళ్ల వనవాసానంతరం ఒక ఏడు పూర్తిగా అజ్ఞాతవాసం చెయ్య కుండానే బయటపడ్డారు. జూద నియమం ప్రకారం తిరిగి పన్నెండేళ్ళు వన వాసమూ, ఒక ఏడు అజ్ఞాతవాసమూ చేయాలి," అన్నాడు దుర్యోధనుడు.

"నీ లెక్క సరికాదు. అజ్ఞాతవాసం పూర్తి కాకపోతే పాండవులు బయట పడరు. ముందు యుద్ధం సంగతి ఆలోచించు," అంటూ భీష్ముడు కౌరవసేనలో యోధులను ఒక్కొక్కచోట ఒక్కొక్కరిని నియోగించి, వ్యూహం తయారుచేశాడు.

రథం కౌరవసేనకు అంతదూరాన నిలబడింది. అర్జునుడు యోధులను కలయజూసి, "అదుగో, దుర్యోధనుడి రథం. మన రథాన్ని సూటిగా ఆటుకేసి తోలు!" అన్నాడు ఉత్తరుడితో. రథం దుర్యోధనుడున్న దిక్కుగా బయలు దేరింది. అర్జునుడు కౌరవసేనలపై బాణాలు కురిపించసాగాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st March '58
50
NAYE PAISE
8
M.T.V.Acharya

అట్టవిూది బొమ్మ

అర్జునుడు నేరుగా దుర్యోధనుడివేపు వెళ్ళుతూఉండటం చూసి, కౌరవ యోధులూ, సైనికులూ దుర్యోధనుడికి అండగా పరిగెత్తారు. ఈలోపల అర్జునుడు గట్టిగా శంఖం పూరించేసరికి విరాటరాజు గోవులమందలు బెదిరి ఇళ్లకేసి పరిగెత్తసాగాయి. యుద్ధంలో ముందుగా కృపాచార్యులు అర్జునుడికి ఎదురు వచ్చాడు. కొద్దిసేపట్లో అర్జునుడు కృపాచార్యుడి రథాన్నీ, గుర్రాలనూ, సారథినీ భగ్నంచేసేశాడు. తరవాత ద్రోణుడు అర్జునుణ్ణి ఎదుర్కొన్నాడు.

ద్రోణుడు తానై బాణాలు వేసేవరకూ అర్జునుడు తన గురువుపై బాణం వెయ్యలేదు. తరవాత ఇద్దరూ భయంకరంగా శస్త్రాస్త్రాలతో యుద్ధం చేసుకున్నారు. ద్రోణుడు ఓడిపోగానే కౌరవసేనలో హాహాకారాలు చెలరేగాయి.

తన తండ్రికి జరిగిన అవమానం సహించలేక అశ్వత్థామ అర్జునుడిపైకి వచ్చి యుద్ధం చేస్తూండగా కర్ణుడు వచ్చాడు.


వెంటనే అర్జునుడు అశ్వత్థామను విడిచి కర్ణుడిపైకి బెబ్బులిలాగా లంఘించి తీవ్రమైన యుద్ధం చేశాడు. కొద్దిసేపట్లోనే కర్ణుడి రొమ్ములో బలంగా బాణం గుచ్చుకున్నది. అతను పారిపోయాడు.

ఇది చూసి చిల్లరయోధులందరూ ఒక్కుమ్మడిగా అర్జునుడిమీదికి వచ్చారు. ఒక్క ఐంద్రాస్త్రంతో అర్జునుడు వారినందరినీ చెల్లాచెదురు చేశాడు.

అది చూసి భీష్ముడు అర్జునుడితో తలపడ్డాడు. ఆయన అర్జునుడి శరీరాన్ని చాలా గాయపరిచాడు, కాని చివరకు ఓడిపోయాడు. తరవాత దుర్యోధనుడు తన ప్రతాపం చూపవచ్చి, గుండెలో బాణం గుచ్చుకోగా వెనక్కు తిరిగి పారిపోయాడు.

యుద్ధం అయిపోయింది. ఉత్తరుడు తన చెల్లెలు కోరిన బొమ్మల గుడ్డలు తీసుకున్నాడు. వారు విరాటనగరానికి బయలుదేరారు. నగరంలో ఈ వార్త తెలిసేసరికి విరాటుడూ, ధర్మరాజూ జూదం ఆడుతున్నారు. "చూశావా? నా కొడుకు కౌరవ యోధులనందరినీ జయించి వస్తున్నాడు!" అన్నాడు విరాటుడు.

"అది బృహన్నలవల్ల కావలసిందేగాని నీ కొడుకువల్ల అయ్యే పని కాదు," అన్నాడు ధర్మరాజు. ఆ మాటకు అలిగి విరాటుడు ధర్మరాజు ముఖంమీద పాచిక విసిరివేశాడు. ధర్మరాజు ముఖంనుంచి రక్తం కారసాగింది. పక్కనే ఉన్న ద్రౌపది తన చీరచెంగుతో ఒత్తి, రక్తం కిందపడకుండా ఆపింది.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
April '58
50
NAYE PAISE
8
AS

అట్టవీరాది బొమ్మ

శత్రువులను సంహరించి విజయోత్సాహంతో ఉత్తరుడు వచ్చి తండ్రికీ, ధర్మరాజుకూ నమస్కారంచేశాడు. విరాటుడు తన కొడుకును, "నాయనా, పసివాడవు ఒంటరిగా ఆ మహాయోధులందరినీ ఎలా జయించావు?" అని అడిగాడు.


"నాన్నగారూ, వారిని జయించినది నేనుకాదు. నేను యుద్ధరంగానికి పోతూఉండగా ఒక దేవతాపురుషుడు వచ్చి రథం ఎక్కి నన్ను సారథిగా పెట్టుకుని, కౌరవయోధులతో పోరి అందరినీ ఓడించాడు! రెండు మూడు రోజులలోగా ఆయన మనకు దర్శనమిస్తాడు!" అని ఉత్తరుడు తండ్రికి జవాబు చెప్పాడు.

ఇది జరిగిన మూడవ రోజున పంచపాండవులు స్నానాలుచేసి మంచి బట్టలు ధరించి, తమ ఆభరణాలన్నీ పెట్టుకుని, విరాటుడి కొలువుకూటానికి వెళ్లి, అక్కడ రాజకుటుంబంవారి ఆసనాలలో కూచున్నారు. కొంతసేపటికి అక్కడికి విరాటుడు వచ్చి వారిని చూసి మొదట ఆశ్చర్యపోయాడు. తరవాత ఆగ్రహంతో ధర్మరాజుకేసి చూసి, "ఓ కంకుభట్టా, నాతో జూదం ఆడటానికి కుదిరినవాడివి మా ఆసనాలలో కూచున్నావేమిటి?" అని అడిగాడు. వెంటనే అర్జునుడు, "ఓ రాజా, ఈయన పాండవాగ్రజుడైన ధర్మరాజు. ఈయనకు నీ సింహాసనంకూడా చాలదు," అన్నాడు.

విరాటరాజు నివ్వెరపడి, "ఈయన ధర్మరాజైతే మిగిలిన పాండవులెక్కడ?" అని అడిగాడు. "రాజా నీ వంటలవాడు భీముడు, మీ కీచకుణ్ణి చంపింది ఇతనే. నీ అశ్వపాలకుడు నకులుడు, గోపాలకుడు సహదేవుడు. సైరంధ్రి ద్రౌపది!" అని అర్జునుడు చెప్పాడు. తరవాత ఉత్తరుడు అర్జునుణ్ణి తండ్రికి ఎరుకపరిచాడు.

విరాటరాజుకు చాలా పశ్చాత్తాపం కలిగింది. తాను పంచపాండవులచేత సేవ చేయించుకోవటమేగాక, వారివల్ల యుద్ధంలో చాలా సహాయం పొందాడు. అందుచేత ఆయన వారిని మంచిచేసుకునేనిమిత్తం తన కుమార్తె అయిన ఉత్తరను అర్జునుడి కొడుకైన అభిమన్యుడికి ఇచ్చి పెళ్లిచేస్తానన్నాడు.

ద్వారకనుంచి అభిమన్యుడూ, అతనివెంట కృష్ణ బలరామ సాత్యకి మొదలైనవారూ వచ్చారు. ఉత్తరాభిమన్యుల వివాహం వైభవంగా జరిగింది.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '58
50
8

అట్టమీది బొమ్మ

అభిమన్యుడికీ ఉత్తరకూ వివాహం ముగియగానే పెళ్ళికి వచ్చిన పెద్దలూ, పిన్నలూ విరాటరాజు సభాభవనంలో సమావేశమయారు. విరాటుడూ, ద్రుపదుడూ, వాసుదేవుడూ మొదలుగాగల పెద్దలు మధ్య కూర్చున్నారు. ఒక పక్కగా పాండవులూ, కృష్ణుడూ, బలరాముడూ, సాత్యకీ మొదలైనవారు కూచున్నారు.

కొంతసేపు ఇష్టాగోష్ఠి నడిచాక కృష్ణుడు లేచి, "పాండవులు కపట జూదంలో తమ రాజ్యాన్ని పోగొట్టుకుని పన్నెండేళ్ళు అరణ్యవాసమూ, ఒక ఏడు అజ్ఞాతవాసమూ అనుభవించారు. ఇప్పుడు వారిరాజ్యం వారికి తిరిగి రావలిసి ఉన్నది. అటు కౌరవులకూ, ఇటు పాండవులకూ నష్టం జరగకుండా ధర్మ సమ్మతంగా పని జరిగే ఉపాయం ఆలోచించండి. దుర్యోధనుడు పాండవులకు రాజ్యంలో సగభాగం ఇవ్వకపోతే యుద్ధం జరుగుతుంది, అందులో కౌరవులు అకారణంగా చనిపోతారు," అన్నాడు.


వెంటనే బలరాముడు లేచి, "అవును, యుద్ధం జరగకుండా పాండవులకు రాజ్యం రావాలంటే మనం దుర్యోధనుడి వద్దకు ఒక దూతను పంపాలి. ఆ దూత ధృతరాష్ట్ర శకుని దుర్యోధనాదులతో అతి వినయంగా మాట్లాడి, వారి అనుగ్రహం సంపాదించి పాండవులకు వారి రాజ్యాన్ని రాబట్టాలి," అన్నాడు.

ఈ మాటలు విని సాత్యకి మండిపడి, "పాండవుల దూత వెళ్ళి కౌరవులకు సాష్టాంగపడవలసిన అవసరంలేదు. ధర్మరాజుకు కౌరవులు అర్ధరాజ్యం ఇవ్వనిపక్షంలో మేమంతా కలిసి యుద్ధంలో వారిని సర్వనాశనం చెయ్యగలం!" అన్నాడు. వృద్ధుడైన ద్రుపదుడు సాత్యకినే బలపరిచాడు. "నా పురోహితుడు ధృతరాష్ట్ర భీష్మ ద్రోణులను బాగాఎరిగినవాడు. అతనిని దూతగా పంపుదాము. అంతేకాదు, ధర్మరాజు ముందుగానే నానాదేశాలకు మనుషులను పంపి, యుద్ధం జరిగే పక్షంలో తన పక్షాన పోరాడమని విజ్ఞప్తి చేయటం మంచిది," అని సలహా ఇచ్చాడు. కృష్ణుడు ఈ సలహాను బలపరిచాడు.

తరవాత కృష్ణుడు మొదలైన వారు తమ ఇళ్ళకు బయలుదేరి పోయారు. సభలో పాల్గొన్న రాజులందరూ యుద్ధప్రయత్నాలు సాగించారు. ద్రుపదుడు తన పురోహితుడికి చెప్పవలసిన విషయాలన్నీ చెప్పి ధృతరాష్ట్రుడి వద్దకు రాయబారం పంపాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st June '58

50 NAYE PAISE

అట్టి వారి ది బొమ్మ

ద్రుపదుడి పురోహితుడు హస్తినాపురానికి బయలుదేరగానే పాండవులు, రానున్న యుద్ధంలో తమ పక్షాన ఉండమని కోరుతూ అనేకమంది రాజులవద్దకు దూతలను పంపారు. కృష్ణుడి సహాయం వేడటానికిగాను అర్జునుడు స్వయంగా ద్వారకకు బయలుదేరాడు.

పాండవుల యుద్ధ యత్నాలు వేగులద్వారా తెలుసుకుంటూ ఉన్న దుర్యోధనుడుకూడా కృష్ణుడి సహాయం కోరటానికి స్వయంగా ద్వారకకు బయలుదేరాడు. అర్జున దుర్యోధనులు ఒకరోజే ద్వారక చేరారు. దుర్యోధనుడు కృష్ణుడి మందిరంలోకి కొంచెం ముందుగా అడుగు పెట్టాడు. కృష్ణుడు నిద్ర పోతూ ఉండటంవల్ల, ఆయన తల వేపున ఉన్న ఆసనంలో దుర్యోధనుడు కూచున్నాడు. మరి కాస్సేపటికి అర్జునుడు వచ్చి కృష్ణుడి కాళ్ళదగ్గిర నిలబడ్డాడు.


కృష్ణుడు నిద్రలేస్తూనే అర్జునుణ్ణి చూసి తరవాత దుర్యోధనుణ్ణి చూశాడు. ఆయన వారిద్దరినీ సమంగా ఆదరించి వచ్చిన పని అడిగాడు. దుర్యోధనుడు తాను వచ్చిన పని చెప్పి, "దేవా, నీకు పక్షపాతం లేదు. నేనూ, అర్జునుడూ ఒకటే. కాని ముందుగా వచ్చినవాణ్ణి నేను. అర్జునుడు నా తరవాత వచ్చాడు. అందుచేత నాకు సహాయం చెయ్యటం ధర్మం," అన్నాడు.

"ముందుగా నేను అర్జునుణ్ణి చూశాను. అందుచేత మీ ఇద్దరికీ సమంగా సహాయం చేస్తాను. నేను అస్త్రం ధరించను. కాని అస్త్రశస్త్రాలతో పోరేవారు నా కింద పదిలక్షలమంది నారాయణులు ఉన్నారు. వారు ఒక వేపూ నేను ఒక వేపూ ఉంటాం," అన్నాడు కృష్ణుడు.

అర్జునుడు కృష్ణుణ్ణి కోరుకున్నాడు. దుర్యోధనుడు నారాయణులను కోరుకున్నాడు. తరవాత దుర్యోధనుడు బలరాముని వద్దకు వెళ్లి సహాయం కోరాడు. కాని బలరాముడు తాను ఏపక్షానా చేరనని చెప్పాడు. కృతవర్మ దుర్యోధనుడికి ఒక అక్షౌహిణీ సేన ఇచ్చాడు.

దుర్యోధనుడు వెళ్లిపోయాక కృష్ణుడు అర్జునుడితో, "పది లక్షలమంది నారాయణులను కోరక, అస్త్రం పట్టని నన్నెందుకు కోరుకున్నావు?" అన్నాడు.

"దేవా, నీవు యుద్ధంచేస్తే నాకేమి ఖ్యాతివస్తుంది. యుద్ధంలో నీవు నాకు సారథివిగా ఉంటే అదే నాకుచాలు!" అన్నాడు అర్జునుడు. కృష్ణుడు సమ్మతించాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st July '58
50
NAYE PAISE
8
AS

అట్టివిూదిబొమ్మ


యుద్ధంలో తనకు సహాయం చెయ్యమని ధర్మరాజు ఆహ్వానాలు పంపిన వారిలో మద్రదేశపు రాజూ, నకులసహదేవుల మేనమామా అయిన శల్యుడొకడు. ఆయన తన అక్షౌహిణీ సేనతో, తన కుమారులతో, సేనాపతులతో ధర్మరాజును చేరవస్తూండగా ఆ వార్త దుర్యోధనుడికి తెలియవచ్చింది. ఆయనను తన పక్షానికి తిప్పుకునేటందుకు దుర్యోధనుడొక యుక్తి పన్నాడు.

అతను స్వయంగా పూనుకుని దారివెంట శల్యుడికి మజిలీస్థలాలలో అద్భుతమైన విడిది ఏర్పాట్లు చేయించి, ఆయనకూ ఆయన పరివారానికీ సమస్త సౌకర్యాలూ కలగజేశాడు. తనకీ ఇంద్రవైభోగం సమకూర్చుతున్నవాడు ధర్మరాజే అనుకుని శల్యుడు ఒకనాడు తన పరిజనులతో, "మనకీ సదుపాయాలు చేస్తున్న వారెవరు? వారికి కోరిన బహుమానం ఇయ్యదలిచాను," అన్నాడు.

ఈ వార్త తెలియగానే దుర్యోధనుడు శల్యుడి ఎదటకు వచ్చి, ప్రేమతో ఆలింగనం చేసుకుని, "మహాత్మా, మీరు నా సైన్యాలకొక సేనాపతిగా ఉండాలి. ఇదే నా కోరిక!" అన్నాడు, "ఆడినమాట తప్పను. నీ కోరిక ప్రకారం నీ సైన్యాలను నడుపుతాను. కాని ముందుగా నేనొకసారి పాండవులను చూసి రావాలి," అన్నాడు శల్యుడు. ఇందుకు దుర్యోధనుడు సమ్మతించి, హస్తినా పురానికి వెళ్ళిపోయాడు.

శల్యుడు ఉపప్లావ్యానికి వెళ్ళి పంచపాండవులను చూశాడు. ధర్మరాజు ఆయనకు స్వాగతమిచ్చి ఎంతో గౌరవించాడు. శల్యుడు ధర్మరాజును పరామర్శించి, "మాయాజూదంలో ఓడిపోయి మీరు పడరాని ఇక్కట్లు పడ్డారు. తిరిగి మీకు న్యాయం జరుగుతుంది. రాగల యుద్ధంలో మీకు జయం తప్పక సిద్ధిస్తుంది," అంటూ, తాను దుర్యోధనుడికి మాటఇవ్వటం గురించి చెప్పాడు.

"పెద్దలు అన్నమాట నిలబెట్టుకోవటం ధర్మమే. కాని మీరు నన్ను మన్నించి నా కోరిక ఒకటి నెరవేర్చాలి. యుద్ధంలో కృష్ణార్జునులు పోరాడుతారు. అర్జునుడికి కృష్ణుడు సారథి. కౌరవబలాలలో మిమ్మల్ని మించిన సారథి లేడు. అందుచేత మీరు కర్ణుడికి సారథ్యం చెయ్యవలసి వస్తుంది. అప్పుడు మీరు ఎలాగైనా అర్జునుడు గెలవటానికి తగిన సహాయం చేయాలి!" అని ధర్మరాజు శల్యుణ్ణి వేడుకున్నాడు. శల్యుడు అలాగే చేస్తానని ధర్మరాజుకు మాటఇచ్చాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st August '58
50
NAYE PAISE
8
AS

అట్టి వివాదిబొమ్మ

కౌరవ పాండవుల మధ్య జరగబోయే యుద్ధంలో పోరాడటానికి రాజులందరూ తమ సైన్యాలతో వచ్చి చేరారు. కౌరవుల పక్షాన పదకొండు అక్షౌహిణీల సేనా, పాండవుల పక్షాన ఏడు అక్షౌహిణీల సేనా చేరింది.

ఈలోపుగా సంధిరాయబారంమీద పాండవులు పంపిన ద్రుపదపురోహితుడు ధృతరాష్ట్రుడి సభకు వచ్చి, పాండవుల కివ్వవలసిన రాజ్యభాగం వెంటనే ఇచ్చి సఖ్యంచేసుకోమనీ, యుద్ధానికి దిగితే కౌరవులకు నష్టం కలుగుతుందనీ చెప్పాడు.

"ఈ విషయం నేను ఆలోచించి సంజయుడిద్వారా పాండవులకు సమాధానం పంపుతాను!" అని చెప్పి ధృతరాష్ట్రుడు ద్రుపదపురోహితుణ్ణి పంపేశాడు. తరవాత సంజయుడు పాండవులవద్దకు వచ్చి ధర్మరాజుతో యుద్ధప్రయత్నం మానుకోమన్నాడు.

"దుర్యోధనుడు మా రాజ్యాన్ని మాకు మంచిగా ఇచ్చేస్తే యుద్ధం చెయ్యము. కాని అతడు లోభి అయి అందుకు నిరాకరిస్తే తప్పక యుద్ధంలో ఓడించి మాకు రావలసినది తీసుకుంటాము," అన్నాడు ధర్మరాజు. కృష్ణుడు కూడా ధర్మరాజును బలపరిచాడు. ఆఖరు మాటగా ధర్మరాజు అయిదుఊళ్ళు కోరాడు. వాటిలో నాలుగు కుశస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం. అయిదవది దుర్యోధనుడికే వదిలాడు.

సంజయుడు హస్తినాపురానికి తిరిగి పోయి ధృతరాష్ట్రుడితో జరిగిన సంగతి చెప్పాడు. ఆ రాత్రి ధృతరాష్ట్రుడికి నిద్ర రాలేదు. విదురుణ్ణి పిలిపించాడు. విదురుడు ఆయనకు అనేక నీతులు బోధించాడు.

మర్నాడు సభలో సంజయుడు పాండవులు పంపిన సందేశాన్ని దుర్యోధనాదులకు తెలిపాడు. భీష్మద్రోణులు యుద్ధంవల్ల కీడు కలుగుతుందనీ, అర్జునుణ్ణి ఎవరూ గెలవలేరనీ అన్నారు. తానొక్కడే పాండవబలాలను నాశనం చెయ్యగలనని కర్ణుడు ప్రగల్భాలాడాడు. భీష్ముడు అతనిని మందలించాడు. కర్ణుడు అలిగి, "నువు బతికిఉండగా నేను ఆయుధం పట్టను," అని భీష్ముడితో ప్రతిజ్ఞచేసి సభనుంచి వెళ్ళిపోయాడు. దుర్యోధను డిది చూసి అలిగి భీష్ముడితో, "నేను మిమ్మల్నందర్నీ నమ్ముకుని యుద్ధానికి దిగటం లేదు. నేనూ, కర్ణుడూ, దుశ్శాసనుడూ కలిసి పాండవులను చంపగలం," అన్నాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టి వినోదిబొమ్మ

సంజయుడు హస్తినాపురానికి బయలుదేరి వెళ్ళిపోగానే ధర్మరాజు కృష్ణుడితో, "దేవా, ఇప్పుడు మాకు కర్తవ్య మేమిటో నీవే చెప్పాలి. రాజ్యం ఇవ్వకుండానే యుద్ధం మానమని సంజయుడు అడిగాడు. నేను కేవలం అయిదు ఊళ్లే అడిగాను. యుద్ధం చేసి రక్తపాతం చెయ్యటం నాకిష్టం లేదు," అన్నాడు.

దానికి కృష్ణుడు, "ధర్మరాజా, భిక్ష కోరటం క్షత్రియ ధర్మం కాదు. నేను వారివద్దకు రాయబారం వెళ్లి మంచిగా మీ రాజ్యభాగం ఇమ్మని అడుగుతాను. కాని అందువల్ల ప్రయోజనం ఉండదని నా అనుమానం. మంచి మాటలతో పని జరగకపోతే యుద్ధంలో మీకు కలగబోయే విజయాన్నీ, మీ ధర్మాన్నీ వివరించి, దుర్యోధనుడి పక్షాన పోరవచ్చినవారి మనసులు మారుస్తాను," అన్నాడు.

అప్పుడు భీముడు, "కృష్ణా, యుద్ధం మాటలతో దుర్యోధనుణ్ణి బెదరగొట్టకు. వీలయినంతవరకు మంచిగా పని జరిగేటట్టు చూడు!" అన్నాడు. భీముడి సౌమ్యం చూసి కృష్ణుడు నిర్ఘాంతపోయాడు. భీముణ్ణి రెచ్చగొట్టటానికాయన సూటీ పోటి మాటలన్నాడు. "నేను భయపడి సంధి కోరుతున్నాననుకుంటున్నావా ? యుద్ధంలో ఆ కౌరవాధముల నందరినీ చీల్చి చెండాడేస్తాను. నా బలపరాక్రమాలు నీవే చూస్తావు!" అని ఆర్భాటం చేశాడు భీముడు.

తరవాత అర్జునుడుకూడా తాను ధర్మరాజుతో ఏకీభవిస్తున్నాననీ, సంధి సాధ్యంకాని పక్షంలో కృష్ణుడు తన యిచ్ఛానుసారం మాట్లాడాలనీ అన్నాడు. నకులుడుకూడా సౌమ్యంగానే మాట్లాడాడు.

కాని సహదేవుడు మాత్రం, "నాకు ధర్మంతో పనిలేదు. కౌరవులు శాంతినే కోరినా మేము యుద్ధంచేసి వారిని నాశనంచేస్తామని చెప్పు!" అన్నాడు. సాత్యకి సహదేవుణ్ణి బలపరిచాడు. పాండవుల పక్షాన పోరవచ్చిన రాజులందరూ యుద్ధోద్రేకంతోనే మాట్లాడారు.

ఆఖరుకు ద్రౌపది తన జుట్టును కుడిచేత పట్టుకుని కంట నీరుకార్చుతూ కృష్ణుడి వద్దకు వచ్చి తాను పడిన కష్టాలన్నీ చెప్పుకుని, "నాకు అంత అవమానం చేసిన ఆ దుర్మార్గులింకా బతికేఉన్నారు. వారు చచ్చేలాగు చూడు!" అని ఏడ్చింది. "అమ్మా, ఏడవకు. నీ యేడుపుకు వేయింతలు వారి స్త్రీలు ఏడవటం నీవే చూస్తావు! నా మాట నమ్ము!" అని కృష్ణు డామెను ఓదార్చాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st Oct. '58

50 NAYE PAISE 8 AS

అట్టవిగాదిబొమ్మ

కార్తీకమాసంలో ఒకనాటి ఉదయం కృష్ణుడు హస్తినాపురానికి పాండవుల రాయబారిగా బయలుదేరాడు. దారుకుడు సారథిగా గల కృష్ణుడి రథంలో అనేక ఆయుధాలు పెట్టుకుని కృష్ణ సాత్యకులు ఎక్కి కూచున్నారు. పాండవులూ తదితరులూ కృష్ణుణ్ణి కొంతదూరం సాగనంపారు.


మధ్యదారిలో కృష్ణుడు వృకస్థలంలో మజిలీ చేశాడు. ఈ సంగతి తెలిసి ధృతరాష్ట్రుడు, వృకస్థలంనుంచి హస్తినాపురానికి వచ్చే మార్గంలో కృష్ణుడికి సన్మానాలు చేయటానికి అనేక ఏర్పాట్లు చేశాడు. కాని కృష్ణుడు వాటి చాయలకు పోక నేరుగా హస్తినాపురానికి వచ్చేశాడు.

కృష్ణుడు హస్తినాపురానికి వస్తూనే ధృతరాష్ట్రుడి కొలువుకూటానికి వెళ్లాడు. అక్కడ ఆయన భీష్మద్రోణ కృపాశ్వత్థామలతోనూ ఇతరులతోనూ కులాసాగా కొంతసేపు ప్రసంగించి, ధృతరాష్ట్రుడివద్ద సెలవు తీసుకుని విదురుడి ఇంట బస చెయ్యటానికి వెళ్ళాడు. ఆ మధ్యాన్నం ఆయన కుంతీదేవిని చూడబోయాడు. కుంతీదేవి తన కొడుకులు పడ్డ శ్రమలన్నీ తలుచుకుని ఏడ్చింది. కృష్ణుడామెను ఊరడించి పాండవులకు మంచికాలం రాబోతున్నదని చెప్పాడు.

కుంతీదేవి ఇంటినుంచి కృష్ణుడు దుర్యోధనుడి సభాభవనానికి వెళ్ళాడు. దుర్యోధనుడు కృష్ణుడికి చేయవలసిన మర్యాదలన్నీ చేసి తనవెంట భోజనం చెయ్యమన్నాడు. కాని కృష్ణుడు ఒప్పుకోక, విదురుడి ఇంట భోజనం చేసి రాత్రికి అక్కడే పడుకున్నాడు.


మర్నాడు కృష్ణుడు లేచి కాలకృత్యాలు తీర్చుకుని కౌరవ సభకు వెళ్లాడు. సభలో పెద్దలందరూ ఉన్నారు. కృష్ణుడికి ఉచితాసనం ఇచ్చారు. అందరూ వింటూండగా ఆయన ధృతరాష్ట్రుడితో తన రాయబారం చెప్పాడు: "ఇప్పటికే నీవు గొప్ప చక్రవర్తివి. పాండవులతో పొత్తు చేసుకుని వారినికూడా నీ బలగంలో చేర్చుకుంటే నీకేసి దేవతలుకూడా తేరిపారచూడలేరు. అలాకాక యుద్ధం జరిగితే ఇక్కడ వున్న రాజులందరూ మరణిస్తారు," అన్నాడు కృష్ణుడు.

ధృతరాష్ట్రుడూ, భీష్ముడూకూడా దుర్యోధనుడికి హితం చెప్పారు. అంతా విని దుర్యోధనుడు, "నేనా పాండవులకు సూదిమొన మోపినంత భూమికూడా ఇవ్వను!" అని చెప్పి, శకుని కర్ణ దుశ్శాసనులతో సభనుంచి వెళ్లిపోయాడు.


చందమామ
దీపావళి సంచిక
50
NAYE
PAISE

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టివిూదిబొమ్మ

దుర్యోధనాదులు వెళ్ళిపోయాక కృష్ణుడు కౌరవసభలోని పెద్దలతో, "ఒక్క దుర్యోధనుడికోసరం ఇక్కడ చేరిన రాజులందరూ యుద్ధానికి బలి కావటం ధర్మం కాదు. దుర్యోధనుని మీరు పెడరెక్కలు కట్టి బంధించి పాండవులకు వప్పగించి వారితో సంధి చేసుకోండి," అని చెప్పాడు.

శకుని కర్ణులతో దుర్యోధనుడు మంత్రాంగం ఆలోచించే సమయంలో దుశ్శాసనుడు, "నిన్ను బంధించి పాండవులకు వప్పగించుతారట. మా ముగ్గుర్ని కూడా అలాగే చేస్తారేమో!" అన్నాడు.

దుర్యోధనుడు మండిపడి, "ఈలోగా మనమే ఆ కృష్ణుణ్ణి బంధించుదాం. అంతటితో పాండవులు మతిపోయి, అరణ్యాలలోకి పారిపోతారు!" అన్నాడు.

దుష్టచతుష్టయం చేసే ఆలోచన సాత్యకికి తెలిసింది. అతను తమ పరివారాన్ని సభాద్వారంవద్దకు వచ్చే ఏర్పాటు చేసి, సభలోకి వెళ్ళి కృష్ణుడితో, "దుష్టచతుష్టయం నిన్ను బంధించే ఆలోచన చేస్తున్నారు!" అని చెప్పాడు.

పెద్దలంతా కంగారుపడ్డారు. వారు దుర్యోధనుడికోసం కబురు చేసి పిలిపించారు. కృష్ణుడు దుర్యోధనుడితో, "నేను దుర్బలుణ్ణి అనుకుని నన్ను బంధించటానికి ప్రయత్నిస్తున్నావా? నా విశ్వరూపం చూడు!" అంటూ సమస్త లోకాలనూ, దేవగణాలనూ, ఆదిత్యులనూ, ఋషిగణాలనూ తనలో చూపాడు. గుడ్డివాడైన ధృతరాష్ట్రుడుకూడా విశ్వరూపాన్ని చూడగలిగాడు.

తరవాత కృష్ణుడు సభనుంచి బయటికి వచ్చాడు. ఆయన కుంతిని చూసి ఆమెవద్ద సెలవు పుచ్చుకుని, భీష్మద్రోణాదులందరికీ వీడ్కోలు చెప్పి, రథం ఎక్కుతూ కర్ణుణ్ణి తనవెంట ఎక్కించుకున్నాడు.


రథం నిర్జన ప్రదేశాన్ని చేరుకున్నాక కృష్ణుడు కర్ణుడితో, "నీవు కుంతి పెద్దకుమారుడవు. పాండవులు నీకు తమ్ములు. అందుచేత నాతో వచ్చేసి నీ తమ్ములతో చేరిపో. వారు నిన్ను తమ తండ్రిలాగా గౌరవిస్తారు," అన్నాడు.

కర్ణుడు "దేవా, నన్ను చేరదీసి పెంచిన తల్లిదండ్రులనూ, నన్నే నమ్ముకుని యుద్ధానికి దిగుతున్న దుర్యోధనుణ్ణీ కాదని పాండవుల పక్షానికి రాలేను. వారికి యుద్ధంలో విజయం లభించేటట్టుగా చెయ్యి. అదే నా కోరిక!" అన్నాడు.

తరవాత కృష్ణుడు కర్ణుడికి వీడ్కోలు చెప్పి పాండవులవద్దకు తిరిగి వచ్చాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st Jan. '59

50 PAISE

అట్టి విూ ది బొ మ్మ

కృష్ణుడు వెళ్లిపోగానే విదురుడు కుంతీదేవి వద్దకు వెళ్లి, "అమ్మా, నేను ఏది వద్దనుకున్నానో అదే జరగబోతున్నది. యుద్ధం జరిగితీరుతుంది," అన్నాడు.

అప్పుడు కుంతీదేవి తనలో ఈ విధంగా ఆలోచించుకున్నది : "యుద్ధం చాలా ప్రమాదకరమే. దుర్యోధనుడి పక్షాన భీష్మ ద్రోణ కర్ణులు పోరాడతారు. అయితే భీష్మ ద్రోణులకు నా కొడుకులపై ఆదరాభిమానాలున్నాయి; ఒక్క కర్ణుడే నా కొడుకులపైన పగపట్టి ఉన్నాడు. వాణ్ణి ఎలాగైనా ప్రసన్నుణ్ణి చేయ గలిగితే బాగుండును. వాడూ నా కొడుకేగదా ! ఆ సంగతి వాడితో చెప్పేస్తాను !"

ఇలా ఆలోచించుకుని కుంతి భాగీరథీతీరానికి ప్రయాణమై వెళ్లింది. అక్కడ కర్ణుడు స్నానంచేసి, తూర్పుగా తిరిగి, చేతులు పైకెత్తి జపంచేసు కుంటూ ఆమెకు కనిపించాడు. కుంతీదేవి అతని వెనుకగా కూర్చున్నది.

కర్ణుడు తన జపం పూర్తిచేసి కుంతిని చూసి, భక్తితో నమస్కారంచేసి, "దేవీ, ఏ పనిమీద వచ్చావు ? నావల్ల ఏంకావాలి ?" అన్నాడు.


"నాయనా, నువు కుంతి కొడుకువుకావా ? రాధ కొడుకునని ఎందు కంటావు ? రాధ నిన్ను మోసికన్నదా ? నేను కన్యగా ఉన్నప్పుడే సూర్యుడి దయవల్ల నిన్ను కన్నాను. పూర్వం అర్జునుడు గెలిచిన రాజ్యాన్నంతా కౌరవులు కాజేశారు. ఆ రాజ్యాన్ని నీ తమ్ములైన పాండవులతో కలిసి నువే ఏలుకో, బాబూ ! బలరామకృష్ణులలాగా మీరు సఖ్యంగా ఉండండి," అన్నది కుంతీదేవి.

"అమ్మా, సూతుడుగా పెరిగిన నన్నిప్పుడు క్షత్రియుణ్ణి కమ్మంటే కాగలనా ? నీ మాటలు విని పాండవులతో చేరిపోతే నన్ను పిరికివాడని లోకం ఆడిపొయ్యదా ? నాకు కౌరవులు చెయ్యని మర్యాదలేదు. నన్ను చూసి దుర్యో ధనుడు యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. నే నతని పక్షాన పోరాడితీరుతాను. నీ కొడుకులలో అర్జునుడు తప్ప మరెవ్వరి ప్రాణాలూ తీయనని అభయం ఇస్తు న్నాను. యుద్ధంలో నేనో అర్జునుడో చచ్చితీరాలి. అర్జునుడుపోతే నేను నీ కొడుకులలో ఒకడినవుతాను. నేనుపోయినా, అర్జునుడుపోయినా నీకు అయిదు గురు కొడుకులుంటారులే !" అన్నాడు కర్ణుడు.

"నాయనా, విధి నీచేత ఇలా మాట్లాడిస్తున్నది. దాన్ని ఎవరు తప్పించ గలరు ?" అని కుంతి కర్ణుణ్ణి దీవించి తన ఇంటికి తిరిగివచ్చింది

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టి వీరాధివీరో వస్తు

కృష్ణుడు హస్తినాపురం నుంచి ఉపప్లావ్యానికి తిరిగి వచ్చి పాండవసభలో తన రాయబారం విఫలమైనట్టు చెప్పి, "అప్పుడే కౌరవులు తమ పదకొండు అక్షౌహిణుల సేనలతో కురుక్షేత్రానికి వెళ్ళారు. భీష్ముణ్ణి వారు తమ సర్వసేనానిగా పెట్టుకున్నారు. కనుక మీరుకూడా వెంటనే కర్తవ్యం నిర్ణయించండి!" అన్నాడు.


ధర్మరాజు సభలోని వారితో, "మనకు ఏడు అక్షౌహిణీల సేనవున్నది. ఆ ఏడు అక్షౌహిణీలకూ ఏడుగురు యోధులు—విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, చేకితానుడు, భీముడు—సేనానాయకులుగా వుంటే బాగుంటుందని నా అభిప్రాయం. సర్వసేనానిగా వుండటానికి ఎవరు తగుదురో నిర్ణయించండి!" అన్నాడు.

అర్జునుడు ధృష్టద్యుమ్నుణ్ణి సర్వసేనానిగా వుంచితే బాగుంటుందనీ, అతను అస్త్రవిద్యలోనూ, యుద్ధనైపుణ్యంలోనూ భీష్ముడితో అన్నివిధాలా తుల తూగగలవాడనీ అన్నాడు.

అర్జునుడి అభిప్రాయాన్ని కృష్ణుడుకూడా బలపరిచినమీదట రాజులందరూ ఈ నిర్ణయానికి తమహర్షాన్ని వెలిబుచ్చారు.

వెంటనే సమరసన్నాహం ప్రారంభమయింది. సైనికులు సంరంభంచేసి ఆయుధాలు మొదలైనవన్నీ తీసుకున్నారు. పాండవసేనకూడా కురుక్షేత్రానికి బయలుదేరింది. సేనకు ముందుగా భీముడూ, నకుల సహదేవులూ, అభిమన్యుడూ, ఉపపాండవులూ, ధృష్టద్యుమ్నుడూ మొదలైనవారు కదిలారు. సేన మధ్యలో ధర్మరాజున్నాడు.

ఈ సేన కురుక్షేత్రం చేరగానే సైనికశిబిరాలకు యోగ్యమైన చోటు చూశారు. హిరణ్వతీ నదీతీరాన మంచి రేవులున్నచోట, శుచి అయిన సమ ప్రదేశంలో శిబిరాలు నిర్మించ నిశ్చయించారు. కృష్ణుడు శిబిరాలచుట్టూ పెద్ద అగడ్త తవ్వించి దానికి సైనికులను కాపలా వుంచాడు. రాజులందరికీ ఒకేవిధమైన గుడారాలు వేశారు. సైనికులూ, శస్త్ర చికిత్సకులూ, ఇతర నౌకరులూ ఎవరి పనులలో వారు నిమగ్నులయారు. సైన్యానికి అవసరమైన కవచాలూ, ఆయుధాలూ, ఆహారసామగ్రీ కొండలంతేసి రాసులుగా అమర్చారు. ధర్మరాజు ప్రతి గుడారానికీ వెళ్ళి అన్ని ఏర్పాట్లూ స్వయంగా పరీక్షించాడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Mar. '59
50
8



శ్రీకృష్ణుడు రాయబారం విఫలమై పాండవుల వద్దకు తిరిగి వెళ్లిపోయాక దుర్యోధనుడు మిగిలిన దుష్టత్రయాన్ని, కర్ణ శకుని దుశ్శాసనులను పిలిపించి వారితో సమాలోచన చేశాడు.

"సంధి చేయవచ్చిన కృష్ణుడు తన పని కొనసాగకుండానే తిరిగి వెళ్లాడుగదా. అతను వెళ్లి పాండవులను బాగా రెచ్చగొడతాడు. అర్జునుడూ భీముడూ అతను ఏం చెయ్యమంటే అది చేస్తారు. ధర్మరాజు వారిని కాదని ఏపనీ చెయ్యడు. పోతే పాండవుల పక్షాన ఉన్నవారిలో విరాటుడూ, ద్రుపదుడూ నాకు ఇంతకు పూర్వమే శత్రువులు. పాండవుల సేనకు గల నాయకులలో వాళ్లు ప్రముఖులు. అందుచేత యుద్ధం తథ్యం. ఇక మనం తాత్సారం చేసేటందుకు ఎంతమాత్రమూ వీలులేదు. వెంటనే సమరసన్నాహాలు సాగించండి. కురుక్షేత్రంలో మనందరికోసమూ అనేక వందల గుడారాలు నిర్మించండి. వాటి నిర్మాణానికి తగిన స్థలం చూడండి. ఆ చోటు శత్రువులకు సులువుగా అందరాదు; జలకాష్ఠ సమృద్ధి కలదిగా ఉండాలి. శిబిరాలకు ఆహారపదార్థాలు చేరే మార్గాలను శత్రువులు ఛేదించకుండా రక్షణలు ఏర్పాటు చేయండి. అన్ని శిబిరాలలోనూ ఆయుధాలు పుష్కలంగా పేర్చండి. హస్తినాపురంనుంచి శిబిరాలకు చదునైన మార్గం వేయించండి. రేపే సేనలు కురుక్షేత్రానికి తరలి వెళ్లాలని చాటించండి," అని దుర్యోధనుడు తన అనుచరులకు ఆదేశించాడు.

శకుని కర్ణ దుశ్శాసనులు వెంటనే యుద్ధసన్నాహాలు ఆరంభించారు. కురుక్షేత్రంలో, దుర్యోధనుడి పక్షాన యుద్ధంచేసే రాజుల కోసం అనేక వేల సంఖ్యలో శిబిరాలు నిర్మించబడ్డాయి. ఇక్కడ హస్తినాపురం

కోలాహలంగా ఉన్నది. దుర్యోధనుడి ఆదేశం వినగానే రాజులందరూ జబ్బలు నిమురుకుని, తలపాగాలు చుట్టుకుని, యుద్ధాలంకారాలు చేయసాగారు. సారథులు రథాలనూ, కాసావాళ్లు గుర్రాలనూ, మావటి వాళ్లు ఏనుగులనూ ఆయత్తపరిచారు. పదాతిసైనికులు ధగధగ మెరిసే కవచాలు తొడుక్కొని, శస్త్రాలు ధరించి యుద్ధసన్నద్ధులయారు. నగరమంతా ఏదో ఉత్సవం జరుగుతున్నట్టుగా కనపడింది. ఎక్కడ చూసినా జనమూ, గుర్రాలూ, ఏనుగులూ, రథాలూ, శంఖనాదాలూ, దుందుభి మోతలూనూ!

ఆ రోజు పాండవ శిబిరంలో ధర్మరాజు రానున్న కులక్షయం గురించి చాలా బాధ పడినవాడై కృష్ణుడితో, "మహాత్మా, మాతల్లి కుంతీదేవి యుద్ధం చెయ్యమంటున్నది. కాని నీ ఉద్దేశం ఏమిటి?" అని అడిగాడు.

దానికి కృష్ణుడు, "ధర్మరాజా, ఈ యుద్ధం మనం కోరి తెచ్చుకున్నది కాదు. దుర్యోధనుడికి చెప్పవలిసినదంతా నేను చెప్పాను, విదురుడూ చెప్పాడు. భీష్మ ద్రోణులు అతని బుద్ధి మార్చలేకపోయారు. శకుని కర్ణాదులు అతని దుర్బుద్ధిని రెచ్చగొట్టారు. అందుకే వంశక్షయానికి దారి తీసే ఈ యుద్ధం వచ్చిపడుతున్నది. దానికి



మనం ఏమి చేయగలం. రాజ్యభాగం ఇవ్వకుండానే మనం సంధి చేసుకోముగదా! ఇక యుద్ధం చెయ్యక ఎలా తప్పుతుంది?" అన్నాడు కృష్ణుడు.


అర్జునుడుకూడా అదే ధోరణిలో మాట్లాడి ధర్మరాజు మనస్సును యుద్ధానికి సుముఖంచేశాడు.

ఆ రాత్రి గడిచింది. మర్నాడు దుర్యోధనుడు తనవెంట ఉన్న పదకొండు అక్షౌహిణుల సేనలో గల చతురంగ బలాలను, ఉత్తమ, మధ్యమ, దుర్బల శాఖలుగా విభజించాడు. ఉత్తమ బలాలు యుద్ధరంగంలో ముందు నిలబడేటట్టూ, మధ్యమ బలాలు మధ్య నిలబడేటట్టూ, దుర్బల బలాలు వెనుక పార్శ్వంలో ఉండేటట్టూ నిర్ణయించాడు.

యుద్ధంలో ఒక రథం దెబ్బతిని దానిలో ఒక భాగం విరిగిపోయినట్టయితే దాన్ని మరమ్మతు చెయ్యటంకోసం అవసరమైన సామగ్రి రథాల అడుగుభాగాన అమర్చారు. రథాల తూణీరాలలో అంబులూ, నూరేసి విల్లులూ ఇతర ఆయుధాలూ, తాళ్లూ, పాశాలూ, జెండాలూ మొదలైనవన్నీ అమర్చారు.

రథసారథులైనవారికి కవచాలుంటాయి. వారు శూరులూ, శస్త్రాలన్నిటినీ తెలిసిన





వారూ, అశ్వలక్షణాలు ఎరిగినవారూ అయి ఉండాలి. అలాటివారిని రథ సారథులుగా నియమించారు. ఒక్కొక్క రథానికీ నాలుగేసి ఉత్తమాశ్వాలను పూన్చారు. ఒక్కొక్క రథం వెంటా ఏడుగురేసి యోధులుంటారు. ఒకడు రథం వెనక సామాను మోసే గుర్రం పైన ఉంటాడు; ఇద్దరు రథసారథులుంటారు, ఇద్దరు యుద్ధం చేసేవారుంటారు, వీరు గాక ఒక రథీ, ఒక అశ్వనిపుణుడూ కూడా ఉంటారు.

ఏనుగులనుకూడా అలంకరించి ఆయత్తం చేశారు. రథం వెంట మాదిరిగానే, ఏనుగు వెంట కూడా ఏడుగురేసి ఉంటారు. వారిలో ఇద్దరు అంకుశాలు పట్టుకునే మావటీలు, ఇద్దరు బాణాలతో యుద్ధం చేసేవారు, ఇద్దరు ఖడ్గధారులు, శక్తులనూ, త్రిశూలాలనూ ధరించిన వాడు ఒకడు. వీరంతా ఏనుగుపైనే ఉంటారు. ఒక్కొక్క అశ్వదళం వెంటా వెయ్యేసి మంది మహాబలవంతులైన యోధులుంటారు.

సైన్యం ఎలా సంఘటితపరచబడిందంటే ఒక్కొక్క రథానికి పదిమంది గజయోధులు, ఒక్కొక్క ఏనుగువెంటా పదేసి గుర్రాలూ, ఒక్కొక్క గుర్రంవెంటా పదేసిమంది కాల్బటులూ ఉన్నారు.

దుర్యోధనుడు తన పదకొండు అక్షౌహిణుల సేనను ఈవిధంగా విభజించి, పదకొండుగురు సేనాపతులను నియమించాడు. వారెవరంటే: కృపుడు, ద్రోణుడు, శల్యుడు, సైంధవుడు, సుదక్షిణుడు, కృతవర్మ, అశ్వత్థామ, భూరిశ్రవసుడు, కర్ణుడు, శకుని, బాహ్లికుడు.

అనంతరం దుర్యోధనుడు రాజులందరి సమక్షాన భీష్ముడికేసి తిరిగి నమస్కరించి, "మహాత్మా, మహాసముద్రంలాటి సేన అయినప్పటికీ తగిన నాయకుడు లేకపోతే చీమలపుట్టలాగా చెదిరిపోతుంది. చిల్లర సేనాపతులమధ్య ఏకాభిప్రాయం కుదరక

పోవచ్చు, అంతఃకలహాలుకూడా ఏర్పడవచ్చు. అందుచేత సమర్థుడైన సర్వసేనాని ఉండటం అవసరం. యుద్ధంలో విజయానికది మొదటి మెట్టు. నీవు గొప్ప నీతిమంతుడవు, మా హితం కోరినవాడివి, ధర్మం తప్పనివాడవు, అజేయుడవు. కావున ఈ సేనలన్నిటికీ సర్వసేనాధిపత్యం వహించమని నిన్ను వేడుకుంటున్నాను. నీవు వృషభరాజులాగా ముందు నడిస్తే మేము గోవుల మందలాగా నిన్ను అనుసరించి వస్తాము!" అన్నాడు వినయంగా.

దానికి భీష్ముడు ఇలా చెప్పాడు: "నాయనా, నువ్వన్నమాటలలో కొంత నిజం లేకపోలేదు. పాండవసేనలో నాతో సమంగా పోరగలవాడు అర్జునుడు తప్ప మరొకడు లేడు. వాడివద్ద అనేక దివ్యాస్త్రాలున్నాయి. వాడు నాతో ఇంతవరకెన్నడూ ముఖాముఖి యుద్ధం చేయలేదు. మేమిద్దరమూ ఒకరినొకరు ఎదిరించి మా కుగల దివ్యాస్త్రాలన్నీ ప్రయోగించినట్లయితే భూమి నిర్మానుష్యమైపోగలదు. అయితే నాకు మీరెంతో పాండవులూ అంతే. నేను వారిని యుద్ధంలో చంపటమనేది జరిగే పనికాదు. మిగిలిన యోధులనంటావా, లక్షల సంఖ్యలో చంపేస్తాను. ఇంకొక్క విషయంకూడా ఉన్నది. కర్ణుడూ, నేనూ కలిసి యుద్ధం చెయ్యటం



నా కిష్టంలేదు. ఎందుకంటే అతనికి నేనంటే మాత్సర్యం. అతని అనంతరం నేను యుద్ధం చేస్తాను, లేదా నా అనంతరం అతను యుద్ధం చేయవచ్చు. ఈ రెండు నియమాలూ నీకు సమ్మతమైతే నీసేనలకు సర్వసేనాధిపత్యం వహించగలను."


ఈ మాటలు విని కర్ణుడు, "ముందు మీరే యుద్ధం చెయ్యండి. మీ అనంతరమే నేను యుద్ధంలోకి వస్తాను," అన్నాడు.

తరవాత దుర్యోధనుడు బ్రాహ్మణులకు భారీగా దక్షిణలిచ్చి భీష్ముడికి సర్వసైన్యాధిపత్యాభిషేకం చేశాడు. భేరీలూ, మృదంగాలూ, తప్పెటలూ మొదలైన వాద్యాలు మోగించారు, సింహనాదాలు చేశారు, శంఖాలు పూరించారు, ఏనుగులు ఒక్కపెట్టున ఘీంకరించాయి.

ఇదే సమయంలో కొన్ని దుశ్శకునాలు కూడా కలిగాయి. ఆకాశం నుంచి అశరీరవాక్యాలు వినిపించాయి. మబ్బులు లేకుండానే నెత్తురువాన కురిసింది. పెనుగాలులు వీచాయి. వీటిని చూసి యోధులందరూ భయపడ్డారు.

తరవాత దుర్యోధనుడు తన తమ్ములనూ, భీష్ముణ్ణీ, తదితర రాజులనూ వెంటబెట్టుకుని కురుక్షేత్రానికి బయలుదేరాడు. కురుక్షేత్రంలోని వారి శిబిరాలు చూస్తే హస్తినాపురం మళ్లీ కురుక్షేత్రంలో వెలిసిందా అన్నట్టుగా ఉన్నది.

కౌరవ పాండవుల మధ్య యుద్ధం జరగనున్నట్టు తెలిసి బలరాముడు అక్రూర సాంబ గదాదులను వెంటబెట్టుకుని పాండవుల వద్దకు వచ్చి, ధర్మరాజుతో, "మాకు మీరూ కౌరవులూ సమానులే. మీకూ వారికీ కూడా సమంగా సహాయం చెయ్యమని కృష్ణుడితో చెప్పాను. కాని వాడు మీఎడల పక్షపాతం వహించాడు. నేను కౌరవుల నాశనం చూడలేను; తీర్థయాత్రలు చేయబోతున్నాను!" అని చెప్పి వెళ్లిపోయాడు.



చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st April '59



మహాభారతం

కృష్ణుడి అన్న అయిన బలరాముడు భారత యుద్ధంలో ఏ పక్షానా పోరనని తీర్థయాత్రలకు బయలుదేరివెళ్లిన సమయంలో రుక్మిణి అన్న అయిన రుక్మి ఒక అక్షౌహిణి సేనతో సహా పాండవుల వద్దకు వచ్చాడు. కృష్ణుడు సంతోషిస్తాడుగదా అని ధర్మరాజు అతనికి సమస్త సత్కారాలూ చేశాడు.


తరవాత రుక్మి అందరూ వింటూండగా అర్జునుడితో, "ఈ యుద్ధంలో నేను నీకు సహాయంచేస్తాను, భయపడకు. అసలు ఈ రాజులందరూకూడా అవసరం లేదు. నేను ఒక్కణ్ణే యుద్ధానికి పోయి కృప ద్రోణ కర్ణ భీష్ములందరినీ అవలీలగా వధించగలను!" అని ప్రగల్భాలు పలికాడు.

అర్జునుడు నవ్వి, "నేను ఒంటరిగా లోగడ కౌరవబలాలను జయించాను, ఖాండవదహనమప్పుడు సురాసురులను కూడా జయించాను. అందుచేత నాకు భయమేమీ లేదు. ఇప్పుడైనా నాకు ఒకరి సహాయం లేకపోతే జరగదని లేదు. మీరు కావలిస్తే ఇంకెక్కడికైనా వెళ్లవచ్చు. మాతోనే ఉండటం మీకోరిక అయితే మాకు ఆక్షేపణ ఏమీలేదు!" అన్నాడు.

తరవాత రుక్మి దుర్యోధనుడివద్దకు వెళ్లి అర్జునుడితో చెప్పినట్టే చెప్పాడు. దుర్యోధనుడు అతని సహాయాన్ని నిరాకరించి పంపేశాడు. బలరాముడిలాగే రుక్మికూడా భారతయుద్ధంలో పోరాడలేదు. మిగిలిన రాజులందరూ ఏదో ఒకపక్షాన పోరాడారు.

అక్కడ హస్తినాపురంలో గుడ్డిరాజు ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి పిలిపించి, యుద్ధవార్తలేమిటని అడిగాడు. "సంజయా, ఈ యుద్ధం జరగటం తప్పని తెలిసికూడా మా దుర్యోధనుడి మనసు మరల్చలేక పోయాను గదా! అదేమి చిత్రమో, వాడు నా దగ్గిరికి రాగానే వాడి నిర్ణయాలన్నీ

సరిగానే తోస్తాయి. ఇంతకూ నేనేమి చేయగలను. ఏమి కానున్నదో అది జరిగితీరుతుంది. యుద్ధంలో చావటం క్షత్రియులకు ధర్మమే కదా!" అని ధృతరాష్ట్రుడు చింతాక్రాంతుడయాడు.



దానికి సంజయుడు, "రాజా, తప్పు నీలో ఉంచుకుని దుర్యోధనుడిపైన ఎందుకు వేస్తావు? విధిలో నీకు నమ్మకం ఉన్నట్టయితే అనర్థాలు జరిగినా విచారించకుండా ఉండు!" అని బదులు చెప్పి ఆయనను ఊరడించాడు.

ఈలోపుగా దుర్యోధనుడు కర్ణ శకుని దుశ్శాసనులతో సమాలోచించి, శకుని కొడుకైన ఉలూకుణ్ణి పిలిపించి, "నువ్వు హిరణ్వతీతీరాన ఉండే పాండవశిబిరాలకు వెళ్లి ఒక్కొక్కరితోనూ ఈ విధంగా నా తరపున చెప్పు!" అన్నాడు. ఉలూకుడు ధర్మరాజుతో ఏం చెప్పాలో, కృష్ణుడితో, భీముడితో, అర్జున నకుల సహదేవులతో, ఇతర రాజులతో ఏమేమి చెప్పాలో అంతా వివరంగా దుర్యోధనుడు చెప్పాడు. ఆ మాటలు అహంకారపూరితమైనవి, వినేవారికి రోషం తెప్పించటానికి ఉద్దేశించినవి.

ఉలూకుడు పాండవశిబిరాలకు దూతగా బయలుదేరి వెళ్లి ధర్మరాజుతో, "రాజా, దుర్యోధనుడు మీ అందరికీ చెప్పమన్న మాటలు చెబుతాను. అవి నా మాటలు కావు గనక దయచేసి నాపై ఆగ్రహించవద్దని కోరుతున్నాను!" అంటూ, ఒక్కొక్కరితోనూ దుర్యోధనుడు అనమన్న నిందావాక్యాలు అన్నాడు.

ఆ మాటలు వింటుంటే పాండవులకూ, మిగిలిన రాజులకూ మాత్రమే గాక కృష్ణుడికికూడా పట్టరాని ఆగ్రహం వచ్చింది. అందరి కళ్లూ ఎర్రబడ్డాయి, అనేకమంది పళ్లు పటపటకొరికారు, కొందరు జబ్బలు చరుచుకున్నారు. అందరికీ కౌరవసేనలపైబడి చీల్చిచెండాడాలన్నంత కోపంవచ్చింది.

భీముడు ఉలూకుణ్ణి నానా దుర్భాషలూ ఆడాడు. కాని అర్జునుడు తన అన్నను వారించి ఉలూకుడితో, "దుర్యోధనుడితో అతని కోరిక నెరవేరుతుందని చెప్పు. రేపు ఉదయం యుద్ధానికి సిద్ధంగా ఉండమని చెప్పు!" అన్నాడు. తరవాత పాండవులూ, వారి తరఫున యుద్ధం చేయవచ్చిన రాజులూ వేరువేరుగా దుర్యోధనుడికి చెప్పవలిసిన మాటలను ఉలూకుడితో చెప్పారు. అర్జునుడుమాత్రం దుర్యోధనుడికి ఈ మాట చెప్పమన్నాడు: "తమ పరాక్రమంమీద ఆధారపడి యుద్ధానికి దిగి, యుద్ధంలో ఇతరుల సహాయంపొందే మేము మగతనం గల వాళ్లం. ఇతరుల పరాక్రమంపైన మాత్రమే ఆధారపడి యుద్ధానికి దిగిన నీవు పురుషాధముడవు. కనుకనే పురుషోత్తముడైన భీష్ముణ్ణి బలిచెయ్యటానికీ, కౌరవ కుల నాశనానికీ ఈ యుద్ధం తలపెట్టావు!"

అందరి మాటలూ మోసుకుని ఉలూకుడు వెళ్లిపోయాక ధర్మరాజు తమ సేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుణ్ణి వెంటబెట్టుకుని సేనలను యుద్ధరంగానికి తీసుకువెళ్లాడు. ధృష్టద్యుమ్నుడు తన పక్షాన గల యోధులతో వారు శత్రుపక్షంలో ఎవరెవరిని ఎదుర్కోవాలో నిర్ణయించాడు. కర్ణుడికి అర్జునుడు ప్రతియోధుడు, అలాగే దుర్యో



ధనుడికి భీముడూ, శల్యుడికి ధృష్టకేతుడూ, కృపుడికి ఉత్తమౌజుడూ, అశ్వత్థామకు నకులుడూ, కృతవర్మకు శైబ్యుడూ, సైంధవుడికి యుయుధానుడూ, భీష్ముడికి శిఖండీ, శకునికి సహదేవుడూ, వృషసేనుడికి అభిమన్యుడూ ప్రతియోధులు. ఈ విధంగా నిర్ణయించి ధృష్టద్యుమ్నుడు, "నేను ద్రోణుడికి ప్రతియోధుడుగా ఉంటాను!" అని ప్రకటించాడు. తరవాత అతను తన సేనలను వ్యూహాలుగా అమర్చి యుద్ధారంభం కోసం ఎదురుచూడసాగాడు.

అక్కడ కౌరవశిబిరంలో దుర్యోధనుడు తమ సేనాధిపతి అయిన భీష్ముడితో, "మహాత్మా, మన సేనలోనూ పాండవుల సేనలోనూ గల యోధులలో ఎవరెవరు అతిరథులో, ఎవరెవరు మహారథులో, ఎవరెవరు ఏకరథులో, ఎవరెవరు అర్ధరథులో వివరించు!" అని కోరాడు.

భీష్ముడు ఉభయ సేనలలోనూ గల యోధులు ఏయే శ్రేణికి చెందినవారో, వారు ఈ యుద్ధంలో ఏయే కారణాలచేత ఏపాటి దీక్షతో పోరాడతారో వివరించి చెప్పాడు. తాను స్వయంగా పాండవులను చంపననీ, శిఖండితో యుద్ధంచెయ్యననీ ఆయన తెలిపాడు. అలాగే ద్రోణుడికి అర్జునుడిమీద అత్యంతప్రేమ, తన కొడుకైన అశ్వత్థామ





కంటెకూడా అయనకు అర్జును డెక్కువ, ఎల్లప్పుడూ అర్జునుడి శౌర్యపరాక్రమాలను మెచ్చుకుంటూ ఉంటాడు; అయన అర్జునుణ్ణి చంపడు, శల్యుడు పాండవులకు బంధువే అయినా ఆయన యుద్ధంలో తన మేనల్లుళ్లయిన నకులసహదేవులను మినహాయించి మిగిలిన పాండవులను సయితం చంపటానికి వెనకాడడు.

భీష్ముడు కౌరవపక్షాన గల అతిరథులలో దుర్యోధనుణ్ణీ, అతని తొంభైతొమ్మిదిమంది తమ్ములనూ, కృతవర్మనూ, శల్యుణ్ణీ, భూరిశ్రవుణ్ణీ, సైంధవుణ్ణీ, కృపుణ్ణీ, ద్రోణుణ్ణీ, బాహ్లికుణ్ణీ పేర్కొన్నాడు. అశ్వత్థామ ప్రబల యోధుడైనప్పటికీ అతనికి ప్రాణంతీపి కావటంచేత మహారథుడు మాత్రమే అవుతాడనీ, ఆ లోపం లేకపోతే అతిరథుడయే వాడనీ భీష్ముడన్నాడు. కర్ణుడి కొడుకైన వృషసేనుడూ, అలంబుసుడనే రాక్షసుడూ మహారథులని ఆయన చెప్పాడు; శకునిని ఏకరథుడుగా నిర్ణయించాడు.

అవతల పాండవసేనలో అతిరథులు పంచపాండవులూ, అభిమన్యుడూ, సాత్యకీ, ఉత్తమౌజుడు, యుధామన్యుడు, ధృష్టద్యుమ్నుడు, అతని సోదరుడు సత్యజిత్తుడు, కుంతిభోజుడు, ఘటోత్కచుడు. ద్రౌపది అయిదుగురు కొడుకులైన ఉపపాండవులూ, విరాటుడూ, ద్రుపదుడూ, శిశుపాలుడి కొడుకు ధృష్టకేతుడూ మహారథులు.

అయితే భీష్ముడు కర్ణుణ్ణి గురించి చెబుతూ, "నా ఉద్దేశంలో కర్ణుడు కేవలం అర్ధరథుడు. ఎందుచేతనంటే తన సహజ కవచ కుండలాలను కోల్పోయాడు. అది గాక ఇతనికి పరశురాముడి శాపమూ, బ్రాహ్మణశాపమూ తగిలాయి. ఇతను అర్జునుణ్ణి ఎదుర్కొని మళ్లీ ప్రాణాలతో బయట పడడు!" అని చెప్పాడు.

ఈ మాటలను ద్రోణుడు బలపరుస్తూ, "భీష్మా, నీ మాటలలో కొంచెమైనా అసత్యం

లేదు. ఈ కర్ణుడు యుద్ధారంభంలో అందరికన్న ముందుండి ఉత్సాహంగా పోరాడి, చివరకు యుద్ధ విముఖుడులాగా ప్రవర్తించటం నేను ప్రతి యుద్ధంలోనూ గమనించాను!" అన్నాడు.

ఈ మాటలు విని కర్ణుడికి పట్టరాని ఆగ్రహం వచ్చింది. అతను తన కోపాన్నంతా భీష్ముడిపై కక్కుతూ, "ముసలివాడా, అవకాశం దొరికినప్పుడల్లా నన్ను అకారణంగా అనరాని మాట లంటావు. దుర్యోధనుణ్ణి చూసి ఆ మాటలను భరించుతూ వస్తున్నాను. నీకు కొంచెమైనా మతి ఉన్నట్టు కనబడదు. నన్నడిగితే నీవే అర్ధరథుడవంటాను. ఈ సంగతి నాకే కాదు అందరికీ తెలుసు. నీవు కౌరవులపట్ల ద్రోహివిగా ప్రవర్తిస్తున్న సంగతి దుర్యోధనుడు గ్రహించకుండా ఉన్నాడు. నువు శత్రుపక్షంవాడివి కాకపోతే ఈ పక్షాన పోరే యోధులను ఇలాటి మాటలంటావా? జుట్టు నెరిసినంత మాత్రాన ఎవరు మహారథులో ఎవరు అతిరథులో తెలిసిపోతుందా? నోటికి వచ్చినట్టు రథాతిరథులను నిర్ణయించి వారిలో చీలికలు పెడతావా?" అన్నాడు.

తరవాత కర్ణుడు దుర్యోధనుడితో, "రాజా, ఈ భీష్ముడు నీకెక్కడ దొరికాడు. ఇటువంటివాడు సేనలో ఐకమత్యం



లేకుండా చేస్తే ఆ సేన ఎందుకైనా పనికి వస్తుందా? వయసుమళ్లిన ఈ ముసలివాణ్ణి సేనాధిపతిని చేశావు. మిగిలిన యోధులు తమ బలపరాక్రమాలతో, శౌర్యసాహసాలతో సాధించే విజయాలన్నీ చివరకు సేనాపతి వవుతాయి. అందుచేత ఈ ముసలివాడు బతికిఉండగా నేను యుద్ధం చెయ్యను. ఆ తరువాత శత్రువుల నందరినీ నేనే జయిస్తాను," అన్నాడు.


భీష్ముడు ఆగ్రహావేశంతో, "ఓరీ, నీచుడా! యుద్ధం ప్రారంభం కాబోతున్నది గనక నిన్ను చంపక విడిచిపెట్టాను. నీమాదిరిగా ఆత్మశ్లాఘం చేసుకోవటం నాకు సరిపడదు. నేను పరశురాముడి మహాస్త్రాలన్నిటికీ చలింపకుండా నిలబడినవాణ్ణి, కాశీరాజు కూతుళ్లను తెచ్చేటప్పుడు ఒంటరిగా రాజు లందరితోనూ పోట్లాడి జయించాను, నిన్ను చంపడం నాకొక విద్య కాదు. అసలు నిన్ను చేరదీయటంవల్లనే కౌరవులకీ గతి పట్టింది. మించిపోయింది లేదు, చేతనైతే ఈ దుస్థితి నివారించు!" అన్నాడు.

దుర్యోధనుడు మంచిమాటలతో భీష్ముడి కోపాన్ని శాంతింపజేసి, "తాతా, శిఖండి అందరితోబాటు ధనుర్బాణాలు ధరించి మనమీదికి యుద్ధానికి వస్తున్నాడు గదా. అతన్ని ఎందుకు చంపనంటావు? దీనికి ప్రత్యేక కారణమేదైనా ఉన్నదా?" అని అడిగాడు.

"దుర్యోధనా, నేను స్త్రీలతోనూ, స్త్రీలుగా పుట్టి కొంతకాలానికి పురుషులుగా మారిన వారితోనూ యుద్ధం చెయ్యనని వ్రతం పెట్టు కున్నాను. శిఖండి కొంతకాలం కన్యగా ఉండి తరవాత పురుషుడుగా మారాడు. అదీగాక ఈ శిఖండి పూర్వజన్మ వృత్తాంతం వింటే, నేను అతనితో ఎందుకు యుద్ధం చెయ్యనో నీకే తెలుస్తుంది," అంటూ భీష్ముడు దుర్యోధనుడికీ, అక్కడ ఉన్న ఇతర రాజు లకూ శిఖండి పూర్వజన్మ కథ చెప్పాడు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '59
50
NAYE PAISE
8
AS



మహాభారతం

భీష్ముడి తండ్రి శంతనమహారాజు. ప్రతీప మహారాజుకు దేవాపి, శంతనుడు, బాహ్లికుడు అని ముగ్గురు కుమారులుండేవారు. ప్రతీపుడు రాజ్యం విడిచిపెట్టి వనవాసానికి వెళ్లాడు. న్యాయంగా దేవాపి రాజు కావలిసింది. కాని దేవాపి రాజ్యం చేయక తాను కూడా వనాలకు వెళ్లిపోయి పాషండులతో చేరిపోయాడు. అందుచేత ప్రతీపుడి రాజ్యానికి శంతనుడే రాజయాడు.

ఒకనాడు శంతనుడు గంగాతీరాన విహరిస్తుండగా గంగ మానవస్త్రీ రూపంలో కనిపించింది. శంతనుడామెను తనకు భార్యకమ్మని కోరాడు. "నేను ఏంచేసినా సహించి ఊరుకోవాలే గాని నిష్ఠురాలు అడరాదు. అలా ఉండేపక్షంలో నేను నిన్ను పెళ్లాడతాను," అని గంగ అన్నది.

గంగ పెట్టిన ఈ నియమానికి శంతనుడు సమ్మతించాడు.

కాలక్రమాన గంగకు శంతనుడి వల్ల ఏడుగురు కొడుకులు పుట్టారు. గంగ ఒక్కొక్కరినే పుట్టగానే తీసుకుపోయి నీటిలో పడవేసి చంపింది. ఇది చూసి శంతనుడు చాలా బాధపడ్డాడు కాని, ఆమెను విమర్శించే అధికారం లేనందువల్ల మాట్లాడక ఊరుకున్నాడు.

గంగ ఎనిమిదవ పిల్లవాణ్ణికూడా కని చంపటానికి సిద్ధపడింది. శంతనుడు ఇక సహించలేక గంగను నానా మాటలూ అన్నాడు. గంగ ఆ పిల్లవాణ్ణి శంతనుడికి ఇస్తూ, "రాజా, మన మధ్య జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించి నన్ను తిట్టావు గనక ఇక నేను నీకు భార్యను కాను. ఇక నేనీ పిల్లలను ఎందుకు చంపానో చెబుతాను విను. ఒకప్పుడు అష్టవసువులు వసిష్ఠుడి కామధేనువును దొంగిలించటానికి ప్రయత్నించారు. వారిని ఈ దొంగతనానికి పురికొల్పి

అట్టమీది బొమ్మ

నది ప్రభాసుడనే వసువు భార్య. తన గోవును తస్కరించ యత్నించినందుకు వసిష్ఠుడు మానవజన్మ ఎత్తమని శపించాడు. ప్రభాసుణ్ణిమటుకు మానవుడుగా చిరకాలం జీవించమని శపించాడు. ఆ ఎనిమిదిమందీ కోరి నా గర్భాన జన్మించారు. ఏడుగురికి పుట్టగానే జన్మవిమోచన కలిగించాను కాని, వీడు ప్రభాసుడు; వీడు చిరకాలం జీవించి వసువులతో చేరుకుంటాడు!" అన్నది. తరవాత ఆమె శంతనుణ్ణి వదిలి తన దారిన తాను వెళ్లిపోయింది.

గంగకూ శంతనుడికీ పుట్టిన ఎనిమిదవ కుమారుడే భీష్ముడు.

కొంతకాలం గడిచింది. శంతనుడు యమునాతీరాన వేటాడుతూ ఉండగా ఆయనకు దాశరాజు కూతురు సత్యవతి కనిపించింది.

శంతనుడు ఆమె అందానికి పరవశుడై ఆమెను తన భార్యగా చేసుకోవాలనే ఉద్దేశంతో దాశరాజు వద్దకు వెళ్లాడు.

"రాజా, సత్యవతిని నువు వివాహమాడటం నాకు సమ్మతమే. కాని ఆమెకు పుట్టే కొడుకు నీ తరవాత రాజుకావాలి. ఒప్పుకుంటే మీవివాహం ఇప్పుడే చేస్తాను," అన్నాడు దాశరాజు.



ఇది శంతనుడికి సమ్మతం కాలేదు. తన పెద్దకొడుకు భీష్ముడుండగా పుట్టబోయే కొడుకులకు రాజ్యం ఇస్తాననటం ఇష్టంలేక శంతనుడు విచారంతో ఇంటికి వచ్చాడు. భీష్ముడు తన తండ్రి విచారానికి కారణం తెలుసుకుని, దాశరాజు వద్దకు వెళ్లి, "మీ కుమార్తెను నా తండ్రికివ్వండి. నేను రాజ్యం కోరను. నా కొడుకులు రాజ్యం కోసం తగాదా పెడతారని భయపడతారేమో, నేను ఆజన్మబ్రహ్మచారిగా ఉండిపోతాను," అని ప్రతిజ్ఞ చేశాడు. ఇదే భీష్మప్రతిజ్ఞ.

శంతనుడికీ సత్యవతికీ వివాహం జరిగింది. వారికి చిత్రాంగదుడూ, విచిత్ర



వీర్యుడూ అని ఇద్దరు కుమారులు కలిగారు. శంతనమహారాజు చాలాకాలం రాజ్యంచేసి చనిపోయాడు. అప్పుడు భీష్ముడు తన ప్రతిజ్ఞప్రకారం పెద్దవాడైన చిత్రాంగదుడికి రాజ్యాభిషేకం చేసి, విచిత్రవీర్యుణ్ణి యువరాజు చేశాడు.

కొద్దికాలానికి చిత్రాంగదుడు చనిపోయాడు. అప్పుడు భీష్ముడు సత్యవతి అనుమతితో విచిత్రవీర్యుడికి రాజ్యాభిషేకం చేసి, తాను అతనికి అండగాఉంటూ రాజ్యపాలన చేయించాడు.

విచిత్రవీర్యుడికి యుక్తవయసు వచ్చింది. అతనికి తగిన పిల్లనుతెచ్చి వివాహం చేయాలని భీష్ముడు సంకల్పించాడు. ఆ సమయంలో కాశీరాజు తన కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికల స్వయంవరం ప్రకటించి, నానా దేశాల రాజులకు ఆహ్వానాలు పంపాడు.

ఈ సంగతి తెలిసి భీష్ముడు రథమెక్కి ఒంటరిగా కాశీకి ప్రయాణమై వెళ్లాడు. అందగత్తెలని ప్రసిద్ధికెక్కిన ఆ కాశీరాజు కుమార్తెలను ఎలాగైనా తెచ్చి తన తమ్ముడైన విచిత్రవీర్యుడికి పెళ్లిచేయాలని ఆయన ఉద్దేశం. భీష్ముడు కాశీరాజు సభలో ప్రవేశించి అంబనూ, అంబికనూ, అంబాలికనూ చూశాడు. వారిని పెళ్లాడగోరి వచ్చిన రాజులందరినీ చూశాడు.

తన కుమార్తెలు వీర్యశుల్కలు అని కాశీరాజు ప్రకటించి ఉన్నాడు. అంటే వారి కోసం వచ్చినవారిలో యుద్ధం జరిగేపక్షంలో ఆ యుద్ధంలో గెలిచినవారు ఆ కన్యలను పెళ్లాడవచ్చు. అందుచేత భీష్ముడు అందరూ చూస్తుండగానే ఆ ముగ్గురు కన్యలనూ తెచ్చి తన రథంలో పెట్టి, స్వయంవరానికి వచ్చిన రాజులతో, "రాజులారా! నేను శంతనమహారాజు కుమారుడను, భీష్ముణ్ణి. మిమ్మల్నందరినీ ధిక్కరించి నేనీ కాశీరాజు కూతుళ్లను తీసుకుపోతున్నాను.

శక్తిగలవారైతే వీరిని విడిపించుకొనండి!" అని ఎలుగెత్తి చెప్పాడు.

ఆ రాజులు మండిపడ్డారు. వారు తమ తమ భటులకు ఆజ్ఞలిచ్చి రథాలనూ, ఏనుగులనూ, గుర్రాలనూ తెప్పించుకుని వాటిపైన ఎక్కి భీష్ముడితో యుద్ధానికి వచ్చారు. వారందరూ తనను అన్నివైపులా చుట్టుముట్టినప్పటికీ భీష్ముడు తన బాణాలతోనూ, అస్త్రాలతోనూ అందరితోనూ ఒకేసారి పోట్లాడి, అందరినీ ఓడగొట్టాడు. ఆయన ధాటికి నిలవలేక రాజులందరూ పారిపోయారు.



భీష్ముడు కాశీరాజు కుమార్తెలను తీసుకుని సత్యవతి దగ్గిరికి తిరిగి వచ్చి, "తల్లీ, వీరు కాశీరాజు కూతుళ్లు అనేకమంది రాజులతో పోరాడి గెలిచి ఈ కన్యలను నా తమ్ముడైన విచిత్రవీర్యుడికి భార్యలుగా తెచ్చాను," అన్నాడు. సత్యవతి ఆనంద పరవశురాలై, "నాయనా, ఎప్పుడూ ఇలాగే విజయాలు సాధించు!" అని భీష్ముణ్ణి ఆశీర్వదించింది.

విచిత్రవీర్యుడి వివాహానికి ఏర్పాట్లు జరుగుతూ ఉండగా కాశీరాజు పెద్దకూతురైన అంబ భీష్ముడితో, సిగ్గుపడుతూ ఇలా చెప్పింది: "భీష్మా, నేను ఇదివరకే సాళ్వ రాజును నా భర్తగా వరించి ఉన్నాను. ఆయనకూడా నన్ను ప్రేమించాడు. ఈ సంగతి నా తండ్రికి తెలియదు. నీవు ధర్మం ఎరిగినవాడవు. ఒకరికి మనసిచ్చిన నేను మరొకరిని ఎలా పెళ్లాడగలను? సాళ్వ రాజు నాకోసం చూస్తూ బాధపడుతుంటాడు. అందుచేత నన్ను ఆయన వద్దకు పంపు!"

ఈసంగతి తెలియగానే భీష్ముడు సత్యవతితోనూ, మంత్రి పురోహితులతోనూ సంప్రతించి అంబను సాళ్వరాజు వద్దకు పంపే ఏర్పాట్లు చేశాడు. వృద్ధులైన బ్రాహ్మణులనూ, దాసీజనాన్నీ వెంటబెట్టుకుని అంబ సాళ్వరాజువద్దకు వెళ్లింది. ఆమె




సాళ్వరాజుతో, "నేను నీకోసమై వచ్చాను. నిన్నుతప్ప నేను మరొకరిని పెళ్ళాడలేను. అందుచేత నా కోరిక తీర్చు," అన్నది.

సాళ్వరాజు ఈమాటలు విని వెకిలినవ్వు నవ్వి, "అంబా, నువు ఎప్పుడో భీష్ముడికి భార్యవయావు. నేను నిన్ను పెళ్లాడను. భీష్ముడి వద్దకే తిరిగి వెళ్లు. మరొకడికి భార్యవైన నిన్ను పెళ్లాడి నేను నారాజ్యంలో ధర్మాన్ని ఏవిధంగా అమలు చేయగలుగుతాను ?" అన్నాడు.

అంబ సాళ్వరాజుతో, "రాజా, నిజం తెలియకుండా ఇలాటి మాటలనకు. నేను ఇష్టపడి భీష్ముడి వెంట వెళ్లలేదు. భీష్ముడు కూడా నన్ను పెళ్లాడే ఉద్దేశంతో తీసుకుపోలేదు. ఆయనకు బ్రహ్మచర్య వ్రతమున్నది. మా ముగ్గురు అప్పచెల్లెళ్లనూ తన తమ్ముడికిచ్చి పెళ్లిచేసే ఉద్దేశంతో తీసుకువచ్చాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నానని తెలిశాక ఆయన ఈ పరివారమంతా వెంట ఇచ్చి నన్ను ఇక్కడకి పంపాడు. నా చెల్లెళ్లు మాత్రమే విచిత్రవీర్యుణ్ణి పెళ్లాడారు. ఇందులో నావల్ల జరిగిన అధర్మం ఏమున్నది. రాజా, నేను నిన్నుతప్ప మరొకరిని భర్తగా భావించలేదని ప్రమాణం చేస్తాను. నన్ను నిరాకరించకు!" అని బహువిధాల వేడుకున్నది.

కాని సాళ్వరాజు మనసు మారలేదు. ఆయన అంబతో, "అమ్మాయీ, నన్నెందుకు వేధిస్తావు ? నీ యిష్టంవచ్చిన చోటికి వెళ్లిపో. మమ్మల్నందర్నీ చెండాడి భీష్ముడు నిన్ను తన సొత్తు చేసుకున్నాడు. భీష్ముణ్ణి తలుచుకుంటేనే నా శరీరం గజగజలాడుతున్నది. నేను నిన్ను పరిగ్రహించలేను!" అన్నాడు.

అంబ భోరుమని ఏడుస్తూ సాళ్వనగరం నుంచి బయలుదేరింది. ఆమె తన దుస్థితిని బాగా అర్థంచేసుకున్నది. ఆమె తన తండ్రికీ, భీష్ముడికీ, సాళ్వుడికీ కూడా కాకుండా పోయింది. ఇంతా జరిగినాక ఆమె హస్తినా



పురానికి వెళ్లటంలో అర్థంఉండదు. వెళ్లినా భీష్ముడామెను ఆదరించబోడు. ఆమెకు అందరూ అన్యాయమే చేశారు. ఆమె తండ్రి ఆమె మనసు తెలుసుకోక వీర్యశుల్కగా ప్రకటించాడు. భీష్ముడు ఆమె మనసు తెలుసుకోక ఆమెను తన రథంలో హస్తినాపురానికి తీసుకుపోయాడు. ఉన్న సంగతంతా చెప్పినాకూడా చివరకు సాళ్వరాజు ఆమెను నిరాకరించాడు. మిగిలిన వాళ్లతోబాటు అంబ తనకుతానే ద్రోహం చేసుకున్నది; రథంలో ఎక్కించుకునేటప్పుడే భీష్ముడితో ఆమె సాళ్వరాజుగురించి చెప్పిఉంటే, భీష్ముడామెను తప్పక వదిలిపెట్టి ఉండేవాడు, సాళ్వరాజు స్వీకరించీ ఉండేవాడు.

తన జీవితం భగ్నంకావటానికి ఇంతమంది కారకులైనప్పటికీ అంబ కోపం భీష్ముడిమీద కేంద్రీకరించుకున్నది. ఆమె సాళ్వనగరం దాటి అరణ్యాలలో ఉండే ముని ఆశ్రమాలకు వెళ్లి ఆ రాత్రి అక్కడే పడుకున్నది. అక్కడి మునులంతా అంబ చెప్పిన విషాదగాథ విన్నారు.

అక్కడి మునులకందరికీ శైఖావత్యుడనే వృద్ధ ముని ఆచార్యుడు. ఆయన అంబతో, "అమ్మా, ఇక్కడ మేమంతా తపస్సు చేసుకునేవాళ్లం. నీకు కలిగిన కష్టాలు తొలగించటానికి మేము చేయగలది ఏమున్నది?" అన్నాడు.

అంబ చేతులురెండూ ఎత్తి నమస్కారం చేసి, "స్వామీ, మీదయ నాకుచాలు. మీరు నాకు తపస్సుచేసే విధానం తెలిపినట్టయితే కఠోరతపస్సు చెయ్య నిశ్చయించాను. కిందటి జన్మలో చేసుకున్న పాపంచేత నాకు ఎక్కడా నిలవ నీడలేకుండా చేసుకున్నాను. నాకు వేరే జీవితాశకూడా లేదు. అందుచేత మీతోబాటు నేనుకూడా ఇక్కడే వుండి తపస్సు చేసుకునే అవకాశం ఇవ్వండి," అన్నది.

అంబను చూసి ఆశ్రమవాసులందరూ జాలిపడ్డారు. వారిలోవారు ఆమె సమస్య గురించి చర్చించుకుంటున్నారు. కొందరు ఆమెను తండ్రి వద్దకు పంపటం మంచి దన్నారు; మరికొందరు ఆమె దీనస్థితికి భీష్ముడే కారకుడన్నారు; ఇంకా కొందరు ఆమెను ఎలాగైనా సాళ్వరాజుదగ్గిరికి పంప టమే ఉత్తమమన్నారు.

చివరకు అందరూ కలిసి అంబతో, "అమ్మా, నీవు నీ తండ్రి ఇంటికి వెళ్లటమే అన్నివిధాలా శ్రేయస్కరం. ఆడది తండ్రి ఇంటనైనా ఉండాలి, భర్తఇంటనైనా ఉండాలి, మూడోచోట ఉండటం ముప్పు. నీ తండ్రి ఇంట నీకు సుఖం లేకపోవచ్చు, కాని ఇక్కడ తపస్సు చేసేదానికన్న అది ఎంతో మేలు. నీలాటి సుకుమారి అయిన రాజకన్య తపస్సు చేయాలంటే సాధ్య మయే పని కాదు. అదీకాక, ఈ ఆశ్ర మంలో నీవంటి సుందరి ఉన్నదని తెలిస్తే ఎక్కడెక్కడి రాజులూ నిన్ను ఎత్తుకు పోవటానికి వస్తారు. అందువల్ల చాలా ఉప ద్రవాలు కలుగుతాయి. కనుక నీవు ఇంటికి వెళ్లటం మంచిది," అన్నారు.


అంబ అందరికీ నమస్కారం చేసి, "మహామునులారా, నేను నా తండ్రి ఇంట ఒకప్పుడు ఎంతో గౌరవంగా బతికాను. అక్కడే తిరిగి అగౌరవంగా బతకటం నాకు ఎంతమాత్రమూ ఇష్టంలేదు. నేను కాశీకి తిరిగివెళ్లి నా తండ్రికి మొహం చూపించ లేను. అందుచేత మీ అందరి చాటునా ఉండి ఈ అరణ్యంలోనే నేనుకూడా తపస్సు చేసుకుంటాను. తపస్సుచేత పర లోకంలోనైనా నాకింత సుఖం దొరక వచ్చును. ఇప్పుడు నాకుకలిగిన కష్టాల లాటివి ఏ లోకంలోకూడా సంభవించకుండా ఉండటమే నా కోరిక. అందుచేత దయ చేసి నాకు తపోవ్రతం ఉపదేశించండి!" అని ప్రార్థించింది.



చందమామ

పిల్లల కథల మాసపత్రిక





మహాభారతం

ఈవిధంగా అంబ మునులతో మాట్లాడే సమయంలో అక్కడికి హోత్రవాహనుడనే రాజర్షి వచ్చాడు. అక్కడి మునులు ఆయనకు అర్ఘ్యపాద్యాలిచ్చి ఆసనంపైన కూచోబెట్టి తిరిగి అంబను గురించే ముచ్చటించసాగారు. వారి సంభాషణద్వారా అంబ కథ యావత్తూ తెలుసుకున్నవాడై హోత్రవాహనుడు చప్పున తన ఆసనంమీదినుంచి లేచి అంబను ఆలింగనం చేసుకుని, "తల్లీ, నేను మీ అమ్మకు తండ్రిని, నీకు తాతను. నీకు కలిగిన కష్టమేమిటో వివరంగా చెప్పు!" అంటూ ఆమెను ఊరడించాడు.

అంబ తన వృత్తాంతమంతా హోత్రవాహనుడికికూడా చెప్పింది. అంతా విని ఆయన, "అమ్మా, నువు మీ తండ్రి ఇంటికి వెళ్లటం ఎంతమాత్రమూ ఉచితంకాదు. నీకు కలిగిన దుఃఖానికి తగిన విరుగుడు నేను చేస్తాను. నువు నావెంటనే ఉండు. కాని తపస్సు చెయ్యటం నీవల్ల అయేపని కాదు. ఆ ప్రయత్నం మానుకో. జమదగ్ని కొడుకైన పరశురాముడున్నాడే అతని వద్దకు వెళ్లు. అతడితో నీకు జరిగిన అన్యాయం గురించి చెప్పు. అతను వెళ్లి భీష్ముణ్ణి అవలీలగా చంపేస్తాడు. ఇప్పుడు పరశురాముడు మహేంద్రపర్వతంమీద మహోగ్రమైన తపస్సు చేస్తున్నాడు. నాకూ అతనికీ స్నేహం. నేను పంపించానంటే నిన్ను ఎంతో ఆదరించి నీ కష్టాలు తొలగిస్తాడు!" అన్నాడు.

ఇంతలో అక్కడికి అకృతవ్రణుడనే మహర్షి వచ్చాడు. అకృతవ్రణుడు పరశురాముడి అనుచరులలో ఒకడు. ఆయన రాగానే మునులందరూ లేచి స్వాగతం చెప్పారు. ఆయన అర్ఘ్యపాద్యాదులు స్వీకరించి, ఉన్నతాసనంమీద కూచుని, తన చుట్టూ కూచున్న మునులతో వేదాంత చర్చలు చేయసాగాడు.


అట్టమీది బొమ్మ

ఆ సందర్భంలో హొత్రవాహనుడు అకృతవ్రణుణ్ణి పరశురాముడి యోగ క్షేమాలు అడిగి, "ఆయన ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నాడు ?" అన్నాడు.

"ఆయన తరచు మిమ్మల్ని తలుచు కుంటూ ఉంటాడు. మిమ్మల్ని చూసే ఉద్దేశంతో ఇక్కడికి వస్తున్నాడు. రేపు ఉదయానికి రావచ్చు ననుకుంటాను. ఈ పిల్ల ఎవరు ? మీకు బంధువురాలా ?" అంటూ అకృతవ్రణుడు అంబను గురించి ప్రశ్నించాడు. హొత్రవాహనుడు అంబ కథ చెప్పిన మీదట ఆయన అంబతో, "అమ్మాయీ, నీ కష్టాలకు కారకులు ఇద్దరే ఉన్నారు. ఒకడు నిన్ను బలాత్కారంగా తెచ్చిన భీష్ముడు, రెండోవాడు నిన్ను పెళ్ళాడ నిరాకరించిన సాళ్వరాజు. వీరిలో ఎవరిపైన పగ తీర్చుకుంటావో ముందే తేల్చుకుని పరశురాముడితో చెప్పటం మంచిది," అన్నాడు.

అంబ ఏమనటానికీ నిశ్చయించలేక, "మహాత్మా, నా కథఅంతా మీరుకూడా విన్నారుగదా ! నాకు దుఃఖం కలిగించిన ఆ ఇద్దరిలో ఏ ఒకరిని శిక్షించాలో, లేక ఇద్దరినీ శిక్షించాలో మీరే తేల్చండి !" అన్నది.


దానికి అకృతవ్రణుడు, "నా బుద్ధికి భీష్ముడే దోషి అని తోస్తున్నది. అతన్ని



పరశురాముడు చంపినట్టయితే నీ పగ తీరుతుంది," అన్నాడు. "నాకూ అలాగే తోస్తున్నది," అన్నది అంబ.

ఆ రాత్రల్లా ఆశ్రమవాసులు అంబను గురించే మాట్లాడుకున్నారు.

మర్నాడు తెల్లవారుతూనే పరశురాముడు తన శిష్యులతోసహా ఆ ఆశ్రమానికి వేంచేశాడు. మునివేషంలో ఉన్నప్పటికీ ఆయనవెంట విల్లూ, ఖడ్గమూ, గండ్రగొడ్డలీ ఉన్నాయి. పరశురాముడి రాకవల్ల ఆశ్రమమంతా సందడి చెలరేగింది. ఆయనకు మునులందరూ తగినట్టుగా స్వాగత సన్మానాదులు జరిపినాక హొత్రవాహనుడు



అంబను చూపి ఆమెను పరశురాముడికి పరిచయం చేశాడు.

అంబ ఆయన కాళ్లపై పడి, భోరున ఏడుస్తూ ఆయన శరణు జొచ్చింది.

"అమ్మా, నీకు హోత్రవాహనుడు ఎలాగో నేనూ అలాటివాణ్ణే. నీ కోరిక ఏమిటో చెప్పు, నేను తీరుస్తాను!" అన్నాడు పరశురాముడు.

"మహాత్మా, భీష్ముడు జీవితం ధ్వంసం చేశాడు. ఆయనను వధించి నా దుఃఖం తీర్చండి," అన్నది అంబ.

దానికి పరశురాముడు, "అమ్మాయీ, నేను బ్రాహ్మణ రక్షణకు తప్ప ఆయుధం ధరించనని వ్రతం పట్టాను. అలాటప్పుడు నీకోసం భీష్ముణ్ణి ఎలా చంపగలను? అదీ గాక భీష్ముడు నాకు ఎల్లప్పుడూ భృత్యుడై ఉంటాడు. నే నేది చెయ్యమంటే అది చేస్తాడు. అందుచేత అతన్ని చంప నవసరం లేదు," అన్నాడు.


అంబను తీసుకుని భీష్ముడివద్దకు వెళ్లి, ఆమెను పెళ్లి చేసుకోమని అడగటానికీ, భీష్ముడు నిరాకరించినట్టయితే అది బ్రాహ్మణ నిరసన అవుతుంది గనక భీష్ముడితో యుద్ధం చెయ్యటానికీ పరశు రాముడు నిశ్చయించాడు.

పరశురాముడు చేసిన ఈ నిర్ణయం ఆశ్రమవాసులందరికీ సంతోషం కలిగించింది.

పరశురాముడు ఆ రాత్రి ఆశ్రమంలో విశ్రమించి మర్నాడు వారందరినీ అంబనూ వెంటబెట్టుకుని కురుక్షేత్రానికి వచ్చి సరస్వతీ నదీ తీరాన విడిది చేశాడు.

పరశురాముడు తాను కురుక్షేత్రానికి వచ్చిన మూడోనాడు భీష్ముడికి కబురు చేశాడు. భీష్ముడు ఎంతో ఆనందోత్సాహాలతో పరశురాముణ్ణి చూడవచ్చాడు. భీష్ముడు చేసిన పూజలన్నీ అయాక పరశురాముడు, "భీష్మా! ఏం పని చేశావు? బ్రహ్మచారిగా ఉండగోరిన నీవు ఈ కాశీరాజు కుమార్తెను

బలాత్కారంగా తెచ్చావు. తెచ్చినవాడివి నీ ఇంట ఉంచుకోక సాళ్వుడివద్దకు పంపావు. నీవు అంటిన కన్య అని అతను ఈమెను నిరాకరించాడు. ఈమె నీ మూలంగా దిక్కు లేని ప్రాణి అయిపోయింది. అందుచేత నీవే ఈమెను వివాహమాడి ఈమె జీవితం నిలబెట్టు. ఇది నీకు నా ఆజ్ఞ!" అన్నాడు.




పరశురాముడి ఆగ్రహం గ్రహించి భీష్ముడు, "మహర్షీ! ఈమె తాను అదివరకే సాళ్వుణ్ణి వరించానని చెప్పటంచేత నేనీమెను నా తమ్ముడికిచ్చి చేయక సాళ్వుడి వద్దకు పంపేశాను. అది నా దోషం కాదు. ఇక నేను పెళ్లాడేది కల్ల. భయానగాని, లోభానగాని, జాలిచేతగాని, మోహంచేతగాని నేను ప్రతభంగం చెయ్యను!" అన్నాడు.

పరశురాముడు రౌద్రంగా, "ఏమోయ్, నామాట కెదురు చెబుతావా? నా ఆజ్ఞ శిరసావహించకపోతే నిన్నూ, నీ మంత్రులనూ నాశనం చెయ్యగలను, జాగ్రత్త!" అని భయపెట్టాడు.

ఆయనను శాంతపరచటానికి భీష్ముడు ఎన్ని యత్నాలు చేసినా ఫలితంలేక పోయింది. చివరకు భీష్ముడు ఆయనకు ప్రణామం చేసి, "స్వామీ, నేను పసివాణ్ణి. మీరు నాకు నాలుగు రకాల అస్త్రాలు ప్రసాదించిన గురువులు. అలాటప్పుడు నన్ను యుద్ధానికి కవ్విస్తున్నారు, కారణమేమిటి?" అని వినయంగా అడిగాడు.

"నేను నీకు గురువునే అనుకుంటే నా మాట ఎందుకు వినవు? నీ మూలంగా ఈ పిల్లను ఎవరూ పెళ్లాడని పరిస్థితి ఏర్పడినప్పుడు, నీవే ఈమెను వివాహమాడటం ధర్మం కాదా. నీ మేలు కోరే చెబుతున్నాను, నా మాట విని, ఈమెను పెళ్లాడు!" అన్నాడు పరశురాముడు.

"స్వామీ, ఈమె ఇంకొకరిని వరించిన కన్య, ఒకసారి నాచేత వదలబడినది. అలాటి దాన్ని నేను ఎన్నటికీ భార్యగా స్వీకరించను.



మీరు నాకు గురువులు, బ్రాహ్మణులు, తపోధనులు. అందుచేత మిమ్మల్ని వధించటం ఇష్టంలేక ఇంతగా మిమ్మల్ని బతిమాలుకున్నాను. మీరు కోపోద్రేకంలో క్షత్రియ ధర్మం అవలంబించి నాపై ఆయుధం ఎత్తితే మిమ్మల్ని సంహరించటం నాకు ధర్మవిరుద్ధం కాదు. అందుకు నేను జంకను కూడా!" అన్నాడు భీష్ముడు.

"నీకు నాతో యుద్ధం చెయ్యాలని ఉబలాటంగా ఉన్నట్టుంది. రేపు యుద్ధ సన్నద్ధుడవై కురుక్షేత్రానికి రా. నిన్ను యముడి దగ్గిరికి పంపేస్తాను," అన్నాడు పరశురాముడు.

భీష్ముడు ఆయనకు ప్రణామంచేసి హస్తినాపురానికి తిరిగి వచ్చి సత్యవతితో జరిగినదంతా చెప్పాడు.

"విజయం పొందు, నాయనా!" అని సత్యవతి భీష్మణ్ణి దీవించింది.

మర్నాడు భీష్ముడు బ్రాహ్మణులచేత స్వస్తిపుణ్యాహాలు చేయించుకుని యుద్ధ సన్నద్ధుడై, తెల్లగుర్రాలు పూన్చిన వెండి రథంమీద సమస్త ఆయుధాలూ ఉంచుకుని, తెల్లని దుస్తులు ధరించి, తెల్లని గొడుగుతో కురుక్షేత్రానికి వచ్చాడు.

అప్పటికే పరశురాముడు, మునులు, బ్రాహ్మణులు వెంట రాగా, కురుక్షేత్రానికి వచ్చి ఉన్నాడు. ఆయనను చూస్తూనే భీష్ముడు శంఖం పూరించాడు. ఆ సమయంలో గంగ తన కుమారుడైన భీష్ముడి వద్దకు వచ్చి, "నాయనా, నువు పరశురాముడితో యుద్ధం చేయుటమేమిటి? ఇటువంటి ప్రయత్నం మాను!" అన్నది.

భీష్ముడు చేతులు జోడించి, "అమ్మా, జరిగినదంతా నీకు తెలిసే ఉంటుంది. ఈ విషయంలో నా తప్పు ఏమి ఉన్నా ఈ యుద్ధం మానేస్తాను," అన్నాడు.

తరవాత గంగ పరశురాముడితోకూడా చెప్పిచూసింది, కాని పరశురాముడు

వినలేదు. తరవాత భీష్ముడు రథం దిగి కాలినడకను పరశురాముణ్ణి సమీపించి, "మహాత్మా! నేను రథంతో వచ్చాను, కవచం ధరించాను. మీరుకూడా నాలాగే రథకవచాలు తెచ్చుకోండి. అలా అయితే నాకు మీతో యుద్ధంచెయ్యాలని ఉత్సాహం ఉంటుంది!" అన్నాడు.

"భీష్మా, నాకు భూమే రథం; వేదాలే గుర్రాలు; సావిత్రీ గాయత్రీ సరస్వతులు నాకు కవచాలు; వాయుదేవుడే నాకు సారథి," అన్నాడు పరశురాముడు. మరు క్షణం భీష్ముడికి ఆయన ఒక రథంమీద కనపడ్డాడు. పరశురాముడి ముఖ్యానుచరుడైన అకృతవ్రణుడు ఆయనకు సారథిగా ఉన్నాడు! భీష్ముడు ఆశ్చర్యపడుతూ పరశురాముడికి మొక్కి, "స్వామీ, మీరు నాతో సమానులైనా, నాకన్న అధికులైనా సరే మీతో యుద్ధం చెయ్యబోతున్నాను. గురువులైన మీరు, ఈ యుద్ధంలో నాకు జయం కలగాలని ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నాను!" అన్నాడు.

"భీష్మా, నీకన్న పెద్దవాడినైన నావద్దకు కాలినడకను వచ్చి నాకు ముందుగా వందనం చెయ్యటం బాగానే ఉన్నది. కాని నీకు ఈ యుద్ధంలో విజయం కలగాలని



నేను ఆశీర్వదించను. నిన్ను యుద్ధంలో ఓడించటానికి కృతనిశ్చయుణ్ణయి వచ్చాను," అన్నాడు పరశురాముడు.

తరవాత ఇద్దరూ యుద్ధం ప్రారంభించారు. అది కావటానికి ద్వంద్వ యుద్ధమేగాని మహాభయంకరమైన యుద్ధం. ఇద్దరూ అస్త్రశస్త్రాలలో ఆరితేరిన యోధులు. వారు ఎన్నోసార్లు ఒకరినొకరు మూర్ఛ పోగొట్టారు. కాని ఇరవైమూడు రోజులు జరిగినా ఈ యుద్ధంలో ఎవరికీ విజయం దక్కలేదు.


ఇరవైమూడోనాటి రాత్రి భీష్ముడు ఈ యుద్ధం గురించి చాలా దిగులు పడ్డాడు.

ఆయన తన పితృదేవతలకూ, దేవతలకూ ఎన్నో దణ్ణాలు పెట్టుకుని, "నేనీ యుద్ధంలో గెలిచేది ఉంటే ఈ రాత్రి నాకు దేవతలు సాక్షాత్కరించాలి!" అనుకున్నాడు. ఆయన అనుకున్నట్టుగానే కలలో ఆయనకు ఎనిమిదిమంది బ్రాహ్మణులు కనిపించారు. ఒకనాడు భీష్ముడు యుద్ధరంగంలో మూర్ఛపోయినప్పుడుకూడా ఈ బ్రాహ్మణులే కనిపించి తనను పడకుండా పట్టుకుని రక్షించినట్టు ఆయనకు తోచింది. ఈ బ్రాహ్మణులు భీష్ముడితో, "భయపడకు. ఈ యుద్ధంలో నీవు గెలిచితీరుతావు. మా ఎనిమిది మందికీ నీవే శరీరానివి. ప్రస్వాపనం అనే అస్త్రాన్ని నీవు పూర్వజన్మలో ఎరుగుదువుగాని ఈ జన్మలో మరిచావు. దాన్ని ఇప్పుడు జ్ఞాపకం చేస్తున్నాము. ఈ అస్త్రాన్ని ప్రయోగించినట్టయితే పరశురాముడు చచ్చిపోడుగాని, చచ్చినట్టు పడిపోతాడు! నీకు విజయం లభిస్తుంది," అని చెప్పారు.

ఇరవైనాలుగోనాటి యుద్ధం మహా భయంకరంగా జరిగింది. మధ్యలో భీష్ముడు ప్రస్వాపనం అనే అస్త్రాన్ని తీసి పరశురాముడిపైన ప్రయోగించబోయాడు. ఆకాశంనుంచి అదృశ్యంగా యుద్ధాన్ని చూస్తున్న దేవతలు హాహాకారాలు చేశారు. "భీష్మా! వద్దు, వద్దు!" అన్న కేకలు వినిపించాయి. నారదుడు భీష్ముడి ఎదట ప్రత్యక్షమై, "భీష్మా, పరశురాముడు పెద్దవాడు, బ్రాహ్మణుడు, మీదుమిక్కిలి నీకు గురువు. ఈ అస్త్రాన్ని ప్రయోగించావంటే ఆయనకు తీరని అవమానం జరుగుతుంది. అందుచేత నా మాట విని తక్షణం ఈ అస్త్రాన్ని ఉపసంహరించు!" అన్నాడు.

భీష్ముడు అస్త్రం వేస్తున్నాడని తెలిసి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన పరశురాముడు కూడా భీష్ముడితోబాటు తన అస్త్రాన్ని ఉపసంహరిస్తూ, నోరుజారి, "బుద్ధిహీనుణ్ణి అయి భీష్ముడి చేతిలో ఓడాను!" అనేశాడు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st July '59
50
NAYE PAISE
8
AS
M.T.V. Acharya



మహాభారతం

యుద్ధం అయిపోయింది, కాని ఎవరు ముందు వెనక్కు తిరగాలనేది తేలలేదు. "ముందు వాణ్ణి తిరగమనండి! వాడు నన్ను ఎదిరించి నిలబడి ఉండగా నేను తిరిగిపోతానా?" అన్నాడు పరశురాముడు.

"యుద్ధంలో వీపు చూపననీ, నా వెనక పార్శ్వంలో బాణం తగలగూడదనీ నాకు వ్రతం ఉన్నది," అన్నాడు భీష్ముడు.

అందరూ చేరి చివరకు పరశురాముడి చేతనే ముందు యుద్ధం మాన్పించారు. ఆ తరవాత భీష్ముడు వచ్చి ఆయన కాళ్లపై పడ్డాడు. పరశురాముడు చిరునవ్వు నవ్వి, "క్షత్రియులలో నీవంటివాణ్ణి నే నెన్నడూ చూడలేదు. నువు చేసిన యుద్ధం నాకు చాలా నచ్చింది," అన్నాడు.


తరవాత పరశురాముడు అంబకేసి తిరిగి విచారంగా, "అమ్మాయీ, చూశావుగదా! నీకు జరిగిన అన్యాయాన్ని సరిచెయ్యటానికి నాకు చేతనైనంతా చేశాను. ఇక నేను చేయుగలది ఏమీ లేదు," అంటూ దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాడు.

తనను భీష్ముడు ఓడించినట్టు పరశురాముడు చెప్పగానే అంబ, "మహాత్మా, నాకు నీ చేతనైన సాయం చేశావు, కాని ఫలితం లేకపోయింది. నీచేత ఓడని భీష్ముడు దేవతలకుకూడా ఓడడు. అయినా నేను భీష్ముణ్ణి శరణు వేడను. ఎప్పటికైనా, ఎలాగైనా ఆయనను నేనే ఓడించాలి. అందుకు మార్గం ఏమిటో వెతుకుతాను!" అంటూ తన దారిన తాను వెళ్లిపోయింది. పరశురాముడు మునులతోసహా మహేంద్రగిరికి వెళ్లిపోయాడు.

భీష్ముడు బ్రాహ్మణుల ఆశీర్వాదాలు పొంది ఇంటికి తిరిగి వచ్చేశాడు.

ఆయన సత్యవతికి జరిగినదంతా చెప్పాడు. ఆవిడ భీష్ముణ్ణి చాలా మెచ్చు

అట్ట మీది బొమ్మ



కున్నది. తరవాత భీష్ముడు అంబ వెనకగా వేగులవాళ్లను పంపి, ఆమె ఎక్కడికి పోతుందో, ఏమేమి చేస్తుందో ఎప్పటి కప్పుడు తనకు తెలియజేస్తూండవలసిందిగా ఆజ్ఞాపించాడు. వారు ఆ ప్రకారమే భీష్ముడికి అంబను గురించిన వార్తలు వివరంగా తెలుపుతూ వచ్చారు.

అయినా అంబ భీష్ముడికి పక్కలో బల్లెంలాగా తయారయింది. ఆమె తనను చంపటానికిగాను తపస్సు చేస్తానని ప్రతిజ్ఞ చేసి పోయింది. పరశురాముడు ఎంతో తపశ్శాలి అయిఉండికూడా తనను జయించలేకపోయాడు. అయినా భీష్ముడు అంబను తలుచుకుని భయపడసాగాడు. చివరకాయన తన భయాన్ని వ్యాసుడికీ, నారదుడికీ విన్నవించుకున్నాడు. "నీవు అంబను గురించి ఇంతగా విచారించటం అనవసరం. విధి నిర్దేశం ఎలాఉంటే అలా అవుతుంది!" అని ఆ ఇద్దరూ విడివిడిగా భీష్ముడికి ధైర్యం చెప్పారు.

కురుక్షేత్రంనుంచి బయలుదేరిన అంబ యమునాతీరాన గల ఋష్యాశ్రమాలకు వెళ్లి అక్కడ ఘోరతపస్సు ప్రారంభించింది. ఆమె ఆహారం మానేసి, శరీరాన్ని కృశింపజేసి, శరీరంనిండా మట్టి పట్టించుకుని తపస్సు చేసింది; కంఠంవరకూ నీటిలో మునిగి ఆరు మాసాలు తపస్సు చేసింది. ఒక ఏడాది నిరాహార తపస్సు చేసి, తరవాత రోజుకు ఒక పండుటాకు తింటూ, కాలి బొటనవేలిపై నిలబడి మరొక సంవత్సరం తపస్సు చేసింది. ఈ విధంగా ఆమె పన్నెండు సంవత్సరాలు కఠోర తపస్సు చేసింది; ఎంద రెన్నివిధాల చెప్పినా ఆమె తపస్సు మానలేదు.

ఆ తరవాత ఆమె వత్సదేశానికి వెళ్లి అక్కడి ఆశ్రమాలన్నీ చూసింది. తరవాత ఆమె పుణ్యక్షేత్రాలు సేవిస్తూ సంచారం ప్రారంభించి చ్యవనాశ్రమం, బ్రహ్మస్థానం,

ప్రయాగ, దేవారణ్యం, భోగవతి, రామహ్రదం మొదలైన అనేక చోట్లకు వెళ్లింది.

అంబ ఇలా తపస్సుతోపాటు తీర్థ యాత్రలు చేసే కాలంలో భీష్ముడి తల్లి అయిన గంగ ఆమెను కలుసుకుని, "అమ్మాయీ, నీవు దేనికిగాను ఇన్ని కష్టాలు పడుతూ తిరుగుతున్నావు?" అనిఅడిగింది.

"అమ్మా, నాకోసం పరశురాముడంతటి వాడు భీష్ముడితో యుద్ధంచేసి ఓడిపోయాడు. అటువంటి భీష్ముణ్ణి ఇంకెవరు చంపగలరు? నేనే ఆయనను చంపే శక్తి సంపాదించాలని శ్రమపడుతున్నాను. నా కోరిక సిద్ధించేటట్టు వరమియ్యి తల్లీ!" అన్నది అంబ.

"ఓసీ, స్త్రీవై పుట్టి నీకీ కోరిక ఏమిటి? ఇది ఎన్నటికీ సిద్ధించదు. ఇలాటి ప్రయత్నం లోనే నీవు చనిపోయావంటే ఎప్పటికైనా నీవు నదివైపోతావు. నీలో భయంకరమైన మొసళ్లుంటాయి. ఏడాదికి నాలుగు మాసాలు మాత్రమే నీలో నీరుంటుంది; మిగిలిన ఎనిమిది మాసాలూ నిన్ను చూసి నది అనికూడా ఎవరూ అనుకోరు!" అంటూ గంగ వెళ్లిపోయింది.

తరవాత కొంతకాలానికి గంగ చెప్పినట్టే జరిగింది. అంబ మత్స్యదేశంలో నడుస్తూ ఒకచోట స్పృహతప్పి పడిపోయింది. ఆమె పడిపోయిన చోట అంబానది పుట్టింది. ఆ



నదికి వర్షాకాలంలో వరదలు వస్తాయి, భయంకరమైన మొసళ్లతో నిండి ఉంటుంది; ఏడాదికి ఎనిమిది మాసాలు అందులో నీరుండదు.

అంబను చూసి ఎందరో ఋషులు, "అమ్మా, నీవు ఏమి కోరి తపస్సు చేస్తున్నావు?" అని అడిగారు. వారందరికీ అంబ, "అయ్యా, నేను ఉత్తమలోకాలు కోరను. ఎలాగైనా భీష్ముణ్ణి చంపటానికే నేనిలా తపస్సు చేస్తున్నాను. నాకు భర్తా, సంసారమూ లేకుండా పోయాయి. నాది ఆడబ్రతుకూ కాదు, మగబ్రతుకూ కాదు. నాకు ఆడజన్మమీద మోహం మొత్తింది. ఎత్తితే మగజన్మే ఎత్తాలి! ఎలాగైనా భీష్ముణ్ణి యుద్ధంలో చంపాలి. అందుచేత నన్ను మీరు నివారించకండి!" అనేది.

చివరకు అంబ కోరిక అనుకోని విధంగా ఫలించింది. శివుడు ఆమె తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై, "అంబా, ఏం వరం కోరుతావు?" అని అడిగాడు.

"దేవా, నేను భీష్ముణ్ణి జయించేటట్టు అనుగ్రహించు!" అన్నది అంబ. "అలాగే జయిస్తావు!" అన్నాడు శివుడు. "దేవా, నేను స్త్రీనిగదా మహాపరాక్రమశాలి అయిన భీష్ముణ్ణి ఎట్లా జయిస్తాను? నీమాట అసత్యం కాదుగదా?" అన్నది అంబ.





"ఎన్నటికీ కాదు. వచ్చే జన్మలో నీకు పురుషత్వం లభిస్తుంది; నీవు భీష్ముణ్ణి సంహరిస్తావు!" అన్నాడు శివుడు.

శివుడు అంతర్థానం కాగానే అంబ మునీశ్వరులంతా చూస్తుండగానే ఒక చితి పేర్చుకుని, యమునానదివేపు తిరిగి నమస్కారం చేసి, "భీష్ముణ్ణి చంపగలందులకు నేను అగ్నిప్రవేశం చేస్తున్నాను!" అని పలికి, చితిలో పడి కాలిపోయింది.

ఇదే సమయంలో పాంచాలదేశపు రాజైన ద్రుపదుడుకూడా శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. ఆయన తపస్సుకు రెండు కారణాలు. ద్రుపదుడికి పిల్లలు లేరు; సంతానం కావాలన్నది ఒక కోరిక. ద్రుపదుణ్ణి భీష్ముడు ఓడించిఉన్నాడు; భీష్ముణ్ణి జయించగలవాడు తన కడుపున పుట్టాలన్నది రెండో కోరిక.

ద్రుపదుడి తపస్సుకూడా ఫలించింది. శివుడు ప్రత్యక్షమై, "నీ కడుపున ఒక కూతురు కలుగుతుంది!" అని వరమిచ్చాడు.

"దేవా, నాకు కూతురెందుకు? భీష్ముణ్ణి చంపగల కొడుకును ప్రసాదించు!" అని ద్రుపదుడు ప్రార్థించాడు.

"ఆ కూతురే తరవాత కొడుకుగా మారి భీష్ముణ్ణి చంపుతుంది. అంతతో తృప్తిపడి ఇంటికి వెళ్లిపో!" అన్నాడు శివుడు.

ద్రుపదుడు ఇంటికి తిరిగివచ్చి తన భార్యతో జరిగినదంతా చెప్పాడు. తరవాత ద్రుపదుడి భార్య గర్భవతి అయి, నవ మాసాలు మోసి, శివుడు చెప్పిన విధంగానే ఒక ఆడపిల్లను కన్నది. ఆ పిల్ల రహస్యం తల్లిదండ్రులకు మాత్రమే తెలుసు. ద్రుపదుడు అందరితోటీ తనకు మగపిల్లవాడు కలిగాడని చెప్పాడు, ఆ పిల్లవాడికి శిఖండి అని నామకరణం చేశారు.

శిఖండికి మగపిల్లవాడి దుస్తులే వేసి, మగపిల్లవాడులాగే పెంచారు. ఆ పిల్లకు చిత్రలేఖనమూ, శిల్పమూ నేర్పించారు,

విలువిద్యకూడా చెప్పించారు. శివుడు చెప్పినట్టుగా ఆ పిల్ల ఉన్నట్టుండి పురుషుడయి పోతుందనే గట్టినమ్మకంతో ఉన్న ద్రుపదుడికి ఆమెలో నానాటికీ వృద్ధి అయే స్త్రీ లక్షణాలే కనిపించాయి. ఆయన భయపడుతూ తన భార్యతో, "నేను శివుడి మాటలు నమ్మి ఇది మగవాడని ఇంత కాలమూ అందరితోనూ అబద్ధం చెప్పేశాను. చూడగా చూడగా ఇది యుక్తవయస్కురాలై దీని రహస్యం అందరికీ తెలిసిపోయేలా గున్నది. నాకు మతి పోతున్నది. నీకేదైనా ఉపాయం తోస్తే చెబుదూ!" అన్నాడు.

"దీనికి ఒక్కటే ఉపాయం, తగిన కన్యను చూసి పెళ్ళిచేసేద్దాం! తరవాత శివుడు చెప్పినట్టు అది మగవాడు కానే అవుతుంది. అప్పుడు మరే చిక్కూ ఉండదు!" అన్నది ద్రుపదుడి భార్య. ఈ సలహా ద్రుపదుడికి కూడా నచ్చింది.

* * *

దశార్ణదేశంలో హిరణ్యవర్మ అనే రాజుకు ఒక యీడువచ్చిన కుమార్తె ఉన్నది. హిరణ్యవర్మ చాలా పెద్ద బలగం కలవాడు, చాలా బలశాలికూడానూ. ద్రుపదుడు తన కూటంలోని రాజులందరికీ హిరణ్యవర్మ కులగోత్రాదులు చెప్పి, ఆయన కుమార్తెను,



శిఖండిని అనేదాన్ని, తన కుమారుడైన శిఖండికి చేసుకోబోతున్నానని తెలియబరిచాడు. పాంచాల రాజుతో వియ్యం చెయ్యటానికి దశార్ణరాజైన హిరణ్యవర్మకూడా ఎంతో సంతోషించాడు.

శిఖండికీ శిఖండినికీ వివాహం జరిగింది. శిఖండి రహస్యం శిఖండినికి తెలిసిపోయింది. ఆమె తనవెంట వచ్చిన దాసీలతో, "నా భర్త పురుషుడు కాడు, నాలాగే ఒక స్త్రీ!" అని రహస్యంగా చెప్పేసింది. వారీ మాట విని నివ్వెరపోయి ఎవరికీ తెలియకుండా ఈ వార్తను దశార్ణదేశానికి చేరవేశారు.

తన కూతురికీ, తనకూ ద్రుపదుడు చేసిన అన్యాయావమానాలను గ్రహించుకుని హిరణ్యవర్మ ఉగ్రుడైపోయాడు. "నీ కూతురు మగవాడని అబద్ధమాడి నా కూతుర్ని అమెకు పెళ్లి చేసినందుకుగాను నిన్నూ, నీ వంశాన్నీ సర్వనాశనం చేయబోతున్నాను!" అని ఆయన ఒక దూత ద్వారా ద్రుపదుడికి కబురుచేశాడు. ఆ దూత ఈ మాటలను రహస్యంగా ద్రుపదుడి చెవిని వేశాడు.


తాను ఎంతోకాలం దాచిన శిఖండి రహస్యం హిరణ్యవర్మకు తెలిసి ఆయన ఆగ్రహించాడని వినగానే ద్రుపదుడు కొయ్యబారిపోయి, మాటాడలేకపోయాడు. ఆయన తియ్యగా మాట్లాడగలవాళ్లను పిలిచి, "మీరు హిరణ్యవర్మ వద్దకు వెళ్లి, నేను ఆయనను ఏ విధంగానూ మోసం చెయ్యలేదని నచ్చజెప్పి ఆయన ఆగ్రహం పోగొట్టండి!" అన్నాడు.


అయితే ద్రుపదుడి యత్నాలు ఫలించలేదు. తన అల్లుడనుకున్న మనిషి ఆడదన్న సంగతి రూఢిగా ఎరిగిన హిరణ్యవర్మ తన బంధువర్గాన్నంతనూ పిలిచి, ద్రుపదుణ్ణి హతమార్చటానికి బలాలన్నిటితోనూ బయలుదేరమన్నాడు. హిరణ్యవర్మ బంధువులు, "నీవు చెప్పినదే నిజమైతే ఆ ద్రుపదుణ్ణి కట్టి తెస్తాం. అతని కూతురినీ, బంధువులనూ హతమార్చి పాంచాలదేశానికి కొత్త రాజును ఏర్పాటుచేస్తాం!" అన్నారు.

హిరణ్యవర్మ వద్దనుంచి మళ్లీ దూతలు వచ్చి ద్రుపదుడితో, "మా రాజు నిన్ను హతమార్చటానికి ఎత్తివస్తున్నాడు. నీవు కూడా యుద్ధానికి సిద్ధంగా ఉండు!" అన్నారు. ద్రుపదుడు వారితో బింకంగా సరేనని చెప్పి పంపేశాడుగాని లోపల గుండె అదిరిపోతున్నది.

ఆయన చాలా పిరికివాడు; దానికి తోడు తప్పుచేసి ఉన్నాడు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Aug. '59
50 NAYE PAISE
8 AS



ఈ భయంతోబాటు ద్రుపదుడికి ఒక పెద్ద చిక్కు వచ్చిపడింది. తనవారికికూడా శిఖండిగురించి నిజం తెలిసిపోయే పరిస్థితి ఏర్పడింది. వారిదగ్గిర తన పరువు నిలబెట్టు కోవటానికిగాను ద్రుపదుడు ఒక నాటకం ఆడాడు. ఆయన తన భార్య వద్దకు సపరి వారంగా వెళ్ళి, "ఇప్పుడు చాలా పెద్ద చిక్కు వచ్చిపడింది. మన వియ్యంకుడు మన శిఖండి ఆడదని అపోహపడి, తనను మనం మోసంచేశామన్న సాకుతో మనమీదికి దండెత్తి వస్తున్నాడు. ఏమిటిదంతా? నాకు కూడా మన శిఖండి పురుషుడు కాడా అన్న అనుమానం కలుగుతోంది. నిజం ఏమిటో నీకు తెలియకుండా ఉండదుగదా! నేను పొరపాటున ఆ హిరణ్యవర్మకు అపచారం చెయ్యలేదుగదా!" అన్నాడు.

ద్రుపదుడి భార్య యుక్తిగా ద్రుపదుడి పరువు కాపాడింది. ఆమె తన భర్తతో, "మన శిఖండి ఆడపిల్ల అన్న సంగతి నిజమే, మహారాజా! లేక లేక బిడ్డను కన్న నేను ఆడపిల్లను కన్నానంటే నా సవతు లలో లోకువైపోతానన్న భయంతో మగపిల్ల వాడు కలిగాడని బొంకాను. నామీద మీకు గల ప్రేమకొద్దీ నా మాటలు మీరు నమ్మారు, కొడుకుకు చెయ్యవలసిన కర్మకాండ యావత్తూ జరిపించేశారు, చివరకు హిరణ్య వర్మ కుమార్తెను తెచ్చి వివాహంకూడా చేశారు. ఈ రహస్యం ఇంత కాలానికి బయటపడింది!" అన్నది.

ద్రుపదుడు తన మంత్రులతో, "విన్నారు కదా! ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?" అని అడిగాడు.

"మన నగరం సులువుగా శత్రువుకు లొంగేది కాదు. అయినా దానికి మరికొంత అదనపు రక్షణలు ఏర్పాటు చేద్దాం!" అన్నారు మంత్రులు.

అయినా ద్రుపదుడికీ, ఆయన భార్యకూ యుద్ధభయమూ, బెంగా పట్టుకున్నాయి. తమకు యుద్ధభయం లేకుండా చేయమని ప్రార్థిస్తూ ద్రుపదుడూ, ఆయన భార్యా దేవతలను అర్చించారు.

తన మూలంగా ఎటువంటి ఘోర పరిస్థితి ఏర్పడినదీ, యుద్ధంగురించి తన తల్లి దండ్రులు ఎలా భయపడి చస్తున్నదీ శిఖండి గ్రహించింది. "వీరి దుఃఖం నేను చూడలేను. ఇంతకన్న ఆత్మహత్యే మేలు!" అనుకుని ఆమె ఎవరికీ తెలియకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోయి సమీపంలో ఉన్న అడవులలో ప్రవేశించింది.

ఆమె చేరిన అరణ్యం స్థూణాకర్ణుడనే యక్షరాజుది. ఆ యక్షుడు కుబేరుడి అనుచర వర్గంలోవాడు, చాలా బలవంతుడు. ఆయనకు వెరిచి ఆ అరణ్యంలో ఎవరూ ప్రవేశించరు.

అలాటి నిర్జనమైన వనంలో తిండీ తిప్పలూ లేకుండా కొన్నిరోజులు తిరిగిన మీదట శిఖండి తలవనితలంపుగా ఆ యక్ష రాజు కంట పడటం తటస్థించింది.

ఆయన ఆమెతో, "అమ్మాయీ, ఈ అరణ్యంలో చేరి ఉపవాసాలు చేస్తున్న నీ వెవరవు? నావల్ల ఏదైనా సహాయం కావాలంటే చెప్పు!" అన్నాడు.





"అయ్యో, నాకు మీరు కొంచెంకూడా సహాయం చెయ్యలేరు! నాబాధ ఒకరు అర్చేదీ, తీర్చేదీ కాదు!" అన్నది శిఖండి ఎంతో విచారంగా.

"అలా అనకు. నేను కుబేరుడి అనుచరుణ్ణి. నేను ఎవరికైనాసరే చెయ్యలేని సహాయమంటూ ఉండదు. ఇవ్వరానిది కోరినా నేను ఇస్తానని మాట ఇస్తున్నాను!" అన్నాడు యక్షుడు.

శిఖండి తన పెళ్ళి విషయమూ, తన తండ్రిపైకి పిల్లనిచ్చిన మామగారు దండెత్తి వస్తున్న విషయమూ చెప్పేసి, "దేవా, మా మామగారు మా నగరాన్ని నాశనం చేసే లోపుగా చాతనైతే నన్ను మగవాణ్ణి చేయండి. ఆ విధంగాతప్ప; మరేవిధంగానూ మా కష్టం తీరబోదు," అన్నది.

యక్షుడు చిక్కులో పడ్డాడు. ఆయన కొంచెం ఆలోచించి, "అమ్మాయీ, ఏమైనా సరే అన్నమాట తప్పను. కొద్ది కాలంపాటు నీ స్త్రీత్వం నేను తీసుకుని, నా పురుషత్వం నీకిస్తాను. కాని నీ అక్కర తీరిపోయిన మరుక్షణం నీవు నా పురుషత్వాన్ని నాకు తిరిగి ఇచ్చేస్తానని మాత్రం ముందుగా మాట ఇయ్యి!" అన్నాడు.

"దేవా, ధన్యురాలిని! మా మామగారైన హిరణ్యవర్మ తన దేశానికి బయలుదేరి పోగానే మీ పురుషత్వం మీకు తప్పక తిరిగి ఇచ్చి, నా స్త్రీత్వం నేను తీసుకుంటాను!" అన్నది శిఖండి.

స్థూణాకర్ణుడు దివ్యశక్తులు కలవాడు కావటంచేత తన పురుషత్వం శిఖండి కిచ్చి, ఆమె స్త్రీత్వం తాను ధరించి తన ఇంటికి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు శిఖండి మగవాడు. అతను పురుషత్వంతో వెలిగిపోతూ తండ్రి ఇంటికి తిరిగివచ్చాడు. అతను తల్లి దండ్రులకు నమస్కారం చేసి జరిగిన సంగతి చెప్పేసరికి వారు పరమానంద భరితులయారు.


ఇక ద్రుపదుడు ఎక్కడలేని ధైర్యమూ తెచ్చుకుని, తన పైకి దండెత్తి వచ్చే హిరణ్యవర్మకు, "నా కుమారుడైన శిఖండి పురుషుడు కాడని మీకు ఏవిధమైన అనుమానంగాని ఉన్న పక్షంలో మీరే వచ్చి స్వయంగా నిజం తెలుసుకోవచ్చు!" అని కబురుచేశాడు.

ఈ వార్త విని హిరణ్యవర్మ పాంచాల దేశపు రాజధాని అయిన కాంపిల్య నగరానికి వచ్చి ఒక బ్రాహ్మణుణ్ణి ద్రుపదుడివద్దకు దూతగా పంపాడు.

ఆ బ్రాహ్మణుడు వచ్చి తమ రాజుగారి మాటలుగా ద్రుపదుడితో, "రాజాధమా, నీ కూతురికి నా కూతుర్ని భార్యగా చేసుకుని నన్ను మోసగించినందుకు ఫలం అనుభవించబోతున్నావులే!" అన్నాడు.

ద్రుపదుడు ఆ బ్రాహ్మణుడికి అర్ఘ్యమూ, గోవూ ఇవ్వబోయాడు. కాని ఆ బ్రాహ్మణుడు వాటిని నిరాకరించాడు. ఆయనను సాగనంపి ద్రుపదుడు హిరణ్యవర్మవద్దకు తానే ఒక బ్రాహ్మణ్ణి పంపాడు. ఆ బ్రాహ్మణుడు హిరణ్యవర్మవద్దకు వెళ్లి, "మహారాజా, మా రాజుగారు మీతో ఇలా చెప్పమన్నారు: "మా శిఖండి పురుషుడు కాడని మీతో ఎవరో అసత్యాలు చెప్పారు. అతను వాస్తవంగా పురుషుడే! మీరు నిరభ్యంతరంగా మా





గృహానికి వచ్చి, యిందులోవున్న నిజం గ్రహించండి!" అన్నాడు.

హిరణ్యవర్మ నిజం తెలుసుకు రావటానికి కొందరు మనుషులను ద్రుపదుడి ఇంటికి పంపాడు.

వారు కొన్ని దినాలకు తిరిగివచ్చి హిరణ్య వర్మతో శిఖండి స్త్రీ కాదనీ, పురుషుడేననీ తేల్చి చెప్పారు.

హిరణ్యవర్మ ఆగ్రహమంతా మటుమాయమై అంతులేని ఆనందం కలిగింది. శత్రువుగా వచ్చినవాడు కాస్తా ద్రుపదుడికి అతిథిగా మారి, తన వియ్యంకుడు చేసిన సత్కారాలన్నీ స్వీకరించి, తన అల్లుడికి అంతులేని డబ్బూ, గుర్రాలూ, ఏనుగులూ, ఆవులూ, అందగత్తెలైన వెయ్యిమంది దాసీలనూ బహూకరించి తృప్తిగా ఇంటికి తిరిగి వెళ్లాడు.

ఇక్కడ శిఖండి తాత్కాలిక సమస్య పరిష్కారమయేలోపుగా అక్కడ యక్షుడికి తీరని కష్టం వచ్చిపడింది. ఒకనాడు తలవని తలంపుగా కుబేరుడు తన విమానంలో సపరివారంగా వచ్చి వనంలోవున్న యక్షుడి ఇంటి పైభాగాన దిగాడు.

తాను వచ్చి ఎంతసేపైనా కూడా స్థూణాకర్ణుడు తనకు స్వాగతం చెప్పటానికి రాకపోవటం కుబేరుడికి విడ్డూరంగా కనిపించింది. అప్పుడు ఆయనకు, స్థూణాకర్ణుడు ద్రుపదుడనే పాంచాలరాజు కుమార్తెకు తన పురుషత్వం ఇచ్చి తాత్కాలికంగా తాను ఆమె స్త్రీత్వం ధరించి ఉన్నాడనీ, ఆ రూపంలో తన యజమాని ఎదటికి రావటానికి సిగ్గుపడుతున్నాడనీ తెలిసింది.

"దుర్మార్గుడు, ఏం పని చేశాడూ! వాణ్ణి తక్షణం నా వద్దకు తీసుకురండి!" అని కుబేరుడు తన పరివారంలోని యక్షులను ఆజ్ఞాపించాడు. స్త్రీ రూపంలో ఉన్న యక్షుడు కుబేరుడు సమక్షానికి వచ్చి సిగ్గుతో తల వంచుకుని నిలబడ్డాడు.

కుబేరుడు యక్షుణ్ణి చూసి మరింత కోపం వచ్చినవాడై, "నీచుడా, ఏమాత్రమూ విచక్షణ లేక ఎవతెకో నీ పురుషత్వం ఇచ్చేసి, ఆమె స్త్రీత్వం స్వీకరిస్తావా? ఎప్పటికీ స్త్రీవి గానే ఉండిపో! ఆ స్త్రీని శాశ్వతంగా మగవాడుగా ఉండనీ! ఇదే నీకు శిక్ష!" అని శపించాడు.

మిగిలిన యక్షులు తమ సాటి యక్షుణ్ణి చూసి జాలిపడి శాపానికి పరిహారం ఏదన్నా చెప్పమని కుబేరుణ్ణి ప్రాధేయపడ్డారు. కుబేరుడు కనికరించి, శిఖండి చనిపోయినాక యక్షుడికి పురుషత్వ ప్రాప్తి కలిగేలాగు అనుమతించాడు. తరవాత కుబేరుడూ, ఆయన వెంటవచ్చిన పరివారమూ విమానంలో వెళ్లిపోయారు.

తన మామగారు తిరిగిపోగానే శిఖండి అన్నప్రకారం యక్షుడున్న చోటికి వచ్చి, "మహాత్మా, నీ ధర్మాన మా ఆపద గడిచింది. మీ పురుషత్వం మీరు తీసుకుని నా స్త్రీత్వం నాకివ్వండి!" అన్నాడు.

యక్షుడు శిఖండితో జరిగిన సంగతి అంతా చెప్పి, "నీవు బతికిఉన్నంత కాలమూ నా పురుషత్వం ధరించి సుఖంగా జీవించు. అన్న మాటప్రకారం నా పురుషత్వం నాకివ్వటానికి తిరిగి వచ్చినందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. నేను కిందటి



జన్మలో ఏదో పాపం చేసుకుని ఉండటంవల్ల ఇలా జరిగి ఉంటుంది. లేకపోతే నేను స్త్రీగా ఉన్న సమయంలోనే పరీక్షగా కుబేరుడు నన్ను చూడరావాలా ?" అన్నాడు ఎంతో విచారపడుతూ.

శిఖండి యక్షుడికి ప్రణామంచేసి పరమానందంతో ఇంటికి తిరిగి వెళ్లి, దేవతలను ఆరాధించి, బ్రాహ్మణులకు ధన కనక వస్తు వాహనాదులు దానాలు చేశాడు. ఇక ద్రుపదుడి సంతోషానికి మేర లేనేలేదు. ఆయన శిఖండినీ, ధృష్టద్యుమ్నుణ్ణీ ద్రోణుడి వద్ద శిష్యులుగా ఉంచి వారికి విలువిద్య నేర్పించాడు.


వారు ద్రోణశిష్యులై ధనుర్వేదం నాలుగు పాదాలూ పూర్తిగా అభ్యసించారు.

భీష్ముడు ఈ కథ యావత్తూ దుర్యోధనుడికి చెప్పి, "నాయనా, నేనీ రహస్యాలన్నీ నా వేగులవాళ్లద్వారా తెలుసుకున్నాను. వారు మందమతులుగానూ, చెవిటివాళ్లుగానూ, వికలాంగులుగానూ నటించుతూ ద్రుపదుడి నగరంలో ఉండి జరిగిన ప్రతి సంగతీ నాకు తెలుపుతూ వచ్చారు. శివుడి వరంవల్ల అంబ శిఖండి జన్మ ఎత్తి కొంతకాలం స్త్రీగా ఉండి ఇప్పుడు పురుషరూపం ధరించింది. ఇతడు యుద్ధభూమిలో నాకు ఎదురైతే అతనికేసి చూడనైనా చూడను, అతనితో యుద్ధం చెయ్యను, అతనిని చంపను. స్త్రీతోగాని, ఒకప్పుడు స్త్రీగా ఉండిన పురుషుడితోగాని, స్త్రీల పేరు పెట్టుకున్నవాడితోగాని, స్త్రీల మాదిరిగా మసులుకునేవాడితోగాని యుద్ధం చెయ్యరాదని నేను నియమం పెట్టుకున్నాను; ఆ సంగతి లోకానికంతకూ తెలుసు. భీష్ముడు ఆడదాన్ని చంపాడంటే అది ఎంత అప్రతిష్ఠ!" అన్నాడు.

దుర్యోధనుడుకూడా బాగా ఆలోచించి ఆయనకు అలాటి నియమం ఉండటం సమంజసమే ననుకున్నాడు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Sep. '59
50
8



మహాభారతం

పొద్దున్నే ఉదయం దుర్యోధనుడు సభ చేసి, తన తాతగారైన భీష్ముడితో, "మహానుభావా, నీవు పాండవ సైన్యాన్ని చూశావు గదా! దానిని నీవు ఒక్కడవే ఎంతకాలంలో నిర్మూలించగలవు? అదే విధంగా ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణుడూ ఎంతెంత కాలంలో పాండవసేనను తమ తమ దివ్యాస్త్రాలతో నిర్మూలించగలరో తెలుసుకోవాలని నాకు కుతూహలంగా ఉన్నది!" అన్నాడు.

దానికి భీష్ముడు, "రాజా, నీ పక్షాన యుద్ధంచేసేవారి బలాధిక్యతను తెలుసుకోవటం ఉచితమే. నా శక్తి గురించి చెబుతాను విను. నేను రోజుకు పదివేలమంది యోధులనూ, వెయ్యిమంది రథికులనూ చంపగలను. లక్షల సంఖ్యలో శత్రువులను చంపగల దివ్యాస్త్రాలు నావద్ద ఉన్నవి. వాటినికూడా ప్రయోగించినట్టయితే పాండవసేనను నాశనం చెయ్యటానికి నాకు ఒక్క మాసం పట్టుతుంది," అన్నాడు.

తరవాత దుర్యోధనుడు ద్రోణాచార్యుణ్ణి అదే విధంగా అడిగాడు. దానికి ద్రోణుడు చిరునవ్వు నవ్వి, "రాజా, నేను ముసలివాణ్ణి అయిపోయాను. నా శక్తి మందగించింది. నేనుకూడా భీష్మునిలాగే ఒక్క నెలలో పాండవసేన యావత్తూ నిర్మూలించగలుగుతాను. అంతకు మించి నాకు శక్తి చాలదు," అన్నాడు.

తరవాత కృపుడు రెండు మాసాలలోనూ, అశ్వత్థామ పది రోజులలోనూ, పాండవ సైన్యాన్ని నిర్మూలిస్తామన్నారు. కర్ణుడు మాత్రం అయిదు రోజులలోనే అంత పనీ చేస్తాననేశాడు. ఈ మాటలు విని భీష్ముడు గట్టిగా నవ్వి, "కృష్ణుడు సారథిగా అర్జునుడు ఎదురుతగిలేదాకా నీవు ఇలాగే ప్రగల్భాలు పలుకుతావు; ఇంతకంటెకూడా గొప్ప



పనులు చేస్తూనే ఉంటావు!'' అన్నాడు. కౌరవసభలో జరిగిన ఈ సంభాషణ అంతా చారులవల్ల ధర్మరాజుకు తెలిసింది. ఆయన తన తమ్ములను రహస్యంగా పిలిచి, వారితో భీష్మ ద్రోణ కృపాశ్వత్థామలూ, కర్ణుడూ అన్న మాటలు చెప్పి, అర్జునుడితో, "నీవు కౌరవసేనను ఎంత కాలంలో నిర్మూలించ గలవు? నాకు తెలుసుకోవాలని ఉన్నది!'' అని అడిగాడు.

అర్జునుడు ఒకసారి కృష్ణుడికేసి చూసి ధర్మరాజుతో, "మన ప్రతిపక్షులనుగురించి నీకేమాత్రమూ భయము వద్దు. మనలో మహారథులూ, అతిరథులూ ఉన్నారు. వారు కౌరవసేనలను నిర్మూలించేస్తారు. మహేశ్వరుడు మాయా కిరాతరూపంలో నాతో ద్వంద్వయుద్ధం చేసి నా శక్తికి మెచ్చి ప్రసాదించిన పాశుపతాస్త్రం నావద్ద లేదా? అది ఒక్క క్షణంలో మూడు లోకాలనూ నాశనంచేసే అద్భుతశక్తి కలది. కృష్ణుడి అండ ఉంటే నేనా మహాస్త్రంతో మూడు లోకాలనూ తృటిలో చంపగలను. అలాటి అస్త్రం భీష్మాదులవద్ద లేదు. అయితే మనం అలాటి అస్త్రాలను ప్రయోగించకుండా న్యాయమైన యుద్ధంలోనే శత్రువులను జయించుదాం. మనలో శిఖండీ, యుయుధానుడూ, ధృష్టద్యుమ్నుడూ, భీముడూ, నకుల సహదేవులూ, యుధామన్యుడూ, ఉత్తమౌజుడూ, శంఖుడూ, ఘటోత్కచుడూ, సాత్యకీ, అభిమన్యుడూ, నీవూ, విరాట ద్రుపదులూ, ఉపపాండవులూ కలిసి మూడు లోకాలనూ జయించగలవారు కారా?'' అన్నాడు.

మర్నాడు తెల్లవారుతూనే పడమటినుంచి పాండవుల సేనలూ, తూర్పునుంచి కౌరవ సేనలూ బయలుదేరి యుద్ధభూమిని చేరాయి. ఆ సమయాన జంబూద్వీపంలో గల యోధానుయోధు లందరూ కురుక్షేత్రం లోనే ఉండటంచేత మిగిలిన ద్వీపమంతా

నిర్వీర్యమైపోయినట్టయింది. ఉభయపక్షాలా యుద్ధోత్సాహం మిన్నుముట్టుతున్నది. ఆకాశంలో మహాయోధుల ధ్వజాలు మెరుస్తున్నాయి. వారు చేసే శంఖారావాలకు దిక్కులు పిక్కటిల్లుతున్నాయి.

ఉభయపక్షాలవారూ యుద్ధనియమాలు చేసుకున్నారు: పోరాటం జరిగే స్థలాన్ని విడిచిపెట్టి వెళ్లేవాణ్ణి చంపరాదు; రథంపై ఉన్నవాడు రథంపై ఉన్నవాడితోనూ, ఏనుగుపై ఉన్నవాడు ఏనుగుపై ఉన్నవాడితోనూ, అశ్వారూఢుడు అశ్వారూఢుడితోనూ, పదాతి పదాతితోనూ మాత్రమే యుద్ధం చెయ్యాలి; తనను నమ్మి పోరాటం చాలించినవాణ్ణీ, స్పృహ తప్పినవాణ్ణీ కొట్టరాదు; యుద్ధవిముఖుణ్ణీ, శస్త్రకవచాదులు లేనివాణ్ణీ కొట్టరాదు; రథికుడు లేని గుర్రాలనూ, సారథినీ, బాణాలు అందించేవారినీ, శంఖాలూ భేరులూ మోగించేవారినీ కొట్టరాదు.

ఈ సమయంలో వ్యాసమహాముని ధృతరాష్ట్రుణ్ణి చూడవచ్చి, "నాయనా, కాలమహిమవల్ల యోధులందరూ కురుక్షేత్రంలో చేరి యుద్ధంలో చావనున్నారు. నీవు వారి కోసం విచారించటం నిరర్థకం. యుద్ధరంగ విశేషాలు సంజయుడు చూసివచ్చి ఎప్పటికప్పుడు నీకు చెబుతూ ఉంటాడు," అని



చెప్పాడు. అలాగే సంజయుడు భారత యుద్ధంసాగిన పద్దెనిమిది రోజులూ యుద్ధ రంగ విశేషాలను ఎప్పటివి అప్పుడు తెలియజేస్తూవచ్చాడు.

అక్కడ యుద్ధరంగాన కౌరవ సర్వసేనాని అయిన భీష్ముడు, తెల్లని కవచమూ, తలపాగా ధరించి, తాటిచెట్టు జెండా గల రథమెక్కి, తన పక్షాన గల వీరులను ఈ విధంగా సంబోధించి, హెచ్చరించాడు: "ఓ క్షత్రియ వీరులారా! మీకోసం స్వర్గ ద్వారాలు తెరిచి ఉన్నాయి. ఆ దారిన మీరు ఇంద్రలోకానికీ, బ్రహ్మలోకానికీ పోగలరు. మనకు అనాదిగా వస్తున్న వేదోక్త మార్గమిదే. కనక మీరు భయం విడిచిపెట్టి, యుద్ధంమీదనే దృష్టి నిలిపి, పూర్వం నాభాగుడూ, మాంధాతా, యయాతీ, నహుషుడూ మొదలైనవారు నడిచిన దారినే నడవండి. వ్యాధిగ్రస్తులై, ఇళ్లలో చనిపోవటం క్షత్రియ లక్షణం కాదని మరవకండి!"

కౌరవ సైన్యమంతా ఒక వ్యూహంగా అమర్చబడింది. అందులో వివిధ యోధులు తమకు నిర్ణయించిన స్థానాలలో ఉన్నారు. అది పదకొండు అక్షౌహిణుల సేన.

అవతల అర్జునుడు తమ ఏడు అక్షౌహిణుల సేనను వజ్రమనే వ్యూహంలో అమర్చాడు. అది దుర్జయమైన వ్యూహం.



ఆ వ్యూహంముందు భీముణ్ణి నిలబెట్టాడు. నకుల సహదేవులు భీముడికి చక్రరక్షకులుగా ఉంచబడ్డారు. భీముడి వెనుక పార్శ్వాన్ని రక్షించటానికి ఉపపాండవులూ, అభిమన్యుడూ ఉంచబడ్డారు. వీరందరినీ సర్వసేనాని అయిన ధృష్టద్యుమ్నుడు రక్షించాడు.

రెండు సేనలూ ముందుకు కదలివచ్చి ఒకదాన్ని ఒకటి సమీపించాయి. ఆ సమయానికి సూర్యోదయమయింది.

మహా సముద్రంలాటి కౌరవసేననూ, దానికి నాయకుడైన భీష్ముణ్ణీ చూసి ధర్మరాజు కంగారుపడి అర్జునుణ్ణి తన సమీపానికి పిలిచి, "చూశావా, శత్రుసేన ఎలాటి దుర్భేద్యమైన వ్యూహం పన్ని ఉన్నదో! పైగా వారి పక్షాన భీష్ముడున్నాడు. ఈ సేనను గెలవటం మనవల్ల అవుతుందా?" అని అడిగాడు.

"రాజా, జయానికి బలవీర్యాలు ప్రధానం కావు, ధర్మం ప్రధానం. మన పక్షాన ధర్మం ఉన్నది. పైగా కృష్ణుడు మన పక్షాన ఉన్నాడు. మనకు విజయం తప్పదు!" అని అర్జునుడు ధర్మరాజుకు ధైర్యం చెప్పాడు.

కృష్ణుడు అర్జునుడితో, యుద్ధరంగంలోకి ప్రవేశించేముందు దుర్గాస్తవం చేయమని



సలహా ఇచ్చాడు. అర్జునుడు రథం దిగి, యుద్ధరంగంవేపు తిరిగి, చేతులు జోడించి దుర్గను ధ్యానించాడు. తరవాత తిరిగి రథ మెక్కి, "కృష్ణా, నేను ఎవరెవరితోనైతే యుద్ధం చేయవలసి ఉన్నదో వారందరినీ ఒకసారి చూస్తాను. నా రథాన్ని రెండు సేనల మధ్యకూ తీసుకుపోయి నిలబెట్టు!" అన్నాడు. కృష్ణుడు అలాగే చేశాడు.

అర్జునుడు కౌరవసేనను కలయ చూశాడు. ఎటు చూసినా అతనికి తండ్రులూ, తాతలూ, గురువులూ, మేనమామలూ, అన్నలూ, తమ్ములూ, కొడుకులూ, మనవలూ, మిత్రులూ, తదితర బంధువులూ కనిపించారు. అతను వణికిపోతూ, "కృష్ణా, రాజ్యంకోసమూ, భోగాల కోసమూ నేను చంపవలిసింది వీరినా? వీరిని చంపి ఇంద్రభోగాలు సయితం అనుభవించగలనా? కౌరవులు నీచులై వీరందరి వినాశనానికి ఒడిగట్టారుగాని, నేను వీరిని చంపేకంటె వీరిచేత చావటానికే ఇష్టపడతాను. నేను యుద్ధం చెయ్యలేను. గాండీవాన్ని పట్టుకోలేను!" అని దీనాలాపాలాడాడు. అతని కళ్లవెంట నీరు కారసాగింది.

కృష్ణుడు అర్జునుడి బుద్ధిని ఆవరించిన అజ్ఞానాన్ని పోగొట్టటానికి ఎన్నో విషయాలు



చెప్పాడు. "నీవు చంపేవాడవు కావు, వీరు చచ్చేవారూ కారు. మనుషుల దేహాలు ఎలాగూ పోతాయి, అవి క్షణభంగురాలు. ఆత్మకు నాశమనేది ఎన్నడూ లేదు. నీవు చంపేవాడివన్న భ్రమ వదిలిపెట్టి, నీ ధర్మం నీవు చెయ్యి. నీకు కర్మచేసే అధికారమే ఉన్నదిగాని దాని ఫలితంపై అధికారం లేదు," అంటూ కృష్ణుడు ఆత్మనుగురించీ, కర్మనుగురించీ, జ్ఞానంగురించీ, యోగం గురించీ, మోక్షంగురించీ అనేక విషయాలు అర్జునుడికి తెలియజేశాడు.

చివరకు కృష్ణుడు తన విశ్వరూపాన్ని కూడా దివ్యదృష్టిద్వారా అర్జునుడికి చూపించాడు.

కృష్ణుడి హితబోధతో అర్జునుడి భ్రమలూ, భయాలూ, అనుమానాలూ వదిలిపోయాయి; "కృష్ణా, నాకు కర్తవ్యం ఉపదేశించు. నీవు ఏం చెయ్యమంటే అది చేస్తాను!" అన్నాడతడు.

ఇంతలో ధర్మరాజు తన కవచం విప్పేసి, చేతిలోని ఆయుధాన్ని వదిలేసి, రథం దిగి మౌనంగా శత్రుసేనకేసి వెళ్ళసాగాడు. ఇది చూడగానే అర్జునుడూ, భీమ నకుల సహదేవులూ, కృష్ణుడూ, కొంతమంది ఇతర రాజులూ రథాలు దిగి పాండవసేననుంచి బయలుదేరి ధర్మరాజును అనుసరించారు.


"ఈ ప్రయాణం ఎక్కడికి? ఎందుకు? కవచంకూడా లేకుండా శత్రువుల మధ్యకు పోవటం ప్రమాదకరం కాదా?" అని తమ్ములు ధర్మరాజును అడిగారు. కాని ధర్మరాజు వారికి ఏ జవాబూ ఇవ్వకుండా ముందుకు సాగాడు.


కృష్ణుడు ధర్మరాజు భావం గ్రహించినట్టుగా నవ్వి, "ధర్మరాజు వెళుతున్నది, యుద్ధానికి భీష్మ ద్రోణ కృప శల్యుల అనుమతి పొందటానికి. అలా పెద్దల అనుమతిపై యుద్ధం సాగించటం శ్రేయస్కరం. ఆ సంగతి ఆయనకు తెలుసు!" అన్నాడు.



చందమామ

పిల్లల కథల మాసపత్రిక





మహాభారతం

అవతల కౌరవసేనలో కొందరు ధర్మరాజు రావటం చూసి హాహాకారాలు చేశారు, కొందరు మౌనంగా ఉన్నారు. మరికొందరు, "చూశావా? ధర్మరాజు బెదిరిపోయి తన ప్రాణాలూ, తన తమ్ముల ప్రాణాలూ కాపాడమని భీష్ముణ్ణి వేడుకోవటానికి వస్తున్నాడు. అటువంటి తమ్ములను పెట్టుకుని ఇంత భయపడేవాడు ఇతను ఏం క్షత్రియుడు? తీరా యుద్ధం చేయవలిసి వచ్చేసరికి కాళ్లు చల్లబడ్డాయి!" అనుకున్నారు.

వారిలో కొందరు పైకి "ఛీ, ఛీ!" అనికూడా అన్నారు.

ఈలోపుగా ధర్మరాజు తన తమ్ములతో కూడా కౌరవసైన్యం ప్రవేశించి భీష్ముణ్ణి చేరుకుని, ఆయన పాదాలపై పడి, "తాతా, ఎవరూ గెలవలేని నీతో మాకు యుద్ధం సంప్రాప్తమయింది. అందుకు అనుమతించి, మమ్మల్ని దీవించు!" అన్నాడు.

ఆ మాటలు విని భీష్ముడు, "నాయనా, నీవు వచ్చి ఇలా నన్ను కోరటం చూసి నేనెంతో సంతోషిస్తున్నాను. నేను కౌరవుల ఉప్పు తిన్నవాణ్ణికనక వారి పక్షాన యుద్ధం చెయ్యక తప్పదు. నీవు యుద్ధం చెయ్యి, జయం పొందుతావు. నావల్ల ఏ వరమైనా కావలిస్తే కోరుకో!" అన్నాడు.

"తాతా, ఎప్పుడూ నా మేలు కోరుతూ, నాకు తగిన సలహా ఇస్తూవుండు. నీవు యుద్ధంచెయ్యటం నాకేమాత్రమూ అభ్యంతరం లేదు," అన్నాడు ధర్మరాజు.

"నాయనా, ఏ విషయమై నా సలహా కావాలి?" అని భీష్ముడడిగాడు.

"తాతా, నీవు ఎవరికీ ఓడవుగదా? నిన్ను ఓడించటానికి మేము ఏం చేయాలి?" అని ధర్మరాజు అడిగాడు.

"ధర్మరాజా, నన్ను యుద్ధంలో చంపగలవా డెవడో నాకు తెలియటంలేదు. మళ్లీ


అట్టమీది బొమ్మ


ఇంకొకసారి కలుసుకుందాంలే!" అన్నాడు భీష్ముడు.

ధర్మరాజు భీష్ముడికి నమస్కారం చేసి ఆయనవద్ద సెలవు తీసుకుని, తమ్ములతో సహా ద్రోణుడివద్దకు వెళ్లి ఆయనకు నమస్కరించి, "ఆచార్యా, గురువైన నీ అనుమతి లేకుండా యుద్ధం ప్రారంభించటం దోషమవుతుంది. కనుక నాకు అనుమతి ఇయ్యి!" అని కోరాడు.

ద్రోణుడు కూడా భీష్ముడిలాగే ధర్మరాజును యుద్ధంచెయ్యమనీ, విజయం పొందమనీ ఆశీర్వదించి, "యుద్ధసహాయం తప్ప ఇంకేది కోరినా చేస్తాను," అన్నాడు. ధర్మరాజు విజయమయేలాగు ఆశీర్వదించమని కోరాడు. ద్రోణుడు అలాగే ఆశీర్వదించాడు. తరవాత ధర్మరాజు ద్రోణుడితో, "మిమ్మల్ని ఓడించే ఉపాయం ఏదైనా ఉంటే చెప్పండి!" అన్నాడు.

"నేను అస్త్రశస్త్రాలు ధరించి ఉండగా నన్నెవడూ ఓడించలేడు. నన్ను చంపాలంటే వాటిని నేను విసర్జించినప్పుడే చంపాలి. యుద్ధం చేసే సమయంలో నాకు దుర్వార్త ఏదైనా తెలిస్తే నేను వెంటనే అస్త్రశస్త్రాలను విడిచిపెడతాను. అంతేగాని మరొక పరిస్థితిలో నేను యుద్ధం మానను," అన్నాడు ద్రోణుడు.





తరవాత ధర్మరాజు కృపుడివద్దకూ, శల్యుడివద్దకూ వెళ్లి వారికి నమస్కారాలు చేసి యుద్ధంచెయ్యటానికి వారి అనుమతీ, యుద్ధంలో విజయం కలిగేటట్టు వారి ఆశీస్సులూ పొందాడు. తన మేనమామ అయిన శల్యుడితో ఆయన, "మామా, కర్ణుణ్ణి చంపటానికి మాకు నీ సహాయం అవసరమవుతుంది," అన్నాడు. అలాగే సహాయం చేస్తానన్నాడు శల్యుడు.

ఈలోపుగా కృష్ణుడు కర్ణుడున్న చోటికి వెళ్లి, "కర్ణా, భీష్ముడు జీవించివుండగా యుద్ధం చెయ్యనని ప్రతిజ్ఞచేసినట్టు విన్నాను. అంతదాకా పాండవుల పక్షాన యుద్ధంచేయరాదా? ఆ తరవాత కౌరవులపక్షానికి మారవచ్చు!" అన్నాడు.

ఈ మాట విని కర్ణుడు కృష్ణుడితో, "కృష్ణా, నేను దుర్యోధనుడికోసం ప్రాణాలు అర్పించటానికి సిద్ధంగా ఉన్నవాణ్ణి, నీవు చెప్పినట్టు చేసి అతనికి అపకారం చేస్తాననుకున్నావా?" అన్నాడు.

నమస్కారాలు చేయవలసినవారందరికీ చేసి, తన సైన్యానికి తిరిగివస్తున్న ధర్మరాజు రెండు సైన్యాలమధ్యా ఆగి, కౌరవపక్షాన గల యోధులతో, "ఓ సైనికులారా, మీలో ఎవరుగాని మా పక్షాన యుద్ధంచెయ్యటానికి ఇష్టపడినట్టయితే వారిని రావలిసిందిగా మేము కోరుతున్నాం!" అని అన్నాడు.


కౌరవసైన్యంలో ఉన్న యుయుత్సుడు ధర్మరాజుతో, "రాజా, నీవు కోరేపక్షంలో నేను నీవైపు చేరి కౌరవులతో యుద్ధం చేస్తాను!" అన్నాడు. ఈ యుయుత్సుడు కూడా ధృతరాష్ట్రుడి కొడుకులలో ఒకడు. ఇతని తల్లి ఒక వైశ్యస్త్రీ.

ధర్మరాజు ఆదరంతో, "యుయుత్సుడా, రా, రా! మూఢులైన నీ అన్నలతో మన మంతా కలిసి పోరాడదాం! దుర్యోధనాదులకు తండ్రికి పిండాలు పెట్టే యోగ్యత లేదు, నీవైనా ఆపని చేద్దువుగాని!" అన్నాడు.

వెంటనే యుయుత్సుడు పాండవుల సేనకు మారాడు. ధర్మరాజు తన రథం వద్దకు వెళ్ళి కవచం ధరించాడు. పాండవు లంతా యుద్ధసన్నద్ధులై తమ తమ రథా లలో ఉన్నదీ లేనిదీ సర్వసేనాని ధృష్ట ద్యుమ్నుడు ఒకసారి చూసుకున్నాడు. తర వాత రెండు పక్షాలవారూ శంఖాలూ, భేరులూ మోగించారు.

యుద్ధం ఆరంభమయింది. మహాభయం కరమైన భారతయుద్ధంలో మొదటి సంఘర్షణా, తుది సంఘర్షణాకూడా భీముడే నిర్వహించాడు. పాండవసేనకు ముందు నిలబడివున్న భీముడు దిక్కులు బద్దలయే లాగ ఒక పెడబొబ్బ పెట్టి, యముడులాగా కౌరవులపైకి ఉరికాడు. దుర్యోధన దుశ్శాస నాదులు అతనికి ఎదురువెళ్ళారు. పాండవుల వైపునుంచి ఉపపాండవులూ, అభి మన్యుడూ, నకుల సహదేవులూ, ధృష్ట ద్యుమ్నుడూ మొదలైనవారు దుశ్శాసనాదు లను ప్రతిఘటించి తమ విలువిద్య ప్రద ర్శించసాగారు. వెంటనే ఉభయ పక్షాల గల యోధులు ఒకరితో ఒకరు పోరాటం ప్రారంభించారు.

ఒకవైపునుంచి భీష్ముడూ, రెండోవైపు నుంచి అర్జునుడూ శత్రుసేనలను కార్చిచ్చు



లాగా నిర్మూలించుకుంటూ వచ్చి ఒకరి కొకరు తారసిల్లారు. వారిద్దరిమధ్యా భీకర మైన ద్వంద్వయుద్ధం సాగింది.

ఇదే విధంగా సైన్యమంతటా ద్వంద్వ యుద్ధాలు సాగాయి. కృతవర్మతో సాత్యకీ, కోసలరాజైన బృహద్బలుడితో అభి మన్యుడూ, దుర్యోధనుడితో భీముడూ, దుశ్శాసనుడితో నకులుడూ, దుర్ముఖుడితో సహదేవుడూ, శల్యుడితో ధర్మరాజూ, ద్రోణు డితో ధృష్టద్యుమ్నుడూ, అలంబసుడితో ఘటోత్కచుడూ, అశ్వత్థామతో శిఖండీ, సైంధవుడితో ద్రుపదుడూ, వికర్ణుడితో భీముడి కొడుకు శ్రుతసోముడూ, శకునితో

ధర్మరాజు కొడుకు ప్రతివింధ్యుడూ—ఈ విధంగా అనేక జంటలుగా ఉభయ పక్షాల యోధులు ద్వంద్వయుద్ధాలు చేసుకున్నారు. ఈ యుద్ధాలలో యోధులెవరూ చావలేదు గాని ఎన్నో ధ్వజాలు విరిగాయి, రథాలు కూలాయి, గుర్రాలు చచ్చాయి, సారథులు చచ్చారు, ఎంతోమంది యోధులు గాయ పడ్డారు. ఈ ద్వంద్వయుద్ధాల వెంబడే దొమ్మి యుద్ధంకూడా సాగింది. దొమ్మి యుద్ధంలో సైనికులూ, గుర్రాలూ, ఏను గులూ అపారంగా చావటం జరిగింది.

మిట్టమధ్యాన్నం కావస్తున్నదనగా భీష్ముడు మృత్యుదేవతలాగా పాండవసైన్యం లోకి జొరబడ్డాడు. ఆయనను రక్షించటానికి గాను దుర్యోధనుడు దుర్ముఖుణ్ణీ, కృత వర్మనూ, కృపుణ్ణీ, శల్యుణ్ణీ మరికొందరినీ నియోగించాడు. తమ సేనను చీల్చిచెండాడ వస్తున్న భీష్ముణ్ణి చూసి అభిమన్యుడు మండిపడి ఆయనకు ఎదురువెళ్ళాడు. అతని రథంపైన కొండగోగు గుర్తు గల జెండా ఎగురుతున్నది.

అభిమన్యుడు భీష్ముణ్ణి ఎదుర్కొంటూనే ఆయనపైనా ఆయనకు సహాయంగా ఉన్న వారిపైనా శరపరంపర ప్రయోగించాడు; భీష్ముడి శరీరంలో తొమ్మిది బాణాలు గుచ్చుకున్నాయి; కృపుడి చేతి విల్లు విరిగి



పడింది; దుర్యోధనుడి జెండా ఒక్క దెబ్బతో విరిగింది, ఇంకొక దెబ్బకు అతని సారథి తల పడిపోయింది! అభిమన్యుడి యుద్ధం చూసేవారికి అర్జునుడు జ్ఞాపకం వచ్చాడు. భీష్ముడు అభిమన్యుణ్ణి వెనక్కు మరల్చటానికి ఎంతో ప్రయత్నించాడు గాని అభిమన్యుడు తనపైకి వచ్చే బాణాలన్నిటినీ ఖండిస్తూ, చివరకు భీష్ముడి తాటిచెట్టు జెండానే పడగొట్టేశాడు.

ఇదిచూసి భీముడు పరమానందంతో సింహనాదం చేశాడు.

ఇంతలో విరాటుడూ, ఆయన కొడుకులూ, సాత్యకీ, ధృష్టద్యుమ్నుడూ మొదలైనవారు అక్కడికి వచ్చి కౌరవయోధులతో తలపడ్డారు. ఈ తలపడటంలో ఉత్తరుడు శల్యుడిపైకి వెళ్లాడు. అతను అప్పుడొక ఏనుగునెక్కి ఉన్నాడు. ఆ ఏనుగు శల్యుడి రథంపైకి లంఘించి, ఆ రథానికి కట్టి ఉన్న గుర్రాలు నాలుగింటినీ చంపేసింది. శల్యుడు రథం దిగకుండానే అతి దారుణమైన శక్తిని ఉత్తరుడిపైన విసిరాడు. శక్తి ఉత్తరుడి కవచాన్ని ఛేదించి అతన్ని మూర్ఛ పోగొట్టింది. ఉత్తరుడి చేతినుంచి అంకుశం జారిపోయింది. అతను ఏనుగుపై నుంచి నేలపై పడిపోయాడు. ఈలోపుగా శల్యుడు కృతవర్మ రథంలోకి ఎక్కాడు.





తన సోదరుడు శల్యుడిచేత దెబ్బతినటం గమనించి విరాటుడి మరొక కుమారుడైన శ్వేతుడు కోపావేశంతో కౌరవయోధు లేడు గురిపైకి ఒంటరిగా వచ్చాడు. అతను శత్రువులతో అతి భయంకరమైన యుద్ధం చేశాడు; ఏడుగురి విల్లులూ విరగగొట్టాడు; వారందరూ తనపై విసిరిన ఏడు శక్తులను తన బాణాలతో పడగొట్టాడు; శకుని కొడుకైన రుక్మరథుణ్ణి ఒక్క బాణంతో మూర్ఛపోగొట్టి, శల్యుడి రథంపైకి సింహంలాగా వచ్చిపడ్డాడు. ఆ రోజు శల్యుడు శ్వేతుడి చేతిలో చావవలిసినవాడే, సమయానికి దుర్యోధనుడు భీష్ముడు మొదలైన వీరులతో వచ్చి శ్వేతుడికి అడ్డుపడ్డాడు; శల్యుడు ప్రాణాలు దక్కించుకుని అక్కడినుంచి వెనక్కు వెళ్లిపోయాడు.


అంతతో శాంతించటానికి బదులు శ్వేతుడు రెచ్చిపోయి, ఉన్మాదుడులాగా పోరాడుతూ, కౌరవయోధులను వందల సంఖ్యలోనూ, వేల సంఖ్యలోనూ బలి తీసుకోసాగాడు. అతని దెబ్బకు తట్టుకోలేక పారిపోయిన కౌరవయోధులు, "వీరాగ్రేసరా, ఆ శ్వేతుణ్ణి ఎదుర్కొవటానికి మాకు సాహసం చాలకుండా ఉన్నది!" అని భీష్ముడితో మొరపెట్టుకున్నారు.

ఈ మాటలు విన్న భీష్ముడు విజృంభించి, శ్వేతుడికేసి బయలుదేరి, అడ్డం వచ్చిన పాండవసేనలను మారణం చేయసాగాడు.

చివరకు భీష్ముడూ శ్వేతుడూ తలపడ్డారు. వారిద్దరికీ ఘోరమైన యుద్ధం జరిగింది. ఆ క్షణంలో శ్వేతుడు ఎదురు తగలటంవల్ల పాండవసేనలో ఎంత భాగం భీష్ముడికి బలికాకుండా దక్కిందో ఊహించటం కష్టం. ఇద్దరూ ఒకరినొకరు బాణాలతో తూట్లుతూట్లుగా కొట్టుకున్నారు. చివరకు భీష్ముడు అలిసిపోయి యుద్ధం విరమించి వెనక్కుతిరిగాడు. పాండవుల ఆనందానికీ, కౌరవుల విచారానికీ మేరలేదు.




చందమామ
దీపావళి ప్రత్యేక సంచిక
75
NAYE
PAISE
M.T.V.Acharya



మహాభారతం

దుర్యోధనుడు ఆగ్రహావేశుడై తన తమ్ములతోకూడా కలిసి పాండవసేనల నిర్మూలనానికి పూనుకున్నాడు. శ్వేతుడు భీష్ముణ్ణి విడిచి దుర్యోధనాదులపై సుడిగాలిలాగా వచ్చిపడ్డాడు. వారు ఆ తాకిడికి చెల్లాచెదరై పోయారు. వెంటనే శ్వేతుడు భీష్మణ్ణి వెతుకుతూ వెళ్ళి ఎదిరించాడు. మళ్ళీ ఇద్దరూ పోరాడారు. అతడు భీష్ముడి వింటినీ, జెండానూ విరగగొట్టాడు. అతడు భీష్ముణ్ణి చంపేశాడే అనుకున్నారు కౌరవులు. పాండవులు ఆనందంతో శంఖాలు పూరించారు.

దుర్యోధనుడు భీష్ముడికి అండగా తన యోధులను తీసుకుపోయి, "మీరు భయపడకండి. భీష్ముడి చేతిలో ఇప్పుడే శ్వేతుడు చావబోతున్నాడు!" అని అరిచాడు. త్వరలోనే బాహ్లికుడూ, కృతవర్మా, కృపుడూ, శల్యుడూ, వికర్ణుడూ మొదలైన అనేకమంది యోధులు భీష్ముడికి సహాయంగా వెళ్ళి ఒంటరిగా ఉన్న శ్వేతుణ్ణి ప్రతిఘటించారు. శ్వేతుడు ఇంతమందితోనూ పోట్లాడుతూనే భీష్ముడి విల్లు విరగగొట్టి, ఆయనను బాణాలతో కొట్టాడు. భీష్ముడివంటివాడుకూడా ఆ బాణాలను మధ్యదారిలో విరగగొట్టలేక పోయాడు. ఇది చూసి కౌరవయోధులకు ధైర్యం జారింది.

అయితే భీష్ముడి పౌరుషం మాత్రం రెచ్చింది. ఆయన తన బాణాలతో శ్వేతుడి రథాన్నీ, గుర్రాలనూ, సారథినీ నాశనం చేశాడు. శ్వేతుడు నేలపైకి దిగి ఒక ప్రళయమైన శక్తిని భీష్ముడిపై విసిరాడు. నిప్పులు కక్కుతూ తనపైకి వచ్చే ఆ శక్తిని భీష్ముడు దారిలోనే ఖండించాడు. శ్వేతుడొక పెద్ద గద తీసుకుని భీష్ముడి రథంపై విసిరాడు. దాని తాకిడికి రథం చూర్ణమయింది, కాని భీష్ముడు అపాయం గ్రహించి రథంనుంచి ముందుగానే దిగేశాడు.

అట్టమీది బొమ్మ

భీష్ముడు మరొక రథం ఎక్కి శ్వేతుడి పైకి వచ్చాడు. ఈలోపుగా పాండవయోధులు శ్వేతుడికి అండగా పరిగెత్తుకుంటూ వచ్చారు. కాని భీష్ముడు వారిని తన బాణాలతో సమీపానికి రాకుండా ఆపాడు. తరవాత ఆయన శ్వేతుడిపైన బ్రహ్మాస్త్ర సహితమైన ఒక తీవ్ర బాణాన్ని ప్రయోగించాడు. అది శ్వేతుడి కవచాన్ని ఛేదించి, శరీరంనుంచి దూసుకుపోయి, భూమిలోకి దూరిపోయింది.


శ్వేతుడు చనిపోగానే విరాటుడి మరొక కొడుకు శంఖుడనేవాడు శల్యుణ్ణి చంపటానికి నిశ్చయించుకుని వచ్చాడు. శంఖుడి చేతిలో శల్యుడు చావకుండా కౌరవయోధులు కాపాడారు. వారికి సహాయంగా భీష్ముడు వచ్చాడు. శంఖుణ్ణి అర్జునుడు కాపాడాడు. అయితే భీష్ముడు ఆ మొదటి రోజు యుద్ధంలో చూపిన ప్రతాపాగ్నికి పాండవ సేనలు నల్లులు మాడినట్టు మాడిపోయాయి. సూర్యాస్తమయం అయేదాకా భీష్ముడు ఈ దారుణ హత్యాకాండ సాగిస్తూనే వచ్చాడు.

మొదటి రోజు యుద్ధం ముగిసింది.

ఆ రాత్రి ధర్మరాజు తన తమ్ములనూ, ఇతర యోధులనూ వెంటబెట్టుకుని కృష్ణుడి శిబిరానికి వెళ్లాడు. మొదటి రోజు యుద్ధం చూసి కుంగిపోయిన ధర్మరాజు కృష్ణుడితో,



"బావా, భీష్ముడు మన సేనలనూ, నా పక్షాన పోరవచ్చిన యోధులందరినీ బలి తీసుకునేటట్టు కనబడుతున్నది. రాజ్యలోభంచేత నేను ఈ యుద్ధానికి పూనుకున్నాను. నాకోసం ఈ మహారథులందరూ భీష్ముడి చేతిలో చావటం నాకిష్టం లేదు. నాకోసం నా తమ్ములందరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ పాపం నాకు వద్దు. నేను అరణ్యాలకు పోయి తపస్సుచేసుకుంటాను. మాలో అస్త్రాలు తెలిసినవాడు అర్జునుడు ఒక్కడే అయిఉండికూడా విజృంభించి యుద్ధం చెయ్యక, వెనకాడాడు. భీముడు ఒక్కడే వీరోచితంగా పోట్లాడాడు మిగిలిన



వాళ్లమంతా భయభ్రాంతులమై చూస్తూ ఉండగా, భీష్ముడు మన సేనలను కార్చిచ్చు లాగా నాశనం చేయనారంభించాడు. నేను యుద్ధం సాగించాలంటే ఆ భీష్ముణ్ణి చంప గల శూరుడు మన పక్షాన ఎవరున్నారో నీవు కనిపెట్టు. నీ అనుగ్రహం లేకపోతే మేమీ యుద్ధంలో జయించలేం," అన్నాడు.


కృష్ణుడు ధర్మరాజుతో, "నీవు శోకించ నవసరంలేదు. నీకు సేనాపతిగా ధృష్టద్యుమ్నుడున్నాడు. ఈ రాజులందరూ నీకు విజయం చేకూర్చుతారు. నీ తమ్ములు సర్వ లోక శూరులు. శిఖండి చేతిలో భీష్ముడు చచ్చితీరుతాడు. నీకింకా విచారమెందుకు?" అన్నాడు. ఈ మాటలు అందరికీ ఉత్సాహం కలిగించాయి.

ధర్మరాజు ధృష్టద్యుమ్నుడివైపు తిరిగి, "సేనాపతీ, దేవతలకు కుమారస్వామి ఎలాటివాడో, నీవు మాకు అలాటివాడివి. నీవు ముందుండి మమ్మల్నందరినీ నడిపించి ఈ యుద్ధంలో మాకు విజయం చేకూర్చి పెట్టాలి!" అన్నాడు.

"మహారాజా, మీరు సందేహించవద్దు. నేను రణగర్వితులైన భీష్మద్రోణాదు లంద రికీ పరాభవం చేస్తాను. ద్రోణుడు నా చేతిలో తప్పక చస్తాడు. ఇకనుంచి యుద్ధం ఎలా ఉంటుందో చూడండి," అని ధృష్టద్యుమ్నుడు చెప్పిన జవాబుకూడా అందరికీ ఉత్సాహం కలిగించింది.

"రేపటి యుద్ధంలో క్రౌంచారుణ వ్యూహం పన్ని మన సేనలు శత్రువులకు అజేయంగా ఉండేలాగు చెయ్యి," అని ధర్మరాజు ధృష్టద్యుమ్నుణ్ణి కోరాడు. ధృష్టద్యుమ్నుడు సరేనన్నాడు.

రెండవ రోజు తెల్లవారింది. సూర్యోదయానికి పూర్వమే పాండవసైన్యాలు యుద్ధ సన్నద్ధమయాయి. ఈ రోజు సేనలకు ముందుగా అర్జునుడున్నాడు. ఈ సేన క్రౌంచ పక్షి ఆకారంలో అమర్చబడింది. దాని తలా,



కన్నులూ, మెడా, రెక్కలూ, శరీరమూ, తోకా మొదలైన స్థానాలలో ఆయా వీరులు ఉంచబడ్డారు. రెక్కల స్థానాన్ని భీముడూ, ధృష్టద్యుమ్నుడూ ఆక్రమించారు. ఈ వ్యూహానికి ముందుగా రథంలో అర్జునుడు, సూర్యకాంతి పడి మేరుపర్వతం ప్రకాశిస్తున్నట్టు ప్రకాశిస్తున్నాడు.

అక్కడ దుర్యోధనుడు కూడా తన సేనను ఒక వ్యూహాకారంలో అమర్చ నాజ్ఞాపించాడు. దానియొక్క వివిధ పార్శ్వలను రక్షించటానికీ, సేనాపతి అయిన భీష్ముణ్ణి రక్షించటానికీ మహాయోధులు నియోగించబడ్డారు. ఈ సేనలు సూర్యోదయం కాగానే యుద్ధానికి కదిలాయి. ఉభయపక్షాలవారూ శంఖాలు పూరించి, సింహనాదాలు చేశారు.

రెండవ రోజు యుద్ధం ప్రారంభమయింది. ఉభయపక్షాలవారూ చంపటానికీ, చావటానికీ ఉత్సాహపడుతూ యుద్ధం సాగించారు. భీష్ముడు విల్లెక్కుపెట్టి పాండవ సైన్యాలను సమీపించాడు. ఆయనను భీముడూ, అర్జునుడూ, అభిమన్యుడూ, కేకయులూ, విరాటుడూ, ధృష్టద్యుమ్నుడూ మొదలైనవారు ఎదిరించారు. ఆయన అందరినీ అంబుల వర్షంలో ముంచేసి పాండవవ్యూహాన్ని చెదరగొట్టాడు. ఇది చూసి అర్జునుడు మండిపడి కృష్ణుడితో తన రథాన్ని భీష్ముడిపైకి నడపమన్నాడు. భీష్ముణ్ణి వెంటనే చంపకపోతే తన పక్షంవారంతా ఆయన చేతిలో చచ్చి తీరుతారని అతనికి తోచింది. భీష్ముణ్ణి సమీపించబోతూ అర్జునుడు దారిలో గల కౌరవసేనలను నిర్మూలం చేయసాగాడు. అప్పుడు భీష్ముడితో బాటు ద్రోణుడూ, కృపుడూ, శల్యుడూ, దుర్యోధనుడూ, అశ్వత్థామా, వికర్ణుడూ మొదలైనవారు అర్జునుణ్ణి ఎదుర్కొని అతనిపై శరపరంపర ప్రయోగించారు. వారి దెబ్బలను లక్ష్యపెట్టక



అర్జునుడు వారందరినీ తిరిగి బాణాలతో కొట్టాడు. ఈలోగా సాత్యకీ, విరాటుడూ, ధృష్టద్యుమ్నుడూ, ఉపపాండవులూ, అభిమన్యుడూ అర్జునుడికి అండగా వచ్చి, కౌరవపక్షాన్ని ఎదుర్కున్నారు.

రెండు పక్షాల మధ్యా సంకులసమరం సాగింది. అర్జునుడు విజృంభించి తన గాండీవంతో కౌరవయోధులను బలిపుచ్చుకోనారంభించాడు. అప్పుడు దుర్యోధనుడు భీష్ముడితో, "తాతా, అర్జునుడు మన సేనలను నాశనంచేస్తున్నాడు. నీమూలానగదా కర్ణుడు అస్త్రం పట్టలేదు. అర్జునుణ్ణి చంపే భారం నీవే చూడాలి!" అన్నాడు.

"ఛీ, ఏమి క్షత్రియధర్మం!" అంటూ భీష్ముడు అర్జునుడిపైకి వెళ్ళాడు. ఇద్దరూ ఒకరికొకరు తీసిపోకుండా సమయుద్ధం సాగించారు. ఒకరి ధ్వజాలు ఒకరు పడగొట్టారు. ఒకరి గుర్రాలను ఒకరు కొట్టారు. భీష్ముడు కోపావేశంలో కృష్ణుణ్ణి మూడు బాణాలతో కొట్టాడు. కృష్ణుడు రక్తపుమరకలతో పుష్పించిన మోదుగుచెట్టులాగా తయారయాడు. భీష్ముడు చేసిన ఈ పనికి ప్రతిక్రియగా అర్జునుడు భీష్ముడి సారథిని మూడు బాణాలతో కొట్టాడు. వారిద్దరూ ఒకరినొకరు చంపుకోవాలనే ఉద్దేశంతోనే యుద్ధంచేశారు. కాని వారిలో ఏ ఒకరూ రెండోవారిని జయించలేకపోయారు.

వీ రిలా యుద్ధం చేస్తూండగా ధృష్టద్యుమ్నుడికీ, ద్రోణుడికీ మధ్య ద్వంద్వయుద్ధం ప్రారంభమయింది. మొదట్లో కొంతసేపు ఇద్దరూ సమంగానే పోరాడారు, ఒకరినొకరు బాణాలతో తీవ్రంగా కొట్టుకున్నారు. కాని రానురాను ద్రోణుడిది పైచెయ్యి అయింది. ఆయన ధృష్టద్యుమ్నుడి బాణాన్నీ, రథాన్నీ, సారథినీ, గుర్రాలనూ నాశనం చేశాడు; ధృష్టద్యుమ్నుడు తనపై విసిరిన శక్తినీ, గదనూ బాణాలతో ఖండించాడు. చివరకు ధృష్టద్యుమ్నుడు డాలూ, కత్తీ

పట్టుకుని తనపైకి వస్తూంటే, ద్రోణుడు బాణవర్షంతో అతన్ని ముందుకు రానివ్వకుండా చేశాడు.

ఈ స్థితిలో భీముడు ధృష్టద్యుమ్నుడికి అండగా వచ్చి, అతన్ని వేరొక రథంలో ఎక్కించాడు. ఇది చూసి దుర్యోధనుడు ద్రోణుడికి రక్షణగా కాలింగుణ్ణి సేనతో సహా భీముడిపైకి పంపాడు.

కలింగరాజు అపారమైన తన సేనతో వచ్చి భీముణ్ణి చుట్టుముట్టాడు. అయినా, ఆయన కొడుకు శక్రదేవుడనేవాడూ భీముడిపైన బాణాలు వేశారు. త్వరలోనే భీముడి రథపు గుర్రాలు కూలిపోయాయి. భీముడు కదలని ఆ రథంనుంచే ఒక ఇనప గద విసిరేసరికి శక్రదేవుడు చచ్చాడు, ఆ దెబ్బకే అతని ధ్వజంకూడా విరిగిపోయింది. ఈ లోపుగా కాలింగుడి రథాలు భీముడిచుట్టూ కమ్ముకున్నాయి. భీముడు ఒక డాలూ, కత్తీ తీసుకుని కాలింగుడిపైకి వచ్చాడు. కాలింగుడు భీముడిపైన తీవ్రమైన బాణాలూ, తోమరాలూ విసిరాడు. భీముడు వాటిని తన కత్తితో ఛేదించుతూ, కలింగ రాజు కొడుకైన భానుమంతుడిపైకి లంఘించాడు. భానుమంతుడు ఏనుగుపై ఎక్కి ఉన్నాడు. అతను భీముణ్ణి చూసి గట్టిగా



గర్జించాడు. ఈ గర్జనకు మండిపడి, అంతకంటె భయంకరంగా గర్జించుతూ భీముడు ఏనుగు దంతాలు పట్టుకుని ఒక్క గెంతుతో దానిపై కెక్కి, తన కత్తిదెబ్బలతో భానుమంతుణ్ణీ, ఏనుగునూ కూడా చంపేశాడు.

తరవాత భీముడు మృత్యుదేవతలాగా కలింగసేనను పొట్టబెట్టుకోసాగాడు. నేల మీద నడుస్తూ, కత్తి తప్ప మరొక ఆయుధం లేకుండా అతను ఏనుగులను పడగొట్టాడు, సైనికులను వేల సంఖ్యలో మట్టుపెట్టాడు. గుర్రాలూ, ఏనుగులూ అతని తాకిడికి చచ్చి పడిపోయాయి. దగ్గిరికి వచ్చిన రథికులను కూడా భీముడు చంపేశాడు. తనపై వచ్చే

బాణాలను తప్పించుకోవటానికి కత్తి గిర గిరా తిప్పాడు. కలింగసేనలో చాలాభాగం భీముడి చేతిలో నాశనమయింది.

ఇంతలో భీముడికి కలింగరాజైన శ్రుతాయుషుడు ఎదురుతగిలాడు. భీముణ్ణి అతను బాణాలతో కొట్టి బాధించాడు. కాని ఇంతలోనే భీముడి సారథి అయిన అశోకుడు మరొక రథంతో వచ్చి చేరాడు. భీముడా రథంలో ఎక్కి శ్రుతాయుషుడితో యుద్ధం చేశాడు. త్వరలోనే శ్రుతాయుషుడు భీముడి చేతిలో చచ్చాడు.


భీముడు ఒంటరిగా చేసిన ఈ యుద్ధాన్ని ధృష్టద్యుమ్నుడు కళ్లారా చూసి పొంగిపోయాడు. అతను శిఖండి మొదలైన యోధులతో, "వెళ్లండి! భీష్ముడు మొదలైన వాళ్లను ఎదుర్కోండి!" అని ప్రోత్సహించి, సాత్యకితో సహా భీముడున్న చోటికి వచ్చాడు.

ఇంతలో కౌరవసైన్యాలలో కలకలం సాగింది. భీముడు మృత్యువిహారం చేస్తున్నాడని విని భీష్ముడు భీముడికేసి వచ్చాడు. భీష్ముడికి భీమ సాత్యకి ధృష్టద్యుమ్నులతో యుద్ధం జరిగింది. భీష్ముడు భీముడి గుర్రాలను చంపాడు. భీముడు తనపైకి శక్తి విసరగా దాన్ని బాణాలతో ఖండించాడు. ధృష్టద్యుమ్నుడు భీముణ్ణి తన రథంలో కూచోబెట్టుకుని ఎడంగా తీసుకుపోయాడు. కాని ఆ సమయంలోనే సాత్యకి బాణాలతో భీష్ముడి సారథిని చంపాడు. గుర్రాలు బెదిరి భీష్ముడి రథంతోసహా పారిపోయాయి.


ఇది చూసి భీముడు ఆనందంతో ధృష్టద్యుమ్నుణ్ణి కౌగలించుకుని అతనితో సహా సాత్యకి వద్దకు వచ్చాడు. సాత్యకి రథందిగి వచ్చి భీముణ్ణి కౌగలించుకుని, "భీమా! ఏమి నీశౌర్యం! ఒంటరిగా కలింగరాజునూ, అతని ఇద్దరు కొడుకులనూ, కలింగసేనలోని అనేకమంది యోధులనూ చంపేశావుగదా!" అని అభినందించాడు.

ఇంతలో మధ్యాహ్నమయింది.





చందమామ
పిల్లల కథల మాస పత్రిక
1st Dec. '59
50



మహాభారతం

రెండవ రోజు యుద్ధంలో ఉదయం భీముడు విజృంభించితే, మధ్యాన్నం దాటినాక అర్జునుడు విజృంభించాడు. అది ఈవిధంగా జరిగింది—

తమ సైన్యానికి కలిగిన నష్టం చూసి మండిపడి కౌరవ వీరులలో అశ్వత్థామా, కృపుడూ, శల్యుడూ ఏకమై ధృష్టద్యుమ్నుడి పైకి వెళ్ళారు. ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ రథపు గుర్రాలను చంపాడు. అశ్వత్థామ వెంటనే శల్యుడి రథమెక్కి మళ్ళీ కలియబడ్డాడు. ఇది చూసి మండిపడుతూ అభిమన్యుడు వచ్చి శల్య కృపాశ్వత్థామలను ముగ్గురునీ బాణాలతో కొట్టాడు.

ఇంతలో కౌరవుల పక్షంనుంచి దుర్యోధనుడి కొడుకైన లక్ష్మణుడు అభిమన్యుణ్ణి ఎదిరించాడు. ఇద్దరికీ ఘోరమైన యుద్ధం జరిగింది. ఈ అవకాశం చూసి కౌరవ యోధులు అభిమన్యుణ్ణి చుట్టుముట్టారు.

అభిమన్యుడు ధైర్యంగా వారందరితోనూ పోరాడే సమయంలో అర్జునుడు మూడో కన్ను తెరిచిన శివుడులాగా అక్కడికి వచ్చిపడి కౌరవ సేనలను తన బాణాలతో ఊచకోత కోయసాగాడు.

కార్చిచ్చుకు అరణ్య వృక్షాలు ఆహుతి అయినట్టుగా రథ గజ తురగ పదాతి సేనలు అర్జునుడికి బలి కాసాగాయి.

ఆ సమయంలో అర్జునుడి తీవ్రత చూసి కౌరవసేనలో గల మహాయోధులు ప్రతి ఒక్కరూ భయపడినట్టు కనిపించారు. ఎందుకంటే అతని ధాటిని నిరోధించటానికి ఒక్కడూ ముందుకు రాలేదు. కౌరవ సేనలు చెల్లాచెదరై పారిపోసాగాయి. కృష్ణార్జునులు శంఖాలు పూరించారు.

భీష్ముడు తమ సేనలు పారిపోతూండటం చూసికూడా ఏమీ చేయక ద్రోణుడితో, "ఆచార్యా, అర్జునుడు ఇప్పుడు సమగ్ర


అట్ట మీది బొమ్మ

శక్తితో యుద్ధంచేస్తున్నాడు. ఇటువంటి తరుణంలో ఇతణ్ణి ఎవరూ ఎదిరించలేరు. మన సైన్యాలను వెనక్కు తిప్పటంకూడా సాధ్యంగా కనబడదు. ఇంక కొంచెంసేపటికి సూర్యుడు అస్తమించనున్నాడు గనక ఈ రోజుకు యుద్ధం కట్టిపెట్టటమే మేలనుకుంటాను. బెదిరిన సేనలు యుద్ధం చెయ్యలేవు,'' అన్నాడు.

మర్నాడు తెల్లవారగానే మూడవ రోజు యుద్ధం అరంభమయింది. కౌరవసైన్యాలు గరుడ వ్యూహంలోనూ, పాండవ సైన్యాలు అర్ధచంద్ర వ్యూహంలోనూ యుద్ధానికి అయత్తమయాయి.

ఈనాటి యుద్ధం దొమ్మి యుద్ధంగా ప్రారంభమయింది. పాండవుల పక్షాన అర్జునుడూ, భీముడూ, ఘటోత్కచుడూ, సాత్యకీ, చేకితానుడూ, ఉపపాండవులూ విజృంభించి యుద్ధం చేయసాగారు. ఘటోత్కచుడు భీముడికన్నకూడా దారుణంగా పోరాడాడు.

దుర్యోధనుడు వెయ్యి రథాలను వెంటబెట్టుకుని ఘటోత్కచుడితో యుద్ధానికి వచ్చాడు. భీముడూ, ఘటోత్కచుడూ అతనితో తలపడ్డారు. భీముడు ఒక క్రూరమైన బాణం ఎక్కుపెట్టి దుర్యోధనుణ్ణి ఎదురు రొమ్ములలో కొట్టాడు. ఆ దెబ్బకు దుర్యోధనుడు మూర్ఛపోగా, అతని సారథి రథాన్ని



వెనక్కు తిప్పుకుని వెళ్ళిపోయాడు. ఇది చూసి కౌరవసేనలు పారిపోసాగాయి. భీముడు ఆ సైన్యాలను తరుముతూ బాణాలతో కొట్టసాగాడు.

ఇంకొక పక్క అర్జునుడూ, అభిమన్యు సాత్యకులూ కౌరవసేనలను చెదరగొట్టసాగారు. అతికష్టంమీద భీష్మద్రోణులు తమ సేనలను వెనక్కు తిప్పనారంభించారు.

ఇంతలో మూర్ఛ తెలిసి రణరంగానికి వచ్చిన దుర్యోధనుడు పారిపోతూ తనకు ఎదురైనవారిని యుద్ధోన్ముఖులను చేశాడు. అతను నేరుగా భీష్ముడివద్దకు వెళ్ళి, "తాతా, నీవు జీవించిఉండగానే మన సైన్యం పరారీ కావటం ఎంత అవమానకరం! పాండవులలో నిన్నూ, ద్రోణ కృపాశ్వత్థామలనూ ఎదిరించగలవాళ్ళు లేరనుకుంటూ వచ్చాను. లేక, పాండవులమీద గల ప్రేమ కొద్దీ నీ సైన్యమంతా నాశనమవుతూన్నప్పటికీ చూస్తూ ఊరుకుంటున్నావా? అలా అయినట్టయితే యుద్ధానికి ముందుగానే నాకీ సంగతి చెబితే బాగుండేదిగద! నీవూ, ద్రోణుడూ నన్ను నడిసముద్రంలో ముంచదలచనివారే అయితే మీ పరాక్రమాలు కనపడేలాగా యుద్ధం చెయ్యండి!" అన్నాడు.

ఈ మాటలకు భీష్ముడు రోషం చెంది, "ఏమోయ్, పాండవులను జయించటం దేవ




తలకు కూడా సాధ్యంకాదని నీకు అదివరలో నేను చెప్పలేదా? నేను ముసలివాణ్ణి, అయినా నాకున్న శక్తి ఏమిటో చూపిస్తాను; నీవూ, నీవారూ చూడండి!" అన్నాడు. ఈ మాటలతో తృప్తిచెంది దుర్యోధనుడు శంఖం పూరించాడు, భేరులు మోగాయి.

మధ్యాన్నం దాటగానే భీష్ముడు తన ప్రతాపాగ్నికి పాండవసేనలను గురిచేయ నారంభించాడు. దుర్యోధనుడు భీష్ముడికి అండగా బలమైన సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. ఆపూట భీష్ముడు చేసిన సంహారం వర్ణనాతీతం. పాండవ సేనలూ, అందు గల యోధులూ చెల్లాచెదరై పారిపోసాగారు. యుద్ధరంగంలో ఎక్కడ చూసినా హాహా కారాలు మిన్ను ముట్టాయి.

కృష్ణుడు అర్జునుడి రథాన్ని ఒకచోట ఆపి, "అర్జునా, భీష్మ ద్రోణులతో సహా సమస్త కౌరవ సేననూ నిర్మూలిస్తానని ఒక ప్పుడు ప్రగల్భాలు పలికావు. అది చేసి చూపించవలసిన సమయం వచ్చింది. సింహం మృగాలను తరిమినట్టు భీష్ముడు నీ సేనలను ఎలా తరుముతున్నాడో చూడు. ఆడితప్పనివాడివైతే భీష్ముణ్ణి ప్రతిఘటించి నిర్మూలించు," అన్నాడు.

"రథాన్ని భీష్ముడికి అభిముఖంగా తోలు!" అన్నాడు అర్జునుడు.



త్వరలోనే భీష్మార్జునులు ఒకరితో ఒకరు తలపడ్డారు. ఇది చూసి పాండవ సేనలకు ధైర్యం వచ్చి వెనక్కు మరలాయి.

భీష్ముడు చాలా రౌద్రంగా ఉన్నాడు. తనపైకి వచ్చే అర్జునుణ్ణి ఆయన బాణ వర్షంలో ముంచేశాడు. కాని అర్జునుడు వరసగా రెండుసార్లు భీష్ముడి చేతిలోని విల్లును తన బాణాలతో విరగగొట్టాడు. "అర్జునా, నీకు తగినట్టుగా యుద్ధం చేస్తున్నావు! అలాగే యుద్ధం చెయ్యి!" అంటూ భీష్ముడు మరింత తీవ్రంగా యుద్ధంచేస్తూ, సారథి అయిన కృష్ణుణ్ణికూడా వాడి అయిన బాణాలతో కొట్టాడు.

భీష్ముడు తన ప్రతాపం యావత్తూ చూపుతూంటే అర్జునుడు ఏమాత్రమూ విజృంభించక మందకొడిగా యుద్ధంచేస్తున్నట్టు కృష్ణుడికి తోచింది. "ఇలా అయితే ధర్మరాజుకు సేన అంటూ మిగలదు. భీష్ముడిపై గల గౌరవంమూలాన భీష్ముణ్ణి చంపే బాధ్యత తనపై ఉన్నదని అర్జునుడు మరిచిపోతున్నాడు. ఈ భీష్ముణ్ణి నేనే చంపేస్తాను!" అనుకున్నాడు కృష్ణుడు.

ఈ లోపుగా కౌరవయోధులు విజృంభించి పాండవసేనను లేళ్ళను వేటాడినట్టు వేటాడటం కృష్ణుడి కంటపడింది. సాత్యకి వాళ్ళను కేకవేసి, "సైనికులారా! యోధు



లారా! పారిపోకండి! ఇది క్షత్రియధర్మం కాదు!" అని హెచ్చరించుతున్నాడు.

కృష్ణుడికి మండిపోయింది. అతను సాత్యకితో, "బెదరిపోయేవారిని పోనీ! ఈ మిగిలినవాళ్లంతా పోయినా పోనీ! నేను ఒక్కణ్ణే నా పరాక్రమంతో భీష్మ ద్రోణు లందరినీ చంపి, ధర్మరాజును గెలిపించి, ఆయనకు రాజ్యాభిషేకం చేసి తృప్తిచెందు తాను!" అన్నాడు.

ఈ మాట అంటూ కృష్ణుడు చేతిలో ఉన్న పగ్గాలు వదిలేసి, సుదర్శనమనే తన చక్రాయుధాన్ని తీసుకుని, రథంపైనుంచి కిందికి దూకి, భీష్ముడి రథంకేసి పోసాగాడు.

భీష్ముడు కొంచెంకూడా చలించక, "కృష్ణా, నన్ను చంపెయ్యి. నీచేత చస్తే నాకు ఇహమూ, పరమూకూడా ఉంటుంది. ఇదే నీవు నాకు చూపిన గౌరవం అనుకుం టాను!" అన్నాడు.

కృష్ణుడు కోపోద్రేకంతో, "ఓ ముసలి వాడా, ఈ ప్రజాక్షయానికి అసలు కారణం నీవే. ఇవాళ దుర్యోధనుణ్ణి ఉద్ధరించటానికి బయలుదేరి వచ్చావు, కాని ఆనాడు మీ రాజు కపట ద్యూతంలో పాండవులను ఓడించినప్పుడు అతడి మంత్రివై ఉండి ధర్మం ఎందుకు బోధించకపోయావు? ఒక వేళ అతడు ఆనాడు నీమాట వినకపోతే



అతణ్ణి అప్పుడే ఎందుకు విడిచిపుచ్చ లేదు?" అన్నాడు.


"రాజు ఆశ్రితులకు పరదైవం గదా?" అన్నాడు భీష్ముడు.


"యాదవుల హితం వినని కంసరాజు గతి ఏమయింది? విపరీతబుద్ధి అయిన రాజు శిక్ష పొందటం ధర్మం కాదా?" అని కృష్ణుడు మళ్లీ అడిగాడు.

ఈలోపుగా అర్జునుడు రథం దిగి వచ్చి కృష్ణుణ్ణి గట్టిగా పట్టుకున్నాడు. కాని క్రోధావేశంలో ఉన్న కృష్ణుడు అర్జునుణ్ణి పది అంగల దూరం లాక్కుపోయాడు. అప్పటికి అర్జునుడు కృష్ణుణ్ణి నిలవేసి, "దేవా, శాంతించు. పాండవులకు నీకన్న వేరే గతి ఎవరు? నా అన్నదమ్ములపైనా, పిల్లలపైనా ప్రమాణం చేసి చెబుతున్నాను, నేను నా ప్రతిజ్ఞ నిలబెట్టుకుంటాను. భీష్మ ద్రోణులతోపాటు, కౌరవ వంశాన్నికూడా నిర్మూలించి తీరుతాను!" అన్నాడు.

అప్పటికి కృష్ణుడు శాంతించి తిరిగి రథం వద్దకు వెళ్లి తన స్థానంలో కూచున్నాడు. ఆ తరవాత అర్జునుడు విజృంభించి యుద్ధం చేశాడు. ఆ పూట అతను కౌరవ యోధులందరితోనూ పోరాడటమే గాక, ఈ యుద్ధంలో మొట్టమొదటిసారిగా ఐంద్రాస్త్రం ప్రయోగించాడు. దాని ప్రభావంచేత కౌరవ సైన్యాలు నల్లులు మాడినట్టు మాడిపోయాయి. భీష్మ ద్రోణులకే ప్రళయం ముంచుకువచ్చినట్టు తోచించి. కౌరవ యోధులు చేసేదిలేక యుద్ధరంగం విడిచి వెళ్లిపోయారు. ఆ పూట అర్జునుడు కౌరవ సైన్యంలో పదివేల రథాలూ, ఏడువందల ఏనుగులూ, పూర్తిగా సౌవీరగణాన్నీ, క్షుద్రక మాలవులనూ నిర్మూలించేశాడు. కౌరవ సైనికులు సయితం దివిటీల సహాయంతో తమతమ శిబిరాలకు వెళ్లిపోతూ అర్జునుడు చేసిన ప్రళయమైన యుద్ధాన్ని గురించే మాట్లాడుకున్నారు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Jan
50
NAYE PAISE
8
AS
V. Acharya



మహాభారతం

నాలుగవరోజు ఉదయం ఉభయ సేనలూ తిరిగి యుద్ధానికి తలపడ్డాయి. ఆ రోజు పాండవ వ్యూహాన్ని ధర్మరాజు ఒక కొత్త పద్ధతిలో రచించాడు. దానిముందు అర్జునుడు కపిధ్వజం గల రథంమీద నిలబడి భీష్మ ద్రోణాది కౌరవ వీరుల రాకకోసం ఎదురుచూస్తున్నాడు.

యుద్ధం ఆరంభమవుతూనే భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, శల్యుడూ, వివింశతీ, దుర్యోధనుడూ, సౌమదత్తి అనే యోధులందరూ కలసి అర్జునుణ్ణి ఎదిరించారు. అర్జునుడికి అండగా అభిమన్యుడు వచ్చి అందరితోనూ ఒక్కసారిగా పోర నారంభించాడు. భీష్ముడు అభిమన్యుణ్ణి తప్పించుకుని అర్జునుడితో తలపడ్డాడు. ఇద్దరికీ తీవ్రమైన యుద్ధం జరిగింది.

ఈలోపల అశ్వత్థామా, భూరిశ్రవుడూ, శల్యుడూ, చిత్రసేనుడూ, సాంయమని అనే వాడి కొడుకూ—ఈ అయిదుగురు కౌరవ యోధులూ అభిమన్యుడిపై తలపడి యుద్ధం సాగించారు. అభిమన్యుడు విజృంభించి అందరితోనూ యుద్ధంచెయ్యటం చూసి అర్జునుడు ఉత్సాహంతో శంఖం పూరించాడు. అయిదుగురు యోధులు ఏకమైకూడా అభిమన్యుని ధాటిని ఆపలేకపోయారు.

అప్పుడు దుర్యోధనుడు పంపగా త్రిగర్తులూ, మద్రులూ, కేకయులూ ఏకమై, ఇరవైఅయిదువేల సంఖ్యలో వచ్చి అర్జున అభిమన్యులను చుట్టుముట్టారు. ఇది చూసి మండిపడి పాండవ సేనాని అయిన ధృష్టద్యుమ్నుడు అంతులేని బలాలతో వచ్చి శత్రువులను ఎదుర్కొన్నాడు. కృపుడూ, కృతవర్మా మొదలైన కౌరవ యోధులు ధృష్టద్యుమ్నుడి బాణాలకు గురిఅయారు. ఈవిధంగా ధృష్టద్యుమ్నుడు విజృంభించటం చూసి సాంయమని కొడుకుకు రోషం



వచ్చి, వాడు ధృష్టద్యుమ్నుడిపైనా, సారథి పైనా బాణాలు వేస్తూ మీదికి వచ్చాడు.

ధృష్టద్యుమ్నుడు ఒక్క బాణంతో వాడి విల్లు విరగగొట్టి, తరవాత క్షణంలోనే వాడి రథం గుర్రాలనూ, సారథినీ చంపేశాడు. సాంయమని కొడుకు కత్తి దూసి ధృష్ట ద్యుమ్నుడిపైకి వచ్చాడు. ధృష్టద్యుమ్నుడు వాణ్ణి దగ్గిరికి రానిచ్చి తన గదతో గట్టిగా కొట్టాడు. సాంయమని కొడుకు అలాగే చచ్చి పడిపోయాడు.

ఇది చూసి రోషంతో సాంయమనీ, శల్యుడూ ధృష్టద్యుమ్నుడిపై కలియబడి ఘోరంగా యుద్ధం చేశారు. రెండు గడి యల పాటు సమయుద్ధం జరిగినాక శల్యు డిది పైచెయ్యిగా కనబడింది. అంతలో అభి మన్యుడు వచ్చి శల్యుణ్ణి ఎదుర్కొని ఆయ నను తీవ్రమైన బాణాలతో కొట్టసాగాడు. శల్యుణ్ణి రక్షించటానికి దుర్యోధన, దుశ్శా సన, వివింశతి, వికర్ణ, దుర్మర్షణ, దుస్సహ, దుర్ముఖ, చిత్రసేన, సత్యవ్రత, పురుమిత్రు లనేవారంతా వచ్చి అభిమన్యుణ్ణి చుట్టు ముట్టారు. పాండవ పక్షంనుంచి అభిమన్యు డికి అండగా భీముడూ, ధృష్టద్యుమ్నుడూ, ఉపపాండవులూ, నకుల సహదేవులూ వచ్చారు. రెండుపక్షాలా పదేసి యోధులు ఏర్పడి చాలాసేపు పట్టుదలతో యుద్ధం సాగించారు. ఈ యుద్ధం చూడటానికి మిగి లినవారు యుద్ధం మానేశారు. శల్యుడు నకుల సహదేవులకు మేనమామే అయి నప్పటికీ వారిమధ్యకూడా క్రూరంగానే యుద్ధం జరిగింది.

యుద్ధం మధ్యలో భీముడు అకస్మా త్తుగా పెద్ద సింహనాదం చేసి, గద తీసుకుని రథం దిగి భీకరంగా శల్యుడిపైకి వెళ్ళాడు. దారిలో అడ్డంవచ్చిన ఏనుగులూ, కాల్బ లమూ అతని గదయొక్క దెబ్బలకు చచ్చి పడటం జరిగింది. అతని భీకరమైన వాలకం చూసి అందరూ నిశ్చేష్టులైపోయారు.

భీముడు ఇలా ముందుకు పోతుంటే వెనక నుంచి ధృష్టద్యుమ్నుడూ, అభిమన్యుడూ మొదలైన పాండవయోధులు అతన్ని తమ బాణాలతో రక్షించారు.

భీముడి దెబ్బలకు బెదిరిన ఏనుగులు సైన్యాన్ని తొక్కుకుంటూ పారిపోయాయి. అటుపైన భీముడు శత్రుసైన్యంలో మృత్యువిహారం చేస్తూ ప్రళయకాల రుద్రుడిలాగా ప్రవర్తించాడు.

చివరకు కౌరవ సైన్యాలు ఎలాటి దుస్థితికి వచ్చాయంటే భీముడు ఏ దిక్కుగా చూస్తే అటుగా ఉన్నవారు భయకంపితులై పారిపోసాగారు.

ఇంతలో భీష్ముడు తన రథంతో భీముడిపైకి వస్తూ అతనిపై అంబుల వర్షం కురిపించాడు. ఈలోగా సాత్యకి భీష్మణ్ణి ఎదిరించాడు.

సాత్యకి చేసే ప్రళయమైన యుద్ధం ముందు కౌరవయోధు లెవరూ నిలవజాలకుండా ఉన్నస్థితిలో అలంబుసుడనే రాక్షసుడు సాత్యకిని ఎదిరించి వాడు కూడా వెనక్కు తగ్గాడు.

సాత్యకిని ఎదిరించే యోధుడే లేనట్టు కనపడే స్థితిలో భూరిశ్రవుడు సాత్యకిపైకి వచ్చాడు. దుర్యోధనుడూ, అతని తమ్ములూ భూరిశ్రవుడికి అండగా వచ్చారు. అంత



మంది ధృతరాష్ట్రపుత్రులు కంటబడేసరికి భీముడు లేళ్లమందను చూసిన సింహంలాగా అయిపోయి, తన గదతో వారిమీదికి లంఘించాడు.

దుర్యోధనుడూ, అతని తమ్ముడు నందకుడనేవాడూ భీముణ్ణి బాణాలతో గాయపరిచారు. ఇలా కాదనుకుని భీముడు తన రథమెక్కి సారథి అయిన విశోకుడితో, "ఇవాళ ఈ ధృతరాష్ట్రుడి కొడుకులను వరసగా ఎలా చంపుతానో చూస్తూ ఉండు!" అన్నాడు.

భీముడు దుర్యోధననందకుల మీద బాణాలు వేశాడు. దుర్యోధనుడు వేసిన బాణాలలో మూడు భీముడి మోచేతికి తగిలి అతని విల్లు కింద పడిపోయింది. భీముడి సారథికికూడా బాణాలు తగిలాయి. భీముడు రోషంతో దుర్యోధనుడి వింటిని ఒక బాణంతో విరగగొట్టాడు. దుర్యోధనుడు మరొక విల్లు తీసుకుని తీవ్రమైన బాణంతో ఎదురురొమ్ములో కొట్టేసరికి భీముడు రథంపై మూర్ఛపోయాడు.

ఇది చూసి అభిమన్యుడు మొదలుగాగల పాండవవీరులు దుర్యోధనుడి రథాన్ని బాణాలలో ముంచేశారు. కాని అంతలోనే స్పృహ తెలిసి భీముడు కౌరవయోధులతో మళ్లీ విలుయుద్ధం సాగించాడు. అతని




దెబ్బలకు తట్టుకోలేక శల్యుడు యుద్ధరంగం నుంచి నిష్క్రమించాడు.

సుషేణుడూ, జలసంధుడూ, సులోచనుడూ, ఉగ్రుడూ, భీమరథుడూ, వీరబాహుడూ, అలోలుపుడూ, దుర్ముఖుడూ, దుష్ప్రధర్షుడూ, వివిత్సుడూ, వికటుడూ, సముడూ అనేవారు—అందరూ ధృతరాష్ట్రుడి కొడుకులే—భీముడిపైకి భయంకరంగా వచ్చిపడ్డారు.

భీముడు వారిలో సగంమందిని వరసగా తన బాణాలతో చంపెయ్యటం చూసి మిగిలినవారు భీముడి బారినుంచి తప్పించుకుని పారిపోయారు.

భీష్ముడు కౌరవవీరులతో, "ఓ యోధులారా, భీముడు ధృతరాష్ట్రుడి కొడుకులనందరినీ పొట్టబెట్టుకుంటున్నాడు. మీరంతా అతణ్ణి చుట్టుముట్టండి!" అని హెచ్చరించాడు.

ఈ హెచ్చరికతో అనేకమంది వీరులు భీముడిపైకి వచ్చారు. వారిలో భగదత్తుడు ఒక గొప్ప ఏనుగు నెక్కివచ్చి భీముణ్ణి బాణవర్షంలో ముంచాడు. ఇందుకు ప్రతిక్రియగా అభిమన్యుడు మొదలైనవారు భగదత్తుణ్ణి బాణవర్షంతో కప్పేసి అతని ఏనుగును గాయపరిచారు. ఆ మదించిన ఏనుగు ఆగ్రహించెంది సైన్యాన్ని కల్లోలపరచ



సాగింది. భగదత్తుడు వేసిన ఒక బాణం రొమ్ములో తగలగా భీముడు తన ధ్వజ స్తంభానికి చేరగిలబడ్డాడు. అదిచూసి విజయగర్వంతో భగదత్తుడు పెద్దగా సింహ నాదం చేశాడు.

ఈ సంగతి తెలిసి ఘటోత్కచుడికి మండిపోయింది. వాడు కౌరవుల మద మణచటానికై మాయాయుద్ధానికి దిగాడు. వాడు అకస్మాత్తుగా ఒక మాయ ఐరావతాన్ని ఎక్కి భీకరాకారంతో శత్రువుల మధ్య ప్రత్యక్షమయాడు. వాడి వెనక మిగిలిన దిగ్గజాలు వచ్చాయి. వాటిలో మూడింటిపై ఆయుధాలు కలిగిన రాక్షసులున్నారు.

ఘటోత్కచుడి ఏనుగులు భగదత్తుడి ఏనుగును చుట్టుముట్టి క్రూరంగా హింసించ సాగాయి. ఆ బాధకు తట్టుకోలేక భగదత్తుడి మదపుటేనుగు ఆర్తనాదంచేసింది.

భగదత్తుడు కౌరవసేనానాయకులలో ఒకడు, మహారథుడు. అంతవాడు నిష్కారణంగా ఘటోత్కచుడికి బలి అయిపోతాడన్న భయంతో భీష్ముడు ద్రోణాది కౌరవ యోధులను భగదత్తుడికి రక్షణగా పంపాడు. వారి రాక కనిపెట్టి ధర్మరాజు మొదలైన పాండవులూ, పాంచాలురూ వారిని ఎదిరించ వచ్చారు. ఘటోత్కచుడి విజయ ధ్వానాలింకా మిన్నుముట్టుతూనే ఉన్నాయి.



భీష్ముడు ద్రోణుడితో, "ఆచార్యా, ఈ రాక్షసుడితో యుద్ధం నాకు చాలా వెగటుగా ఉన్నది. అలసిపోయి ఉన్న మనం ఈ రాక్షసుడితో ఇప్పుడు యుద్ధం చెయ్యలేము. ఇవాళకు మనం యుద్ధం చాలించి వెళ్లిపోదాం!" అన్నాడు.

ఈ మాట కౌరవయోధులకు నచ్చింది. ఘటోత్కచుడితో చేస్తున్న యుద్ధంనుంచి వారు ఉపాయంగా బయటపడి తమ శిబిరాలకు వెళ్లిపోయారు. వారు వెళ్లిపోతుంటే పాండవులు శంఖనాదాలు చేశారు.

తరవాత వారు భీముణ్ణీ, ఘటోత్కచుణ్ణీ ముందుంచుకుని విజయగర్వంతో తమ శిబిరాలు చేరుకున్నారు.

దుర్యోధనుడు తన శిబిరంలో కూచుని, చనిపోయిన తన తమ్ములకోసం కొంతసేపు దుఃఖించి, భీష్ముడివద్దకు వెళ్లి, "తాతా! నీవూ, ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా, కృతవర్మా మొదలయినవారంతా మహారథులు గదా, మీరు ఏకమైతే మూడు లోకాలూ నిలవజాలవన్నప్పుడు, ఈ పాండవులు మిమ్మల్ని ఎదిరించి ఎలా గెలవగలుగుతున్నారనుకోవాలి? దీని కేదైనా ప్రత్యేకకారణం ఉంటే చెప్పు! వారు మాటిమాటికీ గెలవటానికి సహాయభూతంగా ఉన్నదేమిటి?" అని అడిగాడు.


"ఈ ప్రశ్నకు సమాధానం నీకూ తెలుసు. పాండవులతో యుద్ధం వద్దు, సంధి చేసుకొమ్మని నేను ఎన్నిసార్లో చెప్పాను. వారు ఎవరికీ ఎన్నడూ కీడు చేసినవారుకారు. అదీగాక వారి పక్షాన శ్రీకృష్ణుడున్నాడు. అతను వారికి అండగా ఉండగా వారి నెవరూ చంపలేరు. అర్జునుడూ, కృష్ణుడూ నర నారాయణుల అవతారాలని తెలిసినవారు చెబుతున్నారు!" అన్నాడు భీష్ముడు.

దుర్యోధనుడు భీష్ముడికి నమస్కారం చేసి సెలవు పుచ్చుకుని తన శిబిరానికి వెళ్లి పడుకున్నాడు.





చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Feb. '60
50
NAYE PAISE
8



మహాభారతం

ఆరుదో రోజు సూర్యోదయానికల్లా తిరిగి ఉభయపక్షాలూ యుద్ధానికి దిగాయి. భీష్ముడు కౌరవసేనను మకర వ్యూహంలో అయత్తంచేశాడు. పాండవ సైన్యాలు శ్యేన వ్యూహంలో ఏర్పాటయాయి. మళ్లీ భీముడే పాండవసేనకు ముందుగా నిలబడ్డాడు. యుద్ధం ఆరంభమవుతూనే భీముడు భీష్ముడితో తలపడ్డాడు. ఉభయపక్షాల యోధులలోనూ పౌరుషాలు రెచ్చిపోయి ఉన్నాయి. యుద్ధం మహాదారుణంగాసాగింది.

భీష్ముడు రౌద్రంగా పాండవ సేనను నిర్మూలించటానికి పూనుకున్నాడు. ఆయనను నిరోధించటానికి అర్జునుడు ప్రయత్నించాడు. భీష్ముడు చేసే యుద్ధం చూసి పొంగిపోయినవాడై దుర్యోధనుడు ద్రోణుడితో, "ఆచార్యా, నీవూ భీష్ముడూ ఉండగా మాకు దేవతలను చూసినా భయంలేదు, ఈ పాండవులేపాటి? వీరు సులువుగా చనిపోయే పద్ధతి చూడు," అని ఆయనను ప్రేరేపించాడు.

ద్రోణుడుకూడా విజృంభించి పాండవ సేనల నిర్మూలనానికి పూనుకున్నాడు. ఇది చూసి సాత్యకి కోపోద్రేకంతో ఆయనను ఎదిరించాడు. ఇద్దరికీ ఘోరయుద్ధం జరిగింది. ద్రోణుడు సాత్యకి కొంకి ఎముకలను తన బాణాలతో కొట్టాడు. భీముడు సాత్యకిని రక్షించటానికి వచ్చి ద్రోణుడితో తలపడ్డాడు. అతనికి సహాయంగా అభిమన్యుడూ, ఉపపాండవులూ వచ్చారు. భీష్మద్రోణులు ఏకమై యుద్ధం సాగించారు. ఇంతలో శిఖండి వచ్చాడు. భీష్ముడు తన నియమం ప్రకారం శిఖండిపై బాణాలు వేయలేదు, కాని ద్రోణుడు శిఖండిని భయంకరంగా ఎదుర్కొనేసరికి శిఖండి పారిపోయాడు.

తరవాత ఉభయపక్షాలమధ్యా దారుణమైన సంకుల సమరం సాగింది. ఎందరో



పాండవపక్ష వీరులు భీష్ముడివాత పడ్డారు. యుద్ధరంగం భీభత్సంగా తయారయింది. భూమ్యాకాశాలు ఆయుధాలతోనూ, పీనుగులతోనూ, దుమ్ముతోనూ, కేకలతోనూ నిండిపోయాయి. రక్తం ఏరులై పారింది. యోధులు ఆయుధాలు లేకపోతే ముష్టి యుద్ధానికికూడా దిగారు.

ఈ సంకుల యుద్ధంతోపాటు ఉభయ పక్షాల యోధులమధ్య అనేక ద్వంద్వ యుద్ధాలుకూడా సాగాయి.

ఒకసారి సాత్యకి భీష్ముణ్ణి ఎదుర్కొని గట్టి దెబ్బ తిన్నాడు. అతని సారథి భీష్ముడి బాణం తగిలి చచ్చాడు; రథాన్ని లాక్కుంటూ సాత్యకి గుర్రాలు పారిపోయాయి. పాండవులు హాహాకారాలు చేశారు. అలాగే అశ్వత్థామకూ, అర్జునుడికీ జరిగిన యుద్ధంలో అశ్వత్థామ విజృంభించాడు. అర్జునుడు వేసిన బాణాలు శరీరమంతా తగిలి రక్తం కారినా అతను చలించక, కృష్ణార్జునులిద్దరికీ తన బాణాల పస చూపించాడు. కౌరవులు అతన్ని చూసి పరమానందం చెందారు.

ఇంకొకసారి లక్ష్మణకుమారుడికి అభిమన్యుడికీ ద్వంద్వయుద్ధం జరిగింది. అందులో లక్ష్మణుడు బాగానే యుద్ధం చేశాడుగాని తన సారథినీ, గుర్రాలనూ కోల్పోయాడు. అప్పటికీ చలించక లక్ష్మణుడు తీవ్రమైన శక్తిని విసరగా అభిమన్యుడు దానిని తన బాణాలతో కొట్టేశాడు. ఇంతలో కృపుడు వచ్చి లక్ష్మణుణ్ణి తన రథంలో ఎక్కించుకుని అవతలికి తీసుకుపోయాడు.

ఆ సాయంకాలం సాత్యకి విజృంభించి కౌరవసేనలను నిర్మూలించటం చూసి దుర్యోధనుడు అతనిపైకి రథ సైన్యాన్ని పంపాడు. సాత్యకి తన తీవ్రమైన బాణాలతో ఆ సేనను నిర్మూలించసాగాడు. అది చూసి భూరిశ్రవుడు సాత్యకిపైకి వచ్చాడు.

అతని బాణాలకు తట్టుకోలేక సాత్యకికి అండగా ఉన్న యోధులందరూ వెనుదిరిగి పారిపోయారు.

అప్పుడు సాత్యకి కొడుకులు చిత్రవర్మ మొదలు గాగలవారు అనేకమందిగా కలిసి వచ్చి భూరిశ్రవుడితో, "మాలో ఏ ఒకరితోనైనా పోరాడతావా? లేక అందరితోనూ పోరాడతావా?" అని అడిగారు. మహాయోధుడైన భూరిశ్రవుడు అందరితోనూ పోరాడతానన్నాడు. అందరూ తనపైన ఒక్కసారిగా బాణాలు వేసినప్పటికీ, భూరిశ్రవుడు వారి బాణాలన్నిటినీ ఖండించటమే గాక సాత్యకి కొడుకులను వరసగా చంపేశాడు.

సాత్యకికి మండిపోయింది. అతను భూరిశ్రవుడితో భీకరమైన యుద్ధం చేశాడు. ఈ యుద్ధంలో ఇద్దరి విల్లులూ, రథాలూ, గుర్రాలూ పోయాయి. చెరొక కత్తి పట్టుకుని వారు యుద్ధంచేసే సమయంలో భీముడు రథంలో వచ్చి, సాత్యకిని ఎక్కించుకున్నాడు; దుర్యోధనుడు వచ్చి భూరిశ్రవుణ్ణి తన రథంలోకి ఎక్కించుకున్నాడు. తరవాత కొద్దిసేపటికి సూర్యాస్తమయమయింది. ఆనాటికి యుద్ధం ముగిసింది.

ఆ రాత్రి గడిచి అరవరోజు తెల్లవారేసరికి మళ్ళీ ఉభయ సేనలూ యుద్ధ సన్నద్ధమయాయి. ఈసారి పాండవసేనలు మకర




వ్యూహంలోనూ, కౌరవసేనలు క్రౌంచ వ్యూహంలోనూ రచించబడ్డాయి.

ఆరంభంలోనే భీముడు ద్రోణుడితో తలపడ్డాడు. ద్రోణుడు భీముడి మర్మస్థానాలను ఇనపబాణాలతో కొట్టేసరికి భీముడు కోపించి, ద్రోణుడి సారథిని ఒక్క బాణంతో చంపేశాడు. మహాయోధుడైన ద్రోణుడు తన రథాన్ని తానే నడుపుకుంటూ కూడా దారుణమైన యుద్ధం చేశాడు.

తరవాత భీముడు చెలరేగి దుర్యోధనుడు మొదలుగాగల ధృతరాష్ట్ర పుత్రులపైన వచ్చిపడ్డాడు. వారందరూ ఒక్కచోట కనిపించేసరికి భీముడికి భీష్ముడి భయంకూడా పోయింది, ఆతను ఒంటరిగా కౌరవసేనలో జొరబడ్డాడు. ఇదిచూసి అందరూ, "భీముణ్ణి ప్రాణాలతో పట్టుకుందాం!" అనుకున్నారు. దుశ్శాసన, దుర్విషహ, దుస్సహ, దుర్మద, జయ, జయసేన, వికర్ణ, చిత్రసేన, సుదర్శన, చారుచిత్ర, సువర్మ, దుష్కర్ణులు మొదలుగాగలవారు భీముణ్ణి చుట్టుముట్టారు. ఆ వ్యూహంలో చిక్కుకుని కూడా భీముడు భయపడకపోగా, వాళ్ళు తనను పట్టుకోజూస్తున్నారని తెలిసి, ఆగ్రహావేశంతో గద తీసుకుని వారిమీదికి వెళ్ళాడు.

భీముడు ఏదో ఆఘాయిత్యానికి పూనుకున్నాడని పసికట్టి, పాండవుల సర్వసేనాని





అయిన ధృష్టద్యుమ్నుడు, తాను యుద్ధం చేస్తున్న ద్రోణుణ్ణి వదిలిపెట్టి, భీముడి రథం ఉన్న చోటికి వచ్చాడు. ఖాళీగా ఉన్న రథం చూడగానే అతని శరీరం వణికిపోయింది. అతను కంపిస్తున్న గొంతుతో భీముడి సారథిని, "భీముడెక్కడ?" అని అడిగాడు.

"మహారాజా! నన్ను రెండు గడియల పాటు ఇక్కడే ఉండమని చెప్పి, ధృతరాష్ట్రుడి కొడుకులను చంపిరావటానికిగాను కౌరవ సైన్యంలో జొరబడ్డాడు!" అని సారథి సమాధానం చెప్పాడు.

"అయ్యో, భీముణ్ణి పోగొట్టుకుంటే ఇక నేను జీవించిఉండి మాత్రం ఏమి ప్రయోజనం!" అనుకుంటూ ధృష్టద్యుమ్నుడు ముందుకు చొచ్చుకుపోగా, కొంతదూరాన భీముడు, దారిలో వచ్చిన ప్రతి ఏనుగునూ, రథాన్నీ తన గదతో మోదుతూ, ముందుకు పోతూ కనిపించాడు. అతని చుట్టూ హాహాకారాలు చెలరేగుతున్నాయి, కాని అతని శరీరంనిండా బాణాలే!

ధృష్టద్యుమ్నుడు భీముణ్ణి తన రథమెక్కించి, అతని ఒంటిన గుచ్చుకున్న బాణాలన్నీ పీకేసి, ఉపచారాలు చేసి, కౌగలించుకున్నాడు. ఇంతలో దుర్యోధనుడూ, అతని తమ్ములూ కలిసి ధృష్టద్యుమ్నుడిపై కలియబడ్డారు. ధృష్టద్యుమ్నుడు వారందరినీ ఒక్కసారి కలయజూసి సమ్మోహనాస్త్రం వేసి దుర్యోధనాదులందరినీ మూర్ఛ పోగొట్టాడు.

అవతల ద్రుపదుడితో యుద్ధంచేస్తూ ద్రుపదుణ్ణి తరిమికొట్టిన ద్రోణుడు తన ప్రభువులైన దుర్యోధనాదులు మూర్ఛలో ఉండటం తెలిసి వేగంగా వచ్చి ప్రజ్ఞాస్త్రం వేసి సమ్మోహనాస్త్రాన్ని భగ్నంచేసేసరికి అందరూ మూర్ఛనుంచి లేచారు. వారు తిరిగి భీముడితో యుద్ధానికి ఉపక్రమించారు. భీముడికీ, దుర్యోధనుడికీ తీవ్రంగా యుద్ధం జరిగింది. అప్పటికి మధ్యాహ్నమయింది.

ఈ లోపుగా భీముడికి సహాయంగా ధర్మరాజు పన్నెండుమంది యోధులను, అభిమన్యుడూ, ధృష్టకేతువు, కైకేయులూ, ఉపపాండవులూ మొదలైనవారిని, పంపాడు. వారు రావటం చూసి కౌరవులు వెళ్ళిపోయారు. వారు తనచేత చావకుండా దాటిపోయినందుకు భీముడు చాలా చింతించాడు.

అపరాహ్ణం లగాయతు సాయంకాలం దాకా తిరిగి ఉభయపక్ష వీరులూ తీవ్రంగా పోరాడారు. ఒకవైపున భీష్ముడు పాండవ సేనలను చెండుకుతింటే, దక్షిణ పార్శ్వంలో అర్జునుడు కౌరవ సేనలను బూడిదచేశాడు. సూర్యాస్తమయం కాబోతూండగా భీముడూ, దుర్యోధనుడూ మళ్ళీ తలపడ్డారు. భీముడు పిడుగుల్లాటి బాణాలతో దుర్యోధనుణ్ణి కొట్టాడు; అతని సారథినీ, గుర్రాలనూ చంపాడు; అతని ఛత్రాన్నీ, పాము జెండానూ పడగొట్టాడు. అంతలో కృపుడు వచ్చి దుర్యోధనుణ్ణి ఇంకొక రథంలో కూచోబెట్టాడు. బాగా దెబ్బలు తినిఉన్న దుర్యోధనుడు రథంలో చేరగిలబడి కూచున్నాడు.

తరవాత సైంధవుడు వచ్చి భీముణ్ణి ఎదుర్కొన్నాడు. భీముడికి అండగా వచ్చిన అభిమన్యుడు మొదలుగాగలవారు దుర్యోధనుడి తమ్ములతో తలపడ్డారు. ఈ యుద్ధంలో



దుర్యోధనుడి తమ్ములలో ఒకడైన వికర్ణుడు అభిమన్యుడి బాణాలదెబ్బకు పడిపోయాడు. దుర్ముఖుణ్ణి శ్రుతకర్మ చంపేశాడు. దుష్కర్ణుడు నకులుడి కొడుకైన శతానీకుడితో యుద్ధంచేసి చనిపోయాడు. అంతలోనే సూర్యాస్తమయం అయింది, ఆ నాటికి యుద్ధం ముగిసింది.

ఉభయపక్షాల యోధులూ తమతమ శిబిరాలకు తిరిగి వెళ్ళి, యుద్ధం గురించి ముచ్చటించుకున్నారు, ఒకరి పరాక్రమాన్ని ఒకరు ప్రశంసించుకున్నారు.

ఆ రోజు జరిగిన యుద్ధంలో దుర్యోధనుడు బాగా దెబ్బతిని ఉండటంచేత అతని


మనస్సు చింతతో నిండిపోయి ఉన్నది. అతను తన తాతగారైన భీష్ముడి వద్దకు వెళ్ళి, "తాతా, మనం ఎలాటి అభేద్యమైన వ్యూహాన్ని పన్నినా పాండవులు దానిని భేదించి విజృంభిస్తున్నారు. ఇవాళ భీముడు నన్ను చాలా పీడించాడు, మన సైన్యాన్ని చాలా నాశనం చేశాడు. నేను యుద్ధ రంగంలో మూర్ఛపోయాను. ఇంతవరకూ నా మనస్సు స్థిమితపడనేలేదు. ఓ మహానుభావా, నీ అనుగ్రహం ఉంటే తప్ప నేనా పాండవులను చంపి విజయం సాధించలేను," అన్నాడు.


దుర్యోధనుడి మనసు ఎంతో చింతాక్రాంతమై ఉన్నదని గ్రహించి భీష్ముడు అతనికి తిరిగి ధైర్యోత్సాహాలు కలిగించటానికి ఇలా అన్నాడు:

"రాజా, నీకు విజయం కలగగలందులకు నేను పాండవ సైన్యాలలో జొరబడి యథాశక్తి పోరాడుతూనే ఉన్నానుగాని ఒళ్ళు దాచుకోవటానికి ఎలాటి ప్రయత్నమూ చెయ్యటంలేదు. పాండవులు చూడబోతే శూరులూ, మహారథులూ, అస్త్రాలు ఎరిగిన వారూ, ఆగ్రహించెంది ఉన్న వారూనూ. వారిని జయించటం తేలిక కాదు. అయినా జీవితాశ లేకుండా వారిని ఎదుర్కొంటున్నాను. ఇకముందుకూడా అలాగే పోట్లాడతాను. నేనేగాక, ద్రోణుడూ, శల్యుడూ, కృతవర్మ, అశ్వత్థామా, సోమదత్తుడూ, సైంధవుడూ, విందానువిందులూ, బాహ్లికుడూ మొదలైన మేటి వీరులందరూ నీకోసం ప్రాణాలు అర్పించ సంసిద్ధులై ఉన్నారు. చివరకు పాండవులే నన్ను జయిస్తారో, నేనే పాండవులను జయిస్తానో అదిమాత్రం చెప్పలేను."

దుర్యోధనుడితో భీష్ముడీ విధంగా కొంతసేపు సంభాషించి, అతని దుఃఖాన్ని ఉపశమింపజేయటానికి విశల్యకరణి అనే ఓషధిని ఇచ్చాడు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Mar. '60
50
NAYE PAISE
8
AS



మహాభారతం

ఏడవ రోజు తెల్లవారుతూనే భీష్ముడు తన సేనను మండలమనే వ్యూహంలో అమర్చాడు. పాండవసేనలు వజ్రమనే వ్యూహంలో అమర్చబడ్డాయి. ఆనాడు జరిగిన ద్వంద్వయుద్ధాలలో ఉభయపక్షాల గల మహాయోధులందరూ పాల్గొన్నారు; శత్రు పక్షాల వ్యూహాలను భేదించేశారు.

యుద్ధం ఆరంభంలోనే అర్జునుడు కౌరవ సైన్యాన్ని తన బాణాలతో కల్లోలపరిచి, ఐంద్రాస్త్రం ప్రయోగించాడు. దాని ఫలితంగా కౌరవసైన్యంలోని ప్రతి యోధుడూ, ప్రతి గుర్రమూ, ప్రతి ఏనుగూ కనీసం ఒకటి రెండు బాణాల దెబ్బలు తినటం జరిగింది. కౌరవయోధులు భీష్ముడి శరణుజొచ్చారు.

అప్పుడు అర్జునుడితో పోరటానికి భీష్ముడు వచ్చాడు. ఆయనకు రక్షగా ఉండమని త్రిగర్తరాజైన సుశర్మను దుర్యోధనుడు ప్రోత్సహించాడు. త్రిగర్త సైన్యమంతా భీష్ముడివెంట వచ్చింది. అప్పుడు జరిగిన మహాయుద్ధంలో విరాటుడు తన రథాన్ని, గుర్రాలనూ పోగొట్టుకుని, తన కొడుకైన శంఖుడి రథమెక్కి యుద్ధం సాగించాడు. ఇంతలోనే శంఖుడు ద్రోణుడి చేతిలో తీవ్రంగా గాయపడి రథంలో కూలబడేసరికి విరాటుడు పారిపోయాడు.

శిఖండికీ అశ్వత్థామకూ యుద్ధం జరిగింది. శిఖండి అశ్వత్థామను మూడు బాణాలతో నుదుటిమీద కొట్టాడు. అశ్వత్థామ మండిపడి శిఖండి రథ సారథినీ, జెండానూ, గుర్రాలనూ, శిఖండి చేతి వింటినీ విరగగొట్టేశాడు. శిఖండి కత్తి పట్టుకుని యుద్ధం చేస్తూ చాలాసేపు అశ్వత్థామ బాణాలనుంచి తనను తాను కాపాడుకుని అవతల ఇంకొక రథమెక్కాడు.

సాత్యకికీ, అలంబుసుడనే రాక్షసుడికీ యుద్ధం జరిగింది. వాడు మాయాయుద్ధం

సాగించేసరికి సాత్యకి, అర్జునుడినుంచి సంపాదించిన ఐంద్రాస్త్రం ప్రయోగించి వాడి మాయను పటాపంచలు చేశాడు.

ధృష్టద్యుమ్నుడికీ దుర్యోధనుడికీ జరిగిన ద్వంద్వయుద్ధంలో దుర్యోధనుడు తన రథాన్నీ, ఆయుధాలనూ కోల్పోయి పరాభవం చెంది, కత్తి తీసుకుని పోరాడవలసి వచ్చింది. అంతలో శకుని వచ్చి అతన్ని తన రథంలో ఎక్కించుకున్నాడు.

ఈ పరాభవంతో కుమిలిపోతూన్న దుర్యోధనుడు చూస్తూండగానే భీముడు కృతవర్మతో ఘోరంగా తలపడి, ఆయనను విరథుణ్ణి చేసి, తన బాణాలతో క్రూరంగా నొప్పించాడు. కృతవర్మ తన బావ అయిన వృషకుడి రథమెక్కాడు.

అర్జునుడికీ, ఉలూపికీ పుట్టిన ఇరావంతుడు, అవంతిరాజులైన విందానువిందులతో పోరాడి, వారిలో ఒకణ్ణి విరథుణ్ణి చేశాడు. తరవాత ఇద్దరూ ఒకేరథంలో ఎక్కి యుద్ధం సాగించారు. ఇరావంతుడు వాళ్ళ సారథిని పడగొట్టేసరికి, గుర్రాలు రథాన్ని లాక్కుని వెళ్ళిపోయాయి.

ఆ రోజు మధ్యాన్నం కాకముందు ఈ విధంగా పాండవ యోధులు విజయపరంపరలు సాధించి కౌరవసైన్యాన్ని క్రూరంగా



నిర్మూలించారు. ఇంతలో ఘటోత్కచుడూ, భగదత్తుడూ తలపడ్డారు. ఇద్దరికీ మహా భయంకరమైన యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఘటోత్కచుడు ఓడిపోయి, భయపడి పారిపోయాడు. భగదత్తుడు పాండవ సైన్యాన్ని చెండాడసాగాడు.

శల్యుడికీ ఆయన మేనల్లుళ్ళయిన నకుల సహదేవులకూ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో నకులుడు తన రథాన్ని కోల్పోయి సహదేవుడి రథమెక్కాడు. తరవాత సహదేవుడు శల్యుణ్ణి ఒక్క తీవ్రమైన బాణంతో కొట్టి, మూర్ఛపోగొట్టాడు. శల్యుడి సారథి రథాన్ని మరలించుకుపోయాడు.



ఆ రోజు యుద్ధంలో పెద్ద ఎత్తున పోరాడి విశేషంగా జనక్షయం చేసినవారిలో ఒకడు అర్జునుడు; అతను యుద్ధంలో సుశర్మను ఓడించటమే గాక, అధికసంఖ్యలో త్రిగర్త యోధులనూ, సైన్యాలనూ నాశనం చేశాడు. రెండోవాడు భీష్ముడు; ఆయన ధర్మరాజు మొదలుగాగల పాండవ యోధులను ఓడించటమే గాక పాంచాల సైన్యాలనూ, యోధులనూ అధిక సంఖ్యలో నిర్మూలించాడు.

ఏడో రోజు యుద్ధం ముగిసేసరికి యుద్ధభూమి నక్కల కూతలతోనూ, గద్దలు మొదలైన వాటితోనూ భయంకరంగా ఉన్నది. యోధులు తమతమ శిబిరాలకు పోయి, తమ శరీరాలలో గుచ్చుకున్న బాణాలు పీకేయించుకుని, స్నానాలుచేసి, సంగీతం విని, యుద్ధంగురించి మాట్లాడకుండా సుఖంగా నిద్రపోయారు.


మర్నాడు యుద్ధారంభంలోనే భీష్ముడు విజృంభించి పాండవ పక్షాన పోరాడే సోమక, సృంజయ, పాంచాల సేనలను కార్చిచ్చులాగా నిర్మూలించసాగాడు. భీష్ముణ్ణి ఆ సమయంలో ఎదుర్కొనటానికి పాండవ యోధులలో భీముడొక్కడే సాహసించాడు. యుద్ధంలో భీముడు భీష్ముడంత భయంకరంగానూ ఉండి ఆయనను పీడించ నారంభించాడు. భీష్ముడికి అండగా దుర్యోధనుడూ, అతని తమ్ములూ ఉన్నప్పటికీ భీముడు లక్ష్యపెట్టక, భీష్ముడి సారథిని చంపేశాడు. భీష్ముడి రథం తొలగిపోయింది.

వెంటనే భీముడు ఒక్క బాణం ఎక్కుపెట్టి దుర్యోధనుడి **తమ్ములలో** ఒకడైన సువాభుడి తల తెగవేశాడు. అది చూసి మండిపడి దుర్యోధనుడి తమ్ములు మరి ఏడుగురు—ఆదిత్యకేతువు, బహ్వాశి, కుండధారుడు, మహోదరుడు, పండితకుడు, అపరాజితుడు, విశాలాక్షుడు అనేవారు—భీముడిపైకి వచ్చారు. వీరందరూ వేసిన బాణాలలో కొన్ని భీముడికి తగిలి బాధ

పెట్టాయి. భీముడు మండిపడి తన బాణా లతో ఏడుగురినీ వరసగా చంపేశాడు.


తన తమ్ములు ఈ విధంగా భీముడి చేతిలో చావటం చూసి దుర్యోధనుడికి దుఃఖం వచ్చేసింది. అతను భీష్ముడితో, "తాతా, భీముడు నా తమ్ములనూ, నా సైన్యాలనూ హతమార్చేస్తున్నాడు. నీవు పట్టించుకోకుండా చూస్తూ ఊరుకుంటు న్నావు! నా దురవస్థ ఎలా ఉన్నదో చూడు!" అన్నాడు. ఈ మాటలు విని భీష్ముడికి కోపం వచ్చింది. ఆయన దుర్యోధనుడితో, "నీకు ఎందరు ఎన్ని హితాలు చెప్పినా అప్పుడు పెడచెవిని పెట్టావు. నన్నూ, ద్రోణుణ్ణీ ఈ యుద్ధంలో దించవద్దంటే విన్నావు కావు. భీముడు నీ తమ్ములను చూస్తే చంపకుండా విడవడు. పాండవులను జయించటం మాటలు కాదు, కావలిస్తే నీ అంతట నీవే వారిని జయించుకో!" అన్నాడు.

ఆనాటి మధ్యాహ్నం యుద్ధం చాలా తీవ్రంగా పరిణమించింది. ధర్మరాజు అజ్ఞ ననుసరించి పాండవపక్ష యోధులందరూ భీష్ముణ్ణి చంపే ఉద్దేశంతో ఆయనపైకి వచ్చారు. అదిచూసి కౌరవపక్ష యోధు లందరూ వారిని ఎదుర్కొన్నారు. అతి భయంకరమైన యుద్ధం సాగింది. ద్రోణుడు



సృంజయ సోమక సైన్యాలను నిర్మూలించ సాగాడు. పాండవుల పక్షాన భీముడు ఏను గుల సైన్యాలనూ, నకుల సహదేవులు అశ్వ దళాలనూ నాశనంచేయసాగారు.

ఒకవంకనుంచి ఇరావంతుడు తన యోధులనూ, సైన్యాన్నీ పురికొల్పి కౌరవ సేనలను నాశనం చెయ్యసాగాడు. అప్పుడు శకుని తమ్ములైన గజుడు, గవాక్షుడు, వృష భుడు, చర్మవంతుడు, ఆర్జవుడు, శకుడు అనే ఆరుగురు ఇరావంతుడితో కలియబడి యుద్ధం ప్రారంభించారు. ఇరావంతుడు అందరితోనూ యుద్ధంచేస్తూ, అసామాన్య మైన శౌర్య పరాక్రమాలు ప్రదర్శించాడు.



అతను తన శరీరంలో గుచ్చుకున్న బాణాలనే పీకి తన శత్రువులపై ప్రయోగించాడు! అతని బాణాలకు శత్రువులందరూ మూర్ఛపోయారు. అదిచూసి ఇరావంతుడు ఖడ్గధారి అయి వారిని చంపటానికి కాలినడకను బయలుదేరాడు. ఇంతలో వారు మూర్ఛ తెలిసి అతన్ని కమ్ముకోవటానికి ప్రయత్నించారు. అయినా కత్తితో అతను వారిని దూరంగా ఉంచటమే గాక, ఒక్కొక్కరినే నరకటంకూడా సాగించాడు. మిగిలిన వారంతా అతని కత్తికి బలికాగా వృషభుడు మాత్రమే ప్రాణాలతో తప్పించుకుని పారిపోయాడు.

ఇదిచూసి దుర్యోధనుడు ఆర్ష్యశృంగుడనే రాక్షసుడితో, "ఆ పోరాడేది ఎవరో తెలుసా? మీ బకాసురుణ్ణి చంపిన భీముడి తమ్ముడి కుమారుడు. నీకెన్నో మాయలూ, మాయాస్త్రాలూ తెలుసు. అందుచేత నువ్వు ఈ యువకుణ్ణి ఎలాగైనా చంపెయ్యి," అన్నాడు.

ఆ రాక్షసుడికీ ఇరావంతుడికీ చాలాసేపు యుద్ధం జరిగాక ఇరావంతుడు మూర్ఛపోయి, ఆ స్థితిలో రాక్షసుడి కత్తికి బలి అయిపోయాడు.

ఇరావంతుడి చావు అర్జునుడికి వెంటనే తెలియలేదు; అతను మరొకచోట కౌరవ సైన్యాలను నిర్మూలిస్తున్నాడు. కాని ఈ సంగతి ఘటోత్కచుడికి తెలిసి, అతను భూమ్యాకాశాలు దద్దరిల్లేలాగ ఒక గొప్ప సింహనాదం చేసి కౌరవసైన్యాలపైకి పరాక్రమించాడు. అతని వెనక రాక్షస సైన్యం వచ్చింది. ఇలా మృత్యువులాగా వచ్చిపడే ఘటోత్కచుణ్ణీ, రాక్షసయోధులనూ దుర్యోధనుడు ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అతనికి అండగా వంగరాజున్నాడు.

దుర్యోధనుడు అత్యంత పరాక్రమశాలి అయి పోట్లాడుతూ తన బాణాలతో అనేక మంది రాక్షస యోధులను చంపాడు. అది చూసి ఘటోత్కచుడు మండిపడి ఒక



శక్తిని తీసుకుని దుర్యోధనుణ్ణి చంపటానికి ఉరుకుతూ వచ్చాడు. అప్పుడు వంగరాజు తన పెద్ద యేనుగును దుర్యోధనుడి రథానికి అడ్డంగా నడిపాడు. ఘటోత్కచుడి శక్తికి ఏనుగు చచ్చింది. వంగరాజు ప్రాణాలతో తప్పించుకుని పారిపోయాడు. ఘటోత్కచుడు మళ్లీ సింహగర్జన చేశాడు.

"ఘటోత్కచుడు దుర్యోధనుణ్ణి పట్టి చంపెయ్య చూస్తున్నాడు. వెళ్ళి రక్షించండి!" అని భీష్ముడు ద్రోణుడితో అనే సరికి, ద్రోణుడూ, సోమదత్తుడూ, బాహ్లికుడూ, సైంధవుడూ, కృపుడూ, భూరిశ్రవుడూ, శల్యుడూ, బృహద్బలుడూ, అశ్వత్థామా, వికర్ణుడూ, చిత్రసేనుడూ, వివింశతి మొదలైన మహాయోధులంతా ఘటోత్కచుడిపైకి వెళ్లారు. రాక్షసులతో వారికి మహాదారుణమైన యుద్ధం జరిగింది. ఘటోత్కచుడు ఆ యోధులందరినీ హింసించి విజృంభించాడు.

ఇంతలో ఘటోత్కచుడికి తోడుగా భీముడూ, అతన్నిచూసి అభిమన్యుడు మొదలుగాగల యోధులూ వచ్చారు. కౌరవ వీరులు వారితో తలపడ్డారు. తీవ్రమైన యుద్ధం సాగింది. ఈ యుద్ధంలో ఒక సందర్భంలో కౌరవవీరులు భీముణ్ణి చుట్టుముట్టి చంప యత్నించారు. అది చూసి ఘటోత్కచుడు మాయ పన్ని భయంకరాకారాలు సృష్టించాడు. వాటిని చూసి అశ్వత్థామవంటి యోధుడుకూడా భయపడ్డాడు. మిగిలిన కౌరవ వీరులు పారిపోయారు.

ఆ స్థితిలో భీష్ముడు భగదత్తుడితో, "ఓ రాజా, ఈ ఘటోత్కచుణ్ణి నీవే ఎదుర్కోవాలి. నీ దగ్గిర ఎన్నో గొప్ప అస్త్రాలున్నాయి. నీవు ఎందరో రాక్షసులతో పోరినవాడవు," అన్నాడు. భగదత్తుడు సుప్రతీకమనే తన గొప్ప ఏనుగునెక్కి శత్రువులపైకి వచ్చాడు.


భగదత్తుడు భీముడి రథంపైకి తన సుప్రతీకాన్ని నడిపాడు. దశార్ణదేశపు రాజైన క్షత్ర


దేవుడుకూడా గొప్ప ఏనుగునే ఎక్కి ఉన్నాడు; అతను భగదత్తుడికి అడ్డుతగిలాడు. కాని భగదత్తుడి దెబ్బలకు తట్టుకోలేక క్షత్రదేవుడి ఏనుగు పారిపోయింది. ఆ తరవాత సుప్రతీకం పాండవ బలాలను నిర్మూలించసాగింది.

అప్పుడు ఘటోత్కచుడు భగదత్తుణ్ణి ఎదిరించాడు. ఘటోత్కచుడు తన ఏనుగుపై విసిరిన శూలాన్ని భగదత్తుడు దారిలోనే రెండుముక్కలు చేశాడు. తరవాత భగదత్తుడు ఒక బ్రహ్మాండమైన శక్తిని విసిరేసరికి ఘటోత్కచుడు దాన్ని ఎగిరి అందుకుని తన మోచేత్తో తిప్పి కొట్టాడు. ఇది చూసి భగదత్తుడు నివ్వెరపోయాడు; పాండవ సైన్యాలు హర్షధ్వానాలు చేశాయి. వాటిని విని భగదత్తుడు రోషంతో దుస్సహంగా యుద్ధం సాగించాడు. పాండవపక్ష యోధులందరూ అతని బాణాలను రుచి చూశారు. భీముడి సారథి విశోకుడు మూర్ఛపోగా భీముడు గద తీసుకుని కిందికి దిగాడు. ఇంతలో అర్జునుడుకూడా భగదత్తుడితో యుద్ధం చేయవచ్చాడు. అప్పుడే అతనికీ, కృష్ణుడికీ, భీముడికీ ఇరావంతుడి మరణవార్త తెలిసింది.


అర్జునుడికి కాస్సేపు యుద్ధంపైనా, రాజ్యకాంక్షపైనా విరక్తి కలిగి, "ఉభయ పక్షాలా జ్ఞాతులను చంపుకునేది ఇది ఏమి యుద్ధం!" అనుకున్నాడు. కాని ఈ యుద్ధాన్ని అంతమొందించటానికి యుద్ధం చెయ్యటమే తప్ప తనకు వేరు మార్గం లేదని అతను తెలుసుకున్నాడు.

ఇంతలో మరికొందరు ధృతరాష్ట్రుడి కొడుకులు భీముడి కంటపడ్డారు. అతను లేళ్లను చూసిన సింహంలాగా అయిపోయి వారిలో కొందరిని చంపేసరికి మిగిలినవారు పారిపోయారు. ఆరోజు యుద్ధం చీకటిపడి కళ్ళు కనిపించకుండా పోయేదాకా సాగి ఆ తరవాత ముగిసింది.





చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st April '60
50 NAYE PAISE
8 AS
T.V. Acharya



మహాభారతం

ఎనిమిదో రోజు రాత్రి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు సమావేశమయారు. దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు: "మన భీష్మ ద్రోణ కృప శల్యులందరూ ఉండికూడా పాండవులను నిర్మూలించ లేకుండా ఉన్నారు. కారణం తెలియదు. పాండవులు చూడబోతే విజృంభించి యుద్ధంచేస్తున్నారు. మన బలాలు నానాటికీ క్షీణిస్తున్నాయి. దేవుడూ, పాండవులూ ఏకమై హేళన చేస్తున్నట్టుగా ఉన్నది నా బ్రతుకు. ఈ యుద్ధంలో ఎలా జయిస్తానో తెలియటంలేదు."

ఈ మాటలు విని కర్ణుడు, "మహారాజా, చింతించకండి. భీష్ముణ్ణి యుద్ధం విరమించుకోమనండి. నేను నా బంధువులతో సహా ఆ పాండవులను క్షణంలో యమలోకానికి పంపుతాను. భీష్ముడికి పాండవులంటే ప్రీతి, పైగా ఆయనకు దురభిమానమూ, ముకోపమూనూ. అందుచేత ఆయన పాండవులను ఒక్కనాటికి నిర్మూలించలేడు. ఆయన ఈ క్షణాన అస్త్రసన్యాసం చేస్తే నేను మరుక్షణాన కదనరంగం ప్రవేశించి, నా శౌర్య పరాక్రమాలు ఆయనకే చూపుతాను," అన్నాడు.

ఈ మాటలకు దుర్యోధనుడు సంతోషించి, మర్నాటి యుద్ధానికి సేనలను ఆయత్తం చెయ్యమని దుశ్శాసనుడితో చెప్పి, కర్ణుడితో, "కర్ణా, నేనిప్పుడే భీష్ముడి శిబిరానికి వెళ్ళి ఆయనను అస్త్రసన్యాసానికి ఒప్పించి వస్తాను," అని చెప్పాడు.

తరవాత దుర్యోధనుడు మంచి బట్టలూ, నగలూ ధరించి అట్టహాసంగా ముస్తాబై, గొప్ప పరివారాన్ని వెంటబెట్టుకుని భీష్ముడి శిబిరానికి వెళ్ళాడు. భీష్ముడు అతనికి తగిన విధంగా స్వాగతమిచ్చి కూచోబెట్టాడు. అతను భీష్ముడితో, "తాతా, కేకయ పాంచాల సోమకుల నందరినీ రూపుమాపుతానని లోగడ ప్రతిజ్ఞచేసి ఉన్నావుగదా,

ఆ పని ఎందుకు చేయవు. ఒకవేళ నీకు పాండవుల మీద ప్రేమ ఉన్నా, లేక, నాపైన ఆగ్రహం ఉన్నా నీవు యుద్ధం చెయ్యటం మాని యుద్ధ భారమంతా కర్ణుడిపైన పెట్టు. అతను పాండవులను బంధుమిత్ర పరివార సమేతంగా మారణం చేసేస్తాడు!" అన్నాడు.

ఈ మాటలు వినేసరికి భీష్ముడికి పట్టరాని ఆగ్రహం వచ్చింది. కళ్ళు ఎర్రబడిపోయాయి. ఆయన ఆ కోపాన్ని ఎలాగో అణచుకుని, "దుర్యోధనా, ఎందుకిలా నన్ను శూలాలతో గుచ్చినట్టుగా మాట్లాడతావు? నీకోసమే గదా శత్రుసైన్యాలను కార్చిచ్చులాగా దహించుతున్నాను? అర్జునుడు ఎలాటి యోధుడైనదీ నీకుమాత్రం తెలియదా? నిన్ను గంధర్వులు పట్టుకుపోయినప్పుడతను ఒంటరిగా వచ్చి విడిపించాడే! అప్పుడు నీ తమ్ములందరూ పారిపోలేదా? ఈ కర్ణుడు ఏమైనా చెయ్యగలిగాడా? తిరిగి ఈ అర్జునుడే విరాటనగరం దగ్గిర మనల నందరినీ ఓడించాడుగదా! అతను అసహాయ శూరుడనటానికి ఇంకేం నిదర్శనం కావాలి? నేను ఒక్క శిఖండిని తప్ప మిగిలిన సోమక పాంచాలుల నందరినీ చంపేస్తాను, లేదా వారి చేతిలో చచ్చి అయినా పోతాను. రేపు నేను చేయబోయే



యుద్ధం నీవే చూద్దువుగాని!" అన్నాడు. ఈ మాటలకు తృప్తిచెంది దుర్యోధనుడు పరివారంతో సహా శిబిరానికి వెళ్ళిపోయాడు.

తెల్లవారుతూనే కౌరవసైన్యాలు సర్వతోభద్రమనే వ్యూహంలో ఆయత్తమయాయి. ఈ తొమ్మిదవరోజు యుద్ధంలో గొప్పగా పోరాడి శత్రుసైన్యాలను చించి చెండాడిన వారిలో అభిమన్యుడొకడు. ఆ రోజు అతడి ధాటికి ద్రోణ కృప అశ్వత్థామలూ, సైంధవుడూ కూడా తట్టుకోలేకపోయారు. అది చూసి దుర్యోధనుడు అలంబుసుడనే రాక్షసుణ్ణి అభిమన్యుడిపైకి పంపాడు. ఇద్దరికీ భయంకరమైన యుద్ధం జరిగింది.



అలంబుసుడు బాగా దెబ్బతిని మాయ పన్ని అంతటా అంధకారం కల్పించాడు. ఆ అంధకారాన్ని ఛేదించటానికి అభిమన్యుడు సూర్యాస్త్రం ప్రయోగించాడు. చివరకు అలంబుసుడు ఓడి పారిపోయాడు. అభిమన్యుడు కౌరవ సేనలను భీభత్సపరిచాడు.

త్వరలోనే కౌరవయోధులు అభిమన్యుణ్ణి చుట్టుముట్టి ఒంటరివాణ్ణి చేశారు. అతన్ని రక్షించటానికి అర్జునుడు వచ్చాడు. తరవాత ఉభయ పక్షాల వీరులకూ అనేక రకాలుగా ద్వంద్వ యుద్ధాలు సాగాయి. ఆ రోజు యుద్ధంలో అర్జునుడు కూడా అభిమన్యుడికి తీసిపోకుండా శత్రునాశనం సాగించాడు.

అయితే అందరికన్న శత్రువులపైన ప్రళయ తాండవం సాగించినవాడు భీష్ముడు. పాండవులు కౌరవ సైన్యాలను ఎలా నిర్మూలించారో, భీష్ముడు అలాగే పాంథవ సైన్యాలను నిర్మూలించాడు. ఆయన ధాటికి తట్టుకోలేక పాండవ సైన్యాలు పారిపోతుంటే వాటిని ఆపటం ఏ ఒకరికీ సాధ్యంకాలేదు. ఆయన అలా యుద్ధం చేస్తూండగానే సూర్యాస్తమయం అయింది. సూర్యుడితోపాటే పాండవుల ధైర్యం కూడా అస్తమించింది. కౌరవుల ఆనందానికి మటుకు మేరలేదు.

ముందు జరగవలసిన యుద్ధంగతి గురించి పాండవ యోధులు మాట్లాడుకున్నారు. ధర్మరాజు కృష్ణుడితో, "అవతల భీష్ముడుండగా ఈ యుద్ధాన్ని తలపెట్టడం ఎంత అవివేకమైన పని! ఆయన మమ్మల్ని బతకనివ్వడు, బతికి ఉంటే ఏ ధర్మమైనా సాధించవచ్చు. చచ్చి ఏమి సాధించగలం? నేని యుద్ధం మానేస్తాను. నీ సలహా ఏమిటి?" అన్నాడు.

దానికి కృష్ణుడు, "భీష్ముడు చచ్చినట్టయితే నీకు విజయం తప్పదు. భీష్ముణ్ణి చంపటం అర్జునుడికి ఇష్టంలేని పక్షాన నన్ను యోధుడుగా నియమించు. నీ ఆజ్ఞతో

అస్త్రం పట్టి నేనా భీష్ముణ్ణి క్షణంలో వధించి నీకు విజయం చేకూర్చుతాను!" అన్నాడు.

"కృష్ణా, నీవు అస్త్రం పట్టనని అని ఉన్నావు. నీ మాట అబద్ధం చెయ్యటం నా కిష్టంలేదు. యుద్ధం చెయ్యటం తప్ప మాకు నీవల్ల ఏ యితర సహాయం లభించినా అదే పదివేలు. మొదట్లో భీష్ముడు నా పక్షాన యుద్ధం చెయ్యకపోయినా ఇతర రీతిగా సహాయపడతా నన్నాడు. ఆయన నా మేలు కోరేవాడు. అందుచేత మనం ఆయనవద్దకు వెళ్ళి ఆయన ఎలాగు చచ్చిపోతాడో ఆ ఉపాయం అడుగుదాం....కృష్ణా, తండ్రి లేని మమ్మల్ని ఆయన తండ్రిలాగా పెంచాడే, ఆయనను చంపటానికి చూస్తున్నాంగదా, ఈ క్షత్రియ జన్మ ఏమి జన్మ!" అన్నాడు ధర్మరాజు.


కృష్ణుడు ధర్మరాజు సూచనను ఆమోదించి, భీష్ముడు ఎలా చస్తాడో ఆయననే అడగటంలో తప్పు లేదన్నాడు. పంచపాండవులూ, కృష్ణుడూ ఆయుధాలూ కవచాలూ తీసివేసి, కిరీటాలు కూడా లేకుండా భీష్ముడి శిబిరానికి వెళ్ళి ఆయనకు భక్తితో నమస్కారాలు చేశారు.

భీష్ముడు వారిని ఎంతో ఆదరంతో కూర్చోబెట్టి కుశలప్రశ్నలు వేసి, వచ్చిన పని



అడిగాడు. ధర్మరాజు ఆయనతో, "తాతా, ఆరోజు కారోజు జనక్షయం అవుతున్నదేగాని మేము గెలిచే జాడ లేదు. నిన్ను యుద్ధంలో ఎలా గెలవాలో మాకు తెలియటంలేదు. నిన్ను జయించే ఉపాయం ఏదైనా ఉంటే చెప్పవా?" అన్నాడు.

దానికి భీష్ముడు, "పాండవులారా, నేను జీవించి ఉండగా ఈ యుద్ధంలో మీకు విజయం లభించేది కల్ల. మీకు గెలవాలని ఉంటే నన్ను శీఘ్రంగా పడగొట్టండి. ఇందుకు మీకు శిఖండి ఉన్నాడు. వాడు మహారథుడు, రణశూరుడు. కాని వాడు మొదట స్త్రీ అయిఉండి అనంతరం పురుష



డైన కారణంచేత నేను వాడితో యుద్ధం చెయ్యను. కనుక వాణ్ణి ముందుంచుకుని మన అర్జునుడు నాపైకి యుద్ధానికి వస్తే నన్ను సులువుగా చంపగలుగుతాడు. ఆ తరవాత కౌరవ సేనలు ఎలాగూ ఓడిపోతాయి," అన్నాడు. పాండవులు ఈ సలహా తీసుకుని పితామహుడికి నమస్కరించి తమ శిబిరాలకు వెళ్ళిపోయారు.

ఇంతా అయాక అర్జునుడు నీరుకారి పోయాడు. అతను కృష్ణుడితో, "నన్ను భీష్ముడు దుమ్ములో ఆడుకుంటూంటే చూసి బాధపడేవాడు. ఒకనాడాయన తొడ మీద కూచుని 'నాన్నా' అని పిలిస్తే, 'నేను నీకు తండ్రిని కాను, నాయనా, తాతను,' అన్నాడు. ఆయనను ఎలా చంపను? ఆయన మమ్మల్నందరినీ చంపినా సరే!" అన్నాడు దీనంగా.

అర్జునుణ్ణి కృష్ణుడు మందలించాడు. చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకోవటానికి భీష్ముణ్ణి చంపవలసిందే నన్నాడు. తనను చంపబూనినవాణ్ణి చంపటం క్షత్రియధర్మమని బోధించాడు.

పదవ రోజు తెల్లవారింది. ఈ రోజు పాండవులు శిఖండిని ముందుంచుకుని తమ సైన్యాలతో యుద్ధరంగానికి కదిలారు. కౌరవసైన్యాలకు భీష్ముడు ముందు నిలబడ్డాడు. యుద్ధం ఆరంభమవుతూనే పాండవ సృంజయులు విజృంభించి కౌరవసైన్యాలను చెండాడసాగారు. ఇది చూసి భీష్ముడు మండిపడి పాండవ సైన్యాలను దారుణ హింసాకాండకు గురి చేయసాగాడు. ఆయన దుర్యోధనుడితో, "నేను పదివేల రథికులను చంపకుండా యుద్ధం చాలించనని నియమం పెట్టుకున్నాను. ఆ ప్రకారమే ఈ రోజు పదివేలమంది రథికులను చంపుతాను. అధైర్యపడకు," అన్నాడు.

అవతల పాండవ యోధులందరూ ఆ రోజు భీష్ముణ్ణి చంపటమే తమ లక్ష్యంగా

పెట్టుకుని అయనపైకే వచ్చారు. అలాగే కౌరవ యోధులు ఆయనను రక్షించటమే తమ లక్ష్యంగా పెట్టుకుని, భీష్ముడిపైకి వచ్చే శత్రు యోధులకు అడ్డుపడి ప్రాణాలపై ఆశ వదిలి యుద్ధంచేశారు. ఈ విధంగా ఆ పదవరోజు యుద్ధమనే జూదంలో భీష్ముడు పణం అయాడు.

అర్జునుడు శిఖండితో, "నీతో భీష్ముడు యుద్ధం చేయడు. నువ్వు ఇవాళ ఆయనను చంపితీరాలి. ఇతర కౌరవ యోధులందరూ కలిసి నిన్ను అడ్డినా వారినందరినీ నేనొక్కణ్ణే ఎదుర్కొని, వారివల్ల నీకేమీ ప్రమాదం రాకుండా చూస్తాను. ఎలాగైనా ఈనాడు భీష్ముణ్ణి చంపి నీవు శాశ్వత కీర్తి సంపాదించాలి!" అని హెచ్చరించాడు.

ఆ రోజు అర్జునుడు శిఖండిని వెన్నాడే ఉన్నాడు. పాండవపక్షాన గల యోధులందరూ భీష్ముణ్ణి చంపటానికి కంకణం కట్టుకుని ఆయనపైకి వచ్చారు. అదేవిధంగా కౌరవ వీరులందరూ ఆయనను రక్షించటానికి కంకణం కట్టుకుని పాండవ వీరులను హోరాహోరి ఎదిరించారు. ఆ రోజు దుశ్శాసనుడు ప్రత్యేకించి భీష్ముణ్ణి అంటి పెట్టుకుని ఉండి అద్భుతమైన శౌర్య ప్రతాపాలు ప్రదర్శించాడు. ద్రోణుడికి భీష్ముడా



రోజు యుద్ధంలో పడిపోతాడని ఎందుకో సందేహం కలిగింది. ఆయన తన కొడుకైన అశ్వత్థామతో, "నాయనా, ఏ తండ్రి కూడా కొడుకు మరణం కోరడు. కాని ఇవాళ నీవు నీ ప్రాణాలను కూడా లక్ష్యంచేయక భీష్ముణ్ణి కాపాడాలని నా ఆజ్ఞ!" అన్నాడు.

తన పక్షపు యోధులు పాండవయోధులను ఎదిరించి పోరాడుతూంటే భీష్ముడు తన ప్రాణాలకోసం కొంచెంకూడా లక్ష్యపెట్టక మృత్యువిహారం చేస్తూ తాను అనుకున్న ప్రకారం పదివేల మంది శత్రురథికులనూ చంపాడు, విరాటుడి తమ్ముడైన శతానీకుణ్ణి చంపేశాడు.

ఆయన ఒంటరిగా ఉభయ సైన్యాల మధ్య నిలబడి పాండవసేనలను మారణ హోమం చేస్తున్న సమయంలో శిఖండి రథం వెనకగా కృష్ణుడు అర్జునుడి రథాన్ని తోలుకుంటూ ఆయనను సమీపించాడు.


భీష్ముడు శిఖండితో యుద్ధం చెయ్యలేదు, కాని అతని గుర్రాలనూ సారథినీ కొట్టాడు. అర్జునుడు శిఖండి వెనుకనుంచి భీష్ముడి చేతిలోని విల్లు విరగగొట్టాడు. ఆయన ఎన్ని విల్లులు ఎత్తితే అన్నిటినీ తన బాణాలతో విరగగొట్టాడు. ఈలోపుగా శిఖండి భీష్ముడి శరీరంనిండా బాణాలు గుచ్చేస్తున్నాడు, కాని భీష్ముణ్ణి అవి బాధించలేదు, అయితే అర్జునుడి బాణాలు తగిలినప్పుడల్లా ఆయన బాధతో నొచ్చుకుని, "ఈ బాణాలు శిఖండివి కావు," అన్నాడు.


"మీరంతా భీష్ముడిపై తలపడండి, మీకేమీ ప్రమాదం రాదు!" అని ధర్మరాజు తన పక్షపు యోధులను హెచ్చరించాడు. రెండు గడియలపాటు భీష్ముడి చుట్టూ అతి భయంకరమైన యుద్ధం చెలరేగింది. ఆ తరవాత దుర్యోధనాదులందరూ చూస్తూండగానే భీష్ముడు తూర్పువైపు తల ఉంచి రథం మీదనుండి కిందికి ఒరిగిపోయాడు. అయితే ఆయన దేహం నేలకు తగలకుండా ఆయన శరీరంలో గుచ్చుకున్న బాణాలే ఆపాయి. ఎక్కడా రెండంగుళాలు ఖాళీ లేకుండా ఆయన శరీరంనిండా బాణాలు గుచ్చుకున్నాయి. అవే ఆయనకు అంపశయ్య అయాయి.

భీష్ముడు పడిపోగానే సైన్యంలో హాహాకారాలు చెలరేగాయి. అది దక్షిణాయన కాలం. మహనీయులు ఉత్తరాయణంలో ప్రాణాలు వదలగోరుతారు.

భీష్ముడు ప్రాణపరిత్యాగం తన చేతిలో ఉన్నవాడు. అందుచేత ఆయన ఉత్తరాయణం వచ్చేదాకా జీవించి ఉండటానికి సంకల్పించాడు.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '60
50
NAYE PAISE
8



మహాభారతం

పదకొండు అక్షౌహిణుల కౌరవసేనకు నాయకుడుగా ఉండి, పదిరోజులపాటు పాండవ యోధులనూ, సైన్యాలనూ కార్చిచ్చులాగా నాశనం చేసి మహాత్ముడైన భీష్ముడు అంపశయ్యపై పడిపోగా, పాండవులు ఉత్సాహంతో శంఖాలు పూరించి, జయధ్వానాలు చేశారు; కౌరవులు గుండె దడతో కుంగిపోయి రోదించారు.

ఆరోజుకు యుద్ధం ఆగిపోయింది. కౌరవ పక్షపు సైన్యాలను యుద్ధం నిలపమని ద్రోణుడు శాసించగానే పాండవులు తమ సైన్యాలచేత యుద్ధం ఆపించారు.

ద్రోణుడికి భీష్ముడు పడిపోవటం గురించి చెప్పినవాడు దుశ్శాసనుడు. భీష్ముడు పడ్డాడని వినగానే ద్రోణుడు రథంలో కూలబడి కొయ్యబారినట్టుగా అయిపోయాడు.

తరవాత యోధులందరూ కవచాలు విప్పేసి భీష్ముడు పడిఉన్న చోటికి వచ్చి ఆయనకు ప్రణామం చేశారు. వారిలో కౌరవులూ, పాండవులూ కూడా ఉన్నారు. భీష్ముడు అందరినీ పలకరించి, "నా తల పడిపోతున్నది. తలకింద ఎవరైనా ఎత్తు పెట్టండి," అన్నాడు.

వెంటనే మెత్తమెత్తని తలగడలు తెప్పించి ఆయన తలకింద పేర్చటానికి ప్రయత్నించారు. అదిచూసి భీష్ముడు, "వీర శయ్యపై పడుకున్నవాడికి ఈ తలగడలు యుక్తమైనవి కావు. అర్జునా, నాకు తగిన ఎత్తు తలకింద అమర్చు," అన్నాడు.

అర్జునుడు మూడు బాణాలు వింటితో సంధించి, భీష్ముడి తలకింద ఎత్తుగా ఉండేలాగు భూమిలోకి కొట్టాడు. వాటిపైన భీష్ముడి తల చక్కగా నిలిచింది.

భీష్ముడు అర్జునుణ్ణి మెచ్చుకుని, "నీ పౌరుషానికీ, నా స్థితికీ తగినట్టుగా తలగడ అమర్చావు, నాయనా," అన్నాడు. తరవాత

అట్టమీది బొమ్మ



ఆయన చుట్టూ ఉన్నవారితో, "నా చుట్టూ ఒక కందకం తవ్వించండి. నేనిక్కడ ఉత్తరాయణం వచ్చేదాకా ఒంటరిగా సూర్యుణ్ణి ధ్యానిస్తూ ఉంటాను. ఇంతటితో ఈ యుద్ధం మానెయ్యండి," అన్నాడు.

ఇంతలో అక్కడికి శస్త్రవైద్యులు ఉపకరణాలతోసహా భీష్ముడి శరీరంనుంచి బాణాలు పెరికివెయ్యటానికి వచ్చారు. అది చూసి భీష్ముడు దుర్యోధనుడితో, "నాయనా, ఈ వైద్యులకు బహుమానాలిచ్చి పంపెయ్యి. వీరితో నాకు పనిలేదు. నేని బాణాలతోనే మరణించటం ధర్మం. నేను పోయాక నన్ను వీటితోనే దహించండి," అన్నాడు.

తరవాత పాండవులు భీష్ముడికి ప్రదక్షిణ చేసి ఆయన చుట్టూ రక్షణ ఏర్పాటుచేసి తమ శిబిరాలకు వెళ్ళిపోయారు. ఆ రాత్రి గడిచి మర్నాడు తెల్లవారింది. మళ్ళీ కౌరవ పాండవులు భీష్ముణ్ణి చూడవచ్చారు. అనేక వేలమంది స్త్రీలూ, వృద్ధులూ, పిల్లలూ కూడా ఆయనను చూడవచ్చి ఆయనకు గంధ పుష్పాలర్పించారు, దండలు వేశారు. నటులూ, నర్తకులూ వచ్చి వాద్యాలతో సహా ఆయనకు వినోదం కలిగించారు.

కాని భీష్ముడు చాలా బాధలో ఉన్నాడు. ఆయన ఆ బాధను బలవంతాన దాచుకుంటూ, "నాకు దాహంగా ఉన్నది," అన్నాడు. వెంటనే భోజనపదార్థాలూ, కుండలతో చల్లని పానీయాలూ వచ్చాయి. కాని భీష్ముడు తన కవి పనికిరావని చెప్పి, అర్జునుడికోసం అడిగాడు.

అర్జునుడు ఆయనను సమీపించి నమస్కరించి, "ఏమి సెలవు?" అని అడిగాడు.

"నాయనా, నీ బాణాలతో దేహమంతా నొచ్చుతున్నది. నోరు ఎండుకు పోతున్నది. నాకు తాగటానికి పనికివచ్చే నీరు ఇవ్వటానికి నీవే సమర్థుడివి!" అన్నాడు భీష్ముడు.

అర్జునుడు అంపశయ్యపైనున్న భీష్ముడి చుట్టూ ప్రదక్షిణంచేసి, గాండీవం తీసుకుని



ఒక కాంతివంతమైన బాణాన్ని ఎక్కుపెట్టి, పర్జన్యాస్త్రం పఠించి, భీష్ముడి కుడివైపున నేలలోకి కొట్టాడు. బాణం భూమిలోకి దూసుకుపోయి, అది చేసిన రంధ్రంనుంచి జల పైకి వచ్చింది. ఆ నీరు తాగి భీష్ముడు తృప్తిచెందాడు. అర్జునుడు చేసిన ఈ పని యోధులందరికీ అద్భుతంగా కనబడింది.

భీష్ముడు అర్జునుడితో, "నాయనా, ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. క్షత్రధర్మం తెలిసినవారందరికీ నీ శక్తి ఎలాటిదో తెలుసు. నిన్ను గురించి నేనూ, విదురుడూ ఎంత చెప్పినా వివేకంలేక దుర్యోధనుడు విన్నాడు కాడు," అన్నాడు.

ఈ మాటలు విని దుర్యోధనుడు మరింత కుంగిపోయాడు. భీష్ముడు అతనితో, "నాయనా, అర్జునుడికి తెలియని అస్త్రం లేదు. అతనికి కృష్ణుడు తోడున్నంత కాలమూ నీకు అతనితో యుద్ధంకంటె సంధి మేలు. నాతో ఈ యుద్ధం ముగిసేలాగు చూడు. పాండవులతో సంధి చేసుకుని వారికి అర్ధరాజ్యమియ్యి. ధర్మరాజు ఇంద్రప్రస్థాన్ని ఏలుకోనీ. ఇప్పటికైనా నా మాటలు వినకపోతే అపకీర్తిపాలై, చెడిపోతావు," అన్నాడు. అయితే దుర్యోధనుడి తలకు ఈ మాటలు ఎక్కనేలేదు.

భీష్ముడు పడిపోయాడన్న వార్త వినగానే కర్ణుడికి కొద్దిగా భయంవేసింది. అతను త్వరగా భీష్ముడు పడిఉన్న చోటికి వెళ్ళి, కంట నీరు కారుస్తూ నమస్కారంచేసి, "మహానుభావా, నీకు అగ్రహం తెప్పించిన కర్ణుణ్ణి. నిమ్మల్ని చూడవచ్చాను," అన్నాడు. భీష్ముడు మెల్లిగా కళ్ళు తెరిచి కర్ణుణ్ణి చూసి, ఆదరపూర్వకంగా, "నాయనా, కర్ణా! నీవు నాకు శత్రుడవుకావు. అకారణంగా పాండవులను దూషిస్తావుగనక నీ గర్వం తగ్గించటానికి నిన్ను గురించి నిష్ఠురంగా మాట్లాడాను. నీవుకూడా కుంతి కొడుకువేనని నాతో వ్యాసుడూ, నారదుడూ

అన్నారు. యుద్ధంలో నీ పరాక్రమం నే నెరగనా? నీ శౌర్యమూ, దాతృత్వమూ, బ్రాహ్మణభక్తి నేను బాగా ఎరుగుదును. నీవంటి వీరుడు లేడు. దేవతలతో సమానమైనవాడవు. నీ తమ్ములైన పాండవులతో సంధి చేసుకున్నావంటే నేను చాలా సంతోషిస్తాను. మీ వైరాలన్నీ నాతోనే పోనివ్వండి. చావగా మిగిలిన క్షత్రియులైనా సుఖంగా ఉండండి," అన్నాడు.

దానికి కర్ణుడు, "మహానుభావా, నాకు అన్నీ తెలుసు. కాని నేను దుర్యోధనుడి ఉప్పు తిని అతనికి నిరాశ కలిగించలేను. పాండవులు ఎలాగైతే అన్నిటికీ కృష్ణుణ్ణి నమ్ముకుని ఉన్నారో, దుర్యోధనుడుకూడా అన్నిటికీ నన్నే నమ్ముకుని ఉన్నాడు. ప్రజాక్షయం తప్పదని అనేక దుశ్శకునాలు సూచిస్తున్నాయి. అర్జునుడితో నేను యుద్ధం చెయ్యక తప్పదు. మహాత్మా, యుద్ధం చెయ్యటానికి నీ అనుమతి ఇయ్యి. నా యీ నిర్ణయంలో అజ్ఞానం ఏమైనా ఉంటే క్షమించు," అన్నాడు.

"అవును, నాయనా! యుద్ధం తప్పదని నాకూ అనిపిస్తూనే ఉన్నది. అహంకారం వదిలి, స్వర్గం కోరి యుద్ధం చెయ్యి. అర్జునుడితో పోరి వీరస్వర్గం సంపాదించు. శాంతి



కోసం నేను చేయవలసినదంతా చేశాను. కాని నా యత్నం ఏమీ ఫలించలేదు," అన్నాడు భీష్ముడు.

ఆయన అన్నట్టుగానే రెండు పక్షాలూ తిరిగి యుద్ధానికి సమకట్టాయి. అయితే భీష్ముడు పడిపోయాక కౌరవసైన్యం అనాథలాగా తయారయింది. కౌరవ యోధులందరూ దిక్కుతోచనట్టుగా తమను నడిపించగల నాయకుడికోసం ఎదురుచూశారు. చాలామంది కర్ణుడి పేరు ఉచ్చరించారు. వారికి భీష్ముడి తరవాత అంతవాడు కర్ణుడే ననిపించింది. కర్ణుణ్ణి వెంటనే పిలిపించమన్నారు.



కర్ణుడుకూడా ఇప్పుడు యుద్ధరంగం ప్రవేశించటానికి సిద్ధంగానే ఉన్నాడు. భీష్ముడు రణరంగంలో ఉన్నంతకాలమూ తాను అస్త్రధారణ చెయ్యనని అతను ప్రతిజ్ఞ చేసిఉన్నాడు; అలాటి భీష్ముడు పతనమయాడు. అతను తన రథసారథితో, "భీష్ముడు పడిపోయాక కౌరవసైన్యం చాలా దుస్థితికి వచ్చింది. అందుచేత నా కవచమూ, శిరస్త్రాణమూ, విల్లులూ, బాణాలూ, ఇతర శస్త్రాలూ సిద్ధంచెయ్యి," అన్నాడు.

వడిగల గుర్రాలు పూన్చిన దివ్యమైన రథమెక్కి, ధ్వజం ఎత్తించి, కర్ణుడు మొట్టమొదటిసారిగా కురుక్షేత్ర యుద్ధానికి బయలుదేరి వచ్చాడు. అతను భీష్ముడున్న చోట దిగి, ఆయన పరాక్రమాన్ని పొగడి, ఆశీర్వదించమని కోరాడు. భీష్ముడుకూడా కర్ణుడి శౌర్య పరాక్రమాలను కొనియాడి, అతన్ని ఆశీర్వదించాడు.

తరవాత కర్ణుడు భీష్ముడి పాదాలు తాకి, తన సమస్త బలాలతోనూ కౌరవసైన్యాన్ని సమీపించాడు. కర్ణుణ్ణి చూడగానే కౌరవ యోధులు ఉత్సాహంతో పొంగిపోతూ సింహనాదాలు చేశారు.

దుర్యోధనుడుకూడా కర్ణుణ్ణి చూసి ఆనందపడుతూ, "నీ రాకవల్ల అనాథగా ఉన్న సైన్యం తిరిగి సనాథ అయింది. ఇక కర్తవ్యమేమిటో చెప్పు," అన్నాడు.

సేనానాయకుడొకడు మళ్ళీ ఏర్పడవలసి ఉన్నది గనక దుర్యోధనుడు ఆ విషయమై కర్ణుడి సలహా కోరాడు.

"రాజా, మన సైన్యంలోని యోధులందరూ అన్నివిధాలా ఉత్తములే, కాని అందరినీ సేనానాయకులను చేయలేము గదా. ఇతరులకు ఈర్ష్య కలగకుండా ఒకరిని ఎన్నుకోవాలంటే అందుకు అర్హత గలవాడు ద్రోణాచార్యుడొక్కడే ఉన్నాడు. ఆయన బ్రహ్మవేత్త, మహత్తరమైన యోధుడు, మీదుమిక్కిలి నీకు విద్యనేర్పిన



గురువు. ఆయనను సర్వసేనానిగా చేసినట్టయితే, పూర్వం దేవగణాలను నడిపించిన కుమారస్వామిలాగా, మన సైన్యాలను నడిపించి, మన యోధులలో విజయోత్సాహం రేకెత్తించగలడని నా నమ్మకం," అన్నాడు కర్ణుడు. దుర్యోధనుడు ఈ సలహా పాటించి, సేనామధ్యంలో ఉన్న ద్రోణుడి వద్దకు వెళ్ళి, "మహాత్మా, జన్మవల్లా, వయసునుబట్టీ, బుద్ధి పరాక్రమాలచేతా నీవే సేనాధిపత్యం వహించదగినవాడవు. మాకందరికీ నాయకుడవుగా ఉండి మమ్మల్ని గెలిచే మార్గంలో నడిపించు," అని కోరాడు.

ఈ మాటలు విని సైన్యంలోని రాజులందరూ సింహనాదాలు చేసి, దుర్యోధనుణ్ణి మెచ్చుకుని, ద్రోణుడికి విజయం కోరారు.

ద్రోణుడు సేనాధిపత్యానికి ఆమోదిస్తూ, "రాజా, నాలో ఏయే గుణాలయితే ఉన్నాయని అన్నావో, వాటినన్నిటినీ వినియోగించి పాండవులతో పోరాడుతూ మీకందరికీ ఆనందం కలిగిస్తాను. సోమకులనందరినీ చంపుతాను. పాండవులు నాతో యుద్ధం చెయ్యలేరు," అన్నాడు.

వెంటనే దుర్యోధనుడు ఆయనను కౌరవ సేనకు నాయకుడుగా అభిషేకించాడు. కౌరవపక్ష యోధులందరూ ఇందులో పాల్గొన్నారు. సైన్యం హర్షధ్వానాలు చేసింది. పుణ్యాహవాచనమూ, స్వస్తివాచనమూ, వందిమాగధ కైవారాలూ మిన్నుముట్టాయి.

ఆసమయంలో ద్రోణుడు సేనామధ్యంలో నిలిచి దుర్యోధనుడితో, "ఓ రాజా, భీష్ముడు నిర్వహించిన సేనాధిపత్యాన్ని ఆయన అనంతరం నాకు కట్టబెట్టి నాకు గొప్ప గౌరవం చూపావు. కనక నావల్ల ఏదైనా వరం కావాలంటే కోరుకో," అన్నాడు.

ఇది విని దుర్యోధనుడు, "గురువర్యా, నాకు ఒకటే కోరిక ఉన్నది. అదేమిటంటే, మీరు ధర్మరాజును ప్రాణాలతో పట్టి తెచ్చి నాకు అప్పగించాలి!" అన్నాడు.


ద్రోణుడు ఆశ్చర్యపడి, "అదేమిటి? ధర్మరాజును చంపాలని కోరక, ప్రాణాలతో పట్టి తెమ్మని కోరావు?" అని అడిగాడు.


"ఆచార్యా, ధర్మరాజు చచ్చిపోతే మాత్రం నాకు ఒరిగేదేమిటి? అర్జునుడుండి మమ్మందరినీ యుద్ధరంగంలో చంపవచ్చు గదా! ధర్మరాజును ప్రాణాలతో తెచ్చి నా ఎదట పెట్టినట్టయితే అయనతో మళ్ళీ జూద మాడి ఓడించి, మరి పదమూడేళ్ళపాటు పాండవులను వనాలకు పంపి, జనక్షయం లేకుండా హాయిగా రాజ్యమేలుకుంటాను," అన్నాడు దుర్యోధనుడు.

అతని కపటం తెలిసిపోయింది. ద్రోణుడు యుక్తిగా, "అది నిజమే. నేను ధర్మరాజును అలాగే ప్రాణాలతో పట్టి తెస్తాను. కాని ధర్మరాజును ఆ అర్జునుడు రక్షించకుండా ఉండాలి. అతడు రక్షిస్తున్నంతసేపూ ధర్మరాజును పట్టటం ఎవరితరమూ కాదు. అందుచేత, దగ్గిరలో అర్జునుడు లేకుండా రెండు ఘడియలపాటు ధర్మరాజు నా ఎదటపడి యుద్ధం చేసినట్టయితే తప్పక అతన్ని పట్టి నీకు అప్పగిస్తాను," అన్నాడు.


ద్రోణుడు ఈ మాటకు కట్టుబడి ఉండ గలందులకై దుర్యోధనుడు ఆయన చేసిన ప్రతిజ్ఞను సేన అంతటా చాటింపు వేయించాడు. ఈ చాటింపు పాండవ సేనలకు కూడా వినిపించింది. ధర్మరాజు, అందరూ వింటుండగా, అర్జునుడితో, "ద్రోణుడు చేసిన ప్రతిజ్ఞ విన్నావు గదా! యుద్ధంలో నీవు నా వెంటనే ఉండాలి," అన్నాడు.

"ద్రోణుడు నన్ను జయించటం ఎంత అసంభవమో, నేను నిన్ను విడవటంకూడా అంత అసంభవం. ద్రోణుడికి ప్రతిగా నేను యుద్ధం చెయ్యలేని పక్షంలో ప్రాణత్యాగం చేస్తాను. దుర్యోధనుడు ఈ జన్మలో నిన్ను ప్రాణాలతో పట్టి తెప్పించుకోలేడు. ద్రోణుడు చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకోలేడు, ఇదే నా ప్రతిజ్ఞ!" అన్నాడు అర్జునుడు.





చందమామ
పిల్లల కథల మాసపత్రిక
8
AS.



మహాభారతం

తిరిగి ఉభయ సైన్యాలూ కలియబడి దారుణమైన యుద్ధకాండ సాగించాయి. ఈ పదకొండో రోజు యుద్ధంలో అభిమన్యుడు విజృంభించి పోరాడాడు. భీముడికీ, శల్యుడికీ ఘోరమైన గదా యుద్ధం జరిగింది. అందులో శల్యుడు ఓడి పారిపోయాడు.

ద్రోణుడు పాండవ సైన్యాలను చించి చెండాడుతూ ధర్మరాజును పట్టుకొనటానికి విశ్వప్రయత్నం చేశాడు. ధర్మరాజుకు అడ్డుగా అనేకమంది పాంచాల యోధులు నిలబడ్డారు. ద్రోణుడు తన కడ్డుపడినవారిలో సింహసేనుడు, వ్యాఘ్రదత్తుడు అనేవారి తలలు తెగవేసి, ధర్మరాజును సమీపించ సాగాడు. ధర్మరాజు చిక్కాడని హాహాకారాలు బయలుదేరాయి. అంతలో అర్జునుడు వచ్చిపడి చీకటి పడినదాకా కౌరవ సైన్యాలను బాణవర్షంలో ముంచి కౌరవ యోధులకు ఊపిరి సలపకుండా చేసేశాడు.

ఆ రాత్రి శిబిరంలో ద్రోణుడు దుర్యోధనుడితో, "దుర్యోధనా, అర్జునుడు అడ్డు పడకుండా ఉన్నట్టయితే ధర్మరాజును ప్రాణాలతో పట్టి తెచ్చిఉందును. ఈ భయంకరమైన యుద్ధంకంటె అదే మంచి ఉపాయంగా తోస్తున్నది. ఎవరైనా ఆ అర్జునుణ్ణి ఇంకొక రంగానికి తీసుకుపోయినట్టయితే ఆ సమయంలో నేను ధర్మరాజును పట్టుకుంటాను," అన్నాడు.

త్రిగర్త రాజైన సుశర్మ ఈ మాటలు విని తన తరఫునా, తన తమ్ముల తరఫునా దుర్యోధనుడితో ఇలా అన్నాడు: "రాజా, మాకు అనాదిగా ఈ అర్జునుడిపై పగ ఉన్నది. మేము అతనికి ఏ ద్రోహమూ చెయ్యకపోయినా అతను అవకాశం దొరికినప్పుడల్లా మాపై కాలుదువ్వి, మమ్మల్ని అవమానిస్తూ ఉంటాడు. అతనిపై పగ తీర్చుకోవటానికి మాకీ యుద్ధం బాగా తోడ్పడింది. రేపు



అతన్ని మేము వేరే యుద్ధరంగానికి పిలుచుకుపోయి అతనో, మేమో తేల్చుకుంటాము. ఇది నీకూ లాభిస్తుంది, మాకూ కీర్తిప్రదంగా ఉంటుంది."

అర్జునుడితో యుద్ధం చెయ్యటానికి ఒక సేన ఆయత్తమయింది. అందులో సత్యరథుడు, సత్యవర్మ, సత్యేషుడు, సత్యవ్రతుడు, సత్యకర్మ అనే అయిదుగురు సోదరులు పదివేల రథాలతో వచ్చి చేరారు. మాలవుడు, తుండికేరుడు అనేవాళ్ళు ముప్ఫైవేల రథాలతోనూ, సుశర్మా అతని తమ్ములూ పదివేల రథాలతోనూ, నానా దేశాలకు చెందినవారు మరి పదివేల రథాలతోనూ వచ్చి చేరారు.

ఇంతమందీ కలిసి అగ్నిసాక్షిగా ప్రమాణాలు చేశారు: "యుద్ధంలో మేము వెనక్కు తిరిగిపోయినట్టయితే ఘోరమైన నరకాన్ని పొందుతాము. మాకు ప్రాణాలుండగా అర్జునుణ్ణి యుద్ధరంగంనుండి పోనివ్వము," అని ఘోరమైన ఒట్లు పెట్టుకుని ప్రతిజ్ఞలు చేశారు. ఇలాటి ప్రతిజ్ఞలు చేసినవారిని సంశప్తకులంటారు. అందుచేత వీరందరూ సంశప్తకులని పేరు సంపాదించుకున్నారు.

"మాతో వచ్చి ప్రత్యేకమైన రంగంలో పోరాడవలసింది," అని వారు అర్జునుడికి ఆహ్వానం పంపారు. అలాటి ఆహ్వానాన్ని తిరస్కరించటం అర్జునుడికి పరువులోపం. అయితే ధర్మరాజు బెంబేలుపడిపోయి, "నాయనా, నన్ను ప్రాణాలతో పట్టుకుని దుర్యోధనుడికి వప్పగించుతానని ద్రోణుడు చేసిన ప్రతిజ్ఞ నీకు తెలుసుగదా!" అన్నాడు.

ఆ మాటకు అర్జునుడు ధర్మరాజుతో, "అన్నా, నేను లేని సమయంలో సత్యజిత్తు నీకు అంగరక్షకుడుగా ఉండి యుద్ధం చేస్తాడు. ఒకవేళ సత్యజిత్తు పడిపోవటమే జరిగితే, మన ఇతర యోధులెంతమంది రక్షిస్తామని వాగ్దానం చేసినా లక్ష్యపెట్టకుండా నీవు రణరంగం నుంచి తొలగి వెళ్ళు. నేను



సాధ్యమైనంత త్వరలో ఆ సంశప్తకుల అంతు తేల్చి తిరిగి వస్తాను," అన్నాడు.

ధర్మరాజు అర్జునుణ్ణి కౌగలించుకుని దీవించి పంపాడు. సంశప్తకులు యుద్ధ రంగానికి దక్షిణంగా సమావేశమై చంద్రాకారంగా వ్యూహం పన్ని అర్జునుడికోసం ఎదురు చూస్తున్నారు. అర్జునుడు ఒంటరిగా వారితో యుద్ధం చేయటానికి వచ్చాడు.

ఈ యుద్ధంలో సుధన్వుడనేవాడు అర్జునుడి బాణాలకు బలిఅయాడు. వెంటనే అతని సేనలు చె౽రి కౌరవ సే౽లకేసి పరిగెత్తసాగాయి. సుశర్మ ఎలుగెత్తి అరుస్తూ, "యోధులారా, పారిపోకండి! మీరు చేసిన ప్రతిజ్ఞలు మరవకండి! అన్నమాట నెరవేర్చకుండా తిరిగివచ్చిన మిమ్మల్ని చూసి దుర్యోధనుడు ఏమనుకుంటాడు?" అన్నాడు. పారిపోతున్న యోధులు తిరిగివచ్చి అర్జునుడితో యుద్ధం సాగించారు. అర్జునుడు సంశప్తకులను కార్చిచ్చులాగా నాశనం చెయ్యసాగాడు.


ఈలోపుగా అసలు రంగంలో పాండవ కౌరవ సైన్యాలు పన్నెండవ రోజు యుద్ధం ప్రారంభించాయి. అర్జునుడు దూరాన సంశప్తకులతో పోట్లాడుతున్నాడు గనక ద్రోణుడు యుద్ధారంభంనుంచికూడా ధర్మరాజును సమీపించటానికే ప్రయత్నిస్తూ యుద్ధంచేశాడు. ఆయన చేసిన యుద్ధం అతి భయంకరమైనది.

ధర్మరాజుకు అంగరక్షకుడుగా అర్జునుడు నియమించిన సత్యజిత్తూ, అతనికి సహాయుడుగా వృకుడనేవాడూ ద్రోణుడితో తీవ్రంగా తలపడి ఆయన చేతిలో ఇద్దరూ చచ్చారు. సత్యజిత్తు చనిపోగానే ధర్మరాజు తన రథాన్ని ద్రోణుడికి దూరంగా తరలించాడు. అదే సమయంలో అనేకమంది పాండవపక్షయోధులు ద్రోణుడికి అడ్డుతగిలి పోరు సాగించారు. పాంచాల్యుడనే ఒక రాజపుత్రుడుకూడా ద్రోణుడి చేతిలో

ప్రాణాలు పోగొట్టుకున్నాడు. చెల్లాచెదరై పారిపోతున్న పాండవ సేనలను భీముడు మొదలుగాగల పాండవయోధులు వెనక్కు మళ్లించారు. భీముడు కౌరవ సేనలలో గల గజయూధాలను నిర్మూలించసాగాడు. ఇది చూసి భగదత్తుడు తన ప్రసిద్ధమైన ఏనుగుతో వచ్చి పాండవ వీరులనూ, సైన్యాలనూ చెల్లా చెదరు చేయసాగాడు. భీముడు సయితం భగదత్తుడి ఏనుగును ఏమీ చెయ్యలేక పోయాడు. దానికి వెరచి పాండవ సేనలు హాహాకారాలు చెయ్యసాగాయి.

అక్కడ సంశప్తకులతో పోట్లాడే అర్జునుడికి తమ సేనలను భగదత్తుడు చీకాకు పరుస్తున్న సంగతి పాడగట్టి కృష్ణుడితో తన రథాన్ని కౌరవ సేనలవేపు నడపమనీ, భగదత్తుణ్ణి జయించగలవాడు తాను తప్ప మరొకరెవరూ లేరనీ అన్నాడు. కృష్ణుడు రథాన్ని వెనక్కు మళ్లించబోయాడు.

అయితే సుశర్మ మొదలైన త్రిగర్తులు అర్జునుణ్ణి చుట్టుముట్టి కదలనివ్వలేదు. అర్జునుడు వారితో ఒకవంక యుద్ధం చేస్తూనే తన రథాన్ని కౌరవ సేనలకేసి నడిపించుకున్నాడు. ఈ యుద్ధంలో అర్జునుడు సుశర్మను తన తీవ్రమైన బాణాలతో తరిమిగొట్టటమేగాక అతని తమ్ముణ్ణి చంపాడుకూడా.





త్వరలోనే అర్జునుడి రథం కౌరవ సైన్యాన్ని చేరుకుని భగదత్తుణ్ణి ఎదుర్కొన్నది. ఇద్దరికీ దారుణమైన యుద్ధం సాగింది. భగదత్తుడు తోమరాలను గురిచేసి అర్జునుడి తలపైకి విసిరాడు. వాటి తాకిడికి అర్జునుడి కిరీటం పక్కకు ఒరిగింది. అర్జునుడు దానిని సరిచేసుకుంటూ, "ఇదేనా నీ గురి?" అన్నాడు.

ఆ మాట విని భగదత్తుడికి మండిపోయింది. అతను వైష్ణవాస్త్రం తీసి అభిమంత్రించి అర్జునుడి రొమ్ముకేసి ప్రయోగించాడు. అమోఘమైన ఆ అస్త్రం అర్జునుడి పైకి వస్తుంటే అకస్మాత్తుగా కృష్ణుడు లేచి నిలబడి తన రొమ్మును దానికి గురిచేశాడు. వైష్ణవాస్త్రం కాస్తా వైజయంతిమాలగా మారి కృష్ణుడి మెడను అలంకరించింది.

అర్జునుడికి భరించరాని అవమానమయింది. అతను కృష్ణుడితో, "దేవా, ఇంక నేను యుద్ధం చెయ్యటం దేనికి, గుర్రాలను నడుపుతాను! నేను అశక్తుడనై ప్రమాద స్థితిలో ఉండగా నీవు రక్షించవచ్చునుగాని, గాండీవం చేతబట్టుకుని సురాసురులనైనా జయించగల స్థితిలో ఉండగా నన్ను నీవిలా కాపాడటం ఏమైనా భావ్యమా?" అన్నాడు.

"అర్జునా, నీకొక రహస్యం చెబుతాను విను. ఒకప్పుడు భూదేవి తన కొడుకైన నరకాసురుడికోసం ఈ వైష్ణవాస్త్రం సంపాదించింది. అది దగ్గిర ఉంచుకుని వాడు విజృంభించి లోకాలన్నిటినీ పీడించి చివరకు నా చేతిలో చచ్చాడు. వాడి అనంతరం ఈ వైష్ణవాస్త్రం వాడి కొడుకు ఈ భగదత్తుడి చేతికి వచ్చింది. అది దగ్గిర ఉండటంచేతనే వీడు అజేయుడుగా ఇంతకాలమూ ఒక వెలుగు వెలిగాడు. ఇక వీడిలో ఏ శక్తి లేదు. కనక వీణ్ణీ, వీడి ఏనుగునూ నీవు అతి సులువుగా నిర్మూలించవచ్చు!" అన్నాడు.

అక్షరాలా అలాగే జరిగింది. అర్జునుడు ఒక వాడికోల విసిరేసరికి భగదత్తుడి ఏనుగు

కుంభస్థలం పగిలి అదికాస్తా చచ్చి పడిపోయింది. తరవాత ఒక అర్ధచంద్ర బాణంతో అర్జునుడు భగదత్తుణ్ణి చంపేశాడు.

తరవాత ఆ రోజు నడిచిన యుద్ధంలో అర్జునుడు శకుని తమ్ములైన వృషకుణ్ణీ, అచలుణ్ణీ చంపేశాడు, కర్ణుడి తమ్ములను ముగ్గురిని కర్ణుడూ, దుర్యోధనాదులూ చూస్తుండగా చంపేశాడు.

ఈ రోజు జరిగిన యుద్ధం పాండవులకు అనుకూలంగానూ కౌరవులకు అవమానకరంగానూ ఉన్నది. అర్జునుడు కౌరవసేనలను చాలా క్షోభ పెట్టాడు.

ద్రోణుడు తను చేసిన శపథం నెరవేర్చుకోలేకపోయాడు. ధర్మరాజు ఆయనకు పట్టుబడలేదు.

ఆరాత్రి గడిచి మర్నాడు తెల్లవారుతూనే దుర్యోధనుడు ద్రోణాచార్యుణ్ణి సమీపించి, "మేము నీకు శత్రుకోటిలోవాళ్లమని స్పష్టమయింది. లేకపోతే సమీపానికి వచ్చిన ధర్మరాజును ఎందుకు తప్పించుకుపోనిస్తావు? మొదట నాపైన అనుగ్రహం పుట్టుకొచ్చి మాట ఇచ్చావేగాని, తీరా మాట నెరవేర్చుకోవలిసి వచ్చేసరికి నీ మనసు మారిపోయింది. పెద్దమనిషి అయినవాడు ఆశ రేపి నిరాశ చేస్తాడా?" అని దెప్పిపొడిచాడు.



ఈ మాటలు విని ద్రోణుడు ఎంతో సిగ్గుపడి, "రాజా, నీ సంతోషం కోసమే కృషి చేస్తున్న నన్ను గురించి ఇలా అనటం ధర్మం కాదు. అర్జునుడు రక్షించే సైన్యాన్ని ఎవరు గెలవగలరు? నేనివాళ ఒక గొప్ప వ్యూహాన్ని నిర్మిస్తాను. అది దేవతలకుకూడా భేదించరానిది. దానిని భేదించటానికి మహావీరుడు తప్ప ప్రయత్నించలేడు. అర్జునుడు యుద్ధరంగానికి ఇవాళకూడా దూరంగా ఉండేటట్టు చూసినట్టయితే మిగిలిన పాండవపక్ష వీరులలో ఎవరో ఒకరు ఈ వ్యూహానికి తప్పక బలి అవుతారని నీకు మాట ఇస్తున్నాను," అన్నాడు.


ఆ తరవాత సంశప్తకులు మళ్ళీ అర్జునుణ్ణి యుద్ధభూమికి దక్షిణంగా తీసుకుపోయారు. ద్రోణుడు కౌరవసేనలను పద్మవ్యూహంలో నిర్మించాడు. పద్మవ్యూహాన్ని భేదించటం తెలిసినవారు నలుగురే ఉన్నారు—కృష్ణుడూ, ప్రద్యుమ్నుడూ, అర్జునుడూ, ఇంకా మీసకట్టుకూడా రాని అభిమన్యుడూనూ. వారిలో అభిమన్యుడొకడే ఆరోజు రణరంగంలో ఉన్నాడు. అందుచేత ధర్మరాజు అతణ్ణి పిలిపించి, "నాయనా, ఈనాడు చాలా పెద్దభారం నీపైన పడింది. నీ తండ్రీ, మేనమామా ఉన్నట్టయితే ఈ పద్మవ్యూహం సులువుగా భేధించేవారు. కాని వారు సంశప్తకులతో యుద్ధంచేయబోయారు. మాలో నీవొక్కడవే దాన్ని భేదించ గలవాడవు. నీవు మాకు నాయకుడవుగా ఉండి పద్మవ్యూహాన్ని భేదించి లోపల ప్రవేశించినట్టయితే మిగిలినవాళ్ళం నీ వెంట వచ్చి వ్యూహాన్ని చెదరగొట్టగలం," అన్నాడు.

ఇందుకు అభిమన్యుడు సమ్మతించి పద్మవ్యూహాన్ని భేదించటానికి సిద్ధపడ్డాడు. అతను బంగారు కవచం ధరించి, కర్ణికార ధ్వజం గల రథంలో ఎక్కి కూచుని తన రథసారథి అయిన సుమిత్రుడితో, "పద్మవ్యూహ ద్వారాన్ని ద్రోణుడు రక్షిస్తున్నాడు. మన రథాన్ని నేరుగా ఆయనవద్దకు తోలు. ఆయనను జయించి నేను పద్మవ్యూహంలో ప్రవేశిస్తాను," అన్నాడు.

సుమిత్రుడికి ఇది ఏమాత్రమూ నచ్చలేదు. పాండవులు ఇంత భారాన్ని ఇలాటి పసివాడిపై ఉంచటం అన్యాయమని అతనికి తోచింది. "బాబూ, నీవు శూరుడవేగాని, సుకుమారంగా పెరిగినవాడివి!" అన్నాడతను. అభిమన్యుడు నవ్వి, "ఓయీ, నా తండ్రి అర్జునుడు, కృష్ణుడు నా మేనమామ. నాకు భయమన్నది లేదు. దేవతలతో కలిసి వచ్చిన ఇంద్రుడినైనా ఎదిరించగలను. రథాన్ని ద్రోణుడివేపు తోలు!" అన్నాడు.




చందమామ
జన్మదిన ప్రత్యేక సంచిక
1st July '60
50
NAYE PAISE
8
AS



మహాభారతం

అభిమన్యుడు పద్మవ్యూహం ప్రవేశించగానే అతను చిక్కిపోయినట్టుగా కౌరవయోధులు జబ్బలుచరిచి, రంకెలు పెట్టి, సింహనాదాలు చేశారు. అయితే త్వరలోనే అభిమన్యుడు వారి ఉత్సాహాన్ని నీరుకార్చేశాడు. అతను కౌరవ సేనపై యముడిలాగా పడి నాశనం చెయ్యసాగాడు. అతని ధాటికి తట్టుకోలేక కౌరవసేనలు చెదరిపోసాగాయి.

దుర్యోధనుడు అలిగి అభిమన్యుడిపైకి వచ్చాడు, అతనికి అండగా కౌరవయోధులందరూ వచ్చిపడ్డారు. అభిమన్యుడు అందరితోనూ భయంకరంగా పోరుతూ, కర్ణుడి శరీరం దూసుకుపోయేటట్టు బాణంతో కొట్టి, శల్యుణ్ణి మూర్ఛపోగొట్టి, సుషేణుడు, దీర్ఘలోచనుడు, కుండభేది అనే యోధులను చంపేశాడు. శల్యుడి తమ్ముడి తల తెగవేశాడు. అర్జునుడికీ, కృష్ణుడికీ తెలిసిన అస్త్రాలన్నీ బాలుడైన అభిమన్యుడికి తెలుసును; వాటిని అతను వారితో సమంగా ప్రయోగించ గలిగాడు. అతను ఒక్కొక్క యోధుణ్ణే బలి తీసుకుంటుంటే ద్రోణుడు చూస్తూనే ఉండికూడా అతణ్ణి ఏమీ చెయ్యలేక పోయాడు.

పైపెచ్చు ఆయన దుర్యోధనుడితో, "ఆహా, ఈ బాలుడు ఎంత గొప్పగా యుద్ధం చేస్తున్నాడో చూశావా? వీడు పాండవులకు ఎందులో తీసిపోతాడు? వీడితో ఎవరు యుద్ధం చెయ్యగలరు? ఎందుకో వదిలేశాడుగాని, కావాలంటే మన సేనలన్నిటినీ వీడే నాశనం చెయ్యగలడు!" అన్నాడు.

ద్రోణుడాడిన ఈ మాటలు దుర్యోధనుడికి శూలాల్లాగా గుచ్చుకున్నాయి. అతను వెటకారంగానూ, కోపంగానూ నవ్వుతూ, కర్ణ దుశ్శాసన శల్య బాహ్లికాది యోధులతో, "పాపం, ఈ బ్రాహ్మడికి అర్జునుడి కుమారుడైన ఈ కుర్రకుంకను చంపే ఉద్దేశం

ఉన్నట్టు లేదు. మీరైనా వెంటనే ఆ పనికి పూనుకోండి!" అన్నాడు.

అప్పుడు దుశ్శాసనుడు, "అన్నా, ఒక్క నిమిషంలో నేను ఈ అభిమన్యుణ్ణి చంపేస్తాను. ఆ వార్త విని కృష్ణార్జునులు కుమిలి చస్తారు. వారి చావుతో పాండవులు ఆత్మహత్యలు చేసేసుకుంటారు. నీకు శత్రునాశనం అవుతుంది," అంటూ అభిమన్యుడిపైకి వెళ్లాడు. అభిమన్యుడు ఒక్క బాణాన్ని చెవిదాకా లాగి దుశ్శాసనుడి రొమ్ము చీలేలాగ కొట్టాడు. దుశ్శాసనుడు మూర్ఛపోయాడు. అతని రథ సారథి రథాన్ని తొలగించి తీసుకుపోయాడు. అదిచూసి పాండవ యోధులు సింహనాదాలు చేశారు.

కర్ణుడికి కోపం వచ్చింది. అతను బాణాలు వేసుకుంటూ అభిమన్యుడిపైకి వెళ్ళాడు. అభిమన్యుడు ఒకే బాణంతో కర్ణుడి ధ్వజాన్నీ, చేతిలోని బాణాన్నీకూడా నిర్మూలించి అతన్ని అసహాయుణ్ణి చేశాడు. కర్ణుడికి అండగా అతని తమ్ముడు వచ్చేసరికి అభిమన్యుడు ఒక్క బాణంతో వాడి తల తెగి పడేలాగ కొట్టాడు. కర్ణుడు తన తమ్ముణ్ణి చూసి ఏడుస్తూ ఉండగా అభిమన్యుడు అతన్నీ, అతని సైన్యాన్నీ తరమనారంభించాడు. కౌరవసేన కంగారుపడి రెండుగా



చీలి చెరొక దిక్కూ పారిపోసాగింది. ఇక అభిమన్యుడు సాగించిన వధకు అంతులేదు.

అలా శత్రునిర్మూలన చేస్తూ ముందుకు వెళ్ళే అభిమన్యుడికి రక్షగా ధర్మరాజూ, భీముడూ, సాత్యకీ, నకుల సహదేవులూ, ధృష్టద్యుమ్నుడూ, విరాటుడూ, ద్రుపదుడూ వారివారి సేనలూ ముందుకు వచ్చాయి. వారందరినీ ఆనాడు సైంధవుడు అడ్డగించి ఆపగలిగాడు.

దీనికొక కారణం ఉన్నది. ధృతరాష్ట్రుడి అల్లుడైన ఈ సైంధవుడు ఒకప్పుడు ద్రౌపదిని బలవంతాన ఎత్తుకుపోవటానికి ప్రయత్నించి భీముడిచేత పరాభవించబడి, పరమేశ్వరుణ్ణి



గురించి తపస్సుచేసి, శివుణ్ణి కలలో ప్రత్యక్షం చేసుకుని, ఒక్క అర్జునుడు తప్ప మిగిలిన పాండవులందరినీ యుద్ధంలో వారించేలాగ వరం పొందాడు. ఆ వరం ఈనాడు అక్కరకువచ్చింది. అభిమన్యుడు కౌరవసేనలను ఎలా చీకాకుపరిచాడో, సైంధవుడు పాండవసేనలను అలా చీకాకుపరిచి తరిమికొట్టాడు.

అభిమన్యుడు మాత్రం ఒంటరిగా కౌరవసేనలను నిర్మూలించుతూ, తనతో తలపడిన యోధులందరినీ ఓడించుతూ ముందుకు సాగాడు. వృషసేనుడనేవాడు సారథిని పోగొట్టుకుని, ప్రాణాలతో తప్పించుకు పారిపోయాడు. ఇనపకవచం ధరించి వచ్చి వసాతీయుడనేవాడు అభిమన్యుడి చేతిలో చచ్చాడు. ఎందరో యోధులు అభిమన్యుడిపైకి పోయి మళ్ళీ వెనక్కు తిరిగి రాకుండా అతనికి బలి అయిపోయారు.

ఇలా పోయినవారిలో శల్యుడి కొడుకు రుక్మరథుడొకడు. అది చూసి రుక్మరథుడి మిత్రులైన రాజకుమారులు అభిమన్యుడిపై కలియబడ్డారు. అంతమందిని ఒక్కసారి ఎదుర్కొవటానికిగాను అభిమన్యుడు గాంధర్వాస్త్రం ప్రయోగించి వారికందరికీ భ్రమ కలిగించి, అనంతరం వారిని వందల సంఖ్యలో చంపాడు. ఈ దారుణ హత్యాకాండ చూసి కోపంతో దుర్యోధనుడు అభిమన్యుడితో తలపడి ఒక్క క్షణంపాటు మాత్రమే యుద్ధంచేసి, అభిమన్యుడి దెబ్బలకు తాళలేక పారిపోయాడు.

యుద్ధరంగంలో తేరిపార చూడటానికి వీలులేకుండా ఉన్న అభిమన్యుడిపైకి ద్రోణుడూ, అశ్వత్థామా, బృహద్బలుడూ, కృపుడూ, కృతవర్మా, కర్ణుడూ మొదలైనవారు ఏకమై బయలుదేరారు. లక్ష్మణుడు అభిమన్యుడితో తలపడ్డాడు. తనకొడుకుకు అండగా దుర్యోధనుడు వెంట వచ్చాడు. ఇద్దరికీ కొద్దిసేపు భయంకరమైన యుద్ధం

జరిగింది. చివరకు అభిమన్యుడు లక్ష్మణ కుమారుడి తల తెగవేశాడు.

దుర్యోధనుడు శోకాగ్రహాలను పట్టలేక, "ఒరే, వాణ్ణి చంపెయ్యండి!" అని గట్టిగా అరిచాడు. ఈసరికి మిగిలిన యోధులు చేరువకు వచ్చారు. సైంధవుడి తాలూకు యోధులుకూడా వచ్చి చేరారు. అందరూ కలిసి తనతో యుద్ధం చేస్తున్నప్పటికీ అభిమన్యుడు వారిలోని క్రాథపుత్రుడు అనేవాణ్ణి చంపేశాడు. ద్రోణ, కృప, కర్ణ, అశ్వత్థామ, బృహద్బల, కృతవర్మలు తప్ప మిగిలిన వారు వెనక్కు తగ్గారు. ఈ ఆరుగురూ అభిమన్యుణ్ణి చుట్టుముట్టారు. అభిమన్యుడు ఇంతమందిపైనా బాణవర్షం కురిపిస్తూనే, దుర్యోధనుడి తమ్ములలో ఒకడైన బృందారకుడనేవాణ్ణి చంపేశాడు; కోసల రాజైన బృహద్బలుడి గుర్రాలనూ, ధ్వజాన్నీ, సారథినీ, విల్లునూ కొట్టి, అతను డాలూ, కత్తీ పట్టి మీదికి వచ్చే సమయంలో ఒక్క బాణంతో బృహద్బలుడి గుండె బద్దలుచేసి చంపేశాడు. తరవాత కర్ణుడి వెంటఉన్న ఆరుగురు మంత్రులను వధించాడు.

ఆ రోజు అభిమన్యుడు పదివేలమంది క్షత్రియులను చంపాడు.

ఈ విధంగా అసహాయశూరుడై పోరాడే అభిమన్యుణ్ణి చంపటానికి ద్రోణుడు తన






అనుచరులతో ఈ విధంగా చెప్పాడు: "వీడి బాణాలు సాటిలేనివి. కవచధారణలో వీడికి అర్జునుడికి గల నేర్పంతా ఉన్నది. వాడి చేతిలో విల్లుండగా మనం ఎంతసేపు పోరినా వాణ్ణి జయించలేము. వీడు ఎందునా అర్జునుడికి తీసిపోడు. ఒక్కసారి వీడి విల్లు విరిచి విరథుణ్ణి చేసినట్టయితే మనం వీణ్ణి చంపగలుగుతాము," అన్నాడు.

ఒక్కసారిగా అందరూ తమతమ పనులు నిర్వర్తించారు. కర్ణుడు అభిమన్యుడి విల్లు కొట్టేశాడు, భోజుడు అతని గుర్రాలు చంపాడు, కృపుడు సారథిని చంపాడు, మిగిలిన వారందరూ అభిమన్యుడిపైన బాణవర్షం కురిపించారు. అభిమన్యుడు డాలూ, కత్తీ పట్టికూడా ఎంతో ప్రతాపం కనబరిచాడు. ఆ స్థితిలోకూడా అతను ఎవరిపైకి దూకుతాడో అని అందరికీ హడలుగానే ఉన్నది. ద్రోణుడు అతని చేతిలోని కత్తిని బాణంతో కొట్టాడు, అదేసమయంలో కర్ణుడు డాలును ఎగరగొట్టాడు.

అభిమన్యుడు తోక తొక్కిన పులిలాగా అయి ఒక చక్రం తీసుకుని ద్రోణుడిపైకి లంఘించాడు. అతని శరీరమంతా రక్తంతో తడిసి ఉన్నది. ఆ చక్రాన్ని కౌరవయోధులు తమ బాణాలతో ముక్కలు ముక్కలుగా కొట్టేశారు. అభిమన్యుడు ఒక గద తీసుకుని అశ్వత్థామ రథంపైకి వెళ్ళేసరికి, అశ్వత్థామ మూడడుగులు వెనక్కు వేశాడు. అభిమన్యుడు గదతో అతని గుర్రాలనూ, సారథినీ చంపాడు, శకుని తాలూకు యోధులను డెబ్భయ్యేనిమిదిమందిని చంపాడు, ఏడుగురు కైకేయ యోధులను చంపాడు, దుశ్శాసనుడి కొడుకు రథంపైకి వెళ్ళాడు.

దుశ్శాసనుడి కొడుకు మండిపడి ఒక గద తీసుకుని అభిమన్యుడితో కలియబడ్డాడు. ఇద్దరూ గదాయుద్ధం చేసి కింద పడ్డారు. అప్పటికి అభిమన్యుడి పని అయిపోయింది. అతను బాగా అలిసిపోయి, నీర



సించి ఉన్నాడు. దుశ్శాసనుడి కొడుకు ముందు లేచి నిలబడి, లేవటానికి ప్రయత్నిస్తున్న అభిమన్యుడి తలమీద తన గదతో కొట్టాడు. అభిమన్యుడు పడిపోయి, మరి కదలలేదు.

అభిమన్యుడు మరణించాడని కౌరవులు పొందిన ఆనందానికి మేరలేదు. వారు సింహనాదాలు చేశారు. పాండవబలాలు పారిపోసాగాయి. ఆరుగురు మహాయోధులు కలిసి ఒక అసహాయుడైన పసివాణ్ణి చంపారు. అయితే ఆ పసివాడు నూరుమందిపెట్టుగా పోరాడి ఎంతో శత్రునిర్మూలనం చేశాడు.

పాండవయోధులందరూ తమ అస్త్రాలను అవతల పారేసి ధర్మరాజు చుట్టూ మూగారు. "అయ్యో, ఎంత పాపాత్ముణ్ణి! నేనే అభిమన్యుణ్ణి ఆ పద్మవ్యూహంలోకి చావటానికి పంపాను. ఇక అర్జునుడిముఖం ఎలా చూసేది? కృష్ణుడి ముఖం ఎలా చూసేది? ఇంక నాకు జయమెందుకు? రాజ్యమెందుకు?" అని ధర్మరాజు వాపోయాడు. అప్పుడు వ్యాసమహాముని అక్కడికి వచ్చి, "ధర్మరాజా, శోకించకు. అభిమన్యుడి కంటె కూడా మహాయోధులైనవారు సహితం రణరంగంలో మరణించారు. బ్రహ్మ లగాయతు సృష్టిలో ప్రతి ఒక్కరికీ చావు తప్పదు," అని ఓదార్చి, ధర్మరాజుకు మనశ్శాంతి కలగటంకోసం కొన్ని కథలు చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంతలో సూర్యాస్తమానమయింది. సైన్యాలు తమ శిబిరాలకు వెళ్ళిపోయాయి. అర్జునుడు సంశప్తకులను నిర్మూలించి కృష్ణుడితో తన శిబిరానికి తిరిగివస్తూ దుశ్శకునాలు గమనించి కలతపడ్డాడు. ధర్మరాజుకేమైనా ప్రమాదం జరిగిందేమో అనుకున్నాడు. శిబిరం చేరవస్తూండగా అతని ఆందోళన మరింత హెచ్చింది. ఎలాటి ఆర్భాటాలూ, మంగళతూర్యాలూ, దుందుభులూ, వీణావాద్యాలూ లేక శిబిరం నిశ్శబ్దంగా,


పాడుబడినట్టుగా ఉన్నది. వందిమాగధ స్తోత్రాలు లేవు. అర్జునుడి కంటపడిన యోధులు తలలు వంచి తప్పుకుపోతున్నారు.


కృష్ణార్జునులు శిబిరం ప్రవేశించి మిగిలిన పాండవులు చింతాక్రాంతులై కూర్చుని ఉన్నచోటికి వెళ్ళి చివరకు అభిమన్యు వధా వృత్తాంతం తెలుసుకున్నారు. అర్జునుడి దుఃఖం కట్టలు తెగి ప్రవహించింది. తన కొడుకును కళ్ళారా చూసుకునేటందుకు తానుకూడా చచ్చిపోవటం తప్ప వేరే మార్గం లేదనిపించింది. తరవాత అతని దుఃఖంతో ఆందోళన ఏకమయింది. "మీరంతా ఉండి నా కొడుకును ఎలా చావనిచ్చారు? మీ ఆయుధాలూ, కవచాలూ అలంకార మాత్రమేనా?" అని అడిగాడు.

అప్పుడు ధర్మరాజు సైంధవుడు తమ నందరినీ ఎలా అడ్డినదీ వివరించాడు. అది విని అర్జునుడు వెర్రివాడులాగా అయిపోయి, చేతులు నులుపుకుంటూ, "ఓ యోధులారా, రేపు సైంధవుణ్ణి చంపేస్తాను! వాడు కౌరవులను వదిలిపెట్టి పోకుండానే ఉండాలి, మమ్మల్నిగాని, ధర్మరాజునుగాని, కృష్ణుణ్ణిగాని శరణుచొరకుండానే ఉండాలి, ఎవరు వాణ్ణి రక్షించినా సరే రేపు రణరంగంలో ఉంటే వాడు నాచేత చచ్చాడే! నాతో ఉండిన స్నేహాన్ని మరిచి వాడు దుర్యోధనుడి పక్షం కావటమే గాక నా కొడుకు చావుకు కారకుడౌతాడా? రేపు సూర్యాస్తమయం లోపుగా వాణ్ణి చంపకపోయానో యుద్ధరంగంలోనే చితి పేర్చుకుని అందులో ప్రవేశిస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ. దీనికి తప్పినట్టయితే పితృ హంతకులూ, మాతృ హంతకులూ, సమస్త పాపులూ పోయే గతికి పోతాను!" అని ఘోరప్రమాణం చేశాడు.

వెంటనే కృష్ణుడు పాంచజన్యం పూరించాడు. అర్జునుడు దేవదత్తం పూరించాడు. పాడుపడినట్టున్న పాండవ శిబిరంలో విజయార్భటులు మారుమోగాయి.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st August '60
50
NAYE PAISE



అర్జునుడు తనను మర్నాడు సూర్యాస్తమయం లోపుగా చంపేస్తానని ప్రతిజ్ఞ చేసినట్టు తెలియగానే సైంధవుడు వణికిపోయాడు. అతను కౌరవ వీరుల ఎదట ఆక్రోశిస్తూ, "అయ్యలారా, నన్ను కాపాడండి. అర్జునుడి ప్రతిజ్ఞ విని పాండవులు, అభిమన్యుడు చచ్చినందుకు ఏడవటానికి మారుగా, సంతోషంతో శంఖాలు పూరిస్తున్నారట. నన్ను కాపాడటం మీవల్ల కాకపోతే చెప్పండి, నేనిప్పుడే మా యింటికి బయలుదేరుతాను!" అన్నాడు.

"ఇంతమంది వీరులుండగా నిన్ను అర్జునుడు ఎట్లా చంపుతాడు? నువ్వేమీ భయపడకు!" అని దుర్యోధనుడు సైంధవుడికి ధైర్యం చెప్పాడు.


"యుద్ధంలో చచ్చిపోవటం నీ ఉత్తమ ధర్మం. అలాటప్పుడు చావుకు భయపడతావేమిటి? అందరమూ చచ్చేవాళ్లమే. రేపు అర్జునుడు ఛేదించలేని వ్యూహం పన్నుతున్నాను. నువు ధైర్యంగా ఉండు," అన్నాడు ద్రోణుడు.

అక్కడ పాండవ శిబిరంలో కృష్ణుడు అర్జునుణ్ణి మందలించాడు. "అర్జునా, నీ అన్నదమ్ములతో సంప్రతించకుండా, నాతోనైనా మాటమాత్రం చెప్పకుండా, రేపు అస్తమయం లోపుగా సైంధవుణ్ణి చంపుతానని ఎందుకు ఘోర ప్రమాణం చేశావు? నేను చారులను పంపి కౌరవుల తంత్రం తెలుసుకున్నాను. రేపు యుద్ధంలో సైంధవుడికి కర్ణ కృపాశ్వత్థామలూ, శల్య భూరిశ్రవ వృషసేనులూ రక్షకులుగా ఉంటారట. ఆ ఆరుగురు యోధులనూ ఓడించినప్పుడుగద నీకు సైంధవుడు చిక్కేది?" అన్నాడు కృష్ణుడు.

అర్జునుడు ఉద్రేకంతో, "కృష్ణా, నువు చెప్పిన ఆరుగురికీ కలిసి నాలో సగం పరాక్రమం లేదు. ద్రోణుడు చూస్తుండగానే

ఆ సైంధవుణ్ణి చంపేస్తాను. ఇదుగో, అస్త్రం ముట్టి ప్రమాణం చేస్తున్నాను. దేవతలు రక్షగా నిలిచినా సరే నేను రేపు సైంధవ పాపిని సంహరించి తీరుతాను. దయచేసి నా అస్త్రాలనూ, నా గాండీవాన్నీ తృణీకరించకు!" అన్నాడు.

ఇద్దరూ కొంతసేపు విచారసాగరంలో మునిగిపోయారు. అర్జునుడు కృష్ణుడితో, "నీ చెల్లెలు సుభద్రనూ, మా కోడలు ఉత్తరనూ ఉపాయంగా ఊరడించు," అన్నాడు. కృష్ణుడు వెంటనే అర్జునుడి శిబిరానికి బయలుదేరి వెళ్ళాడు. సుభద్ర దుఃఖం వర్ణనాతీతం. ఆమెను ఊరడించటానికి వచ్చిన ద్రౌపదీ, మిగిలిన స్త్రీజనమూ శోక సాగరంలో మునిగి తేలుతున్నారు. కృష్ణుడు తన చెల్లెలితో, "సుభద్రా, నీవే ఇంతగా ఏడిస్తే, పాపం, ఉత్తరను ఎవరు ఓదార్చుతారు. అభిమన్యుడి కోసం ఎందుకు దుఃఖిస్తావు? వాడు మాకందరికీ మార్గదర్శీ, ఆదర్శమూ అయినాడు. మేమందరమూ వాడి దారినే వెళ్ళాలనుకుంటున్నాము. వాడి చావుకు కారకుడైన సైంధవుణ్ణి రేపు నీ భర్త చంపి, నీ శోకాగ్ని చల్లార్చుతాడు!" అంటూ సుభద్రకూ, ఉత్తరకూ ఉపశమన వాక్యాలు చెప్పి, ఇంటికి వెళ్ళిపోయాడు.



కృష్ణుడు ఆ రాత్రి చాలాసేపు కన్ను మూయక అర్జునుడి శపథం గురించే ఆలోచించాడు. చివరకు అతను తన సారథి అయిన దారుకుడితో, "చూడు, దారుకా! రేపు అర్జునుడికి బదులుగా నేనే యుద్ధం చేస్తాను. అందుకని నువ్వు ఏంచేస్తావంటే, తెల్లవారుతూనే నా రథం ఆయత్తంచేసి, అందులో నా గదా, కౌమోదకీ, శక్తీ, చక్రమూ, ధనుర్బాణాలూ ఉంచు. గరుడ ధ్వజమూ, గొడుగూ అమర్చు. నువుకూడా కవచం ధరించి రథాన్ని యుద్ధరంగానికి తీసుకురా. అవసరమైనప్పుడు నా పాంచజన్యాన్ని బలంగా పూరిస్తాను; ఆ చప్పుడు



చెవిని పడగానే రథంతో నేనున్న చోటికి రావాలి," అని హెచ్చరిక చేశాడు.

ఆ రాత్రి అర్జునుడు తన ప్రతిజ్ఞ కాపాడుకునే విషయం గురించి విచారిస్తూ కళ్ళు మూసుకుని ఒక చిత్రమైన కల కన్నాడు. ఆ కలలో ఈ విధంగా జరిగింది:

ఎక్కడినుంచో కృష్ణుడు అర్జునుడి వద్దకు వచ్చాడట. అర్జునుడు అతనికి స్వాగతం చెప్పి కూర్చోమని ఆసనం చూపి, తానుమాత్రం నిలబడే ఉన్నాడట. కృష్ణుడు, "అర్జునా, ఎందుకు విచారిస్తావు? దిగులు పడకు," అన్నాడట. దానికి అర్జునుడు, "దేవా, రేపేగదా సైంధవుణ్ణి చంపాలి? కౌరవ వీరులూ, అపారమైన కౌరవ సేనలూ ఆ సైంధవుణ్ణి చుట్టుముట్టి కాపాడితే అతన్ని చంపటం సాధ్యపడుతుందా?" అన్నాడట.

"మహేశ్వరుడు నీకు పాశుపతాస్త్రం ప్రసాదించాడుగదా. ఆ మహేశ్వరుణ్ణి ధ్యానించు. ఆయన అనుగ్రహంవల్ల నీకది లభిస్తుంది," అన్నాడట కృష్ణుడు. ఆ మాట విని అర్జునుడు నేలపై కూర్చుని శంకరుణ్ణి తదేకంగా ధ్యానం చేశాడట.

అంతలోనే కృష్ణార్జునులిద్దరూ ఆకాశంలో తేలి వెళుతున్నారు. ఉత్తరంగా మంచు కొండలు కనబడ్డాయి. గంగానదీ, ఏవేవో చెట్లూ, ఆశ్రమాలూ, అక్కడక్కడా ఇళ్ళ సమూహాలూ కనబడ్డాయి. చివరకు వారు శివ పార్వతులూ, భూతగణాలూ ఉండే కైలాసాన్ని చేరుకున్నారు. కృష్ణుడూ, అతని తరవాత అర్జునుడూ శివుడికి నమస్కరించారు, స్తుతించారు.

శంకరుడు వారిద్దరినీ ప్రేమతో ఆదరించి, "నర నారాయణులారా, మీరు వచ్చిన పని తెలుసుకున్నాను. ఈ పక్కనే ఒక సరస్సులో నా ధనువునూ, అస్త్రాన్నీ ఉంచాను. వెళ్ళి తెచ్చుకోండి," అన్నాడు. కృష్ణార్జునులు ఆ సరస్సువద్దకు వెళ్ళి లోనికి దిగేసరికి ఒక ఘోరమైన మహాసర్పం సూర్యుడు

లాగా వెలిగిపోతూ వారికంట పడింది. అక్షడనే వెయ్యి శిరస్సులు గల మరొక మహా సర్పంకూడా ఉన్నది; దానినుంచి జ్వాలలు వెలువడుతున్నాయి. ఇద్దరూ నమస్కారాలు చేసి శంకరధ్యానం చేస్తూ ఉండిపోయినారు. అప్పుడా మహాసర్పాలు తమ పాము ఆకారాలు విసర్జించి, ధనుర్బాణాలుగా వారికి గోచరించాయి.




కృష్ణార్జునులు వాటిని తీసుకుని శివుడి వద్దకు తిరిగి వచ్చారు. అప్పుడు శివుడి పార్శ్వంనుంచి ఒక ఆకారం వెలువడి ఆ ధనువుకు ఆ బాణాన్ని సంధించింది. అర్జునుడు అతి జాగ్రత్తగా ఆ బాణంయొక్క తాటినీ, పట్టుకునే పద్ధతినీ, బాణం ఎక్కుపెట్టే పద్ధతినీ గమనించుతూ, శివుడు పఠించిన మంత్రాన్ని ఆలకించి తన మనసులో మననం చేసుకున్నాడు.

తరవాత కృష్ణార్జునులు ఆ ధనుర్బాణాలను తిరిగి సరస్సులో ఉంచి, శివుడివద్ద సెలవు పుచ్చుకుని తిరిగివచ్చారు.

ఈ కల పూర్తి అయేలోపుగా అర్జునుడి మనస్సులో ఒక గొప్ప సంతృప్తి, ఘనకార్యం సాధించానన్న ఆనందమూ కలిగింది.

ఆ రాత్రి గడిచినదాకా కృష్ణుడు దారుకుడితో మాట్లాడుతూనే ఉండిపోయి, తెల్లవారగానే ధర్మరాజు శిబిరానికి వెళ్లాడు. ఆ సమయానికి రాజముఖ్యులందరూ ధర్మరాజును చూడవచ్చారు. ధర్మరాజు కృష్ణుడితో, "ఈరోజు అర్జునుడి శపథం పూర్తి అయేటట్టు చూసే భారం నీదే!" అన్నాడు. "ధర్మరాజా, ఆ విషయమై నీవు శాంతంగా ఉండు. ఇవాళలోగా ఆ సైంధవ పాపిశవం నక్కలవాతా, గద్దలవాతా పడటం నిశ్చయం," అన్నాడు కృష్ణుడు. ఇంతలో అర్జునుడు అక్కడికి వచ్చి అందరికీ నమస్కరించి, ధర్మరాజుతో తనకు రాత్రి వచ్చిన కల గురించి చెప్పాడు. అందరూ ఆశ్చర్యానందాలు పొందారు.



తరవాత అందరూ యుద్ధ ప్రయత్నాలకు ఉపక్రమించారు. అర్జునుడు సాత్యకితో, "సాత్యకీ, ఈరోజు మన ధర్మరాజును వెంటఉండి కాపాడే భారం నీమీద వేస్తున్నాను. నీలో నాకుండే విశ్వాసం మరెవరిలోనూ లేదు. ఇక సైంధవుణ్ణి చంపటం మాటా? ఆ పని నేను ఒక్కణ్ణే చేస్తాను. నాకు ఎవరి సహాయమూ అవసరం లేదు," అన్నాడు.

ఆనాటి యుద్ధానికి ద్రోణుడు తన సేనను శకటవ్యూహంలో అమర్చాడు. ఆయన సైంధవుణ్ణి కాపాడేటందుకు భూరిశ్రవుణ్ణీ, కర్ణుణ్ణీ, అశ్వత్థామనూ, శల్యుణ్ణీ, వృషసేనుణ్ణీ, కృపుణ్ణీ నియోగించాడు. ఈ యోధులందరినీ చుట్టుముట్టి రక్షించేటందుకు ఒకలక్ష గుర్రాలనూ, అరవైవేల రథికులనూ, పద్నాలుగువేల ఏనుగులనూ, ఇరవైఒక్క వేలమంది కవచధారులైన కాల్బంటులనూ ఏర్పాటుచేశాడు. ఇలా చేసి ద్రోణుడు సైంధవుడితో, "నువు నాకు ఆరు కోసులు వెనకగా ఉండు. నీకేమీ భయం కలగదు. నిన్ను పాండవులు కారుగదా, దేవతలతో కూడిన ఇంద్రుడుకూడా ఏమీ చెయ్యలేడు!" అని చెప్పాడు.

అవతల పాండవ సేనలను నకులుడి కొడుకైన శతానీకుడూ, ధృష్టద్యుమ్నుడూ కలిసి ఒక వ్యూహంగా అమర్చారు. అర్జునుడు తన ప్రతిజ్ఞ పూర్తిచేసే ఉత్సాహంతో కాలాగ్నిలాగా ప్రజ్వలించుతూ కౌరవసేనల పైన వచ్చి పడ్డాడు. అతను శకట వ్యూహాన్ని చేరేలోపుగా ధృతరాష్ట్రుడి కొడుకులలో ఒకడైన దుర్మర్షణుడు ఏనుగుల సేనతో అడ్డుపడ్డాడు. అర్జునుడా సేనను చించి చెండాడి చెదరగొట్టేశాడు. తరవాత దుశ్శాసనుడు మరొక సేనతోసహా అర్జునుణ్ణి ఎదిరించాడు. ఆ సేనగతీ అంతే అయింది. దుశ్శాసనుడు బెదిరి తన మిగిలిన సేనతో శకటవ్యూహం ప్రవేశించి ద్రోణుడి చాటున దాగాడు.

అర్జునుడు ద్రోణుణ్ణి సమీపించి వినయంగా నమస్కారం చేసి, "గురుదేవా! సైంధవుణ్ణి చంపుతానని ప్రతిజ్ఞచేశాను. ఆ ప్రతిజ్ఞ నెరవేరేటట్టు అనుగ్రహించండి!" అన్నాడు.

"నన్ను జయించకుండా సైంధవుడి దగ్గిరికి నువు వెళ్ళలేవే!" అన్నాడు ద్రోణుడు. ఇద్దరూ యుద్ధం ఆరంభించారు. అర్జునుడి ప్రతాపం ద్రోణుడిముందు ఏమాత్రమూ పారకపోగా, రోజల్లా యుద్ధం చేసినా అర్జునుడు ముందుకు ఒక్క అడుగు వేసే అవకాశం కనిపించలేదు. కృష్ణుడిది గమనించి, "అర్జునా, ఇక్కడే కాలమంతా వ్యర్థమవుతున్నది. ఈ ద్రోణుణ్ణి తప్పించుకుని మనం ముందుకు పోవాలి!" అంటూ రథాన్ని పక్కకు తిప్పి ముందుకు తోలసాగాడు. ద్రోణుడు అర్జునుడి వెంట తగిలి, "అర్జునా, నేను యుద్ధం చేస్తుండగానే ఎక్కడికి అలా పోతున్నావు?" అన్నాడు.

"అయ్యా, మీ శిష్యుణ్ణి, మీ కొడుకులాటివాణ్ణి. మిమ్మల్ని జయించటం నా వల్ల అవుతుందా?" అన్నాడు అర్జునుడు వేగంగా ముందుకు సాగిపోతూ.

అర్జునుడి రథం త్వరలోనే సైంధవుడి సేనను చేరుకున్నది. అర్జునుడికి చక్రరక్షకులుగా యుధామన్యుడూ, ఉత్త




మౌజుడూ మాత్రమే వెంట ఉన్నారు. ఇలా మీదికి వచ్చే అర్జునుణ్ణి అడ్డగించటానికి కృతవర్మా, జయుడూ, కాంభోజుడూ, శ్రుతాయువూ పెద్దసేనతో ఎదుర్కొన్నారు. ఘోరంగా యుద్ధం సాగింది. కృష్ణార్జును లిద్దరూ బాగా గాయపడ్డారు. అర్జునుడికి ఇంకొక నష్టం ఏం జరిగిందంటే కృపుడు అర్జునుడి చక్రరక్షకులిద్దరినీ నిలవేసి ముందుకు పోకుండా చేశాడు. అందుచేత అర్జునుడి రథం ఒంటిగా శత్రుసైన్యం ప్రవేశించింది.

అయినా అర్జునుడు ఆరోజు చేసిన సైన్య క్షయానికి అంతులేదు. ఎందరో యోధులు అతని చేతిలో చచ్చారు. కాంభోజరాజు కొడుకు సుదక్షిణుడూ, శ్రుతాయుధుడనే అజేయుడైన వీరుడూ చచ్చారు. ఈ శ్రుతా యుధుడు వరుణదేవుడికీ పర్ణాశ అనే నదికీ పుట్టినవాడు. వరుణుడు వాడికొక అప్రతి హతమైన గద ఇచ్చాడు. ఆ గద మూలంగా వాడు సాటిలేని వీరుడై, ఎవరికీ ఓడకుండా జయించుకువచ్చాడు. అయితే వరుణుడు వాడికొక్క హెచ్చరిక చేశాడు. "ఈ గదను యుద్ధం చెయ్యనివాడిపై ప్రయోగించావో, అది నీ తలనే పగలగొట్టుతుంది!" అన్నాడు. శ్రుతాయుధుడు ఈ సంగతి మరిచిపోయి ఈరోజు తన గదను కృష్ణుడిపై విసిరాడు, మరుక్షణమే అది తలపై పడి వాడు చచ్చి పోవటం జరిగింది.

తరవాత శ్రుతాయువూ, అచ్యుతాయువూ అనేవాళ్లు అర్జునుడితో వీరోచితంగా పోరాడి చచ్చారు. వారి కొడుకులు నియుతాయువూ, దీర్ఘాయువూ అనేవాళ్లు తనపైకి రాగా అర్జునుడు వారిని తృటిలో యమలోకానికి పంపేశాడు. అదేవిధంగా అంబష్ఠుడనేవాడు కూడా అర్జునుడి చేతిలో చచ్చాడు. అర్జునుడు ఆనాడు సైంధవుణ్ణి చంపి తన ప్రతిజ్ఞ నెరవేర్చుకునే ప్రయత్నంలో కౌరవసైన్యం పైన కావించిన చిత్రవధ వర్ణనాతీతమైనది.




చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Sept. '60
50
NAYE PAISE
8



అర్జునుడి విజృంభణ చూసి దుర్యోధనుడు ఓర్చలేనివాడై, తన సర్వసేనాని అయిన ద్రోణుడి దగ్గిరికి వెళ్ళి, "ఆచార్యా, అర్జునుడు మన సేనలను కార్చిచ్చులాగా దహించుకుంటూ సైంధవుడున్న దిక్కుగా వెళుతూ ఉండటం చూశావా?" అన్నాడు.

"వ్యూహముఖంలో చిన్న సందు చూసుకుని కృష్ణుడు అర్జునుడి రథాన్ని నా పక్కగా తప్పించి ముందుకు తోలుకుపోయాడు. అర్జునుణ్ణి వెంబడించి పట్టుకునే వేగం నాకు లేదు. అదీగాక పాండవయోధులు వ్యూహముఖానికి వచ్చి ఉన్నారు. నేను వారినుంచి వ్యూహాన్ని కాపాడాలి. నీవు అర్జునుణ్ణి నిరపాయంగా ఎదుర్కొనే మార్గం నేను చూస్తాను. నేను నీకొక బంగారు కవచం తొడుగుతాను. అది నీ శరీరంమీద ఉండగా, అర్జునుడు కాడుగదా, దేవేంద్రుడైనా నిన్నేమీ చేయలేడు," అంటూ ద్రోణుడు మంత్రోచ్చాటన చేస్తూ ఒక దివ్యమైన కవచాన్ని దుర్యోధనుడికి తొడిగి, ఆశీర్వదించాడు. దుర్యోధనుడు ఆ కవచం ధరించి బోలెడంత సైన్యాన్ని వెంటబెట్టుకుని అర్జునుడున్న చోటికి వెళ్ళాడు.

సాయంకాలం కావస్తున్నది. ఇంకా అర్జునుడు సైంధవుణ్ణి చేరుకోలేదు. ఒక చెంప అర్జునుడు తన బాణాలతో సైన్యాలను సంహరిస్తూ ఉంటే ఇంకొక చెంప కృష్ణుడు రథాన్ని వాయువేగంతో ముందుకు నడుపుకుపోతున్నాడు. గుర్రాలు బాణాల దెబ్బలు తినీ, మెలికలు తిరుగుతూ నడిచీ, చచ్చిపోయిన పీనుగుల గుట్టలమీదిగా పరిగెత్తీ ఆకలిదప్పులతో డస్సి, కదలలేని స్థితికి వచ్చాయి. ఆ అదను చూసుకుని కౌరవసేనలు ఉత్సాహంతో అర్జునుడిపైకి అన్ని వైపులనుంచీ వచ్చాయి. అర్జునుడు ఒక వంక తన బాణాలతో ఆ సైన్యాన్ని సమీ

అట్టమీది బొమ్మ

పానికి రాకుండా చూసుకుంటూ, ఒక అస్త్రంతో భూమిని భేదించి ఒక చిన్న సరస్సు ఏర్పాటుచేశాడు, బాణాలతో ఒక ఇల్లులాగా నిర్మించాడు. ఈ విడ్డూరం చూసి శత్రు సైనికులు అద్భుతం చెందుతూండగా కృష్ణుడు తాపీగా రథపు గుర్రాలను విప్పి, వాటికి గుచ్చుకున్న బాణాలు ఉపాయంగా పెరికి, గుర్రాలను నీటిలో కడిగి, వాటిచేత నీరు తాగించి, వాటికి మేత వేసి, మళ్ళీ వాటిని రథానికి పూన్చాడు. ఇంతసేపూ తన చుట్టూ ఉన్న శత్రు సైన్యంతో యుద్ధం చేస్తూ ఉండిన అర్జునుడు రథమెక్కి బయలుదేరాడు.

ఇప్పుడు అర్జునుడి రథం శరవేగంతో కదిలి సైంధవుడున్న చోటికి వెళ్ళింది. అర్జునుడు సైంధవుణ్ణి చూడగానే దుర్యోధనుడి తమ్ములందరూ హాహాకారాలు చేశారు.

ఆ సమయంలో దుర్యోధనుడు కవచం ధరించి ఒంటరిగా అర్జునుడికి ఎదురు వచ్చాడు. ఇద్దరికీ యుద్ధం జరిగింది. దుర్యోధనుడి బాణాలు అర్జునుడి శరీరాన్ని గాయపరిచాయి గాని, అర్జునుడి బాణం ఒక్కటీ దుర్యోధనుడి కవచాన్ని ఛేదించలేకపోయింది. ఇది గమనించి అర్జునుడు వడివడిగా దుర్యోధనుడి బాణాన్నీ, గుర్రాలనూ,



సారథినీ ధ్వంసంచేసి దుర్యోధనుడి హస్తాలను గాయపరిచాడు.

ఈలోపల ద్రోణుడున్న చోట కూడా ఉభయపక్ష యోధుల మధ్యా తీవ్రంగా యుద్ధం సాగుతున్నది.

భీముడికీ అలంబుసుడనే రాక్షసుడికీ గొప్ప యుద్ధం జరిగింది. మొదట్లో భీముడు మూర్ఛపోయి, తరవాత వాణ్ణి ఓడించేసరికి వాడు పారిపోయాడు. ఆ తరవాత ఘటోత్కచుడికీ, వాడికీ యుద్ధం జరిగింది. ఇద్దరూ రాక్షసులే. ఈ యుద్ధంలో అలంబుసుడు చచ్చిపోయేసరికి పాండవ యోధులు పొందిన ఆనందానికి మేరలేదు.

ఈలోపల ధర్మరాజుకు అర్జునుణ్ణి గురించి బెంగ పట్టుకున్నది. ఆయన సాత్యకితో, "అర్జునుడు ఉదయమనంగా కౌరవ సేన ప్రవేశించాడు, ఇప్పుడు అస్తమయం కావస్తున్నది. కౌరవుల సింహనాదాలు వినవస్తున్నాయి. నీవు కాస్త అర్జునుడికి తోడుగా వెళుదూ!" అన్నాడు. సాత్యకి ధర్మరాజు రక్షణభారం భీముడిపై వేసి, రథంపైన అర్జును డుండే చోటికి బయలుదేరాడు.

ప్రచండ వాయువులాగా సాత్యకి శత్రు సేనలను చెదరగొట్టుకుంటూ ముందుకు పోతూండగా ద్రోణుడు అడ్డుపడి, "ఏమోయీ, నీచుడిలాగా నీ గురువు అర్జునుడు నాతో యుద్ధంచెయ్యటానికి బదులు నాకు ప్రదక్షిణం చేసి ముందుకు సాగిపోయాడు. నీవుకూడా అదే పని చెయ్యి. లేకపోతే నీ ప్రాణాలు దక్కవు!" అన్నాడు.


"బ్రాహ్మణోత్తమా, గురువు చూపించిన మార్గం శిష్యుడు అవలంబించటమే ధర్మం గదా! నన్ను వెళ్ళనివ్వండి!" అంటూ సాత్యకి ఆయనను తప్పుకుని ముందుకు పోయాడు. ద్రోణుడు తన సేనను కృతవర్మకు అప్పగించి సాత్యకిని వెన్నాడాడు.

ద్రోణుడు తనను చేరవచ్చేలోగా సాత్యకి ఒక గజ సైన్యాన్ని ఎదుర్కొని నాశనం చేశాడు, మగధ దేశానికి చెందిన జలసంధుడనేవాడితో యుద్ధంచేసి వాణ్ణి చంపేశాడు. ఇంతలో ద్రోణుడూ, దుస్సహుడూ, వికర్ణుడూ, చిత్రసేనుడూ, వివింశతీ, దుర్మర్షణుడూ, సత్యవ్రతుడూ మొదలుగాగల కౌరవ యోధులు సాత్యకిని చుట్టుముట్టి యుద్ధం చేశారు. సాత్యకి అందరితోనూ పోట్లాడి అందరినీ దెబ్బతీశాడు. తరవాత దుర్యోధనుడు వచ్చి సాత్యకితో యుద్ధం చేసి దెబ్బతిని నిష్క్రమించాడు. ఇంతలో కృతవర్మ వచ్చాడు. ఇద్దరూ కొంతసేపు ఘోరంగా పోరాడినాక కృతవర్మ శరీరమంతా నెత్తురుమయమై రథంనుంచి కింద పడిపోయాడు.



చందమామ


పిల్లల కథల మాసపత్రిక



Oct. '60

50

8



మహాభారతం

మహారథుడైన సాత్యకి దారిలో అడ్డు తగిలిన యోధులనూ, సైన్యాలనూ చించి చెండాడుతూ అర్జునుడు యుద్ధంచేసే చోటును సమీపించాడు.

అయితే ధర్మరాజుకు అర్జునుడేమయాడో నన్న విచారం పట్టుకున్నది. అర్జునుడికి తోడు వెళ్ళిన సాత్యకి కూడా తిరిగి రాలేదు. ఆయన భీముడితో, "అర్జునుడి జాడగాని, అతనికోసం వెళ్లిన సాత్యకి జాడగాని తెలియరాలేదు. నువు వారిద్దరికీ అండగా వెళ్ళు," అని చెప్పాడు.

భీముడు ధర్మరాజును కాపాడే భారం ధృష్టద్యుమ్నుడిపైన పెట్టి తానుకూడా రథంలో అర్జున సాత్యకులు వెళ్లిన దిక్కుగా బయలుదేరాడు. అతన్ని ముందుగా ద్రోణుడు అడ్డగించాడు. అర్జున సాత్యకుల లాగే భీముడుకూడా తనకొక ప్రదక్షిణం చేసి ముందుకు సాగిపోతాడని ద్రోణుడు అనుకున్నాడు. కాని భీముడు అలాటిదేమీ చేయకపోగా ఒక బ్రహ్మాండమైన గదను గిరగిరా తిప్పి ద్రోణుడి రథంపైన విసిరాడు. అది చూస్తూనే, ద్రోణుడు రథంపైనుంచి కిందికి దూకేశాడు.

ఆ కౌరవ వ్యూహ ముఖాన భీముడు ధృతరాష్ట్రుడి కొడుకులతో తలపడి భయంకరమైన యుద్ధం చేసి, కుండభేది, సుషేణుడు, దీర్ఘనేత్రుడు, బృందారకుడు, అభయుడు, రౌద్రకర్ముడు, దుర్విమోచనుడు, సుశర్ముడు, సుదర్శనుడు మొదలైనవారిని చంపేశాడు.

భీముడు అర్జునుడు యుద్ధంచేసే ప్రాంతానికి చేరుకున్నాడు. అంతదూరాన అర్జునుడు కనిపించగానే భీముడు దిక్కులు పిక్కటిల్లే ఒక పెడబొబ్బ పెట్టాడు. అది విని ధర్మరాజు, అర్జునుడు క్షేమంగా ఉన్నాడని గ్రహించి ఎంతో సంతోషించాడు.

అట్టమీది బొమ్మ

ఇక్కడ భీముడికి కర్ణుడు అడ్డుపడ్డాడు. ఇద్దరికీ అతి భయంకరమైన యుద్ధం జరిగింది. చిత్రమేమిటంటే భీముడు విల్లుతో యుద్ధం చేస్తూ కర్ణుణ్ణి ఓడించి విరథుణ్ణి చేశాడు. కర్ణుడు చావుదెబ్బ తిని పారిపోయి కూడా మరొక రథం ఎక్కి వచ్చి మళ్ళీ కలియబడ్డాడు.

కాని చివరకు భీముడు విరథుడూ, నిరాయుధుడూ అయిపోయాడు.

ఆ క్షణాన భీముడి ప్రాణాలు కర్ణుడి చేతిలో ఉన్నాయి. అయితే కర్ణుడు కుంతికి మాట ఇచ్చిఉన్నాడు: ఒక్క అర్జునుడు తప్ప మిగిలిన పాండవులెవరు తనకు చిక్కినా ప్రాణాలతో వదులుతానన్నాడు. అందుచేత కర్ణుడు భీముణ్ణి బాణంతో పొడుస్తూ, "తిండిపోతా, హాయిగా ఇంటిపట్టున తింటూ కూచోక మాబోటి యోధులతో పోట్లాడవస్తావా?" అని ఆక్షేపించాడు.

భీముడు తోకతొక్కిన తాచులాగా రోషంతో బుసలుకొడుతూ, "ఓరీ, దుష్టుడా, నా చేతిలో ఇన్నిసార్లు ఓడి పారిపోయి ఏమని గర్విస్తున్నావు? చాతనయితే నాతో మల్లయుద్ధానికి రా! ఆ కీచకుడున్నచోటికి పంపిస్తాను!" అన్నాడు. ఇంతలో అర్జునుడి బాణాలు వచ్చి కర్ణుడికి తగిలాయి. కర్ణుడు



భీముణ్ణి విడిచి వెళ్ళిపోయాడు. భీముడు సాత్యకి రథమెక్కాడు. అర్జున భీమ సాత్యకులు ఒకచోట చేరుకున్నారు.

తరవాత సాత్యకికీ భూరిశ్రవుడికీ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో సాత్యకి నిరాయుధుడయాడు. సాత్యకిని చంపే ఉద్దేశంతో భూరిశ్రవుడు కత్తి ఎత్తేసరికి, అర్జునుడు సమయానికి ఒక అర్ధచంద్రాకారం గల బాణాన్ని గాండీవానికి సంధించి విడిచి భూరిశ్రవుడు ఎత్తిన చెయ్యి తెగవేశాడు. తరవాత సాత్యకి భూరిశ్రవుడి తల నరికేశాడు. భూరిశ్రవుడి హత్య అధర్మంగా జరిగిందని కొందరు కౌరవులు విమర్శించారు. "నిరా

యుధుడైన కుర్రవాడు అభిమన్యుడు వచ్చి నప్పుడు మీ ధర్మబుద్ధి ఏమయింది?" అని సాత్యకి వారిని అడిగాడు.

త్వరలోనే అర్జునుడి రథం సైంధవుడి కేసి వెళ్ళింది. ఇది చూసి దుర్యోధనుడు కర్ణుడితో, సైంధవుడికి సహాయంగా రమ్మన్నాడు. "భీముడు ఇవాళ నన్ను చాలా పీడించాడు. ఇవాళ్టికి ఇక యుద్ధం వద్దనుకున్నాను. అయినా నా శక్తికొద్దీ అర్జునుడికి అడ్డుపడతాను," అన్నాడు కర్ణుడు.


సూర్యాస్తమానం కావస్తున్నది. కాస్సేపు అర్జునుణ్ణి ముందుకు రానివ్వకుండాచేస్తే అతను చితి పేర్చుకు చస్తాడన్న ఆశతో దుర్యోధనుడూ, కర్ణుడూ, వృషసేనుడూ, శల్యుడూ, కృపుడూ, అశ్వత్థామా అర్జునుడితో తలపడ్డారు. భీమ సాత్యకులు అర్జునుడికి సహాయంగా ఉన్నారు. ఆ ముగ్గురితోనూ కర్ణుడు చాలా గొప్ప యుద్ధం చేశాడు. అప్పుడు కృష్ణుడు అర్జునుడితో, "అర్జునా, సూర్యాస్తమయం గురించి ఏమాత్రమూ విచారించక అవకాశం దొరకగానే సైంధవుణ్ణి చంపెయ్యి," అంటూ తన యోగమాయచేత చీకటి కలిగించాడు.


కౌరవవీరుల ఆనందానికి మేరలేదు. వారు సూర్యుడున్నవేపు చూడసాగారు. సైంధవుడుకూడా మెడ నిక్కించి చూశాడు. "ఇదే సమయం!" అని కృష్ణుడు హెచ్చరించగా, అర్జునుడు ఒక దివ్యాస్త్రంతో అతని తల తెగవేసి, అది భూమిమీద పడకుండా వెళ్ళి సైంధవుడి తండ్రి ఒడిలో పడేలాగు చేశాడు. సైంధవుడి తలను ఎవరైతే భూమిపై పడేస్తారో వారు తల పగిలి చస్తారు. సైంధవుడి తండ్రి ఇలా శాపం పెట్టాడు. ఆ శాపం ఆయనకే తగిలింది. ఎక్కడో కూచుని తపస్సు చేసుకుంటున్న ఆ ముసలివాడి ఒడిలో పడిన సైంధవుడి తల ఆయన లేవగానే కింద పడింది. సైంధవుడి తండ్రి తల పగిలి చచ్చాడు.



చందమామ

దీపావళి ప్రత్యేక సంచిక





మహాభారతం

సైంధవుడు చావగానే కృష్ణార్జునులూ, భీముడూ గొప్ప శంఖనాదాలూ, సింహనాదమూ చేశారు.

భీముడు అర్జునుణ్ణి సమీపించి కర్ణుడు తనకు చేసిన అవమానం గురించి చెప్పాడు. అర్జునుడు అది విని మండిపడి కర్ణుణ్ణి సమీపించి, "ఓరీ, నీచుడా! దైవికంగా నీకు చిక్కిన భీముణ్ణి గురించి అవమానంగా మాట్లాడతావా? చూస్తూ ఉండు, నీ కళ్ళ ఎదటనే నీ కొడుకు వృషసేనుణ్ణి చంపేస్తాను! ఇదే నా ప్రతిజ్ఞ!" అన్నాడు.

ఈ మాటలు వినపడగానే కౌరవ సేనలో హాహాకారాలు లేచాయి. దొమ్మియుద్ధం ప్రారంభమయింది. మరి కాస్సేపటికి సూర్యుడు అస్తమించాడు. తరవాత కృష్ణార్జునులు తిరుగుముఖమై బయలుదేరారు. ధర్మరాజు వారిని ఆలింగనం చేసుకుని ఆనందాశ్రువులు రాల్చాడు.

అక్కడ దుర్యోధనుడి సంతాపానికి మేర లేదు. ఇందరు యోధులుండి కూడా సైంధవుణ్ణి అర్జునుడినుంచి కాపాడలేకపోయారు. అర్జునుడు ఆరోజు ఏడు అక్షౌహిణీల కౌరవ సేనను నాశనంచేశాడు. భీముడు తన తమ్ములను ముప్పైఒక్కమందిని పొట్టన పెట్టుకున్నాడు. అతను ద్రోణుడివద్దకు వెళ్ళి, "ఆచార్యా, భీష్ముడంతటి యోధుణ్ణి పడగొట్టిన శిఖండి ఇంకా బతికే ఉన్నాడు. నన్ను నమ్ముకుని నాకోసం పోరే మహాయోధులందరూ పోతున్నారు. నీ శిష్యుడని అభిమానించి నీవు అర్జునుణ్ణి ఉపేక్షిస్తున్నావు. ఆ అర్జునుడు ఇవాళ నా సైన్యమంతా నాశనంచేసి సైంధవుణ్ణి చంపాడు. నాకు మిత్రులెవరో తెలియని కారణంచేత ఆపద తెచ్చిపెట్టుకున్నాను!" అని ఎత్తిపొడిచాడు.


ఈ మాటలకు ద్రోణుడు గట్టిగానే సమాధానం చెప్పాడు: "అర్జునుణ్ణి జయించటం

తేలికపని కాదని నీకు ఎన్నోసార్లు చెప్పాను. నేను నీచ బ్రాహ్మణుణ్ణి కనకనే నా కొడుకులలాటి పాండవులను చంపటానికి సిద్ధపడ్డాను. వాళ్ళు ధర్మపరులు. ఇక సైంధవుడిమాట అంటావా? అతనికి మిమ్మల్నందర్నీ రక్షగా పెట్టానుకదా, మీరంతా బతికి ఉండగా అతను ఎలా చావటం జరిగింది? మీరు తగుదుమమ్మా అని అర్జునుణ్ణి ఎందుకు చుట్టుముట్టవలిసి వచ్చింది?"

దుర్యోధనుడు మండిపడి కర్ణుడితో, "చూశావా, మిత్రమా? ద్రోణుడు బుద్ధిపూర్వకంగా అర్జునుణ్ణి మన సేన ప్రవేశించనిచ్చాడు. అందువల్ల సైంధవుడు చావటం జరిగింది. ఈ ద్రోణుణ్ణి నమ్ముకుని నేను సైంధవుణ్ణి ఇంటికి పోకుండా ఆపి అతనికి చావు తెచ్చిపెట్టాను," అన్నాడు.

కర్ణుడు ఈ మాట అంగీకరించక, అర్జునుడు కౌరవసేన ప్రవేశించటంలో ద్రోణుడి తప్పు ఏమీ లేదని చెప్పాడు.

చీకటి పడింది. నక్కలు కూస్తున్నాయి. గుడ్లగూబలు భయంకరంగా అరుస్తున్నాయి. కాని సేనలు యుద్ధం చాలించి శిబిరాలకు తిరిగి పోలేదు. రోషంతో మండిపడిపోతూ దుర్యోధనుడు పాండవసేనలలో ప్రవేశించి భయంకరమైన యుద్ధం చేయసాగాడు.



ద్రోణుడుకూడా గొప్ప యుద్ధం సాగించి కేకయులనూ, ధృష్టద్యుమ్నుడి కొడుకులనూ చంపాడు. శిబి అనేవాడు ఆయన చేతిలో చచ్చాడు. ఉభయపక్షాల యోధులకూ రోషం రెచ్చిపోయింది. పాండవపక్షాన ఘటోత్కచుడూ, అతని రాక్షస సైనికులూ రాత్రి పైబడుతున్నకొద్దీ బలం పొందినవారై అతి భయంకరమైన యుద్ధం సాగించారు. ఘటోత్కచుడి దెబ్బకు తట్టుకోలేక దుర్యోధన కర్ణులవంటి యోధులు వెనుతిరిగారు.

ఆ రాత్రి యుద్ధం ఆరంభమయాక భీముడుకూడా ప్రచండమైన యుద్ధం చేస్తూ, కాళింగుడి కొడుకునూ, పదిమంది

ధృతరాష్ట్ర పుత్రులనూ చంపేశాడు, బాహ్లికుణ్ణి చంపాడు. పాండవ యోధుల విజృంభణ చూసి దుర్యోధనుడు కర్ణుడితో, "మిత్రమా, ఈ పాండవసేనల విజృంభణను నీవే అణచాలి!" అన్నాడు. వెంటనే కర్ణుడు ప్రగల్భాలు పలుకుతూ, "రాజా, నీవు విచారించకు. నాకు ఇంద్రుడిచ్చిన శక్తితో అర్జునుణ్ణి తప్పక చంపేస్తాను. ఈ పాండవులనూ, కేకయులనూ, మాత్స్యులనూ, పాంచాలులనూ జయించి భూమండల మంతా ఇచ్చేస్తాను. నీవు చింతించకు!" అన్నాడు.

అది విని కృపుడు వెటకారంగా, "ఎందుకోయి, ఈ ప్రగల్భాలూ? ఇవన్నీ అర్జునుడితో పోరేటప్పుడు ఏమవుతాయి? కార్యశూరులు పనిచేసి చూపుతారుగాని నీలాగా అత్మస్తుతి చేసుకోరు," అని ఎత్తిపొడిచాడు. కర్ణుడు ఆగ్రహించి మరింత ప్రగల్భాలాడటమే గాక కృపుడితో, "ఓ బ్రాహ్మడా, నాకు అప్రియంగా మరి మాట్లాడావంటే నా కత్తితో నీ నాలుక కోసేస్తాను!" అన్నాడు.

ఈ మాటలు విని అశ్వత్థామ మండిపడి, "ఓరీ అధముడా! మహావీరుడైన నా మేనమామను పరాభవిస్తావా? నీ తల తెగవేస్తాను!" అని కత్తి ఎత్తాడు. దుర్యోధనుడు అతి కష్టంమీద అశ్వత్థామనూ, కృపుణ్ణీ, కర్ణుణ్ణీ సమాధానపరిచాడు. ఇంతలో పాండవులు కర్ణుణ్ణి చూసి అతనితో యుద్ధానికి వచ్చారు. కర్ణుడు చాలా గొప్పగా యుద్ధం చేశాడుగాని అర్జునుడు తలపడి అతన్ని విరథుణ్ణి చేసేశాడు.


ఆ తరవాత జరిగిన యుద్ధంలో సాత్యకి సోమదత్తుణ్ణి చంపాడు. అంధకారం బాగా హెచ్చిపోయింది. దీపాలు వెలిగించమని దుర్యోధనుడు తన సేనలకు ఉత్తరువిచ్చాడు. కౌరవసేనలో దీపాలు కనబడగానే పాండవుల. సేనలో కూడా దీపాలు వెలిగించారు. వాటి వెలుగున యుద్ధం సాగింది.



చందమామ

డిసెంబర్ 1960





మహాభారతం

దివిటీల కాంతి యుద్ధరంగమంతా నిండి చీకటి పోగానే ఉభయపక్ష యోధులూ విజృంభించి పోరాడసాగారు. ద్రోణుడు గొప్ప యుద్ధం సాగించాడు, కాని కర్ణుడు ద్రోణుణ్ణి మించిపోయాడు. అతని ధాటికి తట్టుకోలేక పాండవ బలాలు పారిపోసాగాయి.

ధర్మరాజు అర్జునుణ్ణి సమీపించి, "చూడు, కర్ణుడు ఎలాటి దారుణ యుద్ధం చేస్తున్నాడో! అతన్ని అడ్డగించే ఉపాయం నువే చూడాలి. ఉపేక్షిస్తే సర్వనాశనం తప్పదు," అన్నాడు.

అర్జునుడు కృష్ణుడి సలహా అడిగాడు. కృష్ణుడు ఇలా చెప్పాడు: "ఈ సమయంలో నీవు కర్ణుణ్ణి ఎదుర్కోవటం క్షేమంకాదు. అతడివద్ద కవచకుండలాలు తీసుకున్నప్పుడు ఇంద్రుడు అతడికి వైజయంతి అనే మహాశక్తిని ఇచ్చాడు. ఆ అస్త్రాన్ని కర్ణుడు నీపై ప్రయోగించటానికే దాచి ఉంచాడు. దానికి తిరుగు లేదు. ఈ తరుణంలో కర్ణుణ్ణి ఎదుర్కోదగినవాడు మన యోధులలో ఘటోత్కచుడు ఒక్కడే కనిపిస్తున్నాడు."

కృష్ణుడు ఘటోత్కచుణ్ణి పిలిపించి, "ఇప్పుడు మన విజయం నీపైనే ఆధారపడిఉన్నది. కర్ణుడు మన సైన్యాలను చించి చెండాడుతున్నాడు. మాయయుద్ధంలో ఆరితేరిన నీవు అతణ్ణి ఎదిరించి జయించాలి. ఇవాళ నీ యుద్ధంతో నీకూ, మాకూకూడా ఖ్యాతి రావాలి," అన్నాడు.

"నీకు భీముడూ, సాత్యకీ తోడుగా వస్తారు," అన్నాడు అర్జునుడు.

"నాకు ఎవరూ తోడు అవసరంలేదు. ఆ ద్రోణ కర్ణులను నేనొక్కణ్ణే ఎదిరించి చంపేస్తాను," అంటూ ఘటోత్కచుడు తన బలాలతోసహా యుద్ధంలో ప్రవేశించాడు.

ఘటోత్కచుడు కర్ణుడిపైకి వస్తూ ఉండటం చూసి దుర్యోధనుడు దుశ్శాసను

డితో, "నీవు కర్ణుడికి అండగా వెళ్ళు," అన్నాడు. ఆ సమయానికి జటాసురుడి కొడుకైన అలంబుసుడు దుర్యోధనుణ్ణి సమీపించి, "దుర్యోధన మహారాజా, పాపులైన పాండవులు మహాబలశాలి అయిన నా తండ్రిని చంపేశారు. అందుచేత, నీ అనుమతి అయితే, నేనిప్పుడే వెళ్ళి ఆ పాండవులను చంపి వారి రక్తమాంసాలతో నా తండ్రి ఆత్మను ఆరాధిస్తాను," అన్నాడు.

"అయితే వెళ్ళి ముందు ఆ ఘటోత్కచుణ్ణి చంపు," అన్నాడు దుర్యోధనుడు.



అలంబుసుడు ఘటోత్కచుడిపైకి వెళ్ళాడు. ఇద్దరికీ భీభత్సమైన యుద్ధం జరిగింది. చివరకు ఘటోత్కచుడు అలంబుసుణ్ణి పడదోసి, అతడి తలను కత్తితో కోసి, దాని జుట్టును పట్టుకుని దుర్యోధనుడి వద్దకు వెళ్ళి, "ఇదుగో, చూడు, నీ బంధువు చచ్చాడు. కర్ణుడికీ ఈ గతే పట్టబోతున్నది. రాజునూ, బ్రాహ్మణ్ణీ, స్త్రీనీ చూడబోయేవారు వట్టి చేతులతో పోరాదంటారు గనక నీకోసం ఈ అలంబుసుడి తల తెచ్చాను. కర్ణుడి తల వచ్చేదాకా దీనితో తృప్తిపడు!" అని చెప్పి కర్ణుడిపైకి వెళ్ళాడు.

ఇంతలో అలాయుధుడనే మరొక రాక్షసుడు దుర్యోధనుడి వద్దకు వచ్చి, "దుర్యోధనా, బకాసురుడు నాకు జ్ఞాతి. బకాసురుడితోబాటు కిమ్మీరుడూ, హిడింబుడూ కూడా భీముడి చేతిలో చచ్చారని నీకు తెలుసుగదా. నేను భీముణ్ణీ, ఘటోత్కచుణ్ణీ కూడా చంపేస్తాను. మీ సైన్యాలను ఆగమని చెప్పు!" అన్నాడు.

దుర్యోధనుడు సంతోషించి, "మీరు యుద్ధం చెయ్యండి. మీ బలాల వెనకగా మేమూ యుద్ధం చేస్తాం," అన్నాడు.

అలాయుధుడు వెళ్ళి భీముడితో తలపడ్డాడు. వాడు మహా బలశాలి, భీముణ్ణి కూడా చాలా చిక్కులో పెట్టాడు. అది చూసి కృష్ణుడు, కర్ణుడిపైకి కొందరు పాండవ

యోధులను పంపి ఘటోత్కచుడు అలాయుధుడితో తలపడే అవకాశం కల్పించాడు. ఇద్దరు రాక్షసులకూ భీకరమైన యుద్ధం జరిగింది. చిట్టచివరకు ఘటోత్కచుడు అలాయుధుడి తల నరికి, దాన్ని దుర్యోధనుడి ముందు పడేటట్టు గిరవాటువేశాడు.

ఆ తరవాత ఘటోత్కచుడు విజృంభించి యుద్ధంచేస్తూ కౌరవసైన్యాన్నీ, ధృతరాష్ట్రుడి కొడుకులనూ ఎడా పెడా నాశనం చేయసాగాడు.

అదిచూసి కౌరవులు కర్ణుణ్ణి సమీపించి, "కర్ణా, ఎలాగైనా నీవు ఈ ఘటోత్కచుణ్ణి చంపు. వీడు మమ్మల్ని బతకనిచ్చేటట్టు లేడు. అర్జునుణ్ణయినా చంపగలం గాని ఈ ఘటోత్కచుణ్ణి ఎదుర్కోవటం మా తరం కావటంలేదు. నీ దగ్గిర ఇంద్రుడిచ్చిన శక్తి ఉన్నది. దాన్ని ప్రయోగించినట్టయితే ఈ రాక్షసుడు ముందు చస్తాడు. వీడు చావకపోతే మా చావు నిజం," అన్నారు.

కౌరవుల దుస్థితి చూసి కర్ణుడు తన వైజయంతిని ఘటోత్కచుడిపై ప్రయోగించాడు. దాని దెబ్బకు ఘటోత్కచుడు ప్రాణాలు వదిలాడు. ఘటోత్కచుడి చావుకు పాండవులు కన్నీరు కార్చారు. ఒక్క కృష్ణుడే సంతోషించాడు. అర్జునుడు విచారపూర్వకంగా కృష్ణుడితో, "మనకు ఇంత నష్టం జరిగిందిగదా, నీవు ఎలా ఆనందించ గలుగుతున్నావు?" అన్నాడు.


"అర్జునా, ఇప్పుడు నా మనసు కెంత హాయిగా ఉన్నదో నీకు తెలియదు. కర్ణుడి వద్ద ఉన్న ఆ మహాశక్తి ఘటోత్కచుడిపైన వ్యర్థమైపోయింది. ఇక కర్ణుడు చచ్చినవాడి కిందనే లెక్క. ఇప్పటికైనా అతడు నీచేత తప్ప మరొకరిచేత చావడు. మహాశక్తి ఉండగా నీవుకూడా అతన్ని చంపలేకపోయి ఉందువు. నీకోసమే నేను బుద్ధిపూర్వకంగా ఘటోత్కచుడి చావు తెచ్చిపెట్టాను. తెలుసుకో!" అన్నాడు కృష్ణుడు అర్జునుడితో.



CHANDAMAMA (Telugu) JANUARY 1961 Regd. No. M. 4854



మహాభారతం



పాండవయోధుడైన ఘటోత్కచుడు చనిపోగానే కౌరవసేనలో ఉత్సాహం పెరిగింది. ద్రోణుడూ, కర్ణుడూ పెచ్చురేగి యుద్ధం సాగించారు. పాండవ యోధులందరూ ద్రోణుణ్ణి చంపే ఉద్దేశంతో ఒక్కసారిగా ముందుకు వచ్చారు.

కాని ద్రోణుడు అద్భుతమైన పరాక్రమం చూపాడు. ఆయన ఆ రాత్రి విరాటుణ్ణీ, ద్రుపదుణ్ణీ, ద్రుపదుడి కొడుకులు ముగ్గురినీ, పాంచాల మత్స్య చేది దేశాల వీరులనూ హతమార్చేశాడు. తన తండ్రిని చంపిన ద్రోణుణ్ణి తాను తప్పక చంపుతానని ధృష్టద్యుమ్నుడు శపథంచేశాడు.

ఆ రాత్రి మూడుజాములకు సైనికులు అలిసి, రథాలలోనూ, గుర్రాలమీదా, ఏనుగులమీదా, ఎక్కడివాళ్లక్కడ నిద్రమత్తుతో జోగసాగారు. వారి దుస్థితి చూసి అర్జునుడు, "సైనికులారా, ఇంకా రెండు ఘడియలలో చంద్రోదయమవుతుంది. అంతదాకా యుద్ధం మాని విశ్రాంతి తీసుకోండి!" అని కేకపెట్టాడు.

అలాగే కౌరవ సైన్యాలు కూడా చంద్రోదయం వరకూ విశ్రాంతి తీసుకున్నాయి. చంద్రోదయంతో మళ్ళీ యుద్ధం ప్రారంభమయింది. మరి రెండు ఘడియలకు సూర్యోదయమే అయింది.

ద్రోణుడి యుద్ధం అతి భయంకరంగా ఉన్నది. ఆయన ఇరవై వేల పాంచాల రథికులనూ, అయిదు వందల మాత్స్యులనూ, ఆరు వేల సృంజయులనూ, అనేక వేల ఏనుగులనూ, గుర్రాలనూ చంపాడు. ఈ దారుణ హత్యాకాండ చూసి కృష్ణుడు పాండవులతో, "మీరు అన్యాయంగానైనా సరే ఈ ద్రోణుణ్ణి చంపకపోతే మనందరికీ చావు తప్పదు. అశ్వత్థామ చచ్చాడని వింటే ఆయన అస్త్రం విసర్జిస్తాడు," అని సలహా చెప్పాడు.

అట్టచివరి బొమ్మ

భీముడు ద్రోణుడికి దగ్గిరిగా వెళ్లి, "అశ్వత్థామ చచ్చె," అని గట్టిగా అరిచాడు. ద్రోణుడి గుండె గుబుక్కుమన్నది. కాని భీముడి మాట నమ్మలేక ఆయన ధర్మరాజుతో, "ఈ మాట నిజమేనా?" అన్నాడు. ధర్మరాజుకు అబద్ధం ఆడటం సమ్మతం కాకపోయినా మిగిలినవారి ప్రోద్బలంచేత, "అశ్వత్థామ చచ్చిన మాట నిజమే!" అని గట్టిగా అని, "అశ్వత్థామ పేరు గల యేనుగు," అని మెల్లిగా గొణిగాడు. నిజానికి ఆ పేరు గల ఏనుగు ఒకటి అదివరకే చచ్చిపోయింది.



ద్రోణుడికి మతిపోయినట్టయింది. ఇంతలో ధృష్టద్యుమ్నుడు ఆయనమీదికి వచ్చాడు. ద్రోణుడికి ఒక్క అస్త్రమూ స్ఫురణకు రాలేదు. ఆయన మామూలు బాణాలతోనే ప్రచండమైన యుద్ధం చెయ్యసాగాడు. చివరకు భీముడు ఆయన దగ్గిరికి వెళ్ళి, "నీది బ్రాహ్మణ జన్మ, నీ కొడుకు చచ్చిపడి ఉన్నాడు, ఇంకా ఈ హత్యాకాండ మానవు! నీకు లజ్జ లేదా!" అన్నాడు.

ఆ మాటలతో ద్రోణుడు శస్త్రసన్యాసం చేసి, రథంమీద కూర్చుని, యోగనిష్ఠలో ఉండిపోయాడు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు కత్తి పట్టుకునివచ్చి, ఒక చేత్తో ద్రోణుడి తెల్లని జుట్టు పట్టుకుని, రెండవ చేత్తో మెడ నరికేశాడు. "వద్దు, వద్దు!" అని అర్జునుడూ, సాత్యకీ పెట్టిన కేకలను అతను లక్ష్యపెట్టలేదు.

ఈవిధంగా ద్రోణుడు తాను కౌరవసేనలకు సర్వసేనాని అయిన అయిదో రోజు అపరాహ్ణం ధృష్టద్యుమ్నుడి చేతిలో చచ్చిపోయాడు. ఆయన చావుతో పాండవ పక్షంలో ముసలం పుట్టినట్టయింది. అర్జునుడూ, సాత్యకీ మండిపడిపోయి ధృష్టద్యుమ్నుణ్ణి చంపబోయినంత పని చేశారు. భీముడూ, కృష్ణుడూ ద్రోణ హత్యను సమర్ధించారు. వారి మధ్య ఎలాగో రాజీ జరిగింది.

ఇక, ద్రోణుడి చావుతో కౌరవసేనలో కలిగిన సంక్షోభం వర్ణనాతీతం. మహారథులు సయితం పులిని చూసిన లేళ్ళలాగా పారిపోసాగారు. ఇలా బెదిరి పారిపోతున్న కౌరవసేనలకు ఎదురుగా అశ్వత్థామ వచ్చాడు. అతనికి మొదట ఏమీ అర్థంకాలేదు. కృపాచార్యుడు అతనికి జరిగిన సంగతి తెలిపాడు.

తన తండ్రి చచ్చిపోయినందుకు అశ్వత్థామ అంతగా చింతించలేదు; అంతటి యోధుణ్ణి ధృష్టద్యుమ్నుడు జుట్టు పట్టుకుని తల నరికాడంటే అది అతనికి భరించరాని అవమానంగా తోచింది.

ఆ క్రోధోద్రేకంలో అతను పాండవులపై తనవద్ద నున్న నారాయణాస్త్రం ప్రయోగించాడు. నారాయణాస్త్రం నేలపై నిలిచిన వారినీ, యుద్ధవిముఖులనూ చంపదు; వాహనాలలో ఉండేవారినీ యుద్ధోద్రేకం కల వారినీ మాత్రమే చంపుతుంది. ఈ సంగతి తెలిసి కృష్ణార్జునులూ, మిగిలిన యోధులూ రథాలనుంచి దిగి నేలపై నిలబడి నారాయణాస్త్రానికి నమస్కారం చేశారు. ఒక్క భీముడే మూర్ఖించి రథం దిగలేదు. అతన్ని నలుగురూ బలవంతంగా పట్టి కిందికి లాగారు. నారాయణాస్త్రం అణగిపోయింది.

ఇంత మహాస్త్రం ఏ ఒక్క యోధుణ్ణీ బలి తీసుకోకుండా అంతరించినందుకు అశ్వత్థామ హతాశుడయాడు. అంతలో సూర్యాస్తమయమయింది. పదిహేనో రోజు యుద్ధం ముగించి ఉభయపక్షాలవారూ తమ శిబిరాలకు వెళ్ళిపోయారు.

ఈరోజు యుద్ధంలో అర్జునుడికి ఒక విచిత్రమైన అనుభవం కలిగింది. ఒక శూలపాణి అయిన వ్యక్తి తనముందు నడుస్తూ అంతులేని సైన్యాలను చంపుతూ వచ్చాడు. తానే వారినందరినీ చంపుతున్నట్టు అందరూ అనుకున్నారు. ఆ విధంగా తన ముందు నడిచినది సాక్షాత్తూ శివుడేనని అర్జునుడు వ్యాసుడిద్వారా తెలుసుకున్నాడు.



అట్టచివరి బొమ్మ

భారత యుద్ధంలో పదిహేనో రోజు ముగిసింది. ద్రోణుడుపోయాడు. కౌరవులు ఆ సాయంకాలం కుంగిపోయిన మనస్సులతో తమ శిబిరాలకు తిరిగి పోయారు.

ఆ రాత్రి గడిచి తెల్లవారింది. కౌరవ యోధులంతా ఒకచోట కూడారు. కొత్త సేనానాయకుణ్ణి ఏర్పరచుకోవలిసి ఉంది. అశ్వత్థామ కర్ణుణ్ణి సూచించాడు. ఈ మాట దుర్యోధనుడికి ఎంతో నచ్చింది. అతను కర్ణుడితో, "మిత్రమా, భీష్మ ద్రోణులు పడిపోయారు. వారు అతిరథులే కాని వృద్ధులు, అర్జున పక్షపాతులు. నీవు వారికన్న శక్తిమంతుడవు, నా పట్ల పక్షపాతివి. అందుచేత నీవు నా బలాలకు సేనానాయకత్వం వహించి ఈ యుద్ధంలో నాకు విజయం చేకూర్చు," అని కోరాడు.

కర్ణుడికి శాస్త్రోక్తంగా అభిషేకం జరిగింది. సూర్యోదయంవేళకు అతని నాయకత్వం కింద కౌరవసేనలు యుద్ధానికి బయలుదేరాయి. అదే సమయానికి పాండవసేనలు కూడా వ్యూహంగా ఏర్పడి వచ్చాయి. పదహారో రోజు యుద్ధం ప్రారంభమయింది.

ధర్మరాజుతో యుద్ధంచేసి దుర్యోధనుడు పెద్ద దెబ్బతిన్నాడు. కర్ణుడు మంచి యుద్ధమే చేశాడు కాని అర్జునుడు అంతకుమించి యుద్ధం చేశాడు. ఆరోజు చీకటిపడి ఉభయపక్షాలవారు తమ శిబిరాలకు వెళ్ళేటప్పుడు పాండవులు ఉత్సాహంతో వెళ్లారు, కౌరవులు దెబ్బతిని వెళ్ళారు.

ఆ రాత్రి గడవగానే కర్ణుడు దుర్యోధనుడితో, "ఇవాళ నేను అర్జునుణ్ణి చంపటమో, లేక అతడి చేతిలో చావటమో జరిగితీరాలి. అతడికీ నాకూ గల తేడా చెబుతాను. శత్రుసంహారంలోనూ, అస్త్రలాఘవంలోనూ, దూరప్రసారం లోనూ నాకు అర్జునుడు చాలడు. బలపరాక్రమాలలోనూ, శౌర్యంలోనూ, లక్ష్యశుద్ధిలోనూ నాదే పై చెయ్యి. అతడికి గాండీవం ఉంటే నా వద్ద విజయమనే దివ్యమైన బాణం ఉన్నది. మూడువిషయాలలో మటుకు అర్జునుడు నన్ను మించుతాడు. అతడి వింటి నారి దివ్యమైనది, అతడికి అక్షయతూణీరాలున్నాయి, కృష్ణుడివంటి అశ్వహృదయం తెలిసిన సారథి ఉన్నాడు. మన పక్షాన అలా అశ్వ హృదయం తెలిసినవాడు శల్యుడొకడే ఉన్నాడు. అతను నాకు సారథ్యం చేసే పక్షంలో నేను అర్జునుణ్ణి ఇవాళ తప్పక చంపుతాను," అన్నాడు.



మహాభారతం



మహాభారతం

అ ట్ట చి వ రి బొ మ్మ

దుర్యోధనుడు శల్యుణ్ణి సమీపించి ఎంతో వినయంతో, "మహానుభావా, కర్ణుడన్న మాట విన్నారుగదా. అతనికి సారథిగా పనిచెయ్యండి," అన్నాడు.

ఈ మాట విని శల్యుడికి మండిపోయింది. ఆయన చేతులు ఆడిస్తూ, "రాజా, ఎందుకు నన్ను అవమానిస్తున్నావు? ఉత్తమ రాజర్షి వంశంలో పుట్టి మహారథుణ్ణి అనిపించుకున్నవాణ్ణి, ఈ సూతుడికి పనిచేస్తానా? ఇలా అవమానిస్తే నే నసలు యుద్ధమే చేయను. సెలవు!" అని చివాలున లేచాడు.

శల్యుణ్ణి దుర్యోధనుడు ఆపి, "మహాత్మా, ఆగ్రహించవద్దు. కర్ణుడు నీకన్న ఎక్కువని నేను అనలేదు. కర్ణుడు అర్జునుణ్ణి మించినవాడైతే, నీవు అశ్వహృదయంలోనూ, భుజబలంలోనూ కృష్ణుణ్ణి ఇంకా మించినవాడవు!" అన్నాడు.

"అలా మాట్లాడితే నేను హర్షిస్తాను. నీవు కోరినట్టయితే నేను కర్ణుడికి సారథిగాకూడా పనిచెయ్యగలను. కాని నేను కర్ణుడి మంచి కోరి ఏమైనా చెబితే అది మీకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. నన్ను క్షమించాలి," అన్నాడు శల్యుడు.

తరవాత ఆయన కర్ణుడి రథం ఆయత్తం చేసి తెచ్చాడు.

కర్ణుడు ఉత్సాహంగా శల్యుడితో, "ఏమోయ్, మన రథాన్ని అర్జునుడికేసి పోనియ్యి. ఇప్పుడే అతన్నీ, మిగిలిన పాండవులనూ చంపేస్తాను," అన్నాడు.

"అర్జునుడి గాండీవం చప్పుడు పిడుగుపాటులాగా వినిపించినప్పుడు కూడా ఈమాటే అంటావా?" అని శల్యుడు అడిగాడు.


కర్ణుడి కీమాటలు శూలాలతో పొడిచినట్టుగా ఉన్నాయి. అతను తన యోధులతో, "ఇదుగో వినండి! నాకు అర్జునుణ్ణి ఎవరు చూపిస్తారో వారికి ఎంత ధనం కోరితే అంత ఇస్తాను!" అన్నాడు.

శల్యుడు, "ఓరి పిచ్చివాడా? నీవేం కుబేరుడివా? ఎందుకలా ధనదానం చేస్తావు? ఎవరు చూపకుండానే అర్జునుడు నీకు కనిపిస్తాడు!" అన్నాడు.

"ఓరీ శల్యుడా! నా ఘనత నీబోటి నీచుడికి ఎలా తెలుస్తుంది? అటే మాట్లాడక ఊరుకో!" అన్నాడు కర్ణుడు.

కర్ణుడి రథం కౌరవవ్యూహముఖాన్ని చేరుకున్నది. అవతల పాండవసేన కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్నది. శల్యుడు కర్ణుడికి అర్జునుడి రథం చూపిస్తూ, "అర్జునుణ్ణి చూపమని తెగ అడుగుతుంటివే, అడుగో అర్జునుడు!" అన్నాడు.

CHANDAMAMA (Telugu) APRIL 1961 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరిబొమ్మ

ఆరోజు యుద్ధం ఆరంభమవుతూనే కర్ణుడు ధర్మరాజుతో పోరాడి ఓడించి విరథుణ్ణి చేశాడు. ధర్మరాజు పారిపోసాగాడు. కర్ణుడు ఆయనను పట్టుకోబోతూ, కుంతికి ఇచ్చిన మాట స్మరించి ఆ ప్రయత్నం మాని, ధర్మరాజుతో, "నీవు క్షత్రియుడివి కావు. యజ్ఞ యాగాదులు చేసుకుంటూ వేదాలు పఠించవలిసిన వాడివి. యుద్ధంచేసే క్షత్రియుడివైతే ప్రాణాలకు వెరిచి పారిపోతావా?" అని ఎత్తిపొడిచాడు.


ఈ సంగతి తెలిసి భీముడికి పట్టరాని ఆగ్రహం వచ్చి కర్ణుడిపైకి వచ్చాడు. శల్యుడు కర్ణుడితో, "చూశావా? భీముడు కాలరుద్రుడిలాగా వస్తున్నాడు. ఇప్పుడతని ఎదట పడటం క్షేమంకాదు," అని పిరికిమందు పోశాడు. కాని కర్ణుడు శల్యుడితో, "ఈ భీముణ్ణి ఇప్పుడు నేను చంపటమో, ఓడించటమో జరిగితే అర్జునుడు నా పైకి వస్తాడు. నా కోరిక నెరవేరుతుంది," అన్నాడు.

అయితే కర్ణుడి కోరిక నెరవేరలేదు. భీముడు కర్ణుణ్ణి రథంలో మూర్ఛపోగొట్టాడు, శల్యుడు రథాన్ని మళ్ళించుకుని దూరంగా వెళ్ళిపోయాడు. ఆ విజయగర్వంతో భీముడు కౌరవ వీరులపైబడి చిత్రవధ సాగించాడు. వివిత్సుడు, క్రాథుడు, మొదలైన ధృతరాష్ట్ర పుత్రులు భీముడి చేతిలో చచ్చారు.

దుర్యోధనుడికి సంతోషం కలగగలందులకు అశ్వత్థామ ఒక ఘోర ప్రతిజ్ఞ చేశాడు—ఆరోజు ధృష్టద్యుమ్నుణ్ణి చంపక తన కవచం విప్పనన్నాడు. అతను ధృష్టద్యుమ్నుణ్ణి ఎదుర్కొని చంపినంతపనీ చేశాడుకూడా. సమయానికి అర్జునుడు వచ్చి అశ్వత్థామకు అడ్డుపడి ధృష్టద్యుమ్నుడి ప్రాణాలు కాపాడాడు.

ఇలా ఉండగా కర్ణుడు ఆనాటి సాయంకాలం మరొకసారి ధర్మరాజుతో తలపడ్డాడు. ధర్మరాజూ, ఆయనకు చక్రరక్షకులుగా ఉన్న నకుల సహదేవులూ కర్ణుడి చేతిలో చావుదెబ్బలు తిన్నారు. ఆ విషమ పరిస్థితిలో శల్యుడు కర్ణుడితో, "ఈ ధర్మరాజుతో పోట్లాడితే నీకేమిలాభం? అర్జునుడితో పోట్లాడాలి. అదీగాక అవతల దుర్యోధనుడు భీముడి చేతిలో చిక్కి అపాయస్థితిలో ఉన్నాడు. అతన్ని రక్షించటం మన కర్తవ్యం," అన్నాడు.

ధర్మరాజు శిబిరానికి వెళ్ళిపోయి, శరీరంలో గుచ్చుకున్న బాణాలు ఊడబెరికి, మనసులో గుచ్చుకున్న మాటలను పెరకలేక బాధపడసాగాడు.



మహాభారతం

అట్ట చివరి బొమ్మ

ధర్మరాజు జాడ ఎక్కడా కనపడకపోవటం గమనించి, అర్జునుడు భీముణ్ణి సమీపించి, "అన్న ఎక్కడ?" అని అడిగాడు. ఆయన శిబిరానికి వెళ్ళి ఉండవచ్చుననీ, కర్ణుడిచేత బాగా గాయపడ్డాడనీ భీముడు చెప్పాడు.

కృష్ణార్జునులు రథంలో శిబిరానికి వెళ్ళారు. ధర్మరాజు శిబిరంలో ఒంటరిగా పక్కమీద పడుకుని ఉన్నాడు. ఆయన వారిని చూసి సంతోషించి, "ఆ కర్ణుణ్ణి చంపి వచ్చారుగదా! వాడు నా పైకి యుద్ధానికి వచ్చి ఎన్ని అనరాని మాటలన్నాడు; ఎంత అవమానం చేశాడు! అర్జునా, ఆ కర్ణుణ్ణి ఎలా చంపావో అదంతా నాకు వివరంగా చెప్పు!" అని ఆత్రంగా అడిగాడు.


"నీవు కనబడక మనసు వికలమై, నిన్ను చూడవచ్చాను. నేనింకా కర్ణుడితో తలపడలేదు," అని అర్జునుడు సమాధానం చెప్పాడు.

ధర్మరాజుకు కోపం వచ్చింది. "కర్ణున్ని చంపలేక వచ్చావులాగుంది! నిన్ను నమ్ముకుని మేమీ శత్రువులవాత పడ్డాం! 'నేను కర్ణుణ్ణి చంపలేను,' అని నీవు ద్వైతవనంలోనే చెబితే ఇంత దుర్గతి రాకపోను! నీకు తోడు ఆ గాండీవం కూడా దేనికి? కృష్ణుడికిగాని మరొకరికిగాని ఇచ్చెయ్యి!" అన్నాడు ధర్మరాజు.

తన గాండీవాన్ని మరొకరి కివ్వమని ఎవరు అన్నప్పటికీ వాళ్ళను చంపేటట్టు అర్జునుడు రహస్యంగా శపథం చేసుకుని ఉన్నాడు. అందుచేత అతను కత్తి దూసి ధర్మరాజును చంపబోయాడు.

కృష్ణుడు అడ్డుపడి అది అవివేకమని చెప్పాడు. "నా శపథం మాట ఏమిటి?" అని అర్జునుడన్నాడు. "మానవంతులకు అవమానమే చావుకన్న హెచ్చు. అందుచేత మీ అన్నను తూలనాడు," అని కృష్ణుడు సలహా ఇచ్చాడు. ఆ ప్రకారమే అర్జునుడు ధర్మరాజును జూదరి అనీ, తమ కష్టాలన్నిటికీ మూల కారణమనీ నిందించాడు. తన అన్నను నిందించినందుకు అతని మనస్సు క్షోభించింది. అందుచేత అతను ఆ కత్తితోనే ఆత్మహత్య చేసుకోబోయాడు.

కృష్ణుడు మళ్ళీ అడ్డుపడి, "మానధనులకు ఆత్మస్తుతి ఆత్మహత్యతో సమానం. అందుచేత నిన్ను నీవు పొగడుకో. నీ చింత నశిస్తుంది," అని సలహా ఇచ్చాడు. అర్జునుడు తనను తాను పొగడుకున్నాడు. ఆ విధంగా ధర్మరాజుకూ, అర్జునుడికీ మధ్య రాజీ జరిగింది.



ఠ

మహాభారతం

అట్టచివరిబొమ్మ

తరవాత కృష్ణార్జునులు తిరిగి యుద్ధభూమికి బయలుదేరారు. కృష్ణుడు అర్జునుడితో, "పదిహేడు రోజుల నుంచీ యుద్ధం సాగుతున్నది. ఉభయ సేనలూ క్షీణించాయి. కౌరవపక్షాన మిగిలిన మహారథులు అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, కర్ణుడు, శల్యుడు మాత్రమే. ఈ అయిదుగురినీ చంపినట్టయితే నీవు జయించినట్టే," అన్నాడు.

ఈ లోపుగా యుద్ధరంగంలో భీముడు ఒంటరిగా అతి దారుణమైన శత్రునాశం చేస్తున్నాడు. అతన్ని శత్రుయోధులు చుట్టుముట్టారు. భీముణ్ణి ఎలాగైనా చంపమని దుర్యోధనుడు శకునిని పురమాయించాడు. శకుని భీముడితో పోరాడి, చావుదెబ్బతిని ప్రాణాలతో తప్పించుకున్నాడు.

భీముడి దెబ్బకు తట్టుకోలేక పారిపోయి ధృతరాష్ట్రుడి కొడుకులు కర్ణుణ్ణి ఆశ్రయించారు. కర్ణుడు గొప్పగా యుద్ధంచేశాడు. కృష్ణుడు అర్జునుడి రథాన్ని కర్ణుడికేసి పోనిచ్చాడు. కాని వారిద్దరికీ ద్వంద్వయుద్ధం సాసగలేదు, ఉభయ పక్షాలమధ్య దొమ్మియుద్ధమేసాగింది.


కాని ఈ యుద్ధంలో దుశ్శాసనుడు విజృంభించి పోరాడుతూ ఉండటం గమనించి భీముడు, లేడిపైబడే సింహంలాగా అతన్ని ఎదుర్కొన్నాడు. ఇద్దరూ ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకునే ప్రయత్నంలో పోరాడారు.

మొదట్లో దుశ్శాసనుడు తన బాణాలతో భీముణ్ణి బాగానే నొప్పించాడు. కాని ఒకరిమీద ఒకరు శక్తులూ, గదలూ ప్రయోగించు కోవటంలో భీముడు విసిరిన ప్రచండమైన గద దుశ్శాసనుడి రథాన్ని చూర్ణంచేసింది. అతని తలకు గద తగిలి గాయమైంది. దుశ్శాసనుడు బాధతో పొరలసాగాడు.

వెంటనే భీముడు పెడబొబ్బలుపెట్టి, రథంమీది నుంచి దూకి దుశ్శాసనుడి వద్దకు పరిగెత్తుతూ, ఈ దుశ్శాసనుడు నిండు సభలో ద్రౌపదికి చేసిన అవమానం తలుచుకుని మండిపడుతూ, "ఓరీ, కర్ణా! ఓరీ, దుర్యోధనా! ఈ దుశ్శాసనుణ్ణి చంపబోతున్నాను. చాతనయితే రక్షించుకోండి," అని కేకపెట్టాడు.

భీముడు దుశ్శాసనుడి కంఠం మీద ఒక కాలువేసి తొక్కిపట్టి, కత్తితో అతడి గుండె చీల్చి, రక్తంతాగి, ఆ కత్తితోనే అతడి తల నరికేసి, "పాపాత్ముడా, మృత్యుదేవత నిన్ను కాపాడింది. ఇంక నిన్నేమీ చేయలేను!" అన్నాడు.

CHANDAMAMA (Telugu) JULY 1961 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ

దుశ్శాసనుణ్ణి చంపి అతడి రక్తం తాగిన భీముణ్ణిచూసి అందరికీ మతులుపోయాయి.

భీముడు భయంకరమైన ఆ అవతారంతో కృష్ణార్జునులను సమీపించి, "దుశ్శాసనుడిపై చేసిన ప్రతిజ్ఞ తీర్చుకున్నాను. దుర్యోధనుడిపై ప్రతిజ్ఞకూడా తీర్చుకుంటాను," అన్నాడు.

ఈ లోపుగా యుధామన్యుడనేవాడు కర్ణుడి తమ్ముడైన చిత్రసేనుణ్ణి చంపాడు. కర్ణుడి కొడుకు వృషసేనుడు అత్యంత శౌర్య పరాక్రమాలతో పోరాడుతూ నకులుణ్ణి విరథుణ్ణి చేసేశాడు. అర్జునుడు వరసగా బాణాలతో వృషసేనుడి విల్లూ, చేతులూ, తలా నరికేశాడు.

కర్ణుడు పొంగివచ్చే దుఃఖంతో తన కొడుకు రథాన్ని సమీపించి, వాడి శవాన్ని చూసుకుని, అర్జునుడికేసి వచ్చాడు. ఆ ఇద్దరికీ ద్వంద్వ యుద్ధం జరగబోతున్నదని తెలియగానే మిగిలినవాళ్ళు ఇతర ప్రసక్తులు మానేసి, ఎవరు గెలుస్తారన్న వాదోప వాదాలలోకి దిగారు.

కర్ణ శల్యులూ, కృష్ణార్జునులుకూడా తమ తమ శంఖాలను ఊదారు. కృష్ణుడూ, శల్యుడూ ఒకరినొకరు కొరకొరా చూసుకున్నారు. కర్ణుడు నవ్వుతూ శల్యుడితో, "ఈ యుద్ధంలో నేను ఓడిపోతే నీ వేంచేస్తావు? అబద్ధమాడకుండా చెప్పు," అన్నాడు.

"అర్జునుడు నిన్ను చంపేమాటుంటే నేనా కృష్ణార్జునుల నిద్దరినీ చంపేస్తాను," అన్నాడు శల్యుడు. అలాటి ప్రశ్నే అర్జును డడిగితే దానికి సమాధానంగా కృష్ణుడు, "అర్జునా, ప్రపంచం తలకిందులైనా నిన్ను కర్ణుడు చంపలేడు. ఒకవేళ అలా చంపటమే జరిగితే, నా వట్టి చేతులతో ఆ కర్ణుణ్ణీ, శల్యుణ్ణీ చంపేస్తాను," అన్నాడు.

తరవాత కర్ణార్జునులకు భయంకరమైన యుద్ధం ప్రారంభమయింది.


కర్ణుడి వద్ద అతి భయంకరమైన సర్పముఖ బాణం ఒకటి ఉన్నది. అతను దాన్ని ప్రయోగించే సరికి కృష్ణుడు అర్జునుడి రథాన్ని భూమిలోకి తొక్కాడు. గుర్రాలు మోకరించాయి. ఆ బాణం అర్జునుడి కిరీటాన్ని మాత్రం పడగొట్టింది. తరవాత కృష్ణుడు రథం దిగి తన భుజంతో రథాన్ని పైకి ఎత్తాడు. రానురాను యుద్ధంలో అర్జునుడు కర్ణుణ్ణి మించసాగాడు. కర్ణుడు బాగా దెబ్బతిన్నాడు. సమయానికి అతనికి భార్గవాస్త్రం జ్ఞాపకం రాకుండా పోయింది. దానికి తగినట్టుగానే అతని రథచక్రాలు భూమిలోకి దిగబడ్డాయి.

కర్ణుడు అర్జునుణ్ణి, రథం పైకి లాగటానికి రెండు ఘడియల వ్యవధి అడిగాడు, అంతదాకా బాణం వెయ్యవద్దన్నాడు. కాని కృష్ణుడు అర్జునుడితో, "వీడు ఎప్పుడూ అధర్మాన్నే బలపరిచాడు. వీడిపట్ల ధర్మం పాటించ నవసరంలేదు," అన్నాడు.

కర్ణుడు ఆ స్థితిలోనే తీవ్రంగా అర్జునుణ్ణి కొట్టి నొప్పించాడు. అర్జునుడి చేతి గాండీవం పడిపోయింది. అదే సమయమనుకుని కర్ణుడు తన రథాన్ని పైకి లాక్కోవటానికి దిగాడు.

"వీడు మళ్ళీ రథం ఎక్కే లోపుగా వీడి తల తెగవెయ్యి," అని కృష్ణుడన్నాడు. అర్జునుడు ఒక పదునైన బాణం కర్ణుడి పైవేశాడు, కర్ణుడి తల తెగి పడిపోయింది.

CHANDAMAMA (Telugu) AUGUST 1961 Regd. No. M. 54



మహాభారతం

అట్టచివరి బొమ్మ

కర్ణుడు పడిపోగానే పాండవ సైనికులూ, కృష్ణార్జునులూ శంఖాలూదారు. ఒకరి నొకరు కౌగలించుకుని గంతులు వేశారు. కౌరవయోధులు ఒక్కొక్కరే వచ్చి కర్ణుడి శవాన్ని చూసి దుఃఖించారు. భీముడు సింహగర్జనలు చేస్తూ, మల్ల చరుస్తూ, భయంకరంగా నాట్యం చేశాడు.

దుర్యోధనుడు తన యోధులు బెదిరి ఉండటం చూసి, తానొక్కడే పాండవ వీరులతో పోరాడ యత్నించాడు. శల్యుడు వచ్చి, "దైవనిర్ణయం ఈ విధంగా ఉన్నది. ఏం చేస్తాం? సూర్యాస్తమయం కావస్తున్నది. ఈ రోజుకు యుద్ధం కట్టిపెట్టి శిబిరానికి పోదాం," అన్నాడు.

కృష్ణార్జునులు ధర్మరాజు వద్దకు వెళ్ళి కర్ణవధ గురించి చెప్పేసరికి ఆయన బయలుదేరి వచ్చి, యుద్ధరంగంలో పడి ఉన్న కర్ణుణ్ణి చూశాడు.

కృపుడు దుర్యోధనుడి వద్దకు వచ్చి, "ఎవరి కోసం మనం విజయాన్ని కోరామో వారంతా చచ్చారు. ఇప్పటికైనా మనం సంధి చేసుకోవటం మంచిది," అని చెప్పాడు. దుర్యోధనుడు ఆయనతో, "సంధి వల్ల మనకు కలిగే సుఖం లేదు, రాజ్యమూ లేదు. అంతకంటె చివరిదాకా పోరాడి చచ్చి వీరస్వర్గం పొందటం మేలు," అన్నాడు.

కర్ణుడు పోయాడు గనక కొత్త సేనానాయకుడు కావాలి. అశ్వత్థామ నడిగితే శల్యుణ్ణి సూచించాడు. శల్యుడు సమ్మతించాడు. ఆ రాత్రి కౌరవులు నిద్రపోయి మర్నాడు శల్యుణ్ణి సేనానాయకుడుగా అభిషేకించి, ఆఖరు రోజు యుద్ధానికి బయలుదేరారు.

శల్యుడు అతి భయంకరమైన యుద్ధం చేశాడు. ఒకసారి ఆయనకూ భీముడికీ మధ్య గదాయుద్ధం జరిగింది. ఇద్దరూ మూర్ఛపోయారు. భీముడికి స్పృహ వచ్చేలోపుగా కృపుడు వచ్చి, శల్యుణ్ణి తన రథంమీద పెట్టుకుని తీసుకుపోయాడు.


తరవాత శల్యుడు ధర్మరాజుతో తన చివరి యుద్ధం చేశాడు. ఈ యుద్ధంలో ధర్మరాజు శల్యుడిపైన ఒక శక్తి ప్రయోగించి ఆయన ప్రాణాలు తీశాడు. శల్యుడు చచ్చిపోగానే శల్యుడి తమ్ముడొకడు ధర్మరాజుతో తలపడి తానుకూడా చచ్చిపోయాడు. అప్పటికి మధ్యాహ్నమయింది.

కౌరవ సైన్యంలో హాహాకారాలు బయలుదేరాయి. సైన్యం చెల్లాచెదరై పరిగెత్త సాగింది. సాత్యకి ఆ సైన్యాన్ని వెంబడించి నిర్మూలించ నారంభించాడు.

ఇంతలో కౌరవయోధులలో ఒకడైన సాళ్వుడు విజృంభించి యుద్ధానికి వచ్చి, సాత్యకితో యుద్ధం చేసి తన ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఉభయ పక్షాలా చావగా మిగిలిన యోధులు దొమ్మియుద్ధం సాగించారు. ఆ యుద్ధంలో దుర్యోధనుడు గొప్ప శౌర్యపరాక్రమాలు ప్రదర్శించాడు.

శకుని తన సేనతో సహా పాండవసేనలను వెనుకనుంచి పీడించసాగాడు. ఇది చూసి సహదేవుడు కొంత బలంతో వెళ్ళి శకునిపై పడ్డాడు. రెండు గడియలపాటు యుద్ధం జరిగాక శకుని, చావగా మిగిలిన తన బలాలతో యుద్ధరంగం నుంచి పారిపోయాడు.

CHANDAMAMA (Telugu) SEPTEMBER 1961 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ

శకుని యుద్ధరంగం నుంచి పారిపోయినట్టే పోయి తన అశ్వదళంతో ధృష్టద్యుమ్నుడి సేన యొక్క పార్శ్వంపైన పడ్డాడు. తిరిగి యుద్ధ జ్వాలలు లేచాయి. శకుని వెంట ఉన్న అశ్వ దళంలో చాలా భాగం నాశనమై, ఏడువందల అశ్వికులే మిగిలారు.

సముద్రమంత కౌరవ సైన్యం గోష్పాదమంత అయింది. అర్జునుడు దానిని తుడిచిపెట్ట సాగాడు. ఉభయ పక్షాల చావగా మిగిలిన యోధుల మధ్య తీవ్ర పోరాటం జరిగింది. అందులో దుర్యోధనుడు దెబ్బ తిని, విరథుడై, ఒక గుర్రమెక్కి దూరంగా వెళ్ళిపోయాడు.

కృతవర్మ కృపాశ్వత్థామలూ, శకునీ ఒక చోట చేరి, సంజయుణ్ణి కూడా తమ వెంట అయిదవ యోధుడుగా పెట్టుకుని పాండవ సైన్యంతో పోరసాగారు. కాని సాత్యకి వారిని తలపడి, సంజయుణ్ణి మూర్ఛపోగొట్టి ప్రాణాలతో పట్టుకున్నాడు.

ఇంకొకవంక ధృతరాష్ట్రుడి కొడుకులలో చావగా మిగిలినవాళ్ళు భీముణ్ణి ఎదిరించి, అతని చేతిలో అందరూ చచ్చారు. ఒక్క సుదర్శనుడనేవాడు మాత్రం మిగిలాడు.

కృష్ణార్జునులు ఈ దశలో మిగిలి ఉన్న కౌరవబలాల లెక్కలు కట్టారు. దుర్యోధనుడి బలాలలో ఇంకా అయిదువందల గుర్రాలూ, రెండువందల రథాలూ, ఒకవంద ఏనుగులూ, మూడువేలమంది పదాతులూ మిగిలారు. యోధులలో దుర్యోధనుడూ, సుదర్శనుడూ కాక కృపాశ్వత్థామలూ, కృతవర్మా, సుశర్మా, శకునీ, అతని కొడుకు ఉలూకుడూ మిగిలారు. భీమార్జున సహదేవులు ఈ యోధుల నెదిరించారు. ఆ యుద్ధంలో అర్జునుడు సుశర్మను చంపాడు. భీముడు సుదర్శనుడి తల తెగవేశాడు. శకునినీ, ఉలూకుణ్ణీ సహదేవుడు చంపాడు. మరిరెండు ఘడియలలో దుర్యోధనుడి సైనిక బలాలన్నీ నిశ్శేషమయాయి.

పద్దెనిమిదవ రోజున భారత యుద్ధం ముగిసింది. కౌరవసైన్యం పూర్తిగా నాశనమయ్యే సరికి పాండవులకు మిగిలిన బలాలు: రెండువేల రథాలు, ఏడువందల ఏనుగులు, అయిదు వందల గుర్రాలు, పదివేల పదాతులు. శత్రుశేషాన్ని నిర్మూలించుకుంటూ యుద్ధరంగంలో తిరుగుతున్న ధృష్టద్యుమ్నుడు సాత్యకి వెంట బందీగా ఉన్న సంజయుణ్ణి చూసి, "వీణ్ణి ఎందుకు పట్టుకున్నావు? చంపెయ్యి!" అన్నాడు. సాత్యకి సంజయుణ్ణి చంపబోతుండగా వ్యాసుడు వచ్చి విడిపించాడు.

సంజయుడు ఆయుధాలూ, కవచమూ తీసేసి నగరానికి పోతూ ఒక పెద్ద మడుగు దగ్గిర గదాహస్తుడై కంట తడిపెట్టుతూ కూర్చుని ఉన్న దుర్యోధనుణ్ణి చూశాడు. దుర్యోధనుడు సంజయుణ్ణి ప్రశ్నించి, తన పక్షాన కృప కృతవర్మాశ్వత్థామలు మాత్రం మిగిలినట్టు తెలుసుకున్నాడు. "సంజయా, అపజయంపొంది నా బోటి వాడు జీవించి ఉండలేడు. నే నింకా ప్రాణాలతో ఉన్నానని మా తండ్రితో చెప్పు," అంటూ దుర్యోధనుడు మడుగులోకి దిగిపోయాడు.



అట్ట చివరి బొమ్మ

దుర్యోధనుడు మడుగులో ప్రవేశించాక సంజయుడు అక్కడినుంచి బయలుదేరాడు. కొద్దిసేపటికి ఆయనకు కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా ఎదురుపడి, దుర్యోధను డెక్కడ అని అడిగారు. దుర్యోధనుడు మడుగులో దాగిన సంగతి సంజయుడి వల్ల విని అశ్వత్థామ ఏడుస్తూ, "మే మింకా బతికి ఉన్నామని అతనికి తెలియదుగాబోలు. మేము ముగ్గురమూ, తానూ కలిసి వైరులను ఓడించి ఉందుమే," అన్నాడు.

తరవాత వారు సంజయుణ్ణికూడా ఒక రథంలోకి ఎక్కించుకుని శిబిరాలకు వచ్చారు. సూర్యాస్తమయ మవుతున్నది. చావగా మిగిలిన భటులూ, వృద్ధ సైనికులూ స్త్రీ జనాన్ని హస్తినాపురానికి తీసుకుపోతున్నారు. నిర్జనమైపోయిన శిబిరంలో ఉండటానికి మనస్కరించక కృప కృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుడు దాగివున్న మడుగుకేసి వెళ్ళారు.

యుద్ధంలో తమకు జయం లభించినందుకు ధర్మరాజూ, ఆయన తమ్ములూ చాలా సంతోషించారు. దుర్యోధనుణ్ణి చంపే ఉద్దేశంతో వారు యుద్ధరంగమంతా తిరిగి, అతన్ని ఎక్కడా కానక తమ శిబిరాలకు తిరిగివెళ్ళారు.

తరవాత కృప కృతవర్మాశ్వత్థామలు మడుగు దగ్గిరికి వచ్చి ఎలుగెత్తి, "రాజా, బయటికి రా. నీ శత్రువులైన పాండవులతో యుద్ధంచెయ్యి. నీకు మేము ముగ్గురమూ అండగా ఉంటాం. గెలిస్తే రాజ్యం, చస్తే వీరస్వర్గం!" అని హెచ్చరించారు.

దుర్యోధనుడు "మనం అలిసిపోయి ఉన్నాం. ఈ రాత్రికి విశ్రమించి రేపు పాండవులతో యుద్ధం చేద్దాం," అన్నాడు.

కాని అశ్వత్థామ ఇప్పుడే యుద్ధం చేద్దా మన్నాడు. శత్రుసంహారం చేస్తానని శపథాలు చేశాడు. మడుగులో నుంచి దుర్యోధనుడూ, వెలపల నుంచి అతని మిత్రులూ ఈ విధంగా మాట్లాడుకునే మాటలు కొందరు కటికవాళ్ళ చెవులపడ్డాయి. ఆ కటికవాళ్ళు నిత్యమూ భీముడికి మాంసం ఇచ్చేవాళ్ళు. వారు పాండవ శిబిరానికి వెళ్ళి, భీముడితో ఆ రహస్యం కాస్తా చెప్పేశారు. త్వరలోనే కృష్ణుడూ, ధర్మరాజూ, భీముడూ, మిగిలిన పాండవయోధులూ మడుగు వద్దకు వచ్చారు. వారు రావటం గమనించి కౌరవయోధులు ముగ్గురూ దూరంగా వెళ్ళిపోయారు. ధర్మరాజు దుర్యోధనుణ్ణి సూటిపోటి మాటలాడి రెచ్చగొట్టాడు. అందుకు ఫలితంగా దుర్యోధనుడు తన శత్రువులలో ఏ ఒక్కడితోనైనా గదాయుద్ధం చెయ్యటానికి పూనుకుని మడుగులో నుంచి పైకి వచ్చాడు. భీముడు దుర్యోధనుడితో యుద్ధంచెయ్యటానికి సిద్ధపడ్డాడు.

ఇంతలో బలరాముడు తీర్థయాత్రల నుంచి తిరిగి వచ్చాడు. తన శిష్యులైన భీమ దుర్యోధనులు గదా యుద్ధంలో తమ బలా బలాలను నిర్ణయించబోతున్నారని విని ఆయన కూడా మిగిలినవారితోబాటు ప్రేక్షకుడుగా ఉండటానికి ఒప్పుకున్నాడు. అప్పుడు భీమ దుర్యోధనులు గదాయుద్ధం ఆరంభించారు.



భారతం

భీమ దుర్యోధనుల గదాయుద్ధం సరస్వతీ నది దక్షిణ తీరాన జరిగింది. బలరాముడూ, ధర్మరాజూ, అర్జున నకుల సహదేవులూ, ఇతర రాజులూ వలయంగా ఏర్పడి యుద్ధం చూశారు. గదాయుద్ధానికి ముందు వాగ్యుద్ధం జరిగింది. తరవాత భీమ దుర్యోధనులు ఒకరి నొకరు గదలతో భయంకరంగా కొట్టుకున్నారు. ఒకరినొకరు పడగొట్టారు. భీముడు పడిపోతే మిగిలిన పాండవులు భయపడ్డారు, దుర్యోధనుడు పడిపోయినప్పుడు సంతోషంతో శంఖ నాదాలు చేశారు, ఇద్దరూ సమంగానే పోట్లాడారు.

వారి విధంగా యుద్ధంచేస్తుంటే అర్జునుడు కృష్ణుణ్ణి, "ఈ ఇద్దరిలో ఎవరు అధికులు?" అని అడిగాడు. దానికి కృష్ణుడు, "భీముడికి బలం హెచ్చు, దుర్యోధనుడికి నేర్పు హెచ్చు. న్యాయయుద్ధం చేసి భీముడు దుర్యోధనుణ్ణి ఎన్నటికీ చంపలేడు. మాయచేతనే చంపాలి. దుర్యోధనుడి తొడలు విరగగొట్టుతానని భీముడు ప్రతిజ్ఞచేసి ఉన్నాడుగదా. అన్యాయమైనప్పటికీ భీముడు ఆ పని చెయ్యటం మంచిది. లేకపోతే ఈ యుద్ధంలో సంపాదించుకున్న విజయం కాస్తా వృథా అయి పోవచ్చు," అన్నాడు.

అర్జునుడు ఈ మాట విని భీముడు చూస్తూండగా తన ఎడమతొడ చరుచుకున్నాడు. భీముడికి ఆ సంజ్ఞ అర్థమయింది. అతను అవకాశం చూసుకుని తన ఇనప గదతో దుర్యోధనుడి తొడపైన కొట్టాడు. తొడలు విరిగి దుర్యోధనుడు కుప్పకూలి పోయాడు. భీముడు దుర్యోధనుడి తలను తన్ని, "ఆ నాడు సభలో ద్రౌపదిని చూసి నవ్వినందుకు అనుభవించు," అన్నాడు.

భీముడు దుర్యోధనుడి తలను తన్నటం కొందరికి అధర్మ మనిపించింది. ధర్మరాజు అతనితో, "నీ పగ తీర్చుకున్నావు. ఇక అంతతో పోని. ఈ స్థితిలో ఇతన్ని చూసి మనం విచారించాలి గాని, నవ్వటానికేమున్నది?" అంటూ దుర్యోధనుడితో, "నాయనా, మా మీద ఆగ్రహించకు, నిన్ను నీవు నిందించుకోకు. మనకూ మనకూ ఈ వైరం కలగటం కేవలం విధికృతం. అందరినీ పోగొట్టుకుని మేమూ దీనస్థితిలోనే ఉన్నాం. ధృతరాష్ట్రుడి కోడళ్ళ చేత తిట్లుతినటమే మాకు మిగిలింది," అన్నాడు

భీముడు చేసిన పనికి బలరాముడు మండిపడ్డాడు. "ఛీ, ఛీ! శాస్త్రం తెలియని ఈ మూఢుడు ధర్మయుద్ధం చేసే దుర్యోధనుణ్ణి బొడ్డుకు కిందుగా కొట్టాడు!" అంటూ ఆయన తన నాగలి ఎత్తి భీముడిపైకి వెళ్ళాడు. కృష్ణుడు వెళ్ళి ఆయనను పట్టుకుని శాంతపరుస్తూ, "అన్నా, భీముడు ఈ దుర్యోధనుడి తొడలు విరగగొట్టుతానని ఏనాడో శపథం చేశాడు. ఆ శపథం ఇప్పుడు నెరవేర్చుకున్నాడు. అతనిపై ఆగ్రహించకు," అన్నాడు.

బలరాముడి వాదంతో తృప్తిచెందక అప్పటి కప్పుడే రథమెక్కి, ద్వారకకు ప్రయాణమై వెళ్ళి పోయాడు. అయితే చాలామంది భీముడు చేసిన పనిని శ్లాఘించి అతనిని అభినందించారు.



మహాభారతం

అట్టచివరి బొమ్మ

గదాయుద్ధంలో దుర్యోధనుణ్ణి పడగొట్టినందుకు పాండవపక్ష యోధులు భీముణ్ణి అభినందిస్తూ ఉంటే, కృష్ణుడు వారిని ఊరుకోమనే నెపం మీద దుర్యోధనుణ్ణి ఎత్తి పొడుస్తూ, "పెద్దవాళ్ళందరూ చెప్పిన మాటలు పెడచెవిని బెట్టి ఈ పురుషాధముడు ఈ స్థితికి వచ్చాడు. చచ్చిన వాణ్ణి ఇంకేం చంపుతారు. రథాలెక్కండి. మన దారిన మనం పోదాం," అన్నాడు.

తొడలు తెగి పడి ఉన్న దుర్యోధనుడు ఈ మాటలు విని కోపంతో, చేతుల మీద కొంచెంగా లేచి, "కృష్ణా, నీ కంటె పాపి ఎవడు? భీష్ముణ్ణీ, ద్రోణుణ్ణీ, కర్ణుణ్ణీ, నన్నూ అధర్మ యుద్ధంలోనే గదా ఓడించావు? నా తొడలు కొట్టమని నీవు చెప్పించటం నేను గమనించ లేదనుకున్నావా? నీకు సిగ్గయినా లేదేం?" అన్నాడు.

"నీవు చిన్నతనం నుంచీ పాండవులకు చేయిస్తూ వచ్చిన అన్యాయాలకు, నేను చేయించినవి ప్రతిక్రియలు. నీవు లోభివై పాండవులకు రాజ్యం ఇవ్వకపోబట్టే గదా అనలీ యుద్ధం జరిగింది!" అన్నాడు కృష్ణుడు.

తరవాత పాండవులు దుర్యోధనుడి శిబిరానికి వెళ్ళారు. అది బావురుమంటున్నది. కృష్ణుడు అర్జునుడితో, "గాండీవం తాడు తీసెయ్యి. అక్షయ తూణీరాలు తీసుకుని ముందు నీవు రథం దిగు, తరవాత నేను దిగుతాను," అన్నాడు.


అర్జునుడు రథం దిగాక కృష్ణుడుకూడా దిగిపోగానే రథం భగ్గున మండి క్షణంలో బూడిద అయిపోయింది. అర్జునుడు ఆశ్చర్యంతో, "ఇదేమిటి?" అన్నాడు.

"అస్త్రాలు దీన్ని ఏనాడో దగ్ధం చేశాయి. నేను ఉన్నందువల్ల ఇది ఇంతవాకా తగలబడకుండా నిలిచి ఉంది," అన్నాడు కృష్ణుడు.

పాండవులు దుర్యోధనుడి శిబిరంలో ఉన్న సమస్త సంపదనూ, దాస దాసీ జనాన్నీ అధీనం చేసుకున్నారు. గాంధారీ ధృతరాష్ట్రులను ఊరడించటానికి బయలుదేరుతూ కృష్ణుడు పాండవులతో, "మీరీ రాత్రి శిబిరంలో పడు కోవటం శుభకరం కాదు," అని చెప్పాడు. వారు ఓఘవతీ నదీతీరానికి వెళ్ళారు.

దుర్యోధనుడు తొడలు విరిగిపడి ఉన్నాడని తెలియగానే అశ్వత్థామ కృప కృత వర్మలు అతని వద్దకు వెళ్ళి ఏడిచారు. అశ్వత్థామ, "రాజా, ఈ రాత్రే ఆ పాండవులనూ, పాంచాలురనూ చంపేస్తాను, అనుమతి ఇయ్యి!" అన్నాడు.

దుర్యోధనుడు కృపాచార్యుడితో, "గురువర్యా, ఒక చెంబుతో నీరు తెచ్చి ఈ అశ్వత్థామను కౌరవ సేనాపతిగా అభిషేకించు!" అన్నాడు. అభిషేకం పొంది అశ్వత్థామ అప్యాయంగా దుర్యోధనుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. తరవాత హతశేషులైన ముగ్గురు వీరులూ దుర్యోధనుణ్ణి విడిచి వెళ్ళిపోయారు.



మహాభారతం

అట్టచివరి బొమ్మ

కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా వాహనా లెక్కి దక్షిణంగా బయలుదేరి పాండవ శిబిరానికి సమీపంలో ఎవరికీ కనబడని చోటుగా చూసుకుని అక్కడ కొంతసేపు విశ్రమించారు. సూర్యాస్తమయం అయాక వారు ఆ చేరువనే ఉన్న కీకారణ్యం ప్రవేశించారు. ఒక వెయ్యి కొమ్మల మర్రి కింద రథాలు విప్పి, కాలకృత్యాలు తీర్చుకుని విశ్రమించారు. కృప కృత వర్మలకు త్వరలోనే నిద్రపట్టింది. అశ్వత్థామ మాత్రం క్రోధావేశంతో కన్ను మూయలేదు.

ఆ మర్రి చెట్టు మీద అనేక వేల కాకులున్నాయి. ఒక రాత్రివేళ ఒక పెద్ద గుడ్లగూబ ఎక్కడినుంచో వచ్చి, తన శత్రువులైన ఆ కాకులు నిద్రలోవుండగా వాటిపైన పడి చిత్రవధ చెయ్యటం అశ్వత్థామ కళ్లారా చూశాడు. ఆ గుడ్లగూబ తనను ఇదేవిధంగా శత్రు నిర్మూలనం చెయ్యమని హితబోధ చేస్తున్నట్టుగా అతనికి తోచింది. తాను పాండవులను ఎదిరించి పోరాడటం ఆత్మహత్యే అవుతుంది. తాను దుర్యోధనుడికి చేసిన వాగ్దానం నెరవేర్చుకోవాలంటే తన శత్రువులైన పాండవ పాంచాలురను నిద్రిస్తూవుండగానే చంపెయ్యాలి.

అశ్వత్థామ తన మేనమామ అయిన కృపాచార్యులనూ, కృతవర్మనూ లేపి వారితో తన ఆలోచన చెప్పాడు. ఈ ఆలోచనకు సిగ్గుపడి వారిద్దరూ తలలు వంచుకున్నారు. కృపాచార్యులు అతనితో, "తెల్లవారనీ, ముగ్గురమూ వెళ్లి పాండవులతో యుద్ధం చేద్దాం," అన్నాడు. "అలా కాదు. నే నిప్పుడే వెళ్లి నిద్రపోయే పాండవులనూ, పాంచాలురనూ నా కత్తితో చంపేయాలి," అన్నాడు అశ్వత్థామ.

ఇద్దరికీ కొంతసేపు చర్చజరిగింది. ఇలా చేయుటం అన్యాయమన్నాడు కృపాచార్యులు. వచ్చే జన్మలో పురుగుగానైనా పుడతాను గాని, ఈ పని చెయ్యక మాననన్నాడు అశ్వత్థామ. భీష్ముణ్ణీ, తన తండ్రి అయిన ద్రోణుణ్ణీ, భూరిశ్రవుణ్ణీ, దుర్యోధనుణ్ణీ, పాండవులు న్యాయంగానే కొట్టారా అనికూడా అడిగాడు.


అతను దృఢనిశ్చయుడై తన రథాన్ని సిద్ధం చేసుకుంటూ వుండటం చూసి, కృపాచార్యులూ, కృతవర్మాకూడా కవచాలు తొడిగి, బాణాలు తీసుకుని అతని వెంట బయలు దేరారు. వారు పాండవ శిబిరాన్ని చేరేసరికి శిబిరంలో అందరూ గాఢ నిద్రలోవున్నారు.

అశ్వత్థామ మిగిలిన ఇద్దరితోనూ శిబిరద్వారం సమీపించేసరికి ద్వారానికి అడ్డంగా ఒక మహా భూతం నిలబడి వున్నది. అది పులితోలు ధరించి వున్నది. దాని శరీరం నుంచి జ్వాలలు వెలువడుతున్నాయి. దానికి గల అసంఖ్యాకమైన చేతులలో భయంకరమైన ఆయుధాలున్నాయి. దాని శరీరాన్ని పాములు చుట్టివున్నాయి. దాని ముఖం భయంకరంగా వున్నది.

ఆ భూతాన్ని చూసి భయపడక అశ్వత్థామ దానిపై తన వద్దనున్న దివ్యాస్త్రాలు ప్రయోగించాడు. కాని ఆ భూతం వాటి సన్నిటినీ దిగమింగింది. అతను తన వద్ద వున్న ఒక శక్తీ, ఒక ఖడ్గమూ, ఒక గదా భూతంపై వేశాడు. అన్నీ వృధా అయిపోయాయి. అశ్వత్థామ నిరాయుధు డైపోయాడు. తన మేనమామ మాట విననందుకు అతను పశ్చాత్తాపపడ్డాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) FEBRUARY 1962 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ

పాండవ శిబిర ద్వారానికి అడ్డంగా నిలబడిన భూతాన్ని జయించలేక, నిరాయుధుడై పోయిన అశ్వత్థామ శివుణ్ణి ధ్యానించాడు. శివుడి అనుగ్రహం చేత ఒక బంగారు వేదిక వెలిసింది. దానిపై అగ్ని ప్రజ్వలించింది. ఆ అగ్నిలో నుంచి శైవగణాలు బయలుదేరాయి.

అశ్వత్థామ శివుణ్ణి ధ్యానిస్తూ, తన శత్రువులను నిర్మూలించే కోరిక నెరవేర్చమని వేడుకుంటూ ఆ అగ్నిలో దూకాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై, "నిన్ను పరీక్షించటానికి నేనే ఆ భూతాన్ని కల్పించాను. నీ శత్రువులకు కాలం తీరిపోయింది. వారిని సంహరించు," అంటూ అశ్వత్థామకు ఒక కత్తి నిచ్చి, అతనిలో తానే ప్రవేశించాడు.

శిబిర ద్వారం వద్ద కృపుణ్ణీ, కృతవర్మనూ వుంచి, బయటి నుంచి శిబిరంలోకి ఎవరూ రాకుండా చూడమని హెచ్చరించి, అశ్వత్థామ శిబిరంలోకి ప్రవేశించాడు. యోధులందరూ గాఢ నిద్రలో వున్నారు. అశ్వత్థామ ముందుగా ధృష్టద్యుమ్నుడుండే చోటికి వెళ్ళాడు. చక్కని పక్కపై సుఖ నిద్రలో వున్న ధృష్టద్యుమ్నుణ్ణి కాలితో ఒక్క తన్ను తన్నాడు. ధృష్టద్యుమ్నుడు లేస్తూండగానే అతని జుట్టు పట్టుకుని కదలకుండా తొక్కిపట్టి అతన్ని అతి క్రూరంగా చిత్రవధ చేశాడు.


అశ్వత్థామ అక్కడినుంచి బయలుదేరి శిబిరమంతా మృత్యువిహారం చేశాడు. అతను నిద్రపోతున్నవారినీ, నిద్ర లేచి తన పైకి వచ్చినవారినీ, ఒక్కణ్ణీ మిగల్చకుండా వధించాడు. అతని చేతిలో ఉత్తమౌజుడూ, యుధామన్యుడూ చచ్చారు. శరీరం నిండా రక్తమై చూడటానికి భూతమో, రాక్షసుడో అన్నట్టున్న అతన్ని చూసి భయపడి కొందరు పారి పోయారు.

ప్రతివింధ్యుడూ, సుతసోముడూ, నకులుడి కొడుకు శతానీకుడూ, శిఖండీ, విరాటుడి కొడుకులూ, మనమలూ, ద్రౌపది కొడుకులూ, అనేక వేల మంది పాంచాల, సృంజయ యోధులూ అతనితో పోరాడి చచ్చిపోయారు. కొందరు యోధులు చావుకు వెరచి శిబిరం విడిచి పారిపోవటానికి యత్నించారు. వారిని కృప కృతవర్మలు చంపేశారు. అంతేగాక, అశ్వత్థామకు వెలుతురు వుండటానికని వారు పాండవ శిబిరానికి మూడు మూలల నిప్పుపెట్టారు.

ఈ విధంగా అర్ధరాత్రి లోపుగా అశ్వత్థామ పాండవ శిబిరంలో మిగిలిపోయిన యోధులనూ, ఏనుగులనూ, గుర్రాలనూ సయితం నిశ్శేషంగా చంపేశాడు. ఆ రాత్రి పాండవులు శిబిరంలో వున్నట్టయితే ఈ ఘోర హత్యాకాండ జరిగి వుండేదికాదు.

అశ్వత్థామ ప్రతిజ్ఞ నెరవేరింది. అతను తన తండ్రి చావుకు పగ తీర్చుకుని, దుర్యోధనుడికి చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకున్నాడు. అతను కృపకృతవర్మలను చేరుకుని తన పని పూర్తి అయిందని చెప్పాడు. వారిద్దరూ అతన్ని కౌగలించుకుని అతని నుంచి తప్పించుకున్న వారిని తాము చంపినట్టు చెప్పారు. "మనము వెళ్ళి, రాజు ఇంకా ప్రాణాలతో వుంటే అతని చెవిని ఈ వార్త వేద్దాం!" అన్నాడు అశ్వత్థామ కృప కృతవర్మలతో.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'



మహాభారతం

92

అట్టచివరి బొమ్మ

పంచపాండవులూ, కృష్ణుడూ, సాత్యకి తప్ప యుద్ధశేషులైన మిగతా పాండవయోధులూ, సైనికులూ కూడా దారుణంగా హత్య చేయబడ్డారు. ఈ హత్యాకాండ ముగించి కృప కృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుడు తొడలు తెగి పడి వున్న చోటికి వెళ్ళారు. దుర్యోధనుడింకా చావలేదు గాని అవసాన దశలో వున్నాడు.

అశ్వత్థామ అతనితో తాను చేసిన శత్రు వధ గురించి చెప్పి, "నేను నీ కోసం కంటె గాంధారీ ధృతరాష్ట్రుల భవిష్యత్తు గురించి ఎక్కువ దిగులు పడుతున్నాను," అన్నాడు.

ఆఖరు క్షణంలో దుర్యోధనుడికి పాండవపక్ష యోధులందరూ చచ్చారన్న వార్త చాలా ఆనందం కలిగించింది. "మనం తిరిగి స్వర్గంలో కలుసుకుందాం," అంటూ దుర్యోధనుడు ప్రాణాలు విడిచాడు. తెల్లవారింది. ధర్మరాజుకు రాత్రి జరిగిన దారుణం గురించి తెలిసింది. ఆయన ద్రౌపది మొదలైన వారిని తీసుకు రమ్మని నకులుణ్ణి పంపి, తాను శిబిరానికి వెళ్ళాడు.

ద్రౌపది తన కొడుకుల శవాలనూ, తోబుట్టువుల శవాలనూ చూసి కుమిలిపోయింది. "ఆ పాపాత్ముడైన అశ్వత్థామను చంపి వాడి తలలో వుండే సహజ మణిని తీసుకురాకపోతే నే నిక్కడే ప్రాయోపవేశం చేసి ప్రాణత్యాగం చేస్తాను," అన్నదామె.


ముందు వెనకలు ఆలోచించకుండా భీముడు రథమెక్కి, అశ్వత్థామను వెతికి చంపటానికి బయలుదేరాడు. అశ్వత్థామ దగ్గిర బ్రహ్మశిరోస్త్రం ఉన్నది. దాన్ని ద్రోణుడు తన కొడుకూ, అర్జునుడికీ ఇచ్చాడు. దాన్ని అశ్వత్థామ ప్రయోగిస్తే భీముడు దక్కడు. కృష్ణుడీ మాట చెప్పి, ధర్మరాజునూ, అర్జునుణ్ణీ రథంలో కూచో బెట్టుకుని వేగంగా బయలుదేరాడు.

రెండు రథాలూ భాగీరథీ తీరానికి చేరేసరికి, అక్కడ వ్యాసనారదాది మహర్షులు కూర్చుని వున్నారు. వారి పక్కనే నార బట్టలు కట్టుకుని, ఒళ్ళంతా దుమ్ము కొట్టుకుని అశ్వత్థామ కనిపించాడు. రోషావేశంలో భీముడు యుద్ధానికి పిలిచే సరికి, అశ్వత్థామ భయభ్రాంతుడై, ఒక ముళ్ళ దుబ్బు పీకి, బ్రహ్మశిరోస్త్రం పఠించి, "పాండవనాశనం చెయ్యి," అంటూ ఆ దుబ్బును విసిరాడు. అది నిప్పులు కక్కుతూ బయలుదేరింది. ఈలోపుగానే అర్జునుడు బ్రహ్మశిరోస్త్రాన్ని పఠించి, "ఆ అస్త్రాన్ని నిరోధించు," అని విడిచాడు.

రెండస్త్రాలూ ఒకదాన్ని ఒకటి ఎదిరించి లోకాన్ని దహించ నారంభించాయి. అప్పుడు వ్యాసుడు అశ్వత్థామనూ, అర్జునుణ్ణీ ఇలాటి పని చేసినందుకు మందలించాడు. ఆత్మరక్షణకు మాత్రమే తాను అస్త్రప్రయోగం చేసినట్టు, చెప్పి, అశ్వత్థామ తలలోని మణి ఇస్తే అతన్ని ప్రాణాలతో వదిలిపెట్టి అస్త్రాన్ని ఉపసంహరిస్తానన్నాడు. ఇందుకు అశ్వత్థామ ఒప్పుకుని తన మణి ఇచ్చాడు గాని, అస్త్రాన్ని ఉపసంహరించే శక్తి అతడికి లేకపోయింది. అందుచేత అతను తన అస్త్రాన్ని పాండవ గర్భనాశనం మాత్రమే చేయమని ఆదేశించి వెళ్ళిపోయాడు. ధర్మరాజు మొదలైన వారు మణి తెచ్చి ద్రౌపది కిచ్చారు. ఆమె తృప్తిపడి, ఆ మణిని ధర్మరాజు కిచ్చి ధరించమని కోరింది. ఆ మణిని ధర్మరాజు ధరించాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) APRIL 1962 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ

యుద్ధం జరుగుతూ ఉండినంత కాలమూ సంజయుడు ధృతరాష్ట్రుడికి యుద్ధ విశేషాలు తెలుపుతూ వచ్చాడు. తన నూరుగురు కొడుకులూ చచ్చిపోయారని వినగానే ధృతరాష్ట్రుడు శోకవివశుడై స్పృహ తప్పి పడిపోయాడు. సంజయుడు ఆయనను లేపుతూ, "నీ కొడుకులేనా? పద్దెనిమిది అక్షౌహిణుల సేనతో సహా ప్రపంచంలో ఉన్న యోధులందరూ నాశనమయారు. అందరికీ ప్రేత కార్యాలు చేయాలి," అని చెప్పాడు.

విదురుడుకూడా ధృతరాష్ట్రుణ్ణి ఓదారుస్తూ, సంసారం ఎటువంటిదో తెలపటానికి ఒక ఉపమానం చెప్పాడు. ఒక బ్రాహ్మణుడు ఒక కారడవిలో ప్రవేశించాడు. అందులో భయంకరమైన జంతువులన్నీ బీభత్సంగా అరుస్తున్నాయి. ఒక రాక్షస స్త్రీ అతని వెంటపడింది. ఆమెను తప్పించుకుని అతను దారిలేని ఆ వనంలో పడిపోతూ ఒక నూతిలో పడ్డాడు. దాని పైన తీగలు అల్లుకుని ఉండటంచేత అది అతనికి కనిపించ లేదు. ఆ తీగలకు కాళ్ళు తగులుకుని అతను సాంతం పడిపోకుండా తల కిందులుగా వేళ్ళాడాడు. ఆ స్థితిలో అతనికి మరికొన్ని ప్రమాదాలు ఎదురయాయి. బావిలో ఒక మహా సర్పం ఉన్నది. బావి పై భాగంలో ఒక బ్రహ్మాండమైన ఏనుగు కనిపించింది. బావి పైన ఉండే ఒక చెట్టునిండా తేనె పట్లూ, వాటి నిండా పోతుల్లాటి తేనెటీగలూ ఉన్నాయి. ఆ తేనె పట్టుల నుంచి తేనె బొట్లు బొట్లుగా కారుతుంటే ఆ బ్రాహ్మణుడు వాటిని ఆత్రంగా తాగసాగాడు. ఎంత తాగినా అతనికి ఇంకా తాగాలన్న ఆశే తప్ప జీవితం మీద విముఖత్వం ఎంత మాత్రమూ లేదు!


విదురుడీ ఉపమానం చెప్పి, "రాజా, మనిషియొక్క లౌకికమైన కోరికలు ఇదే విధంగా ఉంటాయి," అంటూ తత్వబోధ చేశాడు. కాని ఈ వేదాంతంతో కూడా ధృతరాష్ట్రుడికి పుత్రశోకం తగ్గలేదు. అప్పుడు వ్యాస మహాముని వచ్చి ఇలా చెప్పాడు:

"ఒకప్పుడు నేను ఇంద్రసభకు వెళ్ళాను. అప్పుడే భూదేవికూడా వచ్చి దేవతలతో తన భారం తగ్గించమని మొరపెట్టుకున్నది. అప్పుడు విష్ణుమూర్తి ఆమెతో, నీ కడుపున దుర్యోధనుడు కలి అంశతో జన్మించి ఈ భారం తీర్చగలడని చెప్పాడు. పాండవులు నీకు ద్రోహం చేశారని వారిపై పగ పెట్టుకోకు, నీ వంటే పాండవులకు చాలా ఇష్టం."

ఈ మాటలతో కొంత ఊరట పొంది ధృతరాష్ట్రుడు గాంధారిని, కుంతిని ఇతర అంతఃపుర స్త్రీలనూ వెంట బెట్టుకుని యుద్ధరంగానికి బయలుదేరాడు.

దారిలో ధృతరాష్ట్రుడికి కృప కృతవర్మాశ్వత్థామలు ఎదురయారు. వారు గాంధారీ ధృతరాష్ట్రులతో తాము మాత్రమే యుద్ధంలో చావక మిగిలామని, గడచిన రాత్రి ద్రుపదుడి కొడుకులనూ, ద్రౌపది కొడుకులనూ హతమార్చామని చెప్పి, పాండవులకు చిక్కకుండా పారిపోతున్నామని సెలవు పుచ్చుకున్నారు. తరవాత వారు చీలిపోయారు. కృపుడు హస్తినాపురానికి వెళ్ళాడు, కృతవర్మ తన భోజ దేశానికి వెళ్ళిపోయాడు, అశ్వత్థామ వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడే అతను పాండవులకు దొరికిపోయాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'



మహాభారతం

అట్టచివరి బొమ్మ

ధృతరాష్ట్రుడు యుద్ధరంగానికి బయలుదేరాడని తెలిసి ధర్మరాజు కృష్ణుణ్ణీ, సాత్యకినీ, ధృతరాష్ట్రుడి కొడుకై ఉండికూడా తన పక్షాన యుద్ధం చేసిన యుయుత్సుణ్ణీ వెంట బెట్టుకుని బయలుదేరాడు. వారి వెంట ద్రౌపదీ, ఇతర పాంచాల స్త్రీలూ వచ్చారు. వారంతా శోక సముద్రంలో మునిగి ఉన్నారు.

ధర్మరాజు మొదలైనవారు అంత దూరాన ఉండగానే గంగాతీరం నుంచి ధృతరాష్ట్రుడి వెంట ఉన్న స్త్రీల ఆక్రందనం గొర్రెలమంద అరుపులాగా విన వచ్చింది. ఆ స్త్రీలు ధర్మరాజును చూడగానే దుఃఖంలోనే నానా మాటలూ అని, "ధర్మం తెలిసినవాడనీ, భూతదయగలవాడనీ చెబుతారే, అవన్నీ ఏమయాయి? తండ్రులనూ, తమ్ములనూ, గురువులనూ, కొడుకులనూ, మిత్రులనూ, అందరినీ చంపించావు! భీష్ముణ్ణి చంపించావు, జయద్రథుణ్ణి చంపించావు! అభిమన్యుడు పోయాడు, ఉపపాండవులు పోయారు, ఇంక ఈ రాజ్యం ఎట్లా ఏలుతావు?" అని అడిగారు.

తనను కాకులలాగా చుట్టిముట్టిన స్త్రీలను తప్పించుకుని ధర్మరాజు ధృతరాష్ట్రుడికి నమస్కరించి తన పేరు చెప్పుకున్నాడు. అలాగే మిగిలిన పాండవులుకూడా తమతమ పేర్లు చెప్పుకున్నారు. ధృతరాష్ట్రుడు లాంఛనంగా ధర్మరాజును కౌగలించుకుని పరామర్శించి, కడుపు మండిపోతూ భీముణ్ణి ఆలింగనం చేసుకోబోయాడు. భీముడికి రానున్న ఆపద గుర్తించి కృష్ణుడు భీముణ్ణి వెనక్కులాగి అతనికి బదులుగా భీముడి ఇనప విగ్రహాన్ని అందించాడు. ధృతరాష్ట్రుడు దాన్ని భీముడే అనుకుని కసికొద్దీ బలంగా ఆలింగనం చేసుకుని ముక్కలు ముక్కలు చేసేశాడు. ధృతరాష్ట్రుడి రొమ్ము అదిరి, ఆయన నోటి నుండి రక్తం వెలువడింది. కాని ఆయన పుత్రశోకం కొంత చల్లారింది. ఆయన, "అయ్యో, భీమా! భీమా!" అంటూ కపట దుఃఖం అభినయించాడు.

కృష్ణుడాయనతో, "దిగులు పడవద్దు. నీవు విరిచినది భీముణ్ణి కాదు, భీముడి విగ్రహాన్ని. నీ కొడుకు దుర్యోధనుడు గదా యుద్ధాభ్యాసానికై చేయించిన విగ్రహాన్ని నీవు ధ్వంసం చేశావు. వెర్రివాడా, భీముణ్ణి చంపితే చచ్చిన నీ కొడుకులు తిరిగి వస్తారా? పాండవులు నీకు చేసిన నష్టాన్నే ఆలోచిస్తున్నావుగాని, ఏ దోషమూ ఎరగని ఆ పాండవులకు నీ కొడుకులు చేసిన ద్రోహాలుకూడా కాస్త జ్ఞాపకం తెచ్చుకో. యుద్ధం జరగకుండా నేనూ, విదురుడూ, భీష్మ ద్రోణులూ చేసిన యత్నాలన్నిటినీ కాదని నీ కొడుకును బలపరిచావు," అన్నాడు. ధృతరాష్ట్రుడు పశ్చాత్తాప పడి, "నీ మాటలన్నీ నిజమే. నా కొడుకులంతా పోయినాక పాండవుల మీద నాకు పుత్రవాత్సల్యం కలుగుతున్నది. వారిని తాకి ఆనందిస్తాను," అని కోరాడు. తరవాత ఆయన పాండవులను తడివి, పరామర్శించి, వారితో మంచిగా మాట్లాడాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) JUNE 1962 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ

గాంధారి పుత్రశోకంతో కుమిలిపోతూ, ధర్మరాజు కనిపించగానే శపించాలని నిశ్చయించుకున్నది. వ్యాసుడు ఈ సంగతి గ్రహించి ఆమె వద్దకు వెళ్ళి, "ధర్మరాజుపై కక్ష పెట్టుకోకు. నీ కొడుకు యుద్ధానికి వెళ్ళేటప్పుడు, ధర్మం ఉన్నచోటనే జయమూ వుంటుందన్నావు గదా. ధర్మం పాండవుల పక్షాన ఉండటంచేతనే వారు జయించారనుకో!" అని హితం చెప్పాడు.

"నాకు పాండవులు నశించాలన్న కోరికలేదు, కాని పుత్రశోకం నన్ను వివశురాలిని చేసింది. దుర్యోధన దుశ్శాసనులూ, శకుని కర్ణులూ చేసిన తప్పువల్ల కురుక్షయం జరిగింది. అందుకు నేను ఎవరినీ నిందించను. కాని గదా యుద్ధంలో ఎంతో సమర్థుడైన నా దుర్యోధనుణ్ణి భీముడు బొడ్డు కిందుగా కొట్టటం నేను సహించలేకుండా ఉన్నాను," అన్నది.

ఈ మాటలు విన్న భీముడు గాంధారితో, "అమ్మా, నా ప్రాణాలు నేను కాపాడుకున్నానే తప్ప నేను ధర్మాధర్మాలు పాటించలేదు. నీ కొడుకును నేను ధర్మయుద్ధంలో చంపలేదు. నన్ను క్షమించు. అంతకుముందు నీ కొడుకు అధర్మంగా మా అన్నను జయించాడు, అష్టకష్టాలూ పెట్టాడు. ద్రౌపదిని పరాభవించాడు. నీకు తెలుసు గదా!" అన్నాడు.

గాంధారి భీముడితో, "ఈ అధర్మం నీవు చేయవలసినది కాదు. దుశ్శాసనుడి రక్తం తాగావే, అది అనార్యులు చేసేపని గదా!" అన్నది. "అమ్మా, నా ప్రతిజ్ఞ తీర్చుకునేటందుకు అతని రక్తంతో నేరు తడుపుకున్నాను గాని గుటక వెయ్యలేదు. రక్తం తాగటమే నా ఉద్దేశమైతే కర్ణుడి రక్తం తాగకపోయానా?" అన్నాడు భీముడు.


"ధర్మరా జెక్కడ?" అని గాంధారి అడిగింది. ధర్మరాజు వణికిపోతూ, "నీ కొడుకులందరినీ హత్యచేసిన ధర్మరాజును ఇక్కడే ఉన్నాను," అన్నాడు. గాంధారి కళ్ళకు కట్టుకున్న గంత కింది నుంచి ధర్మరాజు గోళ్ళు కనిపించాయి. వాటిపై ఆమె చూపు పడగానే అవి కమిలిపోయాయి. గాంధారి యుద్ధరంగంలో తన కొడుకుల శవాలు చూసి ఎంతో దుఃఖించి, కోపం పట్టలేక కృష్ణుణ్ణి, "మీ యాదవవంశం కూడా ఇలాగే నీ కళ్ళ ఎదట నాశనం కావాలి!" అని శపించింది.

తరవాత ధర్మరాజు విరిగిపోయిన రథాలూ, కట్టెలూ చితులు పేర్పించి ముఖ్యులైన యోధులకు దహనసంస్కారం చేయించాడు. మిగిలినవారి దహనక్రియ ఒకే చితిపై విదురుడు చేయించాడు.

అనంతరం అందరూ గంగకు వెళ్ళి చనిపోయినవారికి జలతర్పణాలు వదిలేటప్పుడు కుంతి పాండవులతో, తాను కన్యగా ఉండగానే దూర్వాసుడు తన కొక మంత్రం చెప్పటమూ, అది పఠించి ఆమె సూర్యుణ్ణి ప్రత్యక్షం చేసుకుని, "నీ వంటి కొడుకును ప్రసాదించు," అని కోరటమూ, దాని ఫలితంగా ఆమెకు కర్ణుడు పుట్టటమూ మొదలైన కథ అంతా చెప్పి, "కర్ణుడు మీ పెద్ద అన్న. అతనికి కూడా తర్పణాలు విడవండి," అన్నది. ఈ సంగతి విని ధర్మరాజు దుఃఖంతో కుంగిపోయాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) JULY 1962 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ


చనిపోయిన వారికి తర్పణాలు వదలినాక పాండవులు, విదుర ధృతరాష్ట్రులతోనూ, స్త్రీజనంతోనూ ఒక నెల పైలపట్టి నగరం వెలపల పర్ణశాలలో ఉండిపోయారు. ఆ సమయంలో వ్యాసుడు, నారదుడు, దేవస్థానుడు, కణ్వుడు శిష్యసమేతంగా ధర్మరాజును చూడవచ్చారు. రాజ్యం గెలుచుకున్నందుకు సంతోషించటానికి బదులు, అందరినీ చంపుకున్నందుకూ, ముఖ్యంగా కర్ణుడు తమ అన్న అని తెలియనందుకూ దుఃఖిస్తున్న ధర్మరాజుకు నారదుడు కర్ణుడు పొందిన శాపాలను గురించి వివరంగా చెప్పాడు.

కర్ణుడికి చిన్నతనంలోనే పాండవులపై అసూయ ఉండేది. ధర్మరాజు బుద్ధిశాలి, భీముడు బలశాలి, అర్జునుడు విలువిద్యలో ప్రవీణుడేగాక కృష్ణుడికి మిత్రుడు, నకుల సహదేవులు బుద్ధిమంతులని పేరు పొందినవారు. ఈ అందరిపై గల అసూయ చేత కర్ణుడు దుర్యోధనుణ్ణి ఆశ్రయించాడు, అస్త్రప్రయోగంలో అర్జునుడంత వాడనిపించుకోవాలని అతను ద్రోణుణ్ణి బ్రహ్మాస్త్రం వేడాడు. అది బ్రాహ్మణ క్షత్రియులకు మాత్రమే ఇవ్వవచ్చునని వంక బెట్టి అర్జున పక్షపాతి అయిన ద్రోణుడు నిరాకరించాడు.

అప్పుడు కర్ణుడు పరశురాముడి వద్దకు వెళ్ళి, బ్రాహ్మణుణ్ణని అబద్ధమాడి, ఆయన దగ్గిర శిష్యుడుగా చేరి, ఎన్నో శస్త్రాస్త్రాలు సంపాదించాడు. ఈ సమయంలోనే కర్ణుడు ఒక బ్రాహ్మణుడి హోమధేనువును చంపాడు. ఆ బ్రాహ్మణుడు కోపంతో, "ఓరీ, నీవు యుద్ధరంగంలో రథ చక్రం కుంగి, నా ఆవు చచ్చినట్టే చస్తావు," అని శాపమిచ్చాడు.

మరి కొంతకాలం శుశ్రూషలు చేసిన మీదట పరశురాముడు కర్ణుడికి బ్రహ్మాస్త్రం యొక్క ప్రయోగ ఉపసంహారాలు చెప్పాడు. ఇది జరిగాక ఒక ఉపవాసదినంనాడు పరశురాముడు కర్ణుడి తొడపై తలపెట్టి నిద్రపోతూండగా ఒక కీటకం వచ్చి కర్ణుడి తొడ తొలచనారంభించింది. గురువుకు నిద్రాభంగం చెయ్యటం ఇష్టంలేక కర్ణుడు బాధ భరించాడు. తరవాత పరశురాముడు లేచి రక్తప్రవాహాలనూ, కీటకాన్నీ చూసి ఆశ్చర్యపడ్డాడు. అంతలోనే కీటకం మాయమై ఒక రాక్షసుడు కనిపించి, తాను పరశురాముడి తాత చేత శాపం పొంది కీటక మైనట్టూ, పరశురాముడు తనను చూడగానే శాప విముక్తి కలిగినట్టూ చెప్పి వెళ్లిపోయాడు. పరశురాముడికి అనుమానం కలిగి, "ఇంత బాధను సహించిన నీవు బ్రాహ్మణుడవు కావు. నిజం చెప్పు," అన్నాడు. కర్ణుడు భయపడి నిజం చెప్పేశాడు. బ్రహ్మాస్త్రం కర్ణుడికి పనికిరాకుండా పరశురాముడు శాపం పెట్టాడు. ఇన్ని శాపాలూ పొందినా కర్ణుడు మహా వీరుడైనాడు. కళింగరాజైన చిత్రాంగదుడి కుమార్తెను స్వయంవరమప్పుడు దుర్యోధనుడు ఎత్తుకు వస్తుంటే, ఇతర రాజులు అతనిపై యుద్ధానికి రాగా కర్ణుడు వారినందరినీ ఓడించాడు. జరాసంధుడితో గదాయుద్ధం చేసి ఓడించి మాలిని అనే నగరాన్ని పుచ్చుకున్నాడు. ఈ విషయాలన్నీ చెప్పి నారదుడు ధర్మరాజుతో, "కర్ణుడి చావుకు నీవుగాని, అర్జునుడుగాని కారకులనుకోకు. ఆ చావుకు కారణాంతరాలెన్నో ఉన్నాయి," అని ఊరడించాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'



మహాభారతం

అట్టచివరి బొమ్మ

కర్ణుడి జన్మ వృత్తాంతమూ, అతని శాపాలూ విన్నమీదట ధర్మరాజు కుంతితో, "అమ్మా, నీవు ఈ రహస్యాన్ని ఇంత రహస్యంగా ఉంచ బట్టేగదా ఈ దారుణం జరిగింది. ఆడవాళ్ళ నోట రహస్యం దాగకుండుగాక!" అన్నాడు. ఆయన శోకతప్తుడై అర్జునుడితో, "ఛీ, ఛీ! రాజధర్మం కన్న బిచ్చ మెత్తటం మేలు. నాకు రాజ్యం వద్దు," అన్నాడు.

క్షత్రియ ధర్మంగా శత్రువులను చంపి రాజ్యం సంపాదించుకున్నాక దాన్ని విడిచి పుచ్చి భిక్ష మెత్తుకుంటానంటే అందరూ నవ్వుతారని అర్జునుడు చెప్పాడు. అందరినీ చంపు కోక పూర్వమే భిక్ష మెత్తుకునే నిశ్చయం చేసి ఉంటే బాగుండేదన్నాడు భీముడు.

ఇందరూ ఇన్ని చెప్పినా మాట్లాడకుండా ఉన్న ధర్మరాజుతో ద్రౌపది, "కష్టాలు పడు తున్నంత కాలమూ తమ్ములతో మన రాజ్యం మనం తిరిగి పొంది సుఖపడతామని ఆశ పెట్టావు. అందుచేత తమ్ములతో సహా సుఖంగా రాజ్యం చెయ్యి," అన్నది.

"నీ ధనాన్ని భోగాలకే ఉపయోగించ నవసరం లేదు. యాగాలకు ఉపయోగించు," అని దేవస్థానుడనే ముని ధర్మరాజును హెచ్చరించాడు. హింస చెయ్యటం రాజ ధర్మానికి విరుద్ధం కాదని అర్జునుడు అన్నకు జ్ఞాపకం చేశాడు. వ్యాసముని అర్జునుడు చెప్పిన దాన్ని బలపరుస్తూ, సుద్యుమ్నుడనే రాజు క్షత్రియ ధర్మం అవలంబించి తరించిన కథ చెప్పాడు.

పూర్వం శంఖ లిఖితులనే ఇద్దరు బ్రాహ్మణ సోదరులుండేవారు. వారు ఒక నది ఒడ్డున, చెరొక ఫల వృక్షం చెంతా ఆశ్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. లిఖితుడు ఒకనాడు అన్న ఇంటికి వెళ్ళి, అక్కడ ఆయన లేక పోయేసరికి చెట్ల పళ్ళు కోసుకుని వాటిని తింటూ కూచున్నాడు. ఇంతలో శంఖుడు వచ్చి, "నీవు చేసినది దొంగ తనం. రాజు వద్దకు వెళ్ళి, నీ నేరం చెప్పకుని శిక్ష పొందిరా," అన్నాడు.

లిఖితుడు అన్న చెప్పినట్టుగా సుద్యుమ్నుడనే రాజు వద్దకు వెళ్ళి, తానొక పనిమీద వచ్చాననీ, కోరిక తీరుస్తానంటే చెబుతాననీ అన్నాడు. రాజు సరేనన్నాడు. అప్పుడు లిఖి తుడు తాను చేసిన పని చెప్పి దండన కోరాడు. రాజు ఎంత చెప్పినా వినక తనకు దండనే కావాలని లిఖితుడు కోరటంచేత రాజు గత్యంతరం లేక అతని చేతులు నరికించాడు. లిఖితుడు శిక్ష పొంది అన్న వద్దకు వెళ్ళాడు. "నీ కిప్పుడు దోషం పోయింది. నీవు వెళ్ళి నదిలో స్నానం చేసి రా," అన్నాడు.

లిఖితుడు స్నానం చెయ్యగానే అతని చేతులు మళ్ళీ వచ్చాయి. అతను ఆశ్చర్యంతో ఈ విషయం అన్నకు చెప్పగా, ఆయన, "ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. నా తపశ్శక్తి వలనే నీకు చేతులు వచ్చాయి," అన్నాడు. లిఖితుడు మరింత ఆశ్చర్య పడి, "అలా అయితే ఆ తపశ్శక్తితోనే నాకు శుద్ధి కలిగించ లేకపోయావా? రాజు చేత దండన ఎందుకు చేయించావు?" అని అడిగాడు. "పిచ్చివాడా, నిన్ను దండించటంచేత రాజుకూడా శుద్ధు డయాడు," అన్నాడు శంఖుడు. ఈ సంఘటనతో ఆ నదికి బాహుదా అని పేరు వచ్చింది.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) SEPTEMBER 1962 Regd. No. M. 4854



మహాభారతం

అట్టచివరి బొమ్మ

ఎవరెన్ని విధాల చెప్పినా ధర్మరాజుకు వైరాగ్యం వదలలేదు. అప్పుడు కృష్ణు డాయనకు షోడశ మహారాజుల కథలు చెప్పి, అనంతరం సృంజయుడి కథ ఈ విధంగా చెప్పాడు:

ఒకప్పుడు నారదుడూ, ఆయన మేనల్లుడైన పర్వతుడూ లోకసంచారం చేస్తూ సృంజయుడనే రాజు వద్దకు వెళ్ళారు. వారిద్దరి మధ్యా రహస్యాలు లేవు. ఎవరు రెండోవారి వద్ద ఏ సంగతి దాచినా శాపఫలం పొందేటట్టు వారు ఒప్పందం కూడా చేసుకుని ఉన్నారు.

సృంజయుడు ఆ మహర్షులకు అతిథ్యం ఇచ్చి, వారికి సపర్యలు చెయ్యటానికి సుకుమారి అనే తన కుమార్తెను నియమించాడు. నారదుడికి ఆ పిల్ల మీద ప్రేమ ఏర్పడి క్రమంగా వృద్ధి కాసాగింది. అయితే ఈ సంగతి నారదుడు తన మేనల్లుడైన పర్వతుడికి చెప్పక దాచాడు. అయినా పర్వతుడీ సంగతి గ్రహించి, "నీ వా పిల్లను పెళ్ళాడిన మరు క్షణం కోతివైపోతావు గాక!" అని తన మామను శపించాడు. "నీకు స్వర్గలోక సంచారం లేకుండా పోవుగాక!" అని నారదుడు ఎదురు శాపం పెట్టాడు. తరవాత మామా అల్లుళ్ళు విడిపోయారు.

నారదుడు సృంజయుడి వద్దకు వెళ్ళి తనకు సుకుమారి నిచ్చి పెళ్ళి చెయ్యమని కోరాడు. రాజు ఒప్పుకుని పెళ్ళి చేశాడు. నారదుడు కోతిగా మారిపోయాడు. కొంత కాల మైనాక పర్వతుడు నారదుడున్న చోటికి వచ్చి తనకు స్వర్గలోక సంచారం అనుగ్రహించ మన్నాడు. అప్పు డిద్దరూ తమ శాపాలను ఉపసంహరించుకున్నారు.

వారు కొంతకాలం సృంజయుడి వద్ద ఉన్నమీదట పర్వతుడు సృంజయుణ్ణి ఒక వరం కోరుకోమన్నాడు. ఇంద్రుడితో సమానుడైన ఒక కొడుకు నిమ్మని సృంజయు డడిగాడు.

"అలాగే ఇస్తాను కాని నీవు వాణ్ణి ఇంద్రుడి బారి నుంచి కాపాడుకోవాలి సుమా!" అన్నాడు పర్వతుడు.

"వాడికి దీర్ఘాయువు కూడా ఇవ్వండి," అని సృంజయు డడిగితే పర్వతుడు బదులు చెప్పలేదు. అది చూసి నారదుడు, "నీ కొడుకుకు ప్రాణాపాయం కలిగితే నేను బతికి స్తాను," అని సృంజయుడికి మాట ఇచ్చాడు.

నారద పర్వతులు వెళ్ళిపోయాక సృంజయుడికి సువర్ణష్ఠీవి అనే కొడుకు కలిగాడు. వాడి కీర్తి ప్రపంచమంతటా వ్యాపించటం చూసి, వాణ్ణి చంపి రమ్మని తన వజ్రాయుధాన్ని ఇంద్రుడు వ్యాఘ్రరూపంలో పంపాడు. ఒకనాడు సువర్ణష్ఠీవిని వాడి దాది వనానికి తీసుకు రాగా ఆ పులి వాణ్ణి చంపి అంతర్ధానమయింది. ఈ సంగతి తెలిసి పుత్రశోకంతో ఏడుస్తున్న సృంజయుడి వద్దకు నారదుడు వచ్చి తత్వబోధ చేసి, ఇంద్రుడి అనుమతితో ఆ కుర్రవాణ్ణి తిరిగి బతికించాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) OCTOBER 1962 Regd. No. M. 4854



మహాభారతం

అట్ట చివరి బొమ్మ

తన జ్ఞాతులను చంపిన కారణం చేత తాను నరకానికి దారిచేసుకున్నానని దిగులుతో రాజ్యం నిరాకరించిన ధర్మరాజుకు వ్యాసుడు పాపకార్యాలు ఎలా ఉంటాయో, వాటికి ప్రాయశ్చిత్తం ఏమిటో, కాలప్రభావం చేత ధర్మాధర్మాలు ఎలా మార్పుచెందుతాయో వివరంగా చెప్పాడు. వ్యాసుడి మాటలు వింటున్న కొద్దీ ధర్మరాజు మనను తేలికపడింది. ధర్మసూక్ష్మాలు తెలుసుకోవాలనే కాంక్ష హెచ్చింది. అంపశయ్యపైన ఉండి త్వరలోనే మరణం పొందే ఉద్దేశంలో ఉన్న భీష్ముడి వద్ద ధర్మసూక్ష్మాలు తెలుసుకోవటం ఉచితంగా ఉంటుందని వ్యాసుడూ నారదుడూ అనుకున్నారు.

భీష్ముడి పేరు చెవిని పడగానే ధర్మరాజు, "అయ్యో, తాత అని కూడా చూడకుండా ఆయనను కూడా యుద్ధంలో పడగొట్టాను. ఏ మొహంతో ఆయనను చూడను?" అని దుఃఖించాడు. కృష్ణు డాయనను ఊరడించాడు.

పెద్దలు కోరిన విధంగా పురప్రవేశం చేసి రాజు కావటానికి ధర్మరాజు ఒప్పుకున్నాడు. పదహారు ఎద్దులను పూన్చి, తెల్లని కంబళి పరిచిన రథంలో ఆయన ఎక్కి కూచున్నాడు. భీముడు సారధి స్థానంలో కూచున్నాడు. అర్జునుడు అన్నగారికి శ్వేతచ్ఛత్రం పట్టాడు. నకుల సహదేవులు వింజామరలు వీచారు.

ధర్మరాజు రథానికి ముందుగా, పల్లకీలో గాంధారీ ధృతరాష్ట్రులూ, వెనుకగా రథాలలో యుయుత్సుడూ, కృష్ణ, సాత్యకులూ, వివిధవాహనాలలో ద్రౌపదీ, ఇతర కౌరవ స్త్రీలూ బయలుదేరారు.

అలంకరించిన రాజమార్గంతో, వీధులు నిండిన స్త్రీ పురుషులతో హస్తినాపురం కళకళలాడింది. స్త్రీలు కొత్తరాణి ద్రౌపదినీ, పురుషులు పాండవులనూ పొగడారు. రాజగృహద్వారం వద్ద మంత్రులూ, పౌరముఖ్యులూ ధర్మరాజుకు స్వాగతం చెప్పారు.


ధర్మరాజు దేవబ్రాహ్మణ పూజచేసి, తన గురువైన ధౌమ్యుడికీ, పెద్ద అయిన ధృతరాష్ట్రుడికీ మొక్కాడు. బ్రాహ్మణాశీర్వచనాలూ, దుందుభిమోతలూ మిన్నుముట్టాయి.

ఈ సమయంలో పరివ్రాజకుడి వేషంలో చార్వాకు డనేవాడు, దుర్యోధనుడి పరమ మిత్రుడు, ధర్మరాజు ఎదటికి వచ్చి, "ఓ రాజా, ఈ బ్రాహ్మణులంతా కోరగా నేనీ మాటలు నీతో అంటున్నాను: ఛీ, ఛీ! జ్ఞాతుల నందరినీ చంపి నీ వీవిధంగా ఎందుకు బతకాలి?" అన్నాడు.

ధర్మరాజు సిగ్గుపడి, తనను నిందించ వద్దని బ్రాహ్మణులను వేడుకున్నాడు. అప్పుడు బ్రాహ్మణు లాయనతో, "వీడు దుర్యోధనుడి మిత్రుడు, రాక్షసుడు. వాడు చెప్పినది మా అభిప్రాయం ఎంత మాత్రమూ కాదు," అని చెప్పి, ఆ చార్వాకుడి ప్రాణాలు అక్కడే తీసేశారు. తరవాత ఆ బ్రాహ్మణులు ధర్మరా జిచ్చిన కానుకలు పుచ్చుకుని తమ దారిన తాము వెళ్ళిపోయారు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

...ber '62 Regd. No. M. 4854



అట్టచివరి బొమ్మ

ధర్మరాజు పట్టాభిషేకం యథావిధిగా జరిగి పోయింది. ధృతరాష్ట్రుడు తన కొడుకులకు శ్రాద్ధం చేశాడు. ధర్మరాజు ద్రోణ కర్ణులకూ, ఘటోత్కచాభిమన్యులకూ, విరాటుడు మొదలైన బంధు మిత్రులకూ వేరు వేరుగా శ్రాద్ధాలు చేశాడు. తన కోసం చనిపోయినవారి పేర ధర్మ సత్రాలూ, విడుదులూ, చలివేంద్రాలూ, చెరువులూ నిర్మించటానికి ఉత్తరు విచ్చాడు. ఆయన భీముడికి దుర్యోధనుడి మేడా, అర్జునుడికి దుశ్శాసనుడిదీ, నకుల సహదేవులకు దుర్మర్షణ దుర్ముఖుల మేడలూ ఇచ్చాడు. కృష్ణ సాత్యకులు అర్జునుడి ఇంట వుండిపోయారు.

ఒకనాడు ధర్మరాజు కృష్ణుణ్ణి చూడబోయాడు. కృష్ణుడు మణిమయమైన శయ్యపై వున్నాడు. ధర్మరాజు కుశల ప్రశ్నలకు అతను సమాధానం చెప్పలేదు. ధర్మరాజు కంగారుపడ్డాడు. అంతలో కృష్ణుడు సమాధి నుంచి బయటపడిన వాడిలాగా అయి, "బావా, కలతపడకు. భీష్ముడు నన్ను తలుచుకుంటున్నాడు, నా మనస్సు ఆయన చెంతకు వెళ్ళింది. భీష్ముడితో బాటు ఎంతో జ్ఞానం నశించబోతున్నది. నీ వాయన దగ్గిరికి వెళ్ళి నీ సందేహాలన్నీ నివర్తి చేసుకోవటం మంచిది," అన్నాడు.

తరవాత కృష్ణ సాత్యకులూ, పాండవులూ, సంజయుడు మొదలైనవారు భీష్ముడున్న చోటికి బయలుదేరారు. దారిలో అయిదు మడుగులున్నాయి. వాటిని పరశురాముడు క్షత్రియ రక్తంతో నింపాడు. వాటి కథ ధర్మరాజు కృష్ణుడి ద్వారా విన్నాడు.

పరశురాముడు జమదగ్ని కొడుకు. గంధమాదన పర్వతం మీద శివుణ్ణి గురించి తపస్సు చేసి, అనేక అస్త్రాలూ, గండ్రగొడ్డలీ వరంగా పొందాడు. ఆ రోజులలో హైహయ వంశం వాడైన కృతవీర్యుడికి అర్జును డనే కొడుకుండేవాడు. మహా బలశాలి. అశ్వమేధ యాగం చేసి లేదనకుండా దానాలు చేశాడు.


ఈ అర్జునుడి కొడుకులు ఒకసారి జమదగ్ని, పరశురాముడూ లేని సమయంలో వారి ఆశ్రమం నుంచి హోమధేనువునూ, దూడనూ ఎత్తుకుపోయారు. పరశురాముడు పగబట్టి వెళ్ళి అర్జునుణ్ణి చంపేశాడు.

అంతటితో ఆ వైరాన్ని పోనివ్వక, అర్జునుడి కొడుకులు జమదగ్ని ఆశ్రమానికి మళ్ళీ వచ్చి జమదగ్ని తల నరికారు.

దానితో పరశురాముడు భూమి మీద క్షత్రియుడు లేకుండా చేస్తానని ప్రతిజ్ఞ చేసి ఇరవై ఒక్కసారి క్షత్రియులందరినీ ఊచకోత కోసి, భూమి అంతా కశ్యపుడికి దానం చేశాడు. కొంతకాలం బ్రాహ్మణులు భూమి నేలి అరాజకం తెప్పించారు. కశ్యపు డది చూసి, పరశురాముడి గొడ్డలి వేటుకు గురికాక తప్పించుకున్న క్షత్రియ కుమారులకు భూమిని తిరిగి ఇచ్చేశాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

NDAMAMA (Telugu) DECEMBER 1962 Regd. No. M. 4854



అట్టచివరి బొమ్మ

కృష్ణుడు చెప్పిన పరశురాముడి కథ విని ధర్మరాజు చాలా సంతోషించాడు. ఈ విధంగా మాట్లాడుతూ పాండవులు భీష్ముడు పడి ఉన్న చోటు చేరారు. ఓఘవతి తీరాన భీష్ముడు అంప శయ్యపై వున్నాడు. ఆయన చుట్టూ మునులున్నారు. ధర్మరాజు మొదలైనవారు అంత దూరానే రథాలు దిగి భీష్ముణ్ణి సమీపించారు.

కృష్ణుడు భీష్ముణ్ణి సమీపించి, "మహాత్మా, నీ మనసు నిర్మలంగా ఉన్నదా? శరీర బాధ హెచ్చుగా లేదు గదా! నీ కింకా యాభై అరు రోజుల ఆయుర్దాయం ఉన్నది. ఆ తరవాత వసువులు విమానం తెచ్చి నిన్ను తీసుకు పోతారు. ఈలోగా ధర్మరాజుకు నీ జ్ఞాన మంతా బోధించి, ఆ జ్ఞానమంతా నీతోనే అంతరించకుండా చూడు," అన్నాడు.

ఆ మాట విని భీష్ముడు, "నాయనా, ఈ బాణాలతో నా శరీరం చాలా బాధపడి పోయింది. మనసు కూడా కలతగా ఉన్నది. అందుచేత ధర్మరాజు తెలుసుకో దగినదంతా నీవే చెప్పు. నాకు ఆకాశమూ, భూమీ కూడా సరిగా కనపడటం లేదు," అన్నాడు.

అప్పుడు కృష్ణుడు భీష్ముడి మన శ్శరీరాలకు కొత్త శక్తి నిచ్చాడు. వెంటనే భీష్ముడిలో కలిగిన మార్పుకు అక్కడి మునులందరూ ఆశ్చర్య పోయారు.

తరవాత కృష్ణుడు భీష్ముడితో, "పాండవులు నీ సంతతివారు. వారికి నీవే ధర్మబోధ చెయ్యటం ఉచితం. జ్ఞాతులనూ, బంధువులనూ, గురువులనూ చంపిన కారణంచేత ధర్మ రాజు నీ ఎదట పడటానికి సిగ్గు పడుతున్నాడు," అన్నాడు.

"సిగ్గెందుకు, నాయనా? ధర్మరాజు అనుసరించినది క్షత్రియ ధర్మమే. అధర్మ పరులైన జ్ఞాతులను చంపటం ధర్మమే. ఆచార వ్యతిరేకులూ, లోభులూ అయితే గురువులను కూడా సుక్షత్రియుడు చంపవచ్చు. ధర్మహాని కలిగినప్పుడు ఉపేక్షించటమే అధర్మం. యుద్ధం వచ్చి పడినప్పుడు వెనకాడేవాడు రాజు అనిపించుకోడు," అన్నాడు భీష్ముడు.

ఆ మాటలతో ధర్మరాజుకు ధైర్యం వచ్చింది. అతను భీష్ముడి ఎదటికి వచ్చి నమస్కరించి ఆయన ద్వారా అనేక ధర్మాలు తెలుసుకున్నాడు. ధర్మరాజు సపరివారంగా రోజూ భీష్ముణ్ణి చూడ రావటమూ, తన సంశయాలను అడగటమూ, భీష్ముడు అతని ధర్మ సందేహాలు తీర్చటమూ పరిపాటి అయింది. రాజధర్మం గురించి ధర్మరాజుకు గల అపో హలను భీష్ముడు పోగొట్టాడు. ధర్మరాజుకు ధర్మోపదేశాల సందర్భంలో అనేక ఉపాఖ్యా నాలు చెప్పాడు.

కృష్ణుడు చెప్పిన గడువు పూర్తి కాగానే భీష్ముడు దేహం చాలించ నిశ్చయించాడు. ఆయన ప్రాణాలు ఒక్కొక్క అవయవంలో నుంచీ వెళ్ళిపోతుంటే ఆ అవయవంలో గల బాణాలు రాలిపోయాయి. చివరకు ఆయన ప్రాణం తలలో నుంచి పోయేసరికి ఆయన శరీరంలో ఒక్క బాణం కూడా మిగలలేదు. ఇది చూసి అందరూ ఆశ్చర్యపడ్డారు

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

January 1963 Regd. No. M. 4854



భారతం

భీష్ముడి వద్ద అన్ని ధర్మాలూ తెలుసుకుని కూడా ధర్మరాజు భీష్మ నిర్యాణంతో తిరిగి శోక సాగరంలో మునిగిపోయాడు. ఆయనను ధృతరాష్ట్రుడు ఓదార్చుతూ, "నూరుమంది కొడుకులను పోగొట్టుకున్న నేనూ గాంధారీ ఏడవాలి గాని, రాజ్యం సాధించుకున్న నీ కెందు కీ దుఃఖం?" అన్నాడు.

తరవాత వ్యాసుడు ధర్మరాజుతో, "నాయనా, ఎంతటి పాపులు కూడా తపస్సు చేతా, యజ్ఞాల చేతా పవిత్రు లవుతున్నారు. అందుచేత నీవు అశ్వమేధాది యాగాలు చేసి నీలో పాపం ఉంటే పోగొట్టుకో!" అని హితం చెప్పాడు.

"ఇంతమంది జ్ఞాతులను చంపి నేను యజ్ఞం చేస్తే ఎంత ఘనంగా దానాలు చెయ్యాలి? అలా చెయ్యటానికి నాకు ధనం లేదు. ఈ ఘోర యుద్ధంలో దృఢకాయులంతా పోగా ప్రజలలో బాలురూ, దీనులూ మిగిలారు. రాజపుత్రులు కష్ట దశలో ఉన్నారు. వారి నెలా యాచించను? పన్ను లెలా వెయ్యను?" అన్నాడు ధర్మరాజు.

దానికి వ్యాసుడు, "ధర్మరాజా, నీకు కావలసినంత ధనం హిమాలయం మీద ఉన్నది. పూర్వం మరుత్తనేవాడు యజ్ఞం చేసి అంతులేని బంగారాన్ని బ్రాహ్మణులకిస్తే దాన్ని వారు హిమాలయంలో ఉంచారు. ఆ ధనం తెప్పించు," అన్నాడు.

అందుకు ధర్మరాజు సంతోషించి, దేవబ్రాహ్మణారాధన చేసి, పితృ కార్యాలు నిర్వర్తించి, ధృతరాష్ట్రుడితో సహా హస్తినాపురానికి తిరిగి వచ్చి రాజ్యం ఏల నారంభించాడు.

కృష్ణుడు అర్జునుడితో కూడా కొన్నాళ్ళు యాత్రలు జరిపి, కబుర్లతో కాలక్షేపం చేసి హస్తినాపురానికి తిరిగి వస్తూ, "అర్జునా, నేను వసుదేవుణ్ణీ, ఇతర యాదవులనూ చూసి చాలా కాలమయింది. ప్రస్తుతం నే నిక్కడ చేసేదికూడా ఏమీ లేదు. అందుచేత ద్వారకకు పోతాను. ఈ సంగతి నీవే ధర్మరాజుకు చెప్పు. ఆయన ఇష్టంలేకుండా పోవటం నాకు రుచించదు," అన్నాడు.

అర్జునుడు ధర్మరాజుతో ఈ మాట చెప్పాడు. ధర్మరాజు అందుకు సమ్మతిస్తూ, "మళ్లీ నేను చేయబోయే అశ్వమేధానికి రావాలి. మమ్మల్ని మరిచి పోవద్దు," అన్నాడు. కృష్ణుడు ధర్మరాజిస్తానన్న రత్నాలు మొదలైన కానుకలు నిరాకరించి, కుంతి దగ్గిర సెలవు పుచ్చుకుని, తన రథం మీద సుభద్రను కూచోబెట్టుకుని, సాత్యకి అర్జునుడితో సహా మరొక రథంలో వెంటరాగా ద్వారకకు బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాక మిగిలిన వారందరూ వెనక్కు వచ్చేశారు. కృష్ణ సాత్యకులు సుభద్రతో ద్వారకకు బయలుదేరారు. దారిలో కృష్ణుడు ఉదంక మహాముని దర్శనం చేసుకున్నాడు. "కౌరవ పాండవుల మధ్య సంధి చేయ వెళ్ళావట! ఇప్పు డందరూ సుఖంగా ఉన్నారా?" అని ఉదంకు డడిగాడు. యుద్ధం జరిగి రెండు వంశాలూ నామ మాత్రంగా మిగిలాయని కృష్ణుడు ఉదంకుడికి తెలిపాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) FEBRUARY 1963 Regd. No. M. 4854



మహాభారతం

భారతం

కృష్ణాదులు ద్వారకకు తిరిగి వచ్చే సమయానికి అక్కడ రైవతక మహోత్సవం కోలాహలంగా జరుగుతున్నది. స్త్రీ పురుషులు బాగా తిని, తాగి ఉత్సాహంతో పాడుతున్నారు, ఆడుతున్నారు. ఎక్కడ చూసినా పరమానందంగా ఉన్నది.

కృష్ణుడు ఇంటికి వెళ్ళి తన తల్లి దండ్రులకు నమస్కారం చేశాడు. అతన్ని చూడటానికి యాదవులంతా వచ్చారు. అంతా కూర్చుని ఉండగా వసుదేవుడు కృష్ణుణ్ణి యుద్ధ వార్తలడిగాడు. కృష్ణుడు కావాలనే అభిమన్యుడి చావు వివరాలు వదిలేసి మిగిలిన విషయాలన్నీ తండ్రికి తెలిపాడు. అంతా వింటున్న సుభద్ర, "అన్నా, అన్నీ చెప్పి అభిమన్యుడి చావు ఎందుకు చెప్పవు ?" అంటూ దుఃఖాతిశయంతో కుప్పగా కూలి పోయింది. కృష్ణుడి నోట అభిమన్యుడి చావు గురించి విన్నాక వసుదేవుడు కూడా శోక సముద్రంలో మునిగి పోయాడు. కృష్ణు డాయనను తగిన విధంగా ఓదార్చాడు. అనంతరం వసుదేవుడూ, బలరామ కృష్ణ సాత్యకులూ అభిమన్యుడి కోసం తర్పణాలు వదిలి బ్రాహ్మణులకు సువర్ణ వస్త్ర గోదానా లిచ్చారు, సంత్పరణలు చేశారు.


అక్కడ హస్తినాపురంలో కూడా అభిమన్యుడి చావు నుంచి ఎవరూ తేరుకోలేదు. చిన్న పిల్ల ఉత్తర కొన్నిరోజులు ఆహారమే ముట్టలేదు. ఆమె గర్భవతిగా కూడా ఉన్నదేమో అందరూ ఆమె దుఃఖానికి విచారించారు. వ్యాసుడు వచ్చి కుంతినీ, ఉత్తరనూ, అర్జునుణ్ణీ పరామర్శించి; అశ్వమేధం చెయ్యమని ధర్మరాజును హెచ్చరించాడు.

ధర్మరాజు అశ్వమేధం చెయ్యాలంటే ధనం కావాలి. మరుత్తు తాలూకు ధనం హిమాలయాలలో ఉన్నది. దానిని తీసుకురావాలి. అలా చెయ్యటం గురించి ధర్మరాజు భీముణ్ణి సలహా అడిగాడు. "శివుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకుని ఆ ధనం తెచ్చుకుందాం. శివుడు ప్రసన్నుడైతే గాని ఆ ధనాన్ని రక్షించే కిన్నరులు ప్రసన్నులు కారు," అన్నాడు భీముడు. మిగిలిన పాండవులు కూడా అలాగే అన్నారు.

ఒక మంచి రోజున బ్రాహ్మణాశీర్వచనాలు పొంది ధర్మరాజు హిమాలయాలకు బయలు దేరాడు. రాజ్యాన్ని యుయుత్సుడికి అప్పగించి, ధృతరాష్ట్ర గాంధారీ కుంతీల వద్ద సెలవు పుచ్చుకుని పంచపాండవులు బయలుదేరారు. వారి వెంట పెద్ద సేన కూడా వెళ్ళింది. వారు అనేక నదులూ, పర్వతాలూ గడిచి హిమాలయాలు చేరి, మరుత్తుడు ధనరాశి వుంచిన చోట విడుదులు ఏర్పాటు చేసుకున్నారు. తరవాత పాండవులు బ్రాహ్మణుల సలహాపై ఆ రాత్రి ఉపవాసం వుండి, దర్భచాపల పైన నిద్రపోయారు.

మర్నాడు ధర్మరాజు శివుడికీ, ప్రమథగణాలకూ విందు చేసి పూజించి, ఆయన ద్వారా లభించిన ధనాన్ని అనేక వేల ఒంటెల మీదా, గుర్రాల మీదా, ఏనుగుల మీదా, బళ్ళ మీదా, మనుషులతోనూ మోయించుకుని హస్తినాపురానికి బయలుదేరాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'



మహాభారతం

భారతం

ఈ లోపల ద్వారకలో కృష్ణుడు అశ్వమేధ యాగానికి బయలుదేరే సమయం వచ్చిందని నిశ్చయించి, యాదవులతో సహా హస్తినాపురానికి బయలుదేరాడు. అతని వెంట ప్రద్యుమ్నుడూ, సాత్యకీ, సుభద్రా, బలరాముడూ, సాంబుడూ, కృతవర్మా మొదలైనవారంతా బయలుదేరారు. వారు హస్తినాపురం చేరే సమయానికి, పాండవుల తరపున ధృతరాష్ట్రుడు విదురుడితో సహా ఎదురువెళ్ళి నగరానికి తీసుకొచ్చాడు.

వీరంతా వచ్చి ఉన్న సమయంలోనే ఉత్తరకు ప్రసవం వచ్చింది. పాండవ వంశానికి అంకురం కలగనున్నదని ఆనందంతో ప్రజలు చేసిన సింహనాదాలు అంతలోనే నిలిచిపోయాయి—ఉత్తరకు పుట్టినది మృతశిశువు!

ఈ వార్త వింటూనే కృష్ణుడు సాత్యకితో సహా త్వరగా అంతఃపురానికి వచ్చాడు. కుంతి ఆత్రంగా ఎదురు వచ్చి, "కృష్ణా, త్వరగా రావాలి," అన్నది. ఆమె వెనకగా సుభద్రా, ద్రౌపదీ, ఇతర స్త్రీలూ ఏడుస్తూ వచ్చారు. "నాయనా, అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రంతో నీ మేనల్లుడి కొడుకు చచ్చి పుట్టాడు. వాణ్ణి ఎలా బతికిస్తావో!" అన్నది. సుభద్ర కూడా తన మనవణ్ణి బతికించమని అన్నను వేడుకున్నది. అలాగే బతికిస్తానని స్త్రీ జనానికి ధైర్యం చెప్పి కృష్ణుడు పురిటింట ప్రవేశించాడు పురిటిల్లు జనంతో కిటకిటలాడుతున్నది. అక్కడ వైద్యులు కూడా, ఉన్నారు. ఉత్తర కృష్ణుడి కాళ్ళమీద పడి తన కొడుకును బతికించమని ఏడ్చింది. ఆమె దుఃఖం చూడలేక మిగిలిన స్త్రీలు కూడా ఏడ్చారు.

అప్పుడు కృష్ణుడు, "నేనే అబద్ధమాడనివాడనైతే, ధర్మమంటే అభిమానం కలవాడనైతే ఈ అభిమన్యు సుతుడు బ్రతుకు గాక!" అంటూ ఆ మృత శిశువును తన పాదంతో తాకి ఆ పాదమస్తకం రాచాడు. వెంటనే ఆ శిశువులోకి ప్రాణమూ, చలనమూ వచ్చాయి. బ్రహ్మాస్త్ర ప్రభావం విరిగిపోయింది.


అక్కడి జనం పొందిన ఆనందానికి మేరలేదు. ముఖ్యంగా కుంతీ, సుభద్రా, ద్రౌపదీ, ఉత్తరా పట్టలేని సంతోషం పొందారు. అందరూ కృష్ణుణ్ణి కీర్తించారు.

"వంశం పరిక్షీణం అయే దశలో పుట్టాడు గనక వీడికి పరీక్షిత్తు అని పేరు పెడుతున్నాను," అన్నాడు కృష్ణుడు. ఆ విధంగా చచ్చి బతికిన పరీక్షిత్తు దినదిన ప్రవర్ధమానుడవుతూ పెరగసాగాడు. ఒక నెల గడిచింది.

అప్పుడు పాండవులు ధనంతో సహా తిరిగి వచ్చారు. యాదవులు వారి కెదురువెళ్ళి తీసుకొచ్చారు. హస్తినాపురమంతా పుష్పమాలలతో అలంకరించారు. ధ్వజా లెత్తారు. పతాక లెగిరాయి. పౌరులంతా తమ ఇళ్ళకు అలంకారాలు చేసుకున్నారు. పూజలు జరిగాయి. నర్తకులు నాట్యాలు చేశారు. గాయకులు పాడారు. హస్తినాపురం రెండో అలకా నగరంలా తయారయింది.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor : 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu)   APRIL 1963   Regd. No. M. 4854



మహాభారతం

భారతం

పాండవులు హిమాలయం నుంచి ధనరాసులతో తిరిగి వచ్చిన కొద్దికాలానికే వ్యాసుడు వచ్చాడు. ధర్మరాజు ఆయనతో, "మీరు చెప్పిన ప్రకారమే ధనం తెచ్చాం. ఇక మీరు మా చేత అశ్వమేధ యాగం చేయించండి. అది ఎప్పుడు ఎలా చేయాలో మీరే నిర్ణయించాలి," అన్నాడు.

"నేనూ, పైలుడూ, యాజ్ఞవల్క్యుడూ కలిసి నీచేత ఈ యాగం చేయిస్తాం. వచ్చే చైత్ర పౌర్ణమినాడు యజ్ఞదీక్ష వహించు. సంభారాలన్నీ సిద్ధం చేయించు. యాగాశ్వాన్ని అశ్వవిద్య తెలిసిన సూతులూ, బ్రాహ్మణులూ పరీక్షించాలి. తరవాత ఆ గుర్రాన్ని దేశం మీద విడవాలి," అని వ్యాసుడు చెప్పాడు.

యాగాశ్వాన్ని కాపాడటానికి అర్జునుడు నియోగించబడ్డాడు. అతని వెంట నకులుడు కూడా వెళ్ళటానికి ఏర్పాటు జరిగింది. ధర్మరాజు యాగదీక్షలో ఉండే కాలంలో రాజ్యభారం మోసేపని భీముడికీ, కుటుంబ వ్యవహారాలు చక్కదిద్దేపని సహదేవుడికీ ఇచ్చారు.

అశ్వం వెంట బయలుదేరుతున్న అర్జునుడితో ధర్మరాజు, "నిన్ను ఎవరైనా క్షత్రియ వీరులు అడ్డగించితే వారితో వైరం రాకుండా ప్రవర్తించు. నేను అశ్వమేధం చేస్తున్నానని వారితో చెప్పి వారిని ఆహ్వానించు," అని చెప్పాడు.


చైత్రపూర్ణిమనాడు ధర్మరాజు చేత యజ్ఞదీక్ష పట్టించారు. యాగాశ్వాన్ని వ్యాసుడు స్వయంగా విడిచాడు. దాని వెంట వెళుతున్న అర్జునుణ్ణి అందరూ దీవించి పంపారు. అర్జునుణ్ణి చూడటానికి పురజనులు తండోపతండాలుగా వచ్చారు. అర్జునుడి వెంట యాజ్ఞవల్క్యుడి శిష్యుడొకడూ, కొందరు బ్రాహ్మణులూ, క్షత్రియులూ బయలుదేరారు.

యాగాశ్వం మొదట ఉత్తర దిక్కుగా పోయింది. దారిలో కిరాతులూ, యవనులూ, మ్లేచ్ఛులూ అర్జునుణ్ణి ఎదిరించి, యుద్ధం చేసి నాశనమైపోయారు. అర్జునుడు భారత యుద్ధంలో త్రిగర్తులను చంపాడు. వారి సంతతివారు యాగాశ్వాన్ని పట్టుకుని దొమ్మిగా అర్జునుడితో యుద్ధంచేయ సిద్ధపడ్డారు. అన్న చెప్పిన ప్రకారం అర్జునుడు వారిని మంచి చేసుకొనటానికి యత్నించాడు. కాని త్రిగర్త రాజైన సూర్యవర్మ తన సేనతో సహా అర్జునుణ్ణి ఎదుర్కొన్నాడు. సూర్యవర్మనూ, అతని తమ్ముణ్ణీ, మరి కొందరు యోధులనూ అర్జునుడు యుద్ధంలో చంపగా మిగిలినవారు శరణువేడారు.

గుర్రం ముందుకు పోయింది. ప్రాగ్జ్యోతిషపురం దగ్గిర భగదత్తుడి కొడుకు వజ్రదత్తుడు గొప్ప ఏనుగుపై వచ్చి అర్జునుణ్ణి ఎదిరించాడు. ఇద్దరికీ మూడు రోజులపాటు యుద్ధం జరిగింది. నాలుగోనాడు వజ్రదత్తుడు అర్జునుడికి ప్రాణాలతో దొరికాడు. అర్జునుడు అతనితో, "నీతో నాకు వైరం లేదు. మా అన్న అశ్వమేధ యాగం చేస్తున్నాడు. దానికి నీవు తప్పక రావాలి," అని చెప్పాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) MAY 1963 Regd. No. M. 4854



మహాభారతం

భారతం

యాగాశ్వం ప్రాగ్జ్యోతిషం నుంచి సింధుదేశాల కేసి నడిచింది. దాని వెంట వస్తున్న అర్జునుణ్ణి సింధు వీరులు ప్రతిఘటించారు. తమ రాజైన సైంధవుణ్ణి చంపాడని అర్జునుడి పై వారికి చాలా ఆగ్రహంగా ఉన్నది. అందుచేత వారు అర్జునుణ్ణి చుట్టు ముట్టి బాణవర్షం కురిపించారు. అర్జునుడు మొదట తీవ్రంగా దెబ్బ తినికూడా వారితో వీరోచితంగా యుద్ధం సాగించాడు. కొంత సేపటికి సింధు వీరుల శక్తి సన్నగిల్లింది.

ఆ సమయంలో దుశ్శల ఒక రథంలో తన మనమణ్ణి కూచో బెట్టుకుని అర్జునుడున్న చోటికి వచ్చి, భోరున ఏడ్చింది. సైంధవుడి భార్యా, ధృతరాష్ట్రుడి కూతురూ అయిన దుశ్శలను అర్జునుడు ఓదార్చి ఆమె వచ్చిన కారణం అడిగాడు.

"అన్నా, వీడు నా కొడుకైన సురథుడి కొడుకు. నీకు పరీక్షిత్తు ఎంతో వీడు అంతే అనుకుని దయ చూపు. వీడి తండ్రి నీ చేత తన తండ్రి చచ్చిన సంగతి విని ఉన్నాడు, గుర్రం వెంట నీవు వస్తున్నావని తెలియగానే ప్రాణాలు విడిచాడు. నా భర్త మీకు చేసిన ద్రోహం మరిచిపో, ఈ సింధు వీరులను కూడా క్షమించు," అన్నది దుశ్శల. అర్జునుడు ఆమెను కౌగలించుకుని ఇంటికి పంపేశాడు.

అక్కడి నుంచి బయలుదేరిన గుర్రం మణిపుర రాజ్యానికి వెళ్ళింది. మణిపుర రాజైన బభ్రువాహనుడు తన తండ్రి వస్తున్నాడని తెలిసి అర్జునుడికి ఎదురు వచ్చాడు. అర్జునుడు ఇందుకు సంతోషించటానికి బదులుగా, "సాయుధుడనై యుద్ధానికి వచ్చిన నాకు నీవు ఎదుర్కోల ఇవ్వటం ఏమీ వీరోచితంగా లేదు," అని అవమానించాడు. అప్పుడు నాగలోకం నుంచి ఉలూచి వచ్చి బభ్రువాహనుడితో, "నాయనా, నేను నీ తల్లిని. నీ తండ్రి కోరినట్టు యుద్ధం చేసి నీ పరాక్రమంతో ఆయనను మెప్పించు," అన్నది. ఆ మాట విని, అంత వరకూ సిగ్గుతో తల వంచుకుని ఉండిన బభ్రువాహనుడు అర్జునుడితో యుద్ధం చెయ్యటానికి సన్నద్ధుడయాడు.

నిజానికి బభ్రువాహనుడు ఉలూచి కొడుకు కాడు. అతని తల్లి చిత్రాంగద. ఉలూచి ఒకప్పుడు, అర్జునుడు తీర్థయాత్రలు చేసేటప్పుడు, తన మాయచేత అతన్ని తీసుకుపోయి తన లోకంలో కొంతకాలం తన భర్తగా ఉంచుకుని అతనివల్ల ఇరావంతుడనే కొడుకును కూడా కన్నది. అర్జునుడు వెళ్ళిపోయినాక కూడా ఆమెకు అతనిపై ప్రేమ పోలేదు. అర్జునుడు శిఖండి చాటున ఉండి భీష్ముణ్ణి చంపినందుకు నరకానికి పోతాడని గంగాతీరాన వసువులు అనుకుంటుండగా విని, అర్జునుడు తన కొడుకుతో యుద్ధం చేసినట్టయితే ఈ నరకం తప్పుతుందని తెలుసుకుని ఆమె ఈ సమయంలో తండ్రి పై కొడుకును యుద్ధానికి ప్రేరేపించింది.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor : 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) JUNE 1963 Regd. No. M. 4854



మహాభారతం

భారతం

ఉలూచి అన్న మాటలతో బభ్రువాహనుడికి రోషం వచ్చింది. అతను బంగారు కవచమూ, మెరిసే శిరస్త్రాణమూ ధరించి, ధనుర్బాణాలు తీసుకుని రథ మెక్కాడు. రథం నిండా ఆయుధాలున్నాయి, దాని పైన సింహధ్వజమున్నది. ఆ రథంలో అతను అర్జునుడి వద్దకు వెళ్ళి, తన మనుషులను గుర్రాన్ని పట్టమని ఆజ్ఞాపించాడు.

ఇది చూసి సంతోషించి అర్జునుడు భూమిపైన నిలబడే తన కొడుకును ఎదుర్కొన్నాడు. ఇద్దరి మధ్యా భయంకరమైన యుద్ధం సాగింది. ఇద్దరూ బాగా గాయపడ్డారు. బభ్రువాహనుడు వేసిన ఒక బాణంతో అర్జునుడు స్పృహతప్పి పడిపోయాడు. చాలా దెబ్బలు తిని ఉన్న బభ్రువాహనుడు తండ్రినిచూసి తానుకూడా స్పృహతప్పి పడిపోయాడు.

బభ్రువాహనుడి తల్లి చిత్రాంగద యుద్ధం జరిగే చోటికి వచ్చి స్పృహలేక పడి ఉన్న భర్తనూ, కొడుకునూ చూసి వణికిపోతూ, ఏడవ నారంభించింది. ఆమె ఉలూచిని చూసి, "ఇదేమిటి అక్కా ? తండ్రిని కొడుకు చేత చంపించి, ఏమీ పట్టనట్టున్నావేమిటి ? నా కొడుకు పోతే మానె, అర్జునుణ్ణయినా బతికించు. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటాను," అన్నది.

కొంతసేపటికి బభ్రువాహనుడికి స్పృహ వచ్చింది. అతను తల్లిని చూశాడు. ఆమె తన భర్త కోసం ఏడుస్తూ ఉండటం చూశాడు. ఎంతో నొచ్చుకుని, గుర్రం వెంట వచ్చిన బ్రాహ్మణులను తండ్రిని చంపిన వాడికి ప్రాయశ్చిత్తం ఏమిటని అడిగాడు.


పశ్చాత్తాపంతో అలమటించే బభ్రువాహనుణ్ణి సమీపించి ఉలూచి, "నాయనా, నీ తండ్రి గురించి భయపడకు. నీ పరాక్రమం చూసి నీ తండ్రి సంతోషించాలని మీకు కయ్యం పెట్టాను. ఇదుగో సంజీవన మణి. దీనిని మీ తండ్రి రొమ్ముపై ఉంచు, ఆయన బతుకుతాడు," అన్నది. ఆమె చెప్పినట్టే, మణి రొమ్మున పెట్టగానే అర్జునుడు నిద్ర మేలుకున్నట్టుగా లేచి కూచున్నాడు.

అతను తనకు మొక్కిన బభ్రువాహనుణ్ణి కౌగలించుకుని, ఉలూచినీ చిత్రాంగదనూ చూసి, "ఇక్కడికి మీక్కలా వచ్చారు ?" అని అడిగాడు. ఉలూచి అతనితో తానెందుకు వచ్చినదీ, ఏమి జరిగినదీ చెప్పింది. భీష్ముణ్ణి చంపిన పాపం తనను బాధించకుండా ఉలూచి ఈ పని చేసిందని విని సంతోషించి అర్జునుడు బభ్రువాహనుణ్ణి అశ్వమేధయాగానికి ఆహ్వానించి, తిరిగి యాగాశ్వం వెంట బయలుదేరాడు.

యాగాశ్వం సముద్రతీరం దాకా వెళ్ళి హస్తినాపురి దారి పట్టి మగధ, చేది, కాశి, కోసల మొదలైన దేశాల మీదుగా దక్షిణదేశం సంచరించి, గాంధారానికి వెళ్ళి తరవాత హస్తినాపురం చేరుకున్నది. ఈ యాత్రలో అర్జునుడు చాలా మందిని ఓడించాడు. వారిలో చెప్పకోదగినవారు మగధరాజు మేఘసంధి, నిషాదరాజు ఏకలవ్యుడు, గాంధార రాజైన శకునికుమారుడు. అతను తనతో ఓడిన వారందరినీ అశ్వమేధ యాగానికి ఆహ్వానించాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Rcad, Madras-26. Controlling Editor : 'CHAKRAPANI'

CHANDAMAMA (Telugu) JULY 1963 Regd. No. M. 4854



మహాభారతం

భారతం

ధర్మరాజు యజ్ఞదీక్ష బూనాడు. ఈ యజ్ఞంలో బ్రాహ్మణులకు దానాలు మూడింతలుగా ఇవ్వమనీ, అలా చేస్తే మూడశ్వమేధాలు చేసిన పుణ్యం లభిస్తుందనీ వ్యాసుడు చెప్పాడు.

యజ్ఞాంతంలో ధర్మారాజు తన రాజ్యమంతా వ్యాసుడికి దానం చేసి, "మహాత్మా, ఈ భూమిని మీరు గ్రహించి బ్రాహ్మణులకు పంచండి. నేనూ, నా తమ్ములూ, భార్యా వనాలకు పోతాం," అన్నాడు. "బ్రాహ్మణులకు భూమితో ఏం పని? దాన్ని నీవే ఉంచుకుని, దానికి సమానమైన విలవ గల బంగారాన్ని దానం చెయ్యి," అన్నాడు వ్యాసుడు.


అందరూ అనందోత్సాహలలో ఉన్న సమయంలో కలుగులో నుంచి ముంగిస ఒకటి వచ్చింది. దాని శరీరంలో ఒక పార్శ్వం బంగారంలాగున్నది. అది అక్కడి వారితో, "ఇదొక గొప్ప యజ్ఞమనుకుంటున్నారా? ఒక ముని చేసిన పేలపిండి దానం ఇచ్చిన ఫలితాన్ని ఇది ఇయ్యదు! ఆ దానాన్ని నేను స్వయంగా చూశాను గనక నాకు తెలుసు," అన్నది.

బ్రాహ్మణులాశ్చర్యపడి, ఆ పేలపిండి దానం వృత్తాంతం చెప్పమని ముంగిస నడిగారు. ముంగిస ఇలా చెప్పింది :

కురుక్షేత్రంలో ఒక బ్రాహ్మణుడు ఉంఛవృత్తి చేసుకుని జీవించేవాడు. బ్రాహ్మణుడూ, భార్యా, కొడుకూ కోడలూ కూడా నేలపై దొరికిన ఆహారం ఏరుకుని దానితోనే పొట్టపోసుకునేవారు. ఇలా ఉండగా క్షామం వచ్చింది. చెట్లన్నీ ఎండిపోయాయి. ధాన్యం దొరకక ఆ బ్రాహ్మడి కుటుంబం ఆకలి బాధకు గురి అయింది. ఆ స్థితిలో వారి కొకనాడు కొంత యవ ధాన్యం దొరికింది. దానిని వారు పేలపిండి చేసుకుని, నాలుగు భాగాలుగా పంచుకుని తినబోతూండగా వారి ఆశ్రమాని కొక అతిథి వచ్చాడు. అతిథికి వారు స్వాగతం చెప్పి అర్ఘ్యపాద్యా లిచ్చి లోపలికి తీసుకువచ్చారు. అతిథి ఆకలి మీద ఉండటం చూసి బ్రాహ్మణుడు తన వంతు పేలపిండి ఆయనకు ఆహారంగా ఇచ్చాడు. అతిథి సంతోషంతో ఆ పేలపిండి తిని ఆకలి తీరని వాడిలాగా కనబడ్డాడు. అది చూసి బ్రాహ్మణుడి భార్య తన వంతు పేలపిండి అతిథి కిచ్చింది. దానితో కూడా అతిథి కడుపు నిండలేదు. అందుచేత బ్రాహ్మణుడి కొడుకూ, కోడలూ కూడా తమ వంతు పేలపిండిని అతిథి కిచ్చారు. అతిథి అందరి వంతు పేలపిండీ తిని తృప్తిపొందినవాడై, "నేను యముణ్ణి. మీ దాతృత్వం పరీక్షించ వచ్చాను. మీరు చేసిన ఈ దానానికి ఫలితంగా మీ కోసం స్వర్గం ఎదురు చూస్తున్నది. వెంటనే అక్కడికి వెళ్ళిపొండి," అన్నాడు.

ముంగిస బ్రాహ్మణులతో, "ఇదంతా నేను స్వయంగా చూశాను. అందరూ వెళ్ళాక నే నా ప్రాంతంలో తిరుగుతూంటే అక్కడి తడీ, పేలపిండి తాలూకుపొడీ అంటి నా శరీరంలో ఒక పార్శ్వమంతా బంగారమయింది. మిగిలిన శరీరం కూడా బంగారం చేసుకుందామని ఎన్ని యజ్ఞాలకో వెళ్ళాను. ఎంతో ఆశతో ఇక్కడికి వచ్చాను. ధర్మరాజు చేసిన ఈ అశ్వమేధం కూడా నా శరీరాన్ని బంగారం చెయ్యలేకపోయింది," అన్నది.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor : 'CHAKRAPANI'



మహాభారతం

భారతం

కాలం గడిచింది. ధృతరాష్ట్రుడి పైన పెద్దరికం ఉంచి పాండవులు సుఖంగా రాజ్యం ఏలుకుంటున్నారు. విదురుడూ, సంజయుడూ, యుయుత్సుడూ, కృపుడూ ధృతరాష్ట్రుణ్ణి కొలిచి ఉండేవారు. వ్యాసుడు అప్పుడప్పుడూ వచ్చి ఆయనకు ఏవేవో కథలు చెబుతూండే వాడు. ధర్మరాజు ఆయనతో చెప్పకుండా ఏ పనీ చేసేవాడు కాడు.

ధృతరాష్ట్రుణ్ణి పాండవులు కొలిచినట్టే గాంధారిని కుంతీ, ద్రౌపదీ, సుభద్రా, ఉలూచీ మొదలైన వాళ్ళు కొలిచేవారు. ఆ వృద్ధ దంపతుల మనస్సుకు కష్టం కలిగించిన వారిని శిక్షిస్తానని ధర్మరాజు ప్రకటించాడు కూడా. వాళ్ళుకూడా గతాన్ని మరిచిపోయి పాండవులను తమ పిల్లల్లాగే చూసుకునేవారు.

పానకంలో పుడకలాగా భీముడొక్కడు మాత్రం ధృతరాష్ట్రుణ్ణి మనసారా ద్వేషించే వాడు. ధృతరాష్ట్రుడికి కూడా భీముణ్ణి తలుచుకుంటే పుత్రశోకం వచ్చేది.

ఈ విధంగా పదిహేనేళ్ళు గడిచాయి. అయినా భీముడి ప్రవర్తన ఏమీ మారలేదు. అతను ధృతరాష్ట్రుడికి బాధ కలిగించే పనులు చాటుమాటుగా చేస్తూనే ఉన్నాడు; ధృతరాష్ట్రుడి సేవకులను కూడగట్టుకుని వాళ్ళు చేయవలసిన పనులు జరగకుండా చేస్తున్నాడు. తన మిత్రులను చేర్చి జబ్బలు చరుచుకుంటూ, "ఈ చేతులతో గాంధారీ ధృతరాష్ట్రుల కొడుకు లందరినీ చంపాను! ఇప్పటికీ వాళ్ళను తలుచుకుంటే మండి పోతుంది. వాళ్ళని బలి తీసుకున్న ఈ చేతులకు గంధం పూయాలి!" అంటూనే ఉన్నాడు.


ఇలాటి మాటలూ, చేష్టలూ విని ఆ వృద్ధ దంపతులు కుమిలిపోతూండేవారు. భీముడి ప్రవర్తన గురించిగాని, దాని మూలంగా గాంధారీ ధృతరాష్ట్రులు పొందుతున్న మనఃక్లేశం గురించి గాని ధర్మరాజుకు తెలియదు. గాంధారీ ధృతరాష్ట్రులు తిండికూడా మాని, రోజుకు ఒక్కసారే తింటూ, దర్భలపై పడుకుంటూ కృశించసాగారు.

కొంత కాలం గడిచాక ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో తనకు వానప్రస్థం వెళ్ళి తపస్సు చేసుకోవాలని ఉన్నదనీ, తన వెంట గాంధారీ, విదురుడూ, సంజయుడూ, కృపుడూ వస్తారనీ, అందుకు సమ్మతించమనీ అడిగాడు.

ఈ మాటలు విని ధర్మరాజు చాలా బాధపడి, "నీ కింత విరక్తి కలిగితే నా కిక ఈ రాజ్యం దేనికి? ఈ వయసులో నిన్ను వనానికి పోనిచ్చి, కష్టాలు పడనిస్తే లోకం నన్నేమంటుంది? నీ మనసులో ఏదైనా సంతాపం ఉంటే చెప్పు, దాన్ని నేను తొలగిస్తాను. అంతేకాని నీవు అరణ్యవాసం వెళ్ళటానికి నేను సమ్మతించను!" అన్నాడు.

ఇందువల్ల ధృతరాష్ట్రుడికి మరింత బాధ కలిగిందే గాని ఆయన నిర్ణయం మారలేదు. ఆ సమయానికి వ్యాసుడు వచ్చి, ధర్మరాజుతో ధృతరాష్ట్రుడి నిర్ణయం సరి అయినదని చెప్పి ఒప్పించాడు.

Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'



మహాభారతం



మహాభారతం

ధృతరాష్ట్రుడు ఆశ్రమవాసానికి బయలు దేరటానికి అవసరమైన ప్రయత్నాలకు ధర్మరాజు ఉత్తరు విచ్చాడు. ఈ వార్త త్వరలోనే హస్తినాపుర మంతటా వ్యాపించింది. నగరంలోని పౌరులు అన్ని వర్గాల వారూ రాజభవనం వెలపల గుంపులు కూడారు.

అప్పుడు ధృతరాష్ట్రుడు గాంధారితో కూడా అంతఃపురం నుంచి బయటికి వచ్చి ప్రజలతో, "ప్రజలారా, నేనూ గాంధారీ కలసి అరణ్యానికి పోవ నిశ్చయించాం. ఇందుకు వ్యాసమహర్షీ, మా ధర్మరాజూ కూడా సమ్మతించారు. మీరు కూడా సమ్మతిస్తారని నమ్ముతున్నాను. మీకూ నాకూ ఉండే అన్యోన్యం శాశ్వతమైనది. నేను ముసలితనం వల్లా, కొడుకులను పోగొట్టుకునీ కృశించి ఉన్నాను. రాజ్యభారం ధర్మరాజు మీద పెట్టి తేలికపడాలని ఉన్నది. దుర్యోధనుడి పాలన కంటె ధర్మరాజు పాలన చాలా మేలని నా నమ్మకం. ఈ స్థితిలో వనవాసం కన్న నాకు ఉత్తమమైనది లేదు. అందుకు మీరు అనుమతించాలి," అన్నాడు.

ఈ మాటలు విని ప్రజలు దుఃఖార్తులై తలా ఒక మాటా అన్నారు. ధృతరాష్ట్రుడు వారితో మళ్ళీ, "ఈ దేశాన్ని శంతనుడు పాలించాడు; భీష్ముడూ, విచిత్రవీర్యుడూ పాలించారు. మా తమ్ముడు పాండురాజు పాలించాడు. ఏదో నేను కూడా కొంత సేవ చేశాను. ఆ సేవలో తప్పులు జరిగితే క్షమించండి. మా దుర్యోధనుడు ఈ రాజ్యాన్ని నిష్కంటకంగా అనుభవించి, అహంకారి అయి క్షత్రియ వంశాలమధ్య గొప్ప యుద్ధం తెచ్చి పెట్టాడు. అందులో నా తప్పుకూడా కొంత ఉండి ఉండవచ్చు. మీరు దానిని మరచిపొండి. ఇప్పుడు కౌరవులకు కూడా ధర్మరాజే రాజు. తన నలుగురు తమ్ములూ

అట్ట చివరి బొమ్మ



మంత్రులుగా అతను మిమ్మల్ని పాలిస్తాడు. అతన్ని మీకూ, మిమ్మల్ని అతనికీ అప్పగిస్తున్నాను. నా కొడుకులు చేసిన అపరాధాలన్నీ క్షమించమని నేనూ కుంతీ మిమ్మల్ని వేడుకుంటున్నాం. మా ప్రయాణానికి అనుమతించండి. మీ కందరికీ నమస్కారం," అన్నాడు.

ఈ మాటలు వింటుంటే ప్రజలకు దుఃఖం ఆగలేదు. కొంత సేపయాక వారు తమ ప్రతినిధిగా మాట్లాడటానికి ఒక బ్రాహ్మణుణ్ణి నియోగించారు. ఆ బ్రాహ్మణుడు ధృతరాష్ట్రుడితో, "రాజా, ఈ ప్రజల పక్షాన నేను చెప్పేదేమంటే, మీ పూర్వులందరూ మమ్మల్ని ఎంతో ప్రీతితో పాలించారు. నీవూ మిత్రుడులాగే మమ్మేలావు. మీ దుర్యోధనుడు మా కెలాటి అపకారమూ చేసి ఉండలేదు. వ్యాసమహర్షి ఆమోదించిన పని తప్పక చేయదగినదే. కాని నీ వియోగం మాకు చిరకాలం బాధాకరంగానే ఉంటుంది. ధర్మరాజు వెయ్యేళ్ళు పరిపాలించాలని కోరుకుంటున్నాము," అన్నాడు.

తరవాత గాంధారీ ధృతరాష్ట్రులు ప్రజల వద్ద సెలవు పుచ్చుకుని అంతఃపురానికి తిరిగి వచ్చారు.

ఆ రాత్రి గడిచింది. మర్నాడు ధృతరాష్ట్రుడు పంపగా విదురుడు ధర్మరాజు ఇంటికి వచ్చి, "ధృతరాష్ట్రుడు ఈ కార్తిక మాసంలో వనవాసానికి ప్రయాణం నిశ్చయించాడు. ఆయన భీష్మ ద్రోణులకూ, తన కొడుకులకూ, సైంధవుడికీ, ఇతర మిత్రులకూ శ్రాద్ధాలు పెడతాడట, కొంత ధనం కోరుతున్నాడు," అని చెప్పాడు.

ధన మివ్వటానికి ధర్మరాజూ, అర్జునుడూ సంతోషంతో ఒప్పుకున్నారు. కాని భీముడు అభ్యంతరం చెప్పాడు. అర్జునుడు భీము

డితో, "అయన శ్రాద్ధాలు జరిపేది భీష్మాదు లకే కద. కాలపరిస్థితిని బట్టి అయన మనని ధనం యాచించవలసి వచ్చింది. మనం ఒకప్పుడు అయనను యాచించిన వాళ్ళం కామా? అందుచేత ధనం ఇవ్వటానికి నీవు కూడా ఒప్పుకో. లేకపోతే నీకే అపకీర్తి. నా మాట నమ్మక పోతే ధర్మరాజు నడుగు," అన్నాడు.

భీముడు కోపంతో, "భీష్ముడు, ద్రోణుడు మొదలైన వారి శ్రాద్ధాలకు మనం ధనం ఇవ్వవచ్చు. కాని ఈ ధృతరాష్ట్రు డిప్పుడు శ్రాద్ధాలు చెయ్యవలసిన అవసరమేమిటి? దుర్యోధనాదులు ఉత్తమ లోకాలు లేక అలమటించనీ! కులనాశకులు భూమి యావత్తూ నాశనం చేసిపెట్టారు. నీవు పడ్డ కష్టాలన్నీ ఎలా మరిచావు? మనం కష్టాలు పడ్డ కాలంలో ఈయన మన కెలా పెత్తండ్రి కాకపోయాడో! జూదమప్పుడు ఈ ముసలి వాడు ఈ విదురుణ్ణే, 'మనవాళ్ళు గెలు స్తున్నారా?' అని అడగలేదా?" అని అర్జునుడితో అన్నాడు.

ధర్మరాజు అతన్ని, "చాల్లే, ఊరుకో!" అని మందలించాడు. అయన విదురుడితో, "ధృతరాష్ట్రుడు శ్రాద్ధాలకుగాను కోరే డబ్బంతా నేనే ఇస్తాను. భీముడు దిగులు



పడ నవసరంలేదు. అతను తాను పడిన కష్టాలను తలచుకుని ఏమేమో అన్నాడు, ఆ మాటలు పాటించ నవసరం లేదు," అన్నాడు.

విదురుడు ధృతరాష్ట్రుడి వద్దకు తిరిగి వెళ్ళి, జరిగినదంతా చెప్పి, "ధర్మరాజూ, అర్జునుడూ కూడా అవసరమైన ధనం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారు. బ్రాహ్మణులకు దానాలు చేయవచ్చు," అన్నాడు.


ధృతరాష్ట్రు డీ మాటలకు సంతోషించి, బ్రాహ్మణులనూ ఋషులనూ పిలిపించి,

చనిపోయిన భీష్ముడు మొదలైన వారందరి పేరా అన్నపానాలూ, యానాలూ, వాహనాలూ, క్షేత్రాలూ, గజాశ్వాలూ, కన్యకలూ మొదలైన వాటిని దానా లిచ్చాడు.

ధృతరాష్ట్రుడు చనిపోయిన వారందరికీ పెద్ద ఎత్తున శ్రాద్ధయజ్ఞం చేస్తూంటే, ధర్మరాజు పంపిన గణకులూ, లేఖకులూ దగ్గిరే ఉండి, ఆయన ఎవరి కేమి ఇవ్వమంటే అది అంతా ఇస్తూ వచ్చారు.

మర్నాడు ధృతరాష్ట్రుడు పాండవులను పిలిపించి, కార్తిక యజ్ఞం చేసి, వనవాస దీక్ష బూని, వల్కలాజినాలు ధరించి, బంధుజన పరివృతుడై గాంధారీ సమేతంగా ఇంటి నుండి బయలుదేరాడు. ఆయన వెంట కౌరవ పాండవ స్త్రీలూ, పంచపాండవులూ, విదురసంజయులూ, యుయుత్సుడూ, గౌతముడూ, ధౌమ్యుడూ నడిచారు. గాంధారి చెయ్యి తన భుజాన వేసుకుని కుంతి ఆమెను నడిపించింది. ధృతరాష్ట్రుడు గాంధారి భుజంమీద చెయ్యి వేసి తాను నడిచాడు. ద్రౌపదీ సుభద్రల వెంట, పిల్లవాణ్ణి ఎత్తుకుని ఉత్తర కూడా నడిచింది. వీరందరి వెనకగా పౌరులు వచ్చారు. అందరి మనసులూ శోకంలో మునిగి ఉన్నాయి. ఆ నాడు పాండవులు జూదంలో ఓడిపోయి వెళ్ళేటప్పుడు ఉండిన స్థితి ఈనాడు మళ్ళీ హస్తినాపురంలో ఏర్పడింది.

అందరూ సింహద్వారం చేరగానే ధృతరాష్ట్రుడు పౌరులను ఇక ఉండమని చెప్పాడు. ధృతరాష్ట్రుడి వెంట వెళ్ళటానికి విదుర సంజయులకు మాత్రమే అనుమతి లభించింది. యుయుత్సుణ్ణీ, కృపుణ్ణీ, అంతఃపుర స్త్రీలతో సహా ధర్మరాజునూ ధృతరాష్ట్రుడు వెనక్కు వెళ్ళిపొమ్మన్నాడు. అందరూ నిలిచారు. ధర్మరాజు కుంతితో, "అమ్మా, నేను వీరి వెంట వెళతాను. నీవు ఆడవాళ్ళను తీసుకుని అంతఃపురానికి తిరిగి వెళ్ళు," అన్నాడు.



CHANDAMAMA (Telugu) OCTOBER 1963 Regd. No. M. 4854



మహాభారతం



మహాభారతం


ధర్మరాజు కుంతిని స్త్రీ జనంతో బాటు ఇంటికి తిరిగి పొమ్మని చెప్పగానే కుంతి తాను కూడా గాంధారీ ధృతరాష్ట్రుల వెంట వనవాసం పోతున్నట్టు బయట పెట్టింది. ఆమె ధర్మరాజుకు అతని తమ్ములనూ, ద్రౌపదినీ పేరు పేరా అప్పగించి, "గాంధారీ ధృతరాష్ట్రులు నాకు అత్తమామల వంటి వారు. వారిని సేవించుకుంటూ నేను కూడా తపస్సు చేస్తాను," అన్నది.

ఈ మాటలు విని ధర్మరాజు నివ్వెర పోయి, "ఇవేం మాటలు? నే నిందుకు ఒప్పుకోను. మమ్మల్నీ, ఈ రాజ్యాన్నీ విడిచి ఎలా పోతావు? అరణ్యంలో ఎలా నివసిస్తావు?" అన్నాడు. భీముడు, "అమ్మా, ఇలాటి ఉద్దేశం ఉన్నదానవైతే మా చేత ఇంత భయంకరమైన యుద్ధం ఎందుకు చేయించావు? ఇప్పుడు అరణ్యానికి ఎందుకు పోవలిసి వచ్చింది?" అన్నాడు.

పాండవులందరూ ఏడుస్తూ ఆమెను విడిచి పెట్టలేదు. ద్రౌపదీ సుభద్రలు కూడా ఆమె వెంట పడ్డారు. వారందరినీ చూసి కుంతి, "మీరు జూదంలో ఓడిపోయి సుఖ భ్రష్టులైపోయారని బాధ పడి మిమ్మల్ని యుద్ధానికి ప్రోత్సహించాను. నిండు సభలో ఈ ద్రౌపదికి జరిగిన అవమానం సహించ లేక మిమ్మల్ని ప్రోత్సహించాను. అంతే గాని స్వార్థంకోరి కాదు. నేను నా భర్తతో రాజ్యభోగాలన్నీ అనుభవించాను, దానాలు చేశాను. ఇక అడవిలో తపస్సు చేసుకుంటూ పుణ్యం సంపాదిస్తాను," అన్నది.

కుంతి నిశ్చయం గ్రహించి పాండవులు వెనక్కు తగ్గారు. అప్పుడు ధృతరాష్ట్రుడు గాంధారితో, "కుంతిని హస్తినాపురానికి తిరిగి వెళ్ళమను. పుణ్యం సంపాదించా లంటే రాజ్యంలో ఉండి కూడా సంపాదించ వచ్చు. దాన వ్రతాలు అపారమైన పుణ్యం

అట్ట చివరి బొమ్మ



కలిగిస్తాయి,'' అన్నాడు. గాంధారి కూడా ఎన్నో విధాల చెప్పి చూసింది. కాని కుంతి తన నిశ్చయం మార్చుకోలేదు. ఈ లోపుగా పాండవులూ, అంతఃపుర స్త్రీలూ వాహనాలలో తిరుగు ప్రయాణం కావటం గ్రహించి ధృతరాష్ట్రుడు తన ప్రయాణం సాగించాడు.

పాండవులు హస్తినాపురానికి తిరిగి వచ్చేసరికి ఆ నగరం ఉత్సవం ముగిసిన మర్నాడున్నట్టుగా వెలవెలపోతూ ఉన్నది.

ధృతరాష్ట్రుడు తన అనుచరులతో సహా పగలల్లా చాలా దూరం నడిచి గంగాతీరాన ఒక చోట నిలిచాడు. అక్కడ బ్రాహ్మణులు అగ్నులు రగిల్చారు. ధృతరాష్ట్రుడు అగ్నిని ఉపాసించి, అస్తమించే సూర్యుణ్ణి అర్చించాడు. విదుర సంజయులు ఆయన కోసం దర్భలతో పక్క తయారు చేశారు. దానికి సమీపంలోనే గాంధారికీ, కుంతికీ దర్భలతో పక్కలు ఏర్పాటయాయి. తెల్లవార్లూ అగ్నులు ప్రజ్వలించాయి. బ్రాహ్మణులు వేదపఠనం చేశారు. ఆ రాత్రి సుఖంగా గడిచింది.

మర్నాడు వారు కాలకృత్యాలు నిర్వర్తించి, నిష్ఠతో తపశ్చర్యలు ప్రారంభించారు. కాని ఆ రోజు వారికి హస్తినాపుర పౌరులూ, వారి దుఃఖమూ మనసులో మెదులుతూనే ఉన్నది. విదురుడి సలహాపై ధృతరాష్ట్రుడు గంగాతీరాన నివాసం ఏర్పరచుకున్నాడు. అక్కడికి వనవాసం చేసే బ్రాహ్మణులూ, తదితరులూ వచ్చారు. ధృతరాష్ట్రుడు వారికి కథలు చెప్పి, తగిన రీతిని ఆదరించి పంపేశాడు. ఆ సాయంకాలం ఆయన గాంధారితో సహా గంగా స్నానం చేసి, అనేక విధులు నిర్వర్తించి, అగ్ని నారాధించాడు.

తరవాత ధృతరాష్ట్రుణ్ణి విదురుడు మొదలైన వారు కురుక్షేత్రానికి తీసుకుపోయారు. అక్కడ శతయూపుడనే రాజర్షి

ఉంటున్నాడు. కేకయవంశం వాడైన ఈ శతయూపుడు రాజ్యాన్ని తన కొడుకు కిచ్చి తపస్సు చేయవచ్చాడు. ధృతరాష్ట్రుడు శతయూపుణ్ణి కలుసుకున్నాడు. ఇద్దరూ కలిసి వ్యాసాశ్రమానికి వచ్చారు. అక్కడ ధృతరాష్ట్రుడు ఆరణ్యకవ్రతం ప్రారంభించి తపశ్చర్య సాగించాడు. కుంతీ, గాంధారీ కూడా వ్రత నిష్ఠ అవలంబించారు. ధృతరాష్ట్రుడు ఇంద్రియాలనూ మనసునూ నిగ్రహించి తీవ్రమైన తపస్సు చేశాడు. ఆయన చర్మం ఎముకలకు అంటుకుపోయింది. విదుర సంజయులు ఆయనకు సేవలు చేస్తూ వచ్చారు.

ఇలా ఉండగా ఒకనాడు ధృతరాష్ట్రుణ్ణి చూడటానికి నారదుడూ, పర్వతుడూ, దేవలుడూ, శిష్య సహితుడై వ్యాసుడూ, మరికొందరు మునులూ వచ్చారు. శతయూపుడు కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నాడు. వచ్చిన వారందరికీ కుంతీదేవి విధ్యుక్తంగా అతిథి పూజ చేసి, సంతోష పెట్టింది. గోష్ఠి జరిగింది. అనేక కథలు చెప్పుకున్నారు. ఆ సందర్భంలో నారదుడు ధృతరాష్ట్రుడికి, తపస్సు చేత స్వర్గానికి వెళ్ళిన అనేకమంది రాజులను గురించి చెప్పాడు. శతయూపుడి తాత అయిన సహస్రచిత్యుడూ, భగదత్తుడి తాత అయిన



శైలాలయుడూ, మాంధాత కొడుకైన పురుకుత్సుడూ మొదలైన వారెందరో ఈ అరణ్యంలోనే తపస్సు చేసి స్వర్గం చేరుకున్నారనీ, అక్కడ వారిని చాలా సార్లు చూశాననీ నారదుడు చెప్పాడు.

"నీ తమ్ముడైన పాండురాజు స్వర్గంలో నాకు ఇంద్రుడికి చేరువలో కనిపిస్తూంటాడు. అతను ఎప్పుడూ నిన్ను గురించే ఆలోచిస్తాడు. నీవూ, గాంధారీ తపోమహిమ చేత అక్కడికి పోతారు. కుంతి కూడా భర్తను చేరుకుంటుంది. విదురుడు ధర్మరాజులో ఐక్యమవుతాడు. సంజయుడు నీతో బాటు స్వర్గానికి వస్తాడు," అని కూడా నారదుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు.


నారదుడు చెప్పిన ఈ మాటలు విని గాంధారీ ధృతరాష్ట్రులెంతో సంతోషించారు. వారితోబాటు అక్కడ చేరిన వారందరూ నారదుణ్ణి మెచ్చుకున్నారు. అప్పుడు శతయూపుడు నారదుడితో, "ఓ మహర్షీ, నీ మాటలు వినటం చేత ధృతరాష్ట్రుడికీ, నాకూ, ఇక్కడ ఉన్న వారందరికీ తపస్సు పైన అభిమానం ఎంతగానో పెరిగింది. ధృతరాష్ట్రుడు ఏయే ఉత్తమ లోకాలు పొందుతాడో వివరంగా తెలుసుకోవాలని ఉన్నది," అని అడిగాడు.

దానికి నారదుడు, "ధృతరాష్ట్రుణ్ణి గురించి ఇంద్రలోకంలో ప్రస్తావన జరిగినప్పుడు ఇంద్రుడే స్వయంగా చెప్పగా కొన్ని విషయాలు విన్నాను. ధృతరాష్ట్రుడికింకా మూడేళ్ళాయు వున్నది. ఆ తరవాత ఇతడు గాంధారితో కూడా కుబేరుడి భవనానికి పోతాడు. కామగమనం గల విమానమెక్కి, దివ్యాభరణాలు ధరించి, దేవలోకాలన్నీ స్వేచ్ఛగా సంచరించ గలుగుతాడు," అని చెప్పాడు.

ఈ మాటలకు ధృతరాష్ట్రుడు పరమానందం చెందాడు. తరవాత వచ్చిన మహామునులందరూ తిరిగి వెళ్ళిపోయారు.



CHANDAMAMA (Telugu) NOVEMBER 1963 Regd. No. M. 4854



మహాభారతం



మహాభారతం

గాంధారీ ధృతరాష్ట్రులు వనవాసం వెళ్ళటంతో హస్తినాపురం కళా కాంతీ లేనిదయినట్టయింది. పాండవులు రాజ్యపాలనా, వేదపఠనమూ మానేసి అస్తమానమూ దిగులులో మునిగి ఉండి, ప్రత్యేకించి తమ తల్లి అయిన కుంతిని తలుచుకుని లోలోపల కుళ్ళసాగారు. నగరంలోని పౌరులు కూడా మాట్లాడుకునేటందుకు మరేమీ లేనట్టు ముసలి రాజును గురించీ, ఆయనకు కలిగిన పుత్రశోకం గురించీ, కుంతీ గాంధారీలను గురించీ, విదుర సంజయులను గురించీ కథలు చెప్పుకుంటూ సంతోషం లేకుండా ఉండిపోయారు.

ముసలివాళ్ళు వెళ్ళిపోయేసరికి పాండవులకు ముందూ, వెనుకా కూడా శూన్యం ఏర్పడింది. అభిమన్యుడూ, ఉపపాండవులూ యుద్ధంలో పోయారు. వారిని తలుచుకున్నా దుఃఖమే, తమ ముందు తరానికి చెందిన వాళ్ళేమో అరణ్యానికి వెళ్ళిపోయారు. వారు బతికున్నారో, చచ్చారో కూడా తెలీదు. వారిని తలుచుకున్నా బాధే. ఈ బాధల మధ్య ఒక్క పిసరు ఆనందం ఇవ్వటానికి పరీక్షిత్తు ఒక్కడే ఉన్నాడు.

చిట్టచివరకు అందరి మనస్సులోనూ ఉన్న గాఢమైన వాంఛను సహదేవుడే పైకి లాగాడు. అతను ధర్మరాజుతో, "అన్నా, నీకు అడవికి వెళ్ళి మనవాళ్ళను చూడాలని ఉన్నదీ, నాకు తెలుసు. నాకు అమ్మను చూడాలని ఉన్న కోరికను బయట పెట్టటానికి భయపడ్డాను. ఆవిడ ఎలా ఉన్నదో! ఏం కష్టాలు పడుతున్నదో!" అన్నాడు.

వెంటనే ద్రౌపది కూడా బలంగా మాట వేసింది. "అత్తయ్యను ప్రాణాలతో మళ్ళీ చూస్తామా? నేనే కాదు, స్త్రీ జనమంతా గాంధారీ ధృతరాష్ట్రులనూ, కుంతీదేవినీ చూడాలని తహతహలాడుతున్నారు.

అట్ట చివరి బొమ్మ



ప్రయాణం కోసం వారు ముని వేళ్ళ మీద ఉన్నారు," అన్నది.

ధర్మరాజు వెంటనే ప్రయాణ సన్నాహాలకు ఉత్తరు విచ్చాడు. పౌరులలో ధృతరాష్ట్రుణ్ణి చూడగోరిన వారందరూ బయలుదేరవచ్చుననీ, రేపే ప్రయాణమనీ చాటింపు వేయించాడు. ఈ చాటింపు విని స్త్రీలూ, వృద్ధులూ కూడా ప్రయాణమయారు. అందరూ చేరటానికి నగరం వెలపల అయిదు రోజులుండి, తరవాత అందరూ అరణ్యానికి బయలుదేరారు. వారి వెంట పెద్ద సేనకూడా కదిలింది. దానికి కృపాచార్యుడు నాయకత్వం వహించాడు. రథాల మీదా, ఏనుగుల మీదా, గుర్రాల మీదా, ఒంటెల మీదా, కాలినడకనా జనం ప్రయాణించారు. ద్రౌపది మొదలైన స్త్రీలు పల్లకీలలో ఎక్కి దారివెంట దాన ధర్మాలు చేస్తూ వెళ్ళారు. అందరూ బయలుదేరి పోతూ ఉంటే యుయుత్సుడూ, ధౌమ్యుడూ నగర రక్షణకు ఉండిపోయారు.

అందరూ కురుక్షేత్రం చేరారు. శతయూపుడూ, ధృతరాష్ట్రుడూ ఉంటున్న వనం అంత దూరాన ఉండగానే రథాలూ, వాహనాలూ దిగి, స్త్రీలతో సహా కాలినడకన ఆశ్రమానికి వచ్చారు. ఆశ్రమం అరటి తోటలతో ప్రశాంతంగా ఉన్నది. అక్కడ ఎవరూ లేరు. పాండవులు వచ్చినట్టు తెలిసి పరిసరాలలో ఉండే తాపసులు కొందరు వచ్చి, ధృతరాష్ట్రుడు యమునా నదికి స్నానం చెయ్యటానికి వెళ్ళినట్టు చెప్పారు.

అప్పుడు పాండవు లయిదుగురూ వారు చెప్పిన మార్గాన కొంత దూరం వెళ్ళేసరికి దూరంగా ధృతరాష్ట్రుడూ, గాంధారీ, కుంతీ కనిపించారు. సహదేవుడు అందరికన్నా ముందు పరిగెత్తి వెళ్ళి కుంతిని చేరి ఆమె కాళ్ళు పట్టుకుని బావురుమని ఏడ్చాడు. కుంతి కూడా కన్నీరు కార్చుతూ సహదేవుణ్ణి

లేవదీసి కౌగలించుకుని, గాంధారితో, "సహదేవుడు వచ్చాడు," అని చెప్పింది. తరవాత ఆమెకు మిగిలిన పాండవులు కూడా వస్తూ కనిపించారు.

కుంతి తాను ముందు నడిచి, గాంధారీ ధృతరాష్ట్రులను నడిపిస్తూ తన కొడుకులను సమీపించింది. పాండవులు ముసలివాళ్ళు తెస్తున్న జల పాత్రలను తాము తీసుకుని వారితోపాటు తిరిగి వచ్చారు. వారందరూ కలిసి పౌరులూ, స్త్రీలూ ఉన్న చోటికి వచ్చారు. ధర్మరాజు వారందరినీ నామ గోత్రాలతో సహా ధృతరాష్ట్రుడికి వివరించి చెప్పాడు. వారంతా తన చుట్టూ ఉంటే ధృతరాష్ట్రుడికి తాను మళ్ళీ హస్తినాపురం లోనే ఉన్నట్టు తోచింది.

స్త్రీలందరూ గాంధారికీ, కుంతికీ నమస్కారాలు చేశారు. తరవాత అందరూ ఆశ్రమం ప్రవేశించారు. చుట్టుపక్కల నుండి పాండవులను చూడవచ్చిన తాపసులు కోరిన మీదట సంజయుడు పంచపాండవులనూ, వారి భార్యలనూ, ఉత్తరనూ, ధృతరాష్ట్రుడి కోడళ్ళనూ వేరువేరుగా చూపాడు.

. తరవాత కుశల ప్రశ్నలు జరిగాయి. ధృతరాష్ట్రుడు ధర్మరాజు రాజ్యపాలనను గురించి అడిగాడు. వాటికి తగిన విధంగా




సమాధానాలిచ్చి ధర్మరాజు ధృతరాష్ట్రుడి వనవాసం గురించి అడిగాడు. ఆ తరవాత ఆయన, "విదురు డెక్కడా కనిపించలేదే? ఏమైనాడు?" అని అడిగాడు.

"నాయనా, విదురుడు మహా ఘోరమైన తపస్సు చేసి కృశించి ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. ఈ అరణ్యంలో అప్పుడప్పుడూ కనిపిస్తాడని బ్రాహ్మణులు చెప్పారు," అని ధృతరాష్ట్రుడు జవాబు చెప్పాడు. ఆయన ఆ మాట అంటూండగానే వారికి చాలా దూరాన విదురుడు కానవచ్చాడు. ఆయన శరీరం బాగా దుమ్ముకొట్టుకుని ఉన్నది.


వెంటనే ధర్మరాజు బయలుదేరి విదురుడి కేసి వెళ్ళాడు. విదురుడు దట్టమైన అడవిలో ప్రవేశించి మధ్యమధ్య కనిపిస్తూ అంతలోనే కనిపించకుండా పోసాగాడు. "విదురా, నేను ధర్మరాజును. నీ దర్శనం కోసమే వస్తున్నాను," అని కేకలు పెడుతూ ధర్మరాజు ముందుకు పరిగెత్తాడు.

చిట్ట చివరకు విదురుడు ఒక నిర్జన ప్రదేశంలో నిలబడి ఉండి ధర్మరాజుకు కనిపించాడు. ఆయనను విదురుడని పోల్చటం కూడా కష్టంగా ఉన్నది. ధర్మరాజు, "మహాత్మా, నేను ధర్మరాజును," అంటూ విదురుడికి ఎదురుగా నిలబడ్డాడు. అప్పుడొక అపూర్వమైన విషయం జరిగింది. విదురుడు రెప్ప వెయ్యకుండా ధర్మరాజు కేసి చూడసాగాడు. అతని చూపులు ధర్మరాజు చూపులతో కలిశాయి. తరవాత విదురుడి ప్రాణాలు తన ప్రాణాలలోనూ, విదురుడి శరీరం తన శరీరంలోనూ ప్రవేశించినట్టు ధర్మరాజుకు తోచింది.

తరవాత కొంచెం సేపటికి ధర్మరాజు చుట్టూ చూడగా విదురుడి శరీరం మూసిన కళ్ళతో ఒక చెట్టు నాని పడి ఉండటం కనిపించింది. అది కళేబరం మాత్రమే. విదురుడు తనలో కలుస్తాడని వ్యాసుడు ఒకప్పుడు చెప్పిన మాటలు ధర్మరాజుకు జ్ఞాపకం వచ్చాయి. ఆయన విదురుడి కళేబరానికి దహన సంస్కారాలు చేసే యత్నంలో ఉండగా అశరీరవాణి, "ధర్మరాజా, యతుల కళేబరాలకు దహన సంస్కారం చెయ్యరాదు. దేహం చాలించిన యతి కొరకు దుఃఖించరాదు," అని చెప్పింది. వెంటనే ధర్మరాజు ఆ కళేబరాన్ని అక్కడే వదిలేసి, ఆశ్రమానికి తిరిగి వచ్చి ధృతరాష్ట్రుడికి జరిగిన దంతా చెప్పాడు. ధృతరాష్ట్రుడు చాలా సంతోషించాడు. అతిథులు ఆ పగలూ, ఆ రాత్రీ ధృతరాష్ట్రుడిచ్చిన కందమూలఫలాల ఆతిథ్యం స్వీకరించి చెట్ల కింద పడుకుని సుఖంగా నిద్రపోయారు.



CHANDAMAMA (Telugu) DECEMBER 1963 Regd. No. M. 4854



మహాభారతం



మహాభారతం

ఆ రాత్రి పాండవులకు ఆశ్రమంలో ఎంతో ఆనందంగా గడిచింది, వారు తమ తల్లికి నాలుగు పక్కలా పడుకుని నిద్రపోయారు! మర్నాడు కూడా వారు ధృతరాష్ట్రుడి ఆశ్రమంలోనే ఉండి, ఆయన తినే ఆహారమే తాము కూడా తిన్నారు. మూడవ నాడు కాలకృత్యాలు ముగించి ధర్మరాజు ధృతరాష్ట్రుడి అనుమతితో, తన తమ్ములనూ, అంతఃపుర స్త్రీలనూ, పరివారాన్నీ వెంటబెట్టుకుని ఆ ప్రాంతమంతటా చూసి రావటానికి బయలుదేరాడు. ఒక ఆశ్రమం దగ్గిర మునులు హోమం చేస్తున్నారు. మరొక చోట వేద ఘోష వినిపిస్తున్నది. ఒకచోట కందమూల ఫలాలు గుట్టగా పోగు వేసి ఉన్నాయి.

ధర్మరాజు తన వెంట హస్తినాపురం నుంచి తెచ్చిన బంగారు పాత్రలూ, రాగి పాత్రలూ, చర్మాలూ, కంబళ్ళూ మొదలైనవి అక్కడి వారికి పంచి పెట్టాడు. తరవాత ఆయన ఆహ్నికాలు ముగించుకుని ధృతరాష్ట్రుడూ, గాంధారీ ఉన్న చోటికి వచ్చి కూర్చున్నాడు. వారికి అంత దూరంలో కుంతి కూర్చున్నది. ధర్మరాజు సమీపంలోనే మిగిలిన పాండవులు కూడా వచ్చి కూర్చున్నారు.

ఇంతలో అక్కడికి కురుక్షేత్రంలో ఉండే శతయూపుడు మొదలైనవారు వచ్చి చేరారు. ఆ సమయంలో తన శిష్యగణంతో సహా వ్యాసుడు వచ్చాడు. అందరూ ఆయనకు ఎదురు వెళ్ళి తీసుకువచ్చారు. దర్భాసనం పైన పరిచిన జింక చర్మం పైన కూర్చుని వ్యాసుడు ధృతరాష్ట్రుణ్ణి కుశల ప్రశ్నలు చేశాడు. తరవాత విదురుడి మాట ఎత్తి, ఆయన మాండవ్యుడి శాపం వల్ల మానవ జన్మ ఎత్తిన యముడనీ, తన యోగబలం చేత ధర్మరాజులో ఐక్యమయాడనీ,

అట్ట చివరి బొమ్మ



ఇప్పుడు ధర్మరాజే విదురుడనీ చెప్పాడు. అనంతరం వ్యాసుడు ధృతరాష్ట్రుడితో, "నాయనా, నీ సంశయాలన్నీ తీర్చటానికి వచ్చాను. నీకేమి కావాలో అడుగు. ఏమి అడుగుతావు? దేన్ని తెలుసుకో గోరుతావు? ఏమి చూడ గోరుతావు? చెప్పు," అన్నాడు.

వ్యాసు డిలా అడగగానే, కళ్ళకు గంతలు కట్టుకుని ఉన్న గాంధారి తడువుకుంటూ లేచి నమస్కరించి, "మహాత్మా, మా కొడుకులు పోయి పదహారేళ్ళయింది. ఇప్పటికీ ఈయన పుత్రశోకం పోలేదు. లోకాంతరాలలో ఉన్న ఆ కొడుకులను చూప గలిగితే చూపండి. ఇదుగో ద్రౌపది, తన కొడుకులను, జ్ఞాతులనూ పోగొట్టుకుని వారి కోసం దుఃఖిస్తున్నది. సుభద్ర అభిమన్యుడి కొరకు దుఃఖిస్తున్నది. ఇది భూరిశ్రవుడి భార్య, ఒక్కసారిగా మామనూ, భర్తనూ, కొడుకునూ పోగొట్టుకున్నది. మా కోడళ్ళు నూరుగురి మాట చెప్పనే అవసరం లేదు," అన్నది.

గాంధారి ఈ మాట లంటూంటే కుంతి కర్ణుణ్ణి జ్ఞాపకం తెచ్చుకుని కన్నీరు కార్చింది. వ్యాసు డామె దుఃఖం గమనించి, "దేవీ, నీ మనసులో ఏదో ఉన్నట్టుంది, చెప్పు," అన్నాడు.

అప్పుడు కుంతి కర్ణుడి జనన వృత్తాంతం, అందరూ వింటూండగా, వ్యాసుడికి ఈ విధంగా చెప్పింది: "ఒకప్పుడు దూర్వాసుడు మా తండ్రి యింటికి భిక్షకై వచ్చాడు. ఆయన ముక్కోపి. ఆయన కోపాన్ని సహించి ఆయన మనస్సుకు సంతోషం కలిగించేటట్టుగా ప్రవర్తించాను. అందు కాయన సంతోషించి, నేను పిలిస్తే ఏ దేవత అయినా వచ్చేలాగా వరం ఇచ్చాడు. ఆ వరం నన్ను ఆశ్చర్యపరచటమేగాక, మరచి పోదామన్నా మరుపు రాకుండా మనస్సులో మెదిలింది. ఒకనాడు

మిద్దె పైన కూర్చుని ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూశాను. నా వరం జ్ఞాపకం వచ్చి, ఆ సూర్యుడి పై మనస్సు పోగా, ఆయనను రమ్మని పిలిచాను. ఆకాశంలో ఉన్న తన శరీరం ఆకాశంలో ఉండగానే సూర్యుడు మరొక శరీరంతో నన్ను సమీపించి, నన్ను వరం కోరుకొమ్మన్నాడు. నేను బెదిరిపోయి ఆయనను వెళ్ళి పొమ్మన్నాను. అనవసరంగా పిలిచి నందుకు ఆయన నన్నూ, నాకు వర మిచ్చిన దూర్వాసుణ్ణీ శపిస్తా నన్నాడు. చేసేది లేక ఆయన వంటి కొడుకు నిమ్మని కోరాను. ఆయన తన తేజస్సును నాలో ప్రవేశ పెట్టి వెళ్ళిపోయాడు. ఈ సంగతి నా తండ్రికి తెలియకుండా నేను ఇంటి లోపలనే ఉండి, రహస్యంగా కర్ణుణ్ణి కని నీటిలో వదిలి పెట్టేశాను. పాపమో, పుణ్యమో, జరిగిన సంగతి ఇది. నాకా కర్ణుణ్ణి చూడాలని ఉన్నది."

"ఇందులో నీ దోషమేమీ లేదు. దేవతల నిర్ణయానికి అడ్డేమున్నది?" అని వ్యాసుడు ఇంకా ఇలా అన్నాడు: "గాంధారీ, నీ కొడుకులూ, సోదరులూ కనిపిస్తారు. కుంతికి కర్ణుడూ, సుభద్రకు అభిమన్యుడూ, ద్రౌపదికి ఆమె తండ్రీ, అన్నలూ, కొడుకులూ కనిపిస్తారు. అందరినీ మీకు చూపించాలని అదివరకే నిర్ణయించాను. ఎవరెవరు యుద్ధంలో చనిపోయారో వారందరూ దైవ నిర్ణయం చేత మనుష్యులుగా పుట్టిన దేవతలు. వారు తమ పని తీరగానే దేవ లోకాలకు తిరిగి వెళ్ళిపోయారు. మీరందరూ భాగీరథీ నదికి వెళ్ళండి. యుద్ధంలో చనిపోయిన యోధు లందరూ అక్కడ మీకు కనిపిస్తారు."




అక్కడ ఉన్న వారందరూ గంగానదికి కోలాహలంగా బయలుదేరారు. గంగా తీరాన వారు మంచి చోటు చూసుకుని, అక్కడే విశ్రమించి, పగలు ఎప్పుడు

21


పోతుందా, రాత్రి వచ్చి మృతు లందరూ ఎప్పుడు కనిపిస్తారా అని ఆత్రంతో ఎదురు చూడసాగారు.

చివరకు సూర్యుడస్తమించాడు. అందరూ స్నానాలు చేసి నిశాకృత్యాలు నిర్వర్తించారు. తరవాత వారు వ్యాసుడు ఏకాగ్రచిత్తుడై కూర్చుని ఉన్న చోటికి వెళ్ళి ఆయన చుట్టూ కూర్చున్నారు. అప్పుడు వ్యాసుడు యుద్ధంలో చనిపోయిన వారి నందరినీ రమ్మని పిలిచాడు. వెంటనే నదీ జలంలో కల్లోలం వినిపించింది. కౌరవ పాండవ సేన లన్నీ ఒక పక్కగా కని పించాయి. భీష్మ ద్రోణులు మొదలైనవారు వేల కొద్ది సైనికులను వెంట బెట్టుకుని నీటిలో నుంచి వెడలి వచ్చారు. విరాటుడూ, ద్రుపదుడూ, ఉపపాండవులూ, అభిమన్యుడూ, ఘటోత్కచుడూ, కర్ణుడూ, దుర్యోధనుడూ, శకునీ, దుశ్శాసనుడు మొదలైన గాంధారి కొడుకులూ, భగదత్తుడూ, భూరిశ్రవుడూ, శలుడూ, శల్యుడూ, ధృష్టద్యుమ్నుడూ, శిఖండీ, బాహ్లిక సోమదత్తులూ—అందరూ ప్రకాశమానమైన దేహాలతో, తాము చనిపోయేటప్పుడు ఏయే వేషంలో ఉన్నారో, అవే వేషాలతో, అవే ఆయుధాలూ ధ్వజాలూ కలిగి కనిపించారు. వారిలో వైరమూ, క్రోధమదమత్సరాలూ లేవు.

వ్యాసుడు ధృతరాష్ట్రుడికి దివ్యదృష్టి ఇచ్చాడు. గాంధారీ ధృతరాష్ట్రులు చని పోయిన వారందరినీ తిరిగి చూడగలిగారు. ఈ అనుభవం అందరినీ ఆశ్చర్యంలో ముంచింది. వ్యాసుడి తపశ్శక్తి చేత బతికి వచ్చిన మృతయోధులు సజీవులై ఉన్న తమ తల్లిదండ్రులనూ, భార్యలనూ, అన్నలనూ, తమ్ములనూ కలుసుకున్నారు, వారితో స్నేహపూర్వకంగా వర్తించారు; మాట్లాడారు, ఆలింగనం చేసుకున్నారు, ఆనందం కలిగించారు. ఎవరి మనస్సులోనూ శోకమన్నది లేదు. ఆ రాత్రి అక్కడ అందరికీ పరమానందంగా గడిచింది.



CHANDAMAMA (Telugu) JANUARY 1964 Regd. No. M. 4854



మహాభారతం



మహాభారతం

తరవాత వ్యాసుడు ఆ చనిపోయిన వారిని వెళ్ళిపొమ్మని చెప్పాడు. మృతులందరు తాము ఏయే వాహనాలూ, రథాలూ ఎక్కి వచ్చారో, వాటి మీదనే తిరిగి గంగాజలంలో ప్రవేశించి, అక్కడి నుండి తమ తమ లోకాలకు చేరుకున్నారు.

వ్యాసుడు స్త్రీల కేసి తిరిగి, "మీలో ఎవరైనా మీ భర్తల వెంట వారి లోకాలకు వెళ్ళ దలిస్తే ఈ గంగలో దిగండి," అన్నాడు. ధృతరాష్ట్రుడి కోడళ్ళు తమ మామ యొక్క సెలవు పొంది గంగలో దిగారు. వారు తమ శరీరాలను గంగలో వదిలి దివ్య శరీరాలతో భర్తలను చేరుకున్నారు. ఆ యోధులు తమ భార్యలను విమానాల పై ఎక్కించుకుని తాముండే లోకాలకు వెళ్ళిపోయారు.

తరవాత ధృతరాష్ట్రుడు మిగిలిన వారందరి వెంటా తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. ధర్మరాజును తిరిగి పోయి రాజ్యం చూసుకోమని చెప్పమని ధృతరాష్ట్రుడికి వ్యాసుడు చెప్పాడు. ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో, "నాయనా, ఇక మీరంతా తిరిగి వెళ్ళండి. మీరుంటే మా తపస్సు సాగదు. నేను హస్తినాపురంలోనే ఉన్నట్టుగా సుఖంగా ఉంటాను," అన్నాడు.

ధర్మరాజు ధృతరాష్ట్రుణ్ణి విడిచి వెళ్ళటానికీ, ముఖ్యంగా కుంతిని విడిచి వెళ్ళటానికీ చాలా బాధపడ్డాడు. కాని కుంతి కూడా వెళ్లిపొమ్మని చెప్పిన మీదట ఆయన అంతఃపుర స్త్రీలనూ, పరివారాన్నీ వెంట బెట్టుకుని హస్తినాపురానికి తిరిగి వచ్చాడు.

ధృతరాష్ట్రుడు వనవాసానికి వెళ్ళిన మూడేళ్ళకు ఒకనాడు నారద మహాముని ధర్మరాజును చూడ వచ్చాడు. ధర్మరాజు ఆయనకు తగిన మర్యాదలు చేసి, కుశల ప్రశ్నలడిగాడు.

అట్ట చివరి బొమ్మ



"నిన్ను చూసి చాలా కాలమయింది. తపోవనం నుంచి బయలుదేరి తీర్థాలు చూసుకుంటూ నీ దగ్గిరికి వచ్చాను," అన్నాడు నారదుడు.

"గంగాతీరవాసులు కొందరు నాతో ధృతరాష్ట్రుడు తీవ్రమైన తపస్సు చేస్తున్నాడని చెప్పారు. మీరాయనను చూశారా? ఆయనకు క్షేమమా? గాంధారీ, కుంతీ, సంజయుడూ ఎలా ఉన్నారు? తెలిస్తే చెప్పండి," అన్నాడు ధర్మరాజు.

"ధర్మరాజా, జరిగిన వృత్తాంత మంతా చెబుతాను, స్థిరచిత్తంతో విను. మీరందరూ వచ్చి వెళ్ళిన తరవాత ధృతరాష్ట్రుడు కుంతీ గాంధారీ సంజయులతో సహా గంగాద్వారానికి బయలుదేరి వెళ్ళాడు. ఆయన చేత అగ్నిహోత్రం చేయించే బ్రాహ్మణులు కూడా అగ్నిహోత్రాలను తీసుకుని ఆయన వెంట వెళ్ళారు. అక్కడ నీ పెత్తండ్రి ఆరు మాసాలపాటు మౌనం ధరించి వాయుభక్షణ చేస్తూ, తీవ్రమైన తపస్సు చేసి, అక్కడి మునుల నందరినీ ఆశ్చర్య పరిచాడు. ఆయన శరీరంలో ఎముకలు తప్ప ఏమీ మిగల లేదు. గాంధారి జలాహారం తీసుకున్నది. కుంతి మాసోపవాసం చేసింది. సంజయుడు ఆరవ జామున మాత్రమే ఆహారం తీసుకుంటూ వచ్చాడు. ఇలా ఉండగా ధృతరాష్ట్రుడు ఇతరులతో ప్రసక్తి లేకుండా అరణ్యం వెంటపడి తిరగసాగాడు. గాంధారీ, కుంతీ ఆయన వెంట వెళ్ళారు. సంజయుడు ఆయనను పట్టుకుని నడిపించాడు. కుంతి గాంధారిని నడిపించింది. తరవాత ఒక రోజున వారందరూ గంగలో స్నానం చేసి ఆశ్రమానికి తిరిగి వస్తూండగా, పెద్ద గాలి సాగి, కార్చిచ్చు అరణ్యమంతటా చుట్టు వేసింది. అసలే తిండీ, బలమూ లేకుండా ఉన్న ధృతరాష్ట్రుడు నడవలేక పోయాడు. గాంధారీ, కుంతీ కూడా చాలా

నీరసించి ఉన్నారు. కార్చిచ్చు తమను సమీపిస్తూండటం గ్రహించి ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి కార్చిచ్చు నుంచి తప్పించుకుని వెళ్ళి పొమ్మన్నాడు. ధృతరాష్ట్రుణ్ణీ, గాంధారినీ, కుంతినీ అగ్ని పాలిటికి వదిలేసి తాను ప్రాణాలు దక్కించుకోవటం సంజయుడికి సమ్మతం కాలేదు; వారిని అగ్ని నుంచి కాపాడే ఉపాయమూ తోచలేదు. అప్పుడు ధృతరాష్ట్రుడు తమలాటి తాపసులు వాయుజలాగ్నులలో దేని చేతనైనా ప్రాణం విడవ వచ్చునని చెప్పి, సంజయుణ్ణి తక్షణమే వెళ్ళి పొమ్మన్నాడు. ధృతరాష్ట్రుడూ, గాంధారీ, కుంతీ తూర్పు దిక్కుగా తిరిగి కూర్చున్నారు. సంజయుడు వారికి ప్రదక్షిణం చేసి తాను అక్కడి నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. అతను గంగా తీరవాసులకు జరిగినదంతా చెప్పి హిమాలయానికి వెళ్ళిపోయాడు. ఆ విధంగా ధృతరాష్ట్రుడూ, గాంధారీ, కుంతీ ఆ కార్చిచ్చులో కాలి చనిపోయారు. దగ్గమైన వారి కళేబరాలను కూడా నేను చూశాను," అని నారదుడు చెప్పాడు.

పాండవులు ఈ దుర్వార్త విని పెద్ద పెట్టున శోకించారు. అంతఃపురమంతా రోదనంతో నిండిపోయింది.



ధర్మరాజు తన దుఃఖాన్ని కొంత దిగమింగుకుంటూ, "అంతటి కఠోర తపస్సు చేసీ, మేమందరమూ కలిగి ఉండి కూడా మా పెత్తండ్రి ఇంత అసహాయపు చావు చచ్చాడా? కొడుకుల నందరినీ పోగొట్టుకుని కుమిలిపోయే గాంధారి చావుకూడా నన్నంతగా బాధించదు. మా ఐశ్వర్యంతో తులతూగుతూ మమ్మల్ని చూసి ఆనందించవలసిన కుంతి ఇలా చచ్చిపోయిందే! ఛీ, ఛీ! ఈ రాజ్యమెందుకు? పరాక్రమ మెందుకు? ఏనాడో చచ్చిపోవలసిన వాళ్ళం ఇంకా బతికి ఉన్నాం. కాలగతి తెలియదు గద!

లేకపోతే పాండవుల తల్లి ఏమిటి? కార్చిచ్చులో పడి చనిపోవటమేమిటి? అగ్ని దేవుడికి మా అర్జునుడు ఖాండవదహన మప్పుడు చేసిన సహాయం నిరర్థకమయింది. అగ్ని ఎంత కృతఘ్నుడు కాకపోతే అతడి తల్లిని దహిస్తాడు?'' అన్నాడు.

నారదుడు మరొక విషయం బయట పెట్టాడు. ఆయన ధర్మరాజుతో, "ధృతరాష్ట్రుణ్ణి దహించినది మామూలు అగ్ని కాదు. ఆయన వాయుభక్షకుడై తపస్సు చేసి యజ్ఞం చేసి, అగ్నులను విడిచాడట. అగ్నిహోత్రం చేసే యాజకులు ఆ అగ్నులను నిర్జనారణ్యంలో వదిలి వెళ్ళిపోయారట. ఆ అగ్నుల చేతనే అరణ్యం అంటుకుని, గాలి వల్ల పెద్ద కార్చిచ్చుగా మారి వాళ్ళను దహించి వేసిందట. ఈ విషయం మునులు చెప్పారు. అందుచేత ధృతరాష్ట్రుడు తన అగ్ని చేతనే దగ్ధుడై ఉత్తమ లోకాలు పొందాడు. ఇక నీవూ, నీ తమ్ముళ్ళు వారికి జలతర్పణాలు విడవండి.'' అన్నాడు.

తరవాత ధర్మరాజు ఒంటి బట్టతో, తమ్ములతో కలిసి, పౌరులు వెంట రాగా గంగానదికి వెళ్ళాడు. అక్కడ యుయుత్సుడితో సహా ఆయన ధృతరాష్ట్రుడికీ, గాంధారికీ, కుంతికీ శాస్త్రోక్తంగా జలక్రియలు చేసి, శౌచవిధి అవలంబించి నగరం వెలపలనే ఉంటూ, ధృతరాష్ట్రుడు మొదలైన వారు దగ్ధులైన చోటికి తెలిసినవారిని పంపి, అక్కడ చేయదగిన పనులు చేయించి, పన్నెండవరోజు శ్రాద్ధక్రియ జరిపి, ధృతరాష్ట్రుడి పేర బంగారమూ, వెండీ, ఆవులూ, మంచాలూ, డబ్బూ దానం చేశాడు. అలాగే గాంధారి పేరా, కుంతి పేరా గొప్ప దానాలు చేశాడు. తరవాత ధర్మరాజు హస్తినాపురం ప్రవేశించాడు. గంగాద్వారానికి పంపబడిన వారు తిరిగి వచ్చి అక్కడ జరగవలసిన విధులన్నీ సక్రమంగా జరిగాయని చెప్పారు.

ధర్మరాజు చేత ఈ కర్మకాండ అంతా దగ్గిర ఉండి చేయించిన నారదుడు వెళ్ళిపోయాడు.





మహాభారతం



మహాభారతం

ఒకప్పుడు విశ్వామిత్రుడూ, కణ్వుడూ, నారదుడూ ద్వారకకు వచ్చారు. రోహిణీ వసుదేవుల కొడుకైన సారణుడూ, మరి కొందరు యాదవులూ కలిసి, జాంబవతీ కృష్ణుల కొడుకైన సాంబుడికి ఆడవేషం వేసి మునుల వద్దకు తీసుకుపోయి, "మహా మునులారా, ఈమె గర్భవతిగా ఉన్నది. తమకు తెలియనిదంటూ ఉండదు. ఈమె కేబిడ్డ పుట్టుతుందో చెప్పండి," అని అడిగారు. మునులు ఆగ్రహించి, "వీడు సాంబుడు. వీడి కడుపున ఇనప రోకలి (ముసలం) పుట్టి వృష్ణి, అంధక వంశాలను నిర్మూలిస్తుంది," అని శపించి, కృష్ణుణ్ణి చూసి, తమ దారిన తాము వెళ్ళిపోయారు. వాళ్ళు అన్నట్టుగానే సాంబుడికి మర్నాడే ఒక ముసలం పుట్టింది. కృష్ణుడు దానిని చూర్ణం చేయించి, ఆ చూర్ణాన్ని తీసుకుపోయి సముద్రంలో కలపమని ఆజ్ఞాపించాడు.

తరవాత ద్వారకలో ఒక చాటింపు జరిగింది: నగరంలో వారెవరూ మద్యం తాగరాదు; ఈ నియమం వృష్ణి అంధకులకు కూడా వర్తిస్తుంది; ఎవడైనా తాగినట్టయితే, వాణ్ణీ, వాడి బంధువులనూ కూడా కొరతవేస్తారు.

శాపకారణంగా జరిగిన ఈ చాటింపు విని నగరంలోని ప్రతి ఒక్కరూ తాగరాదని నియమం పెట్టుకున్నారు.

వారెంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ దుశ్శకునాలు కలిగాయి. నగరవీధులలో ఎలుకలు అసంఖ్యాకంగా తిరిగాయి. ఎక్కడ చూసినా కుండ పెంకులు కానవచ్చాయి.

పక్షుల కూతలూ, జంతువుల అరుపులూ మారిపోయాయి.

ఈ వైపరీత్యాలు గమనించి కృష్ణుడు యాదవులతో, "భారత యుద్ధానికి ముందు కూడా ఇలాటి వైపరీత్యాలే కలిగాయి. అవి

అట్ట చివరి బొమ్మ



జననాశాన్ని సూచిస్తాయని ధర్మరాజు అన్న మాట నిజమే అయింది," అన్నాడు. అతను యాదవులనందరినీ సముద్రతీరానికి యాత్రకు బయలుదేరదీశాడు. వృష్ణి, అంధకులందరూ తమ తమ భార్యలతో సహా సముద్రతీరానికి ప్రయాణమయారు. భక్ష్యభోజ్యాలూ, మద్య మాంసాలూ సిద్ధం చేయించారు. ఏనుగుల మీదా, రథాల మీదా, గుర్రాల మీదా వెళ్ళి, సముద్రతీరాన తమ ఇష్టానుసారం బసలు ఏర్పాటు చేసుకున్నారు. కృష్ణుడి చిన్ననాటి మిత్రుడైన ఉద్ధవుడు యాదవ వీరులను సముద్రం ఒడ్డుకు తీసుకుపోతుంటే కృష్ణుడు వద్దని కూడా అనలేదు.

ఇక యాదవుల ప్రవర్తనకు హద్దూ పద్దూ లేకుండా పోయింది. వారు ఆహారాన్ని కోతులకు వేశారు. వాద్యాలు మోగాయి. నృత్యాలు ఆరంభమయాయి. అందరూ తాగ నారంభించారు. కృష్ణుడి సమీపంలోనే కూర్చుని బలరాముడూ, కృతవర్మా తాగటం మొదలుపెట్టారు. సాత్యకీ, బభ్రువూ, గదుడూ కూడా తాగారు. సాత్యకి తాగిన మత్తులో కృతవర్మతో, "నీవు కాబట్టి ఆనాడు అశ్వత్థామతోబాటు నిద్రపోయే వారిని చంపావుగాని, అది క్షత్రియుడు చేసే పనీ, యాదవులు హర్షించే పనీకాదు," అని ఎత్తి పొడిచాడు. ప్రద్యుమ్నుడు కూడా కృతవర్మను తూలనాడాడు.

"అవునవును. చెయ్యి తెగి, ప్రాయోపవేశం చేసిన భూరిశ్రవుణ్ణి చంపిన నీవే గొప్ప క్షత్రియుడివిరా!" అన్నాడు కృతవర్మ. కృష్ణుడు కృతవర్మ కేసి కోర చూపు చూశాడు. "ఈ నీచుడి తమ్ముడు శతధన్వుడే గద శమంతకమణి కోసం సత్రాజిత్తును చంపింది?" అన్నాడు సాత్యకి కృష్ణుడితో. ఈ మాట విని సత్యభామ ఏడుస్తూ, కృష్ణుడి తొడ పైన చతికిలబడి

అతనికి కోపం తెప్పించింది. "నీ వూరుకో వమ్మా, ఈ దుర్మార్గుణ్ణి ఇప్పుడే ధృష్ట ద్యుమ్న శిఖండుల దగ్గిరికి పంపేస్తాను," అంటూ సాత్యకి లేచి, కత్తితో కృతవర్మ తల నరికాడు.

కృతవర్మను చంపినందుకు భోజులంద రికీ కోపం వచ్చి, సాత్యకిని చుట్టుముట్టి, తాము తాగటానికి ఉపయోగించిన పాత్ర లతో అతన్ని కొట్టారు. అది చూసి ప్రద్యు మ్నుడు భోజుల మీదికి వెళ్ళాడు. భోజు లందరూ చేరి సాత్యకినీ, ప్రద్యుమ్నుణ్ణీ చంపేశారు. కృష్ణుడికి కోపం వచ్చి పిడికెడు తుంగ పీకాడు. అది కాస్తా ఇనపరోకలి అయింది. దానితో అతను ప్రముఖులంద రినీ చంపాడు. ఆ తుంగనే పీకి భోజులూ, అంధకులూ, శైనేయులూ, వృష్ణి వంశం వారూ అనే యాదవజాతుల వారందరూ ఒకరినొకరు చంపుకున్నారు. వారి చేతుల్లో ఒక్కొక్క తుంగ కాడా ఒక్కొక్క ముసల మయింది. తప్ప తాగి తండ్రి కొడుకులు సైతం ఒకరినొకరు చంపుకున్నారు. చేతిలో ముసలం పట్టుకుని ఉన్న కృష్ణుడు, చావగా మిగిలిన యాదవులను పూర్తి చేశాడు. అప్పుడు బభ్రువూ, దారుకుడూ కృష్ణుని వద్దకు వచ్చి, "అయ్యా, అందరినీ చంపే



శారు. ఇక బలరాముడుగారిని వెతుకుదాం పదండి," అన్నారు.


వారు ముగ్గురూ బలరాముణ్ణి వెతు క్కుంటూ వెళ్ళి, ఆయనను ఒక చెట్టు దగ్గిర చూశారు. ఆయన విచారంతో ఉన్నాడు. కృష్ణుడు దారుకుడితో, "వెంటనే హస్తినాపురానికి వెళ్ళి యాదవ వినాశనం గురించి చెప్పు. అది విని అర్జునుడు తప్పక వస్తాడు," అన్నాడు. దారుకుడు రథం తీసు కుని బయలుదేరాడు. తరవాత కృష్ణుడు బభ్రువుతో, "నీవు వెళ్ళి ఆడవాళ్ళను కాపాడు. లేకపోతే నగల కోసం దొంగలు

వారిని పీడించవచ్చు," అన్నాడు. బభ్రువు బయలుదేరాడు గాని, ఎంతో దూరం వెళ్ళక మునుపే అతని పైన ముసలం పడి చంపే సింది. అప్పుడు కృష్ణుడు బలరాముడితో, "అన్నా, నేను స్త్రీ జనాన్ని ఊరు చేర్చి వస్తాను. అంతదాకా ఇక్కడనే ఉండు," అన్నాడు. అతను స్త్రీలను పురానికి చేర్చి వసు దేవుడితో, "ఆడవాళ్ళను జాగ్రత్తగా కని పెట్టి ఉండాలి. బలరాముడు అర్జునుడి రాక కోసం ఎదురుచూస్తూ వనంలో ఉన్నాడు. నేను కూడా అక్కడికే పోతాను. యాదవు లంతా చచ్చిన ఈ పురంలో నాకు ఉండ బుద్ధి కావటం లేదు. నేనూ, అన్నా వనం లోనే తపస్సు చేసుకుంటాం," అంటూ, ఆయన కాళ్ళకు నమస్కరించి వేగంగా వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోతుంటే స్త్రీలు ఆర్తనాదాలు చేశారు. "మీ కేమీ భయం లేదు. అర్జునుడు వస్తాడు," అని కృష్ణుడు వారితో అని బలరాముడి పద్దకు వెళ్ళిపోయాడు.

బలరాముడు యోగసమాధిలో ఉన్నాడు. అతని ముఖం నుంచి తెల్లని సర్పం వెలు వడి సముద్రంలోకి వెళ్ళిపోయింది. అలా వచ్చిన ఆదిశేషును వరుణలోకంలోని నాగ ప్రముఖులు పూజించి, అర్చించారు. బల రాముడు దేహం చాలించటం చూసిన కృష్ణుడు నిర్జనమైన వనంలో కొంతసేపు తిరిగి, ఒకచోట పడుకుని యోగనిద్ర అవ లంబించాడు.

అక్కడికి జరుడనే బోయవాడు వేటకు వచ్చాడు. వాడికి కృష్ణుడి పాదం కన బడింది. అదేదో మృగమని వాడు ఆ పాదాన్ని బాణంతో కొట్టాడు. తరవాత వాడికి మనిషి అన్న సంగతి తెలిసి పశ్చా త్తాపంతో కృష్ణుడి కాళ్ళు పట్టుకున్నాడు. కృష్ణుడు జరుణ్ణి ఓదార్చుతూనే ప్రాణాలు విడిచాడు. అతని శరీరంలో నుంచి గొప్ప తేజస్సు బయలుదేరి పైకి వెళ్ళిపోయింది. దానికి దేవతలూ, అప్సరసలూ, మునులూ ఎదురువచ్చి స్వాగతం ఇచ్చారు.





మహాభారతం

96



మహాభారతం


ద్వారకలో ముసలం పుట్టి యాదవవంశక్షయం జరిగే నాటికి హస్తినాపురంలో ధర్మరాజు పరిపాలన ముప్ఫయ్యారో ఏడు జరుగుతున్నది. ద్వారకలో కనిపించిన ఉత్పాతాల వంటివి హస్తినాపురంలోనూ కనిపించాయి. గులకరాళ్ళు వర్షించాయి, ఉల్కలు తెగరాలాయి, సూర్య చంద్రులు మూడు రంగులలో కనిపించారు. ఇంతలోనే దారుకుడు కురుదేశాలకు వచ్చి, పాండవులకు జరిగిన దంతా చెప్పాడు.

కృష్ణుడితో సహా యాదవ వంశ మంతా నిర్మూలమయిందంటే పాండవులు నమ్మలేకపోయారు. ఇప్పుడేమిటి కర్తవ్యమని ధర్మరాజు తన తమ్ముల నడిగాడు. అర్జునుడు తాను ద్వారకకు వెళ్ళి తమ మేనమామ అయిన వసుదేవుణ్ణి చూసి వస్తానని చెప్పి, దారుకుడి వెంట రథంలో బయలుదేరి వెళ్ళాడు.

ద్వారకానగరం వైధవ్యం సంప్రాప్తించిన స్త్రీ లాగున్నది. అర్జునుణ్ణి చూడగానే అంతఃపుర స్త్రీలందరూ గొల్లున ఏడ్చారు. సత్యభామా, రుక్మిణీ అర్జునుడికి నమస్కారం చేసి, కూర్చోమని ఆసనం చూపించారు, కాని వారేమీ అనలేకపోయారు. ఆ స్త్రీలను చూడటానికే అర్జునుడికి భయం వేసింది. అయినా అతను వారి నూరడించి, కృష్ణుడి గొప్పతనం గురించి కాస్సేపు మాట్లాడి, వసుదేవుడి వద్దకు వెళ్ళాడు.

వసుదేవుడు శోకంతో మంచం పట్టి ఉన్నాడు. అర్జునుడు వచ్చి తన కాళ్ళు పట్టుకోగానే ఆయన లేచి అర్జునుణ్ణి కౌగలించుకుని, "నాయనా, అందరూ పోయారు. వారి చావు విని కూడా ఇంకా బతికే ఉన్నాను. నీకు సాత్యకి, ప్రద్యుమ్నులంటే ఎంతో ప్రేమ; వారి మూలానే ఇంత మందీ నశించారు! కృష్ణుడి అభిమానులే

అట్ట చివరి బొమ్మ



ఈ పని చేశారు! యాదవులను కాపాడటానికి కృష్ణుడైనా ఏమీ ప్రయత్నించలేదు. ఒకరిననేదేమిటి? మునుల శాపం తగిలింది. ఇక నాకు జీవించాలని లేదు. ఆహారం మానేశాను. నీవు వస్తావనీ, నీ వెంట ద్వారకలో ఉన్నవారి నందరినీ పంపివేయమనీ, ఆ తరవాత ద్వారక సముద్రంలో మునిగిపోతుందనీ కృష్ణుడు నాతో చెప్పి ఎటో వెళ్ళిపోయాడు. కనక వాడు చెప్పిన ప్రకారం చెయ్యి," అన్నాడు.

అర్జునుడు మంత్రులతోనూ, బ్రాహ్మణుల తోనూ సభ చేసి, "స్త్రీ జనాన్ని ప్రయాణానికి సిద్ధం చేయించండి. యువరాజైన వజ్రుణ్ణి కూడా నా వెంట తీసుకుపోతాను. రత్నాలు మొదలైన వాటిని కూడా పోగు చెయ్యండి. ఇంక ఏడు రోజులకు ద్వారక సముద్రంలో మునుగుతుంది. అందరూ ప్రయాణాలుకండి. ఆలస్యం చెయ్యవద్దు," అని చెప్పాడు.

అర్జును డా రాత్రి అక్కడే గడిపాడు. మర్నాడు వసుదేవుడు యోగసమాధిలో ప్రాణాలు విడిచిపెట్టాడు. వసుదేవుడికి ప్రియమైన చోటనే ఆయనకు దహన క్రియలు జరిగాయి. ఆయనతోబాటు ఆయన భార్యలు దేవకీ, భద్రా, రోహిణీ, మదిరా సహ గమనం చేశారు. వజ్రుడు మొదలైన యాదవకుమారు లాయనకు జలతర్పణాలు విడిచారు.

తరవాత అర్జునుడు యాదవులు చచ్చిన ప్రదేశానికి వెళ్ళాడు. యుద్ధరంగంలోలాగా వారంతా చచ్చిపడి ఉన్నారు, మూడు పలకల తుంగ వారి ప్రాణాలు తీసింది. యాదవుల కందరికీ అర్జునుడు తగిన రీతిగా సంస్కారం చేయించి, మనుషుల చేత బలరామ కృష్ణుల కళేబరాలు వెతికి తెప్పించాడు. వాటికి కూడా దహన సంస్కారాదులు చేయించి, అర్జునుడు ఏడవ రోజున



హస్తినాపురానికి తిరుగు ప్రయాణం సాగించాడు. గుర్రాలూ, ఎద్దులూ, గాడిదలూ, ఒంటెలూ కట్టిన రథాలు బయలుదేరాయి. యాదవస్త్రీలు అర్జునుడి వెంట కదిలారు. వృద్ధులూ, పిల్లలూ ఒక గుంపుగా నడిచారు. పౌరులందరినీ వెంటబెట్టుకుని అర్జునుడు వెళ్ళిపోతూ ఉంటే, అతని వెనకగా ద్వారకను ముంచుకుంటూ సముద్రం కూడా వచ్చింది.

ఆ రోజు దాకా ద్వారకలోనే ఉండిన వారికీ దృశ్యం అద్భుత మనిపించింది.

అందమైన వనాలూ, కొండలూ దాటుతూ, అర్జునుడు చెప్పిన చోటనల్లా ఆగుతూ, అందరూ ప్రయాణించి పంచనదం చేరారు. అక్కడ ఒక దొంగల దండు వారి పైన పడింది. వేల సంఖ్యలో కర్రలు పట్టుకున్న దొంగలు, రాళ్ళురువ్వుతూ వారి పైన బడ్డారు. ఆ ప్రయాణీకులలో యోధుడైనవాడు అర్జును డొక్కడేనన్న సంగతి వారు గమనించారు. అర్జునుడు వాళ్ళను వెళ్ళిపొమ్మనీ, వెళ్ళిపోకపోతే బాణాలతో కొట్టి చంపేస్తాననీ బెదిరించాడు. కాని వాళ్ళు లక్ష్యపెట్ట లేదు. అర్జునుడు గాండీవాన్ని ఎక్కుపెట్ట యత్నించాడు. ఆ పని చాలా కష్టమనిపించింది. ఎలాగో బాణం ఎక్కుపెట్టి అస్త్రాలను స్మరించగా ఒక్కటీ జ్ఞాపకం రాలేదు. అతను తన అశక్తతకు సిగ్గుపడిపోతూ, మామూలు బాణాలతో కొందరు దొంగలను చంపాడు. కాని బాణాలు అయిపోయాయి. అర్జునుడు చూస్తుండగానే దొంగల ముఠా యాదవస్త్రీలను ఎత్తుకుని వెళ్ళిపోయారు.

ఈ విధంగా తీరని పరాభవం పొంది అర్జునుడు మిగిలిన యాదవులనూ, ధనాన్నీ వెంటబెట్టుకుని హస్తినాపురం చేరుకున్నాడు. ద్వారక నుంచి వచ్చినవారికి వేరువేరు స్థలాలలో నివాసాలు ఏర్పాటుచేశారు. కృతవర్మ

భార్యనూ, కొడుకునూ మార్తికావతంలో ఉంచారు. వజ్రుడికి ఇంద్రప్రస్థంలో పట్టాభిషేకం చేసి, అనేక మంది యాదవులకు అక్కడే నివాసాలు ఏర్పాటుచేశారు. సాత్యకి కొడుకును సరస్వతికి రాజును చేశారు. కృష్ణుని భార్యలలో రుక్మిణీ, జాంబవతీ, హైమవతీ మొదలైన అయిదుగురు అగ్ని ప్రవేశం చేశారు.

సత్యభామా, మిగిలిన వాళ్ళూ తపస్సు చేసుకోవటానికి హిమాలయాలు దాటి కలాప అనే గ్రామం చేరారు.

తన వెంట తెచ్చిన యాదవుల నందరినీ ఆయా స్థలాలలో ఉంచి అర్జునుడు వ్యాస మహాముని ఆశ్రమానికి వెళ్ళి, ఆయనకు తన పేరు చెప్పుకుని నమస్కారం చేశాడు. ఆయన అర్జునుణ్ణి క్షేమమడిగి, కూర్చోమని, అతని విషాదస్థితి గమనించి, అందుకు కారణమేమిటని అడిగాడు.

అర్జును డాయనతో, "మహాత్మా, కృష్ణ బలరాములు చనిపోయారు. యాదవు లందరూ ఒకరినొకరు హత్య చేసుకున్నారు. కృష్ణుడు లేకుండా నే నెలా బతకటం? అతను నా రథం నొగలు మీద కూర్చుని నా చేత యుద్ధం చేయించటం ఇంకా కళ్ళకు కట్టినట్టే ఉంది! అది అలా ఉండగా, నా శక్తి అంతా చచ్చింది. అస్త్రాలన్నీ పోయాయి. దొంగలు నా కళ్ళ ఎదట యాదవకాంతలను తీసుకుపోతూంటే ఏమీ చెయ్యలేని వాణ్ణయాను. ఇక నా కర్తవ్యం ఏమిటో సెలవియ్యండి!" అన్నాడు.

"నాయనా, కాలం ఇలాటి మార్పులు తెస్తుంది. కృష్ణుడు వచ్చిన పని అయిపోయింది. వెళ్ళిపోయాడు. నీ అస్త్రాలూ అలాగే పని ముగించి వెళ్ళిపోయాయి. మీరు కూడా ఉత్తమ గతి చేరటానికి సమయమయింది. అందుచేత నీవు చింతించవలిసిన పనిలేదు," అని వ్యాసుడు అర్జునుడికి కాలప్రభావం గురించి బోధించి పంపేశాడు. అర్జునుడు హస్తినాపురానికి తిరిగి వచ్చాడు.





మహాభారతం

యాదవ వినాశం మాట వినగానే తమకు కూడా కాలం తీరిపోతున్నదని ధర్మరాజు అర్జునుడితో అన్నాడు. అందుచేత పాండవులు మహాప్రస్థానానికి సిద్ధపడ్డారు. ధర్మరాజు యుయుత్సుణ్ణి పిలిపించి, అతనికి రాజ్యమిచ్చి, తన రాజ్యానికి పరీక్షిత్తును రాజుగా చేసి, ఇంద్రప్రస్థానికి యాదవ కులోద్ధారకుడైన వజ్రుణ్ణి రాజుగా చేసి, వారిని కనిపెట్టి ఉండమని సుభద్రకు చెప్పాడు. అనంతరం, చనిపోయిన యాదవప్రముఖులకు జలతర్పణాలు వదిలి, మునుల కందరికీ విందు చేసి, సమస్తదానాలూ ఇచ్చి, పరీక్షిత్తును కృపుడికి శిష్యుడుగా ఉంచి, అందరూ వల్కలాలు ధరించి మహాప్రస్థానం బయలుదేరారు.

వారి ప్రయాణం చూసి పౌరులు చాలా దుఃఖించారు. ద్రౌపదీ సహితులై పాండవులు వెళ్ళిపోతుంటే కొందరికి, జూదంలో ఓడి వారు అరణ్యవాసానికి బయలుదేరటం జ్ఞాపకం వచ్చింది. వారిని స్త్రీ పురుషులు చాలా దూరం వెంబడించి, వారి నిశ్చయాన్ని మార్చలేక వెనక్కు తిరిగారు. వారి వెంట ఒక కుక్క మాత్రమే వెళ్ళింది. ఉలూపి గంగా నది ప్రవేశించింది, చిత్రాంగద తన తండ్రి దేశం వెళ్ళిపోయింది.

పాండవులు తూర్పుగా బయలుదేరి ఒకరి వెనుక ఒకరుగా నడిచారు. ముందు ధర్మరాజూ, వెనుక భీముడూ, అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ, సహదేవుడి వెనుక ద్రౌపదీ, ఆమె వెనుక కుక్కా నడిచారు. అర్జునుడు తన వెంట గాండీవాన్నీ, అక్షయ తూణీరాలనూ ఉంచుకున్నాడు. వారలా వెళ్ళివెళ్ళి లౌహిత్యమనే సముద్రాన్ని చేరుకున్నారు. అక్కడ వారి దారికి అడ్డంగా అగ్నిదేవుడు ప్రత్యక్షమై, "ధర్మరాజా, నేను అగ్నిని. మీ తమ్ముడు అర్జునుడు తన

అట్ట చివరి బొమ్మ



గాండీవాన్ని వదిలెయ్యాలి. అది వరుణుడిది. దానితో పని అయిపోయింది గనక తిరిగి వరుణుడికి చెందాలి," అన్నాడు. అర్జునుడు తన గాండీవాన్నీ, అక్షయతూణీరాలనూ సముద్రంలో విసిరివేయగానే అగ్ని అంతర్ధానమయాడు.

అప్పుడు పాండవులు దక్షిణంగా తిరిగి లవణసముద్రపు ఉత్తరతీరం వెంట నడిచి, కొంతదూరం నైఋతి దిక్కుగా వెళ్ళి, పడమరకు తిరిగారు. అక్కడ వారికి సముద్ర జలంలో మునిగి ఉన్న ద్వారకానగరం కానవచ్చింది.

అక్కడి నుంచి వారు ఉత్తరంగా నడిచారు, హిమవత్పర్వతాన్ని చూశారు.

దారిలో అకస్మికంగా ద్రౌపది పడిపోయింది. భీముడు తన ముందు నడిచే ధర్మరాజుతో, "అన్నా, ద్రౌపది పడిపోయింది. ఆమె ఏ దోషం చేత పడిపోయింది?" అని అడిగాడు.

"ద్రౌపదికి అర్జునుడంటే పక్షపాతం. అందుచేత పడి పోయింది," అని ధర్మరాజు అన్నాడు. కాని ఆయన వెనక్కు తిరిగి చూడలేదు.

తరువాత వరుసగా సహదేవుడూ, నకులుడూ, అర్జునుడూ, భీముడూ పడిపోయారు. సహదేవుడు తన కన్న ప్రాజ్ఞుడు లేడనుకునే వాడనీ, నకులుడు తన అందానికి గర్వించే వాడనీ, అర్జునుడు అందరినీ ఒక్క రోజులో చంపేస్తానని ప్రగల్భాలు పలికాడనీ, ఇతర ధనుర్ధరుల పట్ల తేలిక భావం కలిగి ఉండే వాడనీ, భీముడు తిండిపోతూ, బలగర్వితుడూ అనీ ధర్మరాజు చెప్పాడు. చివరకు ఆయనా, కుక్కా మిగిలారు.

అప్పుడు ఇంద్రుడు రథంతో వచ్చి ధర్మరాజును అందులో ఎక్కమని ఆహ్వానించాడు. తన తమ్ములూ, ద్రౌపదీ వస్తేగాని

తాను స్వర్గానికి రానని ధర్మరాజు చెప్పాడు. "వా రక్కడికి ముందుగానే చేరారు. నీవు కూడా రా," అన్నాడు ఇంద్రుడు.


"దేవా, ఈ కుక్క నన్నే నమ్ముకుని నా వెంట వస్తున్నది. దీనిని కూడా స్వర్గానికి తెస్తాను," అని ధర్మరాజు అన్నాడు.

అందుకు ఇంద్రుడు ఒప్పుకో లేదు. ఇద్దరికీ వాగ్వాదం జరిగింది.

అప్పుడు కుక్క రూపంలో ఉన్న యముడు ధర్మరాజును మెచ్చుకుని, "స్వర్గంలో కూడా నీకు సమానులు లేరు. బొందెతోనే స్వర్గానికి వెళ్ళు," అన్నాడు. ధర్మరాజు రథ మెక్కి స్వర్గం చేరుకున్నాడు. అక్కడ ధర్మరాజుకు దుర్యోధనుడు కనిపించాడు గాని, తన తమ్ములూ, అన్న అయిన కర్ణుడూ, శిఖండి ధృష్టద్యుమ్నులూ, అభిమన్యుడూ మొదలైన వారెవరూ కనిపించ లేదు.

"పాపి అయిన ఈ దుర్యోధనుడితో బాటు స్వర్గం నాకు వద్దు. నా తమ్ములూ, ద్రౌపదీ ఉండే చోటికే వెళ్ళుతాను," అంటూ ఆయన వెనక్కు తిరిగాడు.

"స్వర్గానికి వచ్చినా నీకీ పాత అనుబంధాలు పోలేదా? ఇక్కడ వాటిని విడిచి పెట్టి, హాయిగా స్వర్గ సుఖాలు అనుభవించు," అని నారదుడు ధర్మరాజుకు సలహా ఇచ్చాడు. కాని తన తమ్ములున్న చోటికే పోతానని ధర్మరాజు పట్టుపట్టాడు.



దేవతలు అలాగే కానిమ్మన్నారు. ఒక దేవదూత ధర్మరాజును నరకం దిక్కుగా తీసుకుపోయాడు. దారి పొడుగునా పాపులున్నారు. సుఖమైన దారి కాదు. చీకటి. రొచ్చుదారి. దారి పొడుగునా ఈగలూ, దోమలూ ముసురుతున్నాయి. ఎక్కడ చూసినా కళేబరాల గుట్టలు. కత్తులు ఆకులుగా గల చెట్లు. అక్కడక్కడా కాలే ఇసుక నేల. ఇనుప రాళ్ళ గుట్టలు.

"ఇంకా ఎంత దూరం వెళ్ళాలి?" అని ధర్మరాజు దేవదూత నడిగాడు.

"అయ్యా, ఇది మీరు నడవ దగిన దారి కాదు, తిరిగిపోదాం రండి," అని దేవదూత అన్నాడు.

దుర్గంధంతో ధర్మరాజుకు తల తిరిగిపోతున్నది. ఆయనకు దుఃఖం ముంచుకొచ్చింది. ఇంతలో ఆయనకు ఆర్తనాదాలు వినవచ్చాయి: "బాబూ, రెండు గడియల పాటు ఆగు, వెళ్ళిపోకు. నీవు రావటంచేత ఈ ప్రాంతాల శుభ్రమైన గాలి వీస్తూన్నది. కాస్త సుఖంగా ఉన్నది! మాకు బాధ అంతగా తెలియటం లేదు."

ధర్మరాజు అక్కడే నిలబడి, "మీరెవరు?" అని అడిగాడు.

"కర్ణుణ్ణి! భీముణ్ణి! అర్జునుణ్ణి! నకులుణ్ణి! సహదేవుణ్ణి! ద్రౌపదిని!" అని సమాధానాలు వినిపించాయి. వారంతా అలాటి నికృష్టమైన చోట ఉన్నారని తెలిసి ధర్మరాజు నిర్ఘాంతపోయి, "నాకేమైనా పిచ్చి పట్టిందేమో!" అనుకున్నాడు. ఆయన దేవదూతతో, "నాయనా, నీవు తిరిగివెళ్ళు. నే నిక్కడే ఉంటానని నిన్ను పంపిన వారితో చెప్పు," అన్నాడు.


రెండు గడియల అనంతరం ఇంద్రాది దేవతలు ధర్మరాజున్న చోటికి వచ్చారు. వెంటనే నరకచిహ్నాలన్నీ మాయమయాయి. కొద్ది పాపం చేసుకున్న వారు ముందు నరక బాధ అనుభవించి తరవాత స్వర్గసుఖాలనుభవిస్తారని దేవతలు ధర్మరాజుకు తెలియ జెప్పి ఆయన్ను ఉత్తమ లోకాలకు ఆహ్వానించారు.

ధర్మరాజు ఆకాశ గంగలో స్నానం చేసి పవిత్రుడై స్వర్గానికి వెళ్ళి, అక్కడ కర్ణుణ్ణీ, తన తమ్ములనూ, ద్రౌపదినీ, ధృతరాష్ట్రుణ్ణీ, భీష్మద్రోణులనూ, పాండురాజు వెంట కుంతీ మాద్రులనూ, విరాట, ద్రుపద, శిఖండి మొదలైన వారినీ చూశాడు.

★ [సమాప్తం] ★



CHANDAMAMA (Telugu) APRIL 1964 Regd. No. M. 4854



మహాభారతం